# జ్యోతి నవలానుబంధం



# [మొదటి భాగము]

ఊహాలోకాల్లో తేలిపోతూ, కలల ప్రపంచంలో కరిగిపోతూ, సన్నగా కూనిరాగాలు తీస్తూ పద్యాలు రాస్తున్నవాడల్లా, ఆ గావుకేకకి ఉలిక్కిపడి, కరిగిపోతూన్న కలల లోకంలోంచి కళ్ళుతెరిచి ఒక్కమారు వెనక్కి తిరిగిచూశాడు కిరీటి.

శేఖర్!

సగం అయినా పూర్తికాని సిగరెట్టుని ఒక్కదమ్ములాగి నేలమీదికి విసిరికొట్టి బూటుతో నలిపివేసి, చొక్కాచేతుల్ని మోచేతులదగ్గర మడుస్తూ సిద్ధం అవుతున్నాడు. మొహంమీదకి పడిన జుట్టుని వెనక్కితోసే ఆ విసురుచూస్తేనే అర్థం అయింది కిరీటికి. వాడేదో అఘాయిత్యం చెయ్యబోతున్నాడనే సంగతి

ఇంక ఆలస్యంచేస్తే లాభంలేదు.

అంతపనీ చేసినా చేస్తాడు-అసలే బాణసంచా బాపతు.

వెంటనే, సగం సగం రాస్తూన్న పద్యాన్ని ఆ మట్టునే ఆపేసి, చిన్నముల్లు అయిదుమీదకి రావడాన్ని చూసిన స్టేట్‌బాంక్ గుమాస్తాలాగ, రక్కున ఎక్కడి కాగితా లక్కడచుట్టబెట్టి టేబిల్ సొరుగులోకి తోసేసి, టంచన్‌గా లేచి నిలబడ్డాడు కిరీటి.

"ఒరేయ్! ఇటురా ఇటు రా అంటే" గర్జించాడు శేఖర్.

'ఏదో కొంప మునిగింది కాబోలు రా దేవుడా!'- నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ దగ్గరగావచ్చి నిలబడ్డాడు కిరీటి.

"ఏరా! నువ్వు ఆ కోస్తానుంచీ నేను ఈ కోస్తానుంచీ ఈ పట్నం ఎందుకొచ్చాం.. అహ! ఎందుకొచ్చాం అని?"

'ఇలా అడుగుతాడేవిటి కొత్తగా?'

"ఎందుకొచ్చాం చెప్పు."

"ఎందుకేవిటి? నువ్వు తెలుగు ఎం.ఏ కాదు కాదు నేను తెలుగు ఎం. ఏ, నువ్వు న్యూరాలజీ ఎం. డి. చదవడానికి" అన్నాడు కిరీటి. "ఏం, నేను చెప్పిం దాంట్లో ఏమైనా తప్పుందా?" అన్నట్టు మొహం పెడుతూ.

"అవునా? అది అలా ఉంచు, ఆవిడెవరో, మీ అత్తయ్యేనా? ఆ మహా ఇల్లాలు నీకు నెల నెలా ఎంత కష్టపడి డబ్బు పంపిస్తోంది?"

'నేను కాదన్నానా!' అన్నట్టు చూశాడు కిరీటి.

"నీకంటే రెండేళ్ళు పెద్దవాడి నయితేనేం, ఈ పట్నంలో నాలుగేళ్ళు ఎక్కువ అనుభవం ఉండడంవల్ల నయితేనేం, నువ్వు వట్టి పిచుమిరాయి పిరికి సన్యాసివి, మీదు మిక్కిలి నా రూమ్ మేట్‌వి అయితేనేం, కారణం ఏదైతేనేం, నీకు నేను లోకల్ గార్డియన్‌గా దాఖలు పడ్డానుకదా."

"అవునూ " లోపల అనుకుందాం అనుకుని పైకి అనేశాడు కిరీటి.

"ఉండు మాట్లాడకు. ఈ పరిస్థితిలో, ఫస్ట్‌క్లాసు వచ్చేలాగ, నాకు నచ్చే

లాగా, మీ మేనత్త మెచ్చేలాగా నువ్వు జాగ్రత్తగా చదువుకోవాలా వద్దా? ఏం .. మాట్లాడవేం?'' గద్దించి అడిగాడు శేఖర్.

ఇప్పటిదాకా నోరుతెరిస్తే ఎక్కడ తంతాడో అని మాట్లాడక ఊరుకుంటే, ఇప్పుడు తెరిచేదాకా ఊరుకొనేలాలేడు. వీడికేం మాయరోగం వచ్చిందో ఇవాళ ఇలా పట్టించాడు

గుడ్లు ఇంతలేసిచేసి చూస్తున్నాడు శేఖర్.

ఆ కళ్ళల్లోకి చూడలేక నేలచూపులు చూస్తూ 'నువ్వు చెప్పింది నిజమే' అన్నట్టు తల ఆడించాడు కిరీటి.

''అవునుకదా! మరి అటువంటప్పుడు నువ్వు చెయ్యవలసినపని ఇదేనా? ఇదేనా అంట?''

'ఇప్పుడు కానిపని ఏం చేసాను?'- కంగారుపడుతూ ఒళ్ళంతా ఓ మారు పరిశీలించి చూసుకున్నాడు.

''ఇంకా బుద్ధిగా చదువుకుంటున్నావు అనుకున్నాను నేను.''

వేళ్ళకి అయిన సిరా చూసేసరికి కిరీటికి అర్థం అయింది. సిగ్గుపడి తల వొంచుకొని గోళ్ళు గిల్లుకుంటూ ''పొరబాటయిందిరా ఇంకెప్పుడూ చెయ్యను''- నెమ్మదిగా అన్నాడు.

''ఆ! ఇంకెప్పుడూ చెయ్యడూ? అంటే తను అడుగుతున్నది వీడికి అర్థంకాలేదా? లేదా, తనకి తెలియంది వీడు ఇంకోటి ఏదైనా చేశాడా? అదీ ఇదీకాక తనలాగే వీడుకూడా ఓ దబాయింపు పర్వం ప్రారంభించి తనమతి పోగొట్టి కసి తీర్చుకోవాలని చూస్తున్నాడా?''- అనుమానంగా చూశాడు శేఖర్.

కాస్సేపుఆగి, ఆ తర్వాత భయం భయంగా నీళ్ళునముల్తూ ''మరేమోను ... ఆగోడ...అదే ఆగోడ అవతలనుంచి చల్లగాలికి తలఆడిస్తూ ఒక అందమైన గులాబీ కనిపిస్తే...'' అంటూ ఇంకా వాక్యం పూర్తి చెయ్యలేదు కిరీటి.

శేఖర్, 'ఆ!' అని ఆశ్చర్యంగా అరిచి, ఒక్కగెంతు గెంతి కిరీటిని సమీపించాడు.

''నిజంరా ..ఆ!గులాబీనిచూసి, నా హృదయం పరవశించి పరవళ్ళు తొక్కింది. ఆ పారవశ్యం ఆపుకోలేక పద్యంరాశాను, అంతే''_సంజాయిషీ ఇచ్చుకున్నాడు కిరీటి.

''ఏవిటీ! ఏవిటి?...గులాబీ తల ఊచిందా? గోడ అవతలనుంచా?...ఎవరురా ఆ అమ్మాయి?''- దగ్గరగా జరుగుతూ అడిగాడు శేఖర్.

''అమ్మాయేవిట్రా?...గులాబీ...అదే...గులాబీ పువ్వు''

''ఏవిటీ?...గులాబీపువ్వా? ఓరి స్టుపిడ్! చంపావు ఫో...ఇంకా ఎవరో అమ్మాయినిచూసి ఐసయిపోయావనుకున్నాను నేనూ... ఒక పుష్పాన్నిచూశా ఈ పరవశత్వం అంతానూ?..ఛీ...ఛీ..నువ్వెందుకూ పనికిరావురా...పువ్వుల్నిచూసీ లతల్ని చూసీ పరవశించడం ఏవిట్రా బుద్ధిలేకపోతేనూ? ఓ వాలుజడనిచూసి సోలిపోవడం, ఓ

మందహాసాన్ని చూసి మతిపోగొట్టుకోవడం ఓ హైహీల్డు యానని చూసి ఐసయి పోవడం ఎక్కడేనా ఉందికాని మరీ ఈ బొటానికల్ లవ్ ఏవిట్రా నీబొంద?''

తండ్రి చివాట్లు పెడుతూంటే తప్పుచేసిన కొడుకులాగ తల దించుకొని ఉండి పోయాడు కిరీటి.

''ఊ..సరే..ఏదో అఘోరించావుగాని, దానిసంగతి అలా ఉంచు...ముందు దీని సంగతి చెప్పు'' అంటూ జేబులోంచి ఓ కవరు తీశాడు శేఖర్.

''ఇదేవిటి?''

''ఇదా?...దీన్ని కవరు అంటారులే చిట్టినాయనా! .సోయగాలుపోక అసలు సంగతి సూటిగాచెప్పు. ఈ కవరేమిటి, కధేమిటి? బుద్ధిగా చదుపుకోరా నాయనా అంటే నాటకాలా?''

కిరీటికి అంతా అయోమయంలా ఉంది. ఈ కవరేమిటి, నాటకం ఏవిటి?

''ఈ కవరు గొడవ నాకేం తెలియదు'' అన్నాడు కిరీటి మొండిగా.

''తెలియదూ? ఇది నీ పేరనే వచ్చింది. ఇప్పుడే వీధి మొగలో పోస్ట్‌మేన్ ఇచ్చి వెళ్ళాడు. విప్పి చూస్తే ఏం ఉంది, నీ రహస్యం బయటపడింది''

''రహస్యం!''

''ఆ! తమరు ఆదరంగా పంపింది అందుకున్నాం. అంగీకరించాం. మీకు కట్నం నూట పాతికరూపాయలు! పెళ్ళివారిని తీసుకుని ఫలానారోజున ఫలానా టైముకి వచ్చెయ్యండి అంటూ అంతా స్పష్టంగా రాస్తేనా ఇందులో—ఇంతకంటే వివరంగా ఏ మావగారు రాస్తాడురా!''

''మావగా రేవిటి, కట్నం ఏవిటి? ఎవరో బాబోయ్ నన్నేడిపించడానికి రాశా రిదంతా.''

''అలాగా చిట్టితండ్రీ!'' అన్నాడు శేఖర్ వస్తూన్న నవ్వు ఆపుకుంటూ.

''అస లది ఎవరు రాశారో ఏవిటో ఇలా ఇయ్యి'' అంటూ చటుక్కున శేఖర్ చేతుల్లోంచి కిరీటి లాక్కున్నాడు. లాక్కుని, ఆదుర్దాగా నాలుగు పంక్తులు చదివి, పకపకా నవ్వి శేఖర్‌కేసి చూశాడు. దాంతో అప్పటిదాకా నానా అవస్థా పడుతూ, అతి ప్రయత్నంమీద ఆగిఉన్న శేఖర్‌కూడా, విరగబడి నవ్వేశాడు.

కిరీటి శేఖర్‌కేసి చూసి నవ్వా, శేఖర్ కిరీటిని చూసి నవ్వా; ఇలా ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకొని తెగనవ్వి, చివరికి కడుపులో పోట్లు వచ్చి ఆగారు. ఆగారే కాని మళ్ళీ ఒకళ్ళని చూసినప్పుడు ఇంకొకళ్ళకి నవ్వు వస్తూనే ఉంది.

''ఎంత డబాయించావురా ఏదో నిజంగా కొంప మునిగిందని హడలి చచ్చాను నేను ''

''అది సరే కాని .ఎప్పుడు రాశావురా ఈ రేడియో నాటిక? నాకు మాట మాత్రంగానైనా - చెప్పలేదేం?''

"ఆః ఆ మధ్య ఇద్దరికీ మనిఆర్డర్లు ఆలశ్యం అయి, చేతుల్లో డబ్బులు లేక, పాతపేపర్లు అమ్మాం? ఆ రాత్రే ఏం తోచక రాశాను బాగా వచ్చింది కదా అని రేడియో వాళ్ళకి పంపాను. వాళ్ళకి నచ్చుతుంది అనీ, మనల్నే ట్రూప్‌తో వచ్చి ఇలా వెయ్యమంటారనీ, అనుకోలేదు "

"అనుకోలేదు కనకే వాళ్లు అంగీకరించారు. 'భలే మంచి నాటిక రాశాన'ని నువ్వు అనుకున్నావో, వాళ్లు వెంటనే వెనక్కి తిప్పి పంపించి ఉందురు పత్రికల వాళ్ళకీ రేడియో వాళ్ళకీ అదో సరదా—ఎవరూ ఊహించని రీతిగా రచనల్ని ఎన్నుకుని, ఇటు రచయితల్నీ అటు పాఠకుల్నీ ఏక్‌దమ్మున ఆశ్చర్యంలో ముంచెత్తేస్తూంటారు."

"కాబోలుః" అనుకున్నాడు కిరీటి.

"సరే మంచి పని చేశావు. ఇలాంటి మంచి పనులు అప్పుడప్పుడు చేస్తూ ఉంటే, మనం మరీ అంత అణాకీ బేడకీ అప్పులకి వెళ్ళడమూ తగ్గుతుంది, కప్పు కాఫీకి కక్కుర్తిపడి ఆ వీర్రాజుగాడు కోసే కోతలు వినడమూ తప్పుతుంది "

కిరీటి ఏం మాట్లాడలేదు. గదిమూలని ఉన్న బెడ్డింగుని మరి కొంచెం గట్టిగా దగ్గిరిగా చుట్టి దానిమీద కూర్చున్నాడు. కిరీటి చేతిలోంచి కవరూ కాగితం తీసుకుంటూ "ఈ నాటికలో కథ ఏవిటి? నెల్లాళ్ళలో వచ్చి మనల్నే రికార్డింగ్ ఇమ్మంటున్నాడు ఇంతకీ ఇందులో పాత్రలు ఎన్ని?" అన్నాడు శేఖర్.

"నాలుగు" అన్నాడు కిరీటి, గోడవార నున్న ట్రంకుపెట్టి గది మధ్యకి లాగి, దానిమీద కూర్చుంటూన్న శేఖర్‌ని చూస్తూ.

"అయితే మన ఇద్దరం కాక ఇంకో ఇద్దర్ని వెతకాలన్న మాట."

"ఆ అందులో ఒకటి స్త్రీ పాత్ర."

"వాట్ః స్త్రీ పాత్రా? ఒరేయ్ కిరీటీ, నీకు బుద్ధి లేదురాః నాటికలో స్త్రీ పాత్ర నెందుకు చేర్చావు? నలుగురూ మగాళ్ళయితే సరిపోదూ?"

"అబ్బే వీల్లేదు ఆ కథకి ఆడది ఉండి తీరాల్సిందేః"

"వీల్లేదూ? అయితే కాగితం కలం తీసుకుని, 'అయ్యాః ఈ నాటిక మేం వెయ్యలేం. మీరే వేయించుకోండి' అని రాసి పడెయ్యి ఆ రేడియో వాళ్ళకి."

"అలా అయితే మన కెంతో డబ్బు ఇవ్వరు."

"అయితే ఏం చెయ్యమంటావు? నీ నాటకంలో స్త్రీపాత్ర వెయ్యమని ఎవర్ని అడుగుతావు ఈ హైదరాబాదు మహాపట్నంలో? అయినా ఎవరినేనా వెళ్ళి అడిగి చూడు. కాని వెళ్లేటప్పుడు ఓ దంతవైద్యుణ్ణికూడా వెంట తీసుకుపో, రాలిపోయిన పళ్లు వెంటనే కట్టి ఇవ్వడానికి"—

కిరీటి బిక్కమొహం పెట్టి దీనంగా చూశాడు.

పెట్టిమీంచి లేస్తూ విసుగ్గా, "నువ్వు ఏదో ఇలాంటి ఒక లిటిగేషన్ లేకుండా ఏ పనీ చెయ్యవు కదా?" అన్నాడు శేఖర్. అనీ, చేతులు వెనక్కి కట్టుకునీ ఆ గదిలో,

ఈ గోడ దగ్గర్నుంచి ఆ గోడ దగ్గరికీ, అక్కడనుంచి వెనక్కి తిరిగి మళ్ళీ మొదటి గోడ దగ్గరికీ పచార్లు చెయ్యసాగాడు. అలా తిరుగుతూన్న శేఖర్‌ని చూసేసరికి, జానపద చిత్రాల్లో జైళ్ళముందూ కోటగుమ్మాల ఎదటా, జానెడుచోట్లో అటూ ఇటూ చకచకా గస్తీ తిరిగేసే రాజభటులు జ్ఞాపకం వచ్చి పకాల్న నవ్వాడు కిరీటి. అతని నవ్వు చూసేసరికి ఒళ్ళు మండుకొచ్చింది శేఖర్‌కి.

"ఒరేయ్! నవ్వావంటే చంపేస్తాను. నిన్ను చూస్తే నాకు పచ్చడి బండా, చాకిరేవులో రాయీ, జ్ఞాపకం వస్తున్నాయి. తల బద్దలు కొట్టేస్తాను ఏ మనుకున్నావో ఏమిటో?" అంటూ అరిచాడు శేఖర్.

రెండు చేతుల్తోనూ నోరు మూసుకుని అతి ప్రయత్నంమీద నవ్వాపుకున్నాడు కిరీటి

అలా పచార్లు చేస్తూనే, తనలో తను అనుకొన్నట్లుగా పైకి అన్నాడు శేఖర్. "ఎన్ని రకాలుగా తల బద్దలు కొట్టుకొని ఆలోచించినా, ఆడపిల్లని ఎలా సంపాదించాలో అర్థం కావడం లేదు. పోనీ అని మన 'గేంగ్'లో ఎవడికీ పరిచయాలూ ఏడవ లేదు ఆడపిల్లలతో. అందరూ ఒకే రకం అడివి జంతువులు తయారయ్యారు"—అని.

"పోనీ వీర్రాజుని అడిగితేనో - వాడికి చాలామంది అమ్మాయిలు తెలుసునని అంటూంటాడు కదా?"

"ఒరేయ్ నీదో వెట్టిగోల! వాడి మాటలు నమ్మావట్రా నువ్వు? అవే నిజం అయితే, వాడికో అమ్మాయి రోజూ ప్రేమలేఖలు రాస్తూ ఉండాలి. మరో సరోరుహాక్షి సాయంత్రం వాహ్యాళికి వస్తూ ఉండాలి. ఇంకో ఇందీవరాక్షి మందహాసాలు అందించాలి. ఒక కన్య వీడితో కలిసి కారులో తిరగాలి. ఒక అమ్మాయి ఆస్థి అంతా వీడిపేర రాయాలి. ఇలా వీడు నిజంగా అయిదుగురు ఆడవాళ్ళు ఉన్న మోడరన్ మొగద్రౌపదే అయితే, ఏ హస్తినాపుర అంతఃపురంలోనో అశోకా హోటల్లోనో ఉండును కాని, ఇలా నీ చుట్టూ నా చుట్టూ తిరుగుతూ, కాకిఎంగిలి కత్తెరమార్కు సిగరెట్లు తాగుతూ, 'కాక్ ఎండ్ బుల్' స్టోరీలు చెబుతూ ఇక్కడ ఉండునా?"

గీతోపదేశం వింటూన్న అర్జునుడిలా కళ్లు పెద్దవిచేసి ఆశ్చర్యంగా చూశాడు కిరీటి.

"ఒరేయ్ అబ్బీ! ఈ జబ్బు నేటి అబ్బాయిల కందరికీ ఉన్నదేరా. ఇంకేం ఉంది? ఆ అమ్మాయి నే నంటే పడి ఛస్తుంది అంటాడు. మనం వెంటనే వెఱ్ఱిమొహం లాగ "ఎప్పుడు? రేపా ఎల్లుండా?" అని అడగకూడదు. "అహా అలాగా!" అని నోరు ఆవలించి వినాలి. అదంతా డాబు అని మనకీ తెలుసు. మనదంతా నటనని వాడికీ తెలుసు. తెలిసినా తెలియనట్లుండడమే నాగరికతంటే."

"ఎంత చిత్రం! నిజంగా?"—ముక్కుమీద వేలేసుకున్నాడు కిరీటి. ఎవరేనా తను చూస్తూండగా ముక్కుమీద వేలేసుకున్నా, తన ఎదురుగుండా ముక్కు గోక్కున్నా

పిచ్చికోపం వస్తుంది శేఖర్‌కి. పట్టలేని ఆగ్రహంతో కోతిగంతులు వేసేస్తాడు. పైగా ఇప్పుడు లేనిపోని సమస్యనో దాన్ని తీసుకువచ్చి మీద పడేశాడు.

పడేసి, ఇంక నాకేం సంబంధం లేదు, నీ అఘోరింపేదో నువ్వు అఘోరించు అన్నట్లు ఇలా తాపీగా కూర్చుని, ఆశ్చర్యపోతూ కళ్లు ఎగరేస్తూ ముక్కుమీద వేలేసు కుంటూ, భరతనాట్య భంగిమలన్నీ చేస్తూంటే ఒళ్లు మండిపోదూ? అందుకే అరిచేడు శేఖర్. "అలా నోరు తెరుచుకుని చూస్తూ కూర్చోపోతే కాస్త దీనికి పరిష్కార మార్గ మేదో ఆలోచించకూడదూ" అంటూ.

ఆ అరుపు విని అదిరిపడి శేఖర్‌కేసి చూశాడు కిరీటి.

"నాకేసి కాదు అలా దూలాలకేసి చూడు, పరీక్షహాల్లో విద్యార్థిలాగ. ఓ ఆలోచనైనా వస్తుంది."

'తనుకూడా శేఖర్‌లాగ ఇంటి పైకప్పుకేసి చూస్తూ, ఆలోచిస్తున్నట్లు గాలిలో చేతులు అటూ ఇటూ తిప్పకపోతే, తన్నేలాగ ఉన్నాడు ఏం వచ్చిందో వీడి కివాళ! సరే కానియ్యి' అనుకొని కిరీటి కూడా ఊర్ధ్వదృష్టి ఏర్పరుచుకొని, అభినయ ముద్రలు పట్టసాగాడు.

ఇలా ఇద్దరూ ఒకరివేపు ఒకరు వీపుపెట్టి, దూలాలు ఎక్కడికీ పోకుండా జాగ్రత్తగా కనిపెట్టి చూస్తూ, చిత్ర విచిత్రంగా చేతుల్నీ వేళ్ళనీ గాలిలో పల్టీలు కొట్టిస్తూ, మూకీ సినీమాలో బొమ్మల్లా ఎంతసేపు ఆలోచనని అభినయించి ఉందురో ఏమో-

ఇంతలో, సైడుకర్టెన్‌లోంచి 'ప్రాంప్టర్' ఒక్కతోపుతో స్టేజిమీదికి వచ్చిపడ్డ పిరికి 'యాక్టర్' లా, గుమ్మంలోంచి రూమ్‌లోకి ఊడిపడి, ఒకే భరతనాట్యంలో ఇద్దరూ చెరోవేపూ తిరిగి ఒక్క భంగిమనే అభినయించే ఇద్దరమ్మాయిలులాగ, కదులుతూన్న కిరీటినీ శేఖర్‌నీ చూసి, బిత్తరపోయాడు వీర్రాజు.

వీళ్ళకేం కాలేదుకదా అని మొదట అనుమానించాడు.

కొట్టుకున్నారేమో పిచ్చినాయన్లు—అనుకున్నాడు ఆ తరవాత.

"దొంగ రాస్కెల్స్-నటిస్తున్నారేమో నన్నుచూసి అని అభిప్రాయపడ్డాడు చివరికి. పడీ, "ఒరేయ్-మీరు నాకేంఅప్పు ఇవ్వక్కర్లేదు లెండిరా ఇవాళ—వెధవ నటన చాలించి ఇటు చూడండి" అన్నాడు వీర్రాజు.

ఉహూఁ! వాళ్ళలో చలనంలేదు.

"ఇటు చూడమంటూంటే-ఏం-చూస్తారా చూడరా? ...వన్—టూ—త్రీ"

'అమ్మబాబోయ్!' అంటూ ఒక్కగెంతు గెంతి అమాంతం శేఖర్‌ని వాటేసు కున్నాడు కిరీటి ఆ వచ్చినవాడెవడో దొంగఅయి ఉంటాడనీ, చేత్తో పిస్టల్ పట్టుకొని తనవైపు గురిచూస్తూ, అలా అంకెలు లెఖ్ఖపెట్టి ఉంటాడనీ ఊహించుకుని.

"ఇడియెట్! బ్యూటిఫుల్ ఐడియాని బుగ్గిపాలు చేశావుకదరా సిగోలా నువ్వూను? ఏం జరిగింది?" అంటూ కిరీటిని విదిలించి ఓ మూలకివిసిరి, ఇటు తిరిగాడు శేఖర్.

ఎదురుగుండా వీర్రాజు!

విలన్‌పోజులో, చ్యూయింగ్‌గమ్ నములుతూ, ఓకాలు ఆడిస్తూ విలాసంగా నిలబడి, ఎడం అరచేతిలో కుడిగుప్పిడి గుద్దుకుంటున్నాడు.

'ఏవిటి వీడిపోజూవీడూను ఎదురుగుండా అమ్మాయిలు ఉన్నట్టు? కొంపదీసి వీడికి చత్వారం రాలేదుకదా? ఖర్మ! తననీ కిరీటినీ చూసి అందమైన ఆడపిల్లలు అను కుంటున్నాడో ఏమో!'

"ఒరేయ్ ఏవిట్రా ఆ పోజు, కిరీటిని ఏవిటి అలా బెదరకొట్టేశావు? చూడు వాడా మూలకిపోయి పిచికపిల్లలా ఇంకా భయంతో ఎలా డొక్కలు ఎగరేస్తున్నాడో!" అన్నాడు శేఖర్.

"వాడి పిరికితనం ఎప్పుడూ ఉండేదేకానీ, మనకిప్పుడో సమస్య వచ్చిపడిందిరా" అన్నాడు వీర్రాజు కుడికాలు ఎత్తుగా స్టూలుమీదపెట్టి ఓచేత్తో బట్టలు ఆరవేసే దండెం తాడుని గట్టిగాలాగి పట్టుకుంటూ.

"ముందు ఆ తాడు ఒదులు, తెగిందంటే మాసిపోయిన బట్టలన్నీవచ్చి మానెత్తిన పడతాయి."

చేతిలో ఉన్న ఏ తాచుపామునో వదిలేసినట్లు. వెంటనే కంగారుగా దండెం వదిలేసి, కాలుకిందఉన్న స్టూలులాక్కొని కూర్చున్నాడు వీర్రాజు.

తనకేసి ఆశగా చూస్తున్న వీర్రాజుతో "ఇప్పటికే కిరీటి తెచ్చిన ఓ సమస్యతో తల బద్దలుకొట్టుకుని ఛస్తుంటే మళ్ళీ నీదొకటా?" అంటూ నిస్పృహగా నిట్టూర్చాడు శేఖర్.

"అలా అనకురా...బాబ్బాబు నీచేతులు పట్టుకుంటాను, సలహాచెప్పి సమస్యా పరిష్కారం చెయ్యరా ఇదిగో-కొత్త సిజర్స్‌పేకెట్-ప్రారంభోత్సవమైనా చెయ్యలేదు. దక్షిణగా తీసుకో దమ్ములాగు. ఐడియా వస్తుంది."

అప్పటిదాకా ఐడియాలెందుకురాలేదో అప్పుడు అర్ధమయింది శేఖర్‌కి.

పొగ రింగు రింగులుగా వదులుతూ, అరమోడ్పు కన్నులతో ఆలోచనని అభినయిస్తూ సిగరెట్టుని ఆస్వాదించసాగాడు శేఖర్. ఆలోచిస్తున్నాడో నిద్రపోతున్నాడో అర్ధంకాలేదు కిరీటికి.

"పాపం వాడంతగా కాళ్ళావేళ్ళా పడుతూంటే కాస్త పరిష్కారమార్గం ఆలోచించకూడదురా!" అన్నాడు కిరీటి. కేబినెట్ మినిష్టర్‌కి రికమెండ్ చేసే, డిప్యూటీ మినిష్టర్‌లాగ.

"ఓహో! వాడి సిగరెట్టే అనుకుంటే నీ సిఫార్సు ఒకటా?"

"నవ్వులాటకాదురా పాపం వాడిసమస్యా పరిష్కారం."

"అదేకదరా ఆలోచిస్తున్నాను!"

"ఏవిటీ?,, నేనింకా అసలు సమస్యఏదో చెప్పకుండానే!"

"కానియ్యి...చెప్పు..ఈలోగా ఆలోచించేస్తూ ఉంటాను" అన్నాడు శేఖర్, తన జబ్బు ఏదో రోగి ఇంకా ఓ పక్కనుంచి చెబుతూఉండగానే. మందుచీటీ రాసిఇచ్చేసే బిజీ డాక్టరులాగ.

"నేనీమధ్య ఓ అమ్మాయిని ప్రేమించారా" అన్నాడు వీర్రాజు తలవంచుకుని సిగ్గుపడుతూ.

ఇంతక్రితమే వీర్రాజు ప్రేమ కలాపాలగురించి శేఖర్ చెప్పిన వివరాలన్నీ గుర్తుకువచ్చి, పకపకా నవ్వాడు కిరీటి, శేఖర్ కోపంగా చూశాడు కిరీటికేసి.

అదేం పట్టించుకోకుండా "అదికాదురా ..వీడివన్నీ కోతలని ఇప్పుడేగా మనం అనుకున్నాం" అన్నాడు కిరీటి.

కిరీటిని గుడ్లురిమిచూసి "నువ్వంతటితో నోరుమూస్తావా" అంటూ అరిచి, వీర్రాజువైపుతిరిగి "ఊ.. కానియ్యి" అన్నాడు శేఖర్.

"ఇది పాతకోతలలాంటిదికాదు. నిజంరా. నిఝంగా నిజం" అన్నాడు వీర్రాజు దీనంగా ముఖం పెడుతూ.

"సర్లే కానియ్యి" అన్నాడు శేఖర్, సిగరెట్టునుపిని, పాతసిగరెట్టు పెట్టితో చేపిన అట్ట 'యాష్ట్రే' లో దులుపుతూ.

"ఈమధ్య ఒకటి రెండుసార్లు ఓ అందమైన అమ్మాయి మన ఆటో రిక్షాఎక్కింది"

"మన అంటూ నన్నుకూడా కలుపుతావేమిటి? నువ్వయితే ఎందుకూ పనికిరాని ఆ బి. యే. పాసయ్యావుకనుకా, ఇంటర్వ్యూలలో అభ్యర్థి అక్షతలుమాత్రమే చూస్తారనీ, మనీపర్సుకీ, 'మనోడు'అనేమాటకీ, సెలక్షన్‌కమిటీ అబ్జక్షన్ పెడుతుందనీ, బుద్ధిలేకుండా ఆలోచించావుకనుకా, ఉద్యోగపర్వంలో విషాదయోగాన్ని తెచ్చుకున్నావు ఎటూతోచక చివరికి ఆటోరిక్షా అద్దెకి పుచ్చుకున్నావు నాకేంఖర్మ! ఈ కాస్త ఎమ్.ఎ. అనిపించానంటే, కన్సల్టేషన్‌ఫీజుకిందే సంపాదిస్తాను రోజుకో వంద."

"సంపాదిస్తావులేరా-నేను కాదన్నానా? అందరికీ ఒకే అదృష్టం ఉండమంటే ఉంటుందా?"

"సరే కానియ్యి"

"ఆ అమ్మాయికో మావయ్య ఉన్నాడు"

"వాడుంటే ఉన్నాడులే-ముందు అమ్మాయికథ కానియ్యి."

"కాదురా ..వాడీ కథలో విలన్. చాలాముఖ్యం. వాడికి మనలాంటి చురుకైన యువకులన్నా, కాలేజీ స్టూడెంట్సులన్నా చచ్చేటంత ఎలర్జీ."

"పూర్వాశ్రమంలోనో పూర్వజన్మలోనో ప్రిన్సిపాల్ అయి ఉంటాడు."

"వాడి మొహానికి ప్రిన్సిపాలు కూడానా?"

"పోనీ లెక్చెరరు. అయినా ఇప్పుడు ఆ గొడవెందుకు? అసలు సంగతి అఘోరించు."

''ఇలా స్టూండెంట్సుమీద సదభిప్రాయం లేకపోవడంవల్ల, తన మేనకోడల్ని ఏ కాలేజీలోనూ చేర్పించక ఇంటిదగ్గరే కూర్చోపెట్టి భాషాప్రవీణ పరీక్షకి ప్రైవేటుగా చదివిస్తున్నాడు ఇంతవరకూ మనకేం అభ్యంతరం లేదనుకో.''

''వాడి మేనకోడల్ని వా డిష్టం వచ్చినట్లు చదివించుకుంటాడు మధ్యన నీ అభ్యంతరం ఏవిటోయ్ బోడి అభ్యంతరం?'' అన్నాడు కిరీటి కోపంగా.

''నువ్వుండరా వాణ్ణి చెప్పనీ.''

''శుభమైన ఆ అమ్మాయి నిలా పాతచింతకాయపచ్చడి చదువులోపెట్టి ఊరుకో లేదు ఆ దౌర్భాగ్యుడు. నవనాగరికతా చిహ్నా లేవీ అంటని, అమాయకుడైన ఓ పెసర పప్పులాంటి అబ్బాయిని వెతుకుతున్నాడు ఆ అమ్మాయికి పెళ్ళి చెయ్యడంకోసం. సంస్కృత పండితుడికి కాని, లేదా తెలుగుపండితుడికి కాని, అధమం ఒక తెలుగు ఎమ్మేకి కాని ఇచ్చి చేస్తాట్ట. మనలాంటి కుర్రకుంక కెవ్వడికీ చచ్చినా ఇవ్వడట! ఇలా భయంకరమైన శపథం ఒకటి చేసి తడిసిపోయిన మడతమంచంలా బిర్రబిగుసుకుని కూర్చున్నాడు.''

''ఈ పిచ్చాడు సరే, ఆ అమ్మాయి ఏం అంటుంది?''

''ఆ పిల్లకి మరో పిచ్చి ఉంది. తనక్కాబోయే భర్త ఏం చదువుకున్నా. అసలేం చదువుకోక పోయినా, ఏం అభ్యంతరం లేదట. అందం ఉన్నా సరే లేక పోయినా సరేట. తెలివి తేటల 'కాలమ్' లో 'నిల్' ఉన్నా ఫర్వాలేదట. ధనవంతుడైనా బీదవాడైనా ఒకటేట.''

''వీర కమ్యూనిస్టు ఏవిటీ కొంపదీసి?''

''కానీ, తనకి కాబోయే భర్తకి కొన్ని కనీసమైన అర్హత లుండాలట!''

''ఏమిటిట?''

''ఎత్తు ఎట్టి పక్షంలోనూ అయిదున్నర అడుగులికి తగ్గకూడదట. బరువు అధమం నూట ఏభై పౌను లుండాలట. ఇంక ఛాతీ - గాలి పీలిస్తే ముప్పైఅయిదూ వదిల్తే ముప్పై ఉండాలిట. అంటే దాదాపు నీ రూపం ఉండాలి.''

''ఇంతకీ విగ్రహపుష్టి చాలు. అంతేనా?''

''అయినా ఈ సంగతులన్నీ నీకు ఎలా తెలిశాయి?'' అన్నాడు అమాయకంగా కిరీటి

''ఆ అమ్మాయే చెప్పింది వర్షి వసపిట్టలే. ఒకటి రెండుసార్లు మన ఆటోరిక్షా ఎక్కింది అన్నానుగా - కన్నేశాను కనుక నెమ్మదిగా కబుర్లలో దింపాను అంతే— మావ షరతులూ తన ఆశయాలూ ఏకరువు పెట్టింది.''

''మొత్తానికి మావకి పెసరపప్పూ, కోడలికి ఫైల్వానూ కావాలి. ఈ రెండూ ఋజుప్రవర్తనా, రాజకీయ జీవితంలా ఒకదాని కొకటి అతకవే!''

''మనకి రెండు అర్హతలూ లేవు. చదువు చూద్దాం అంటే తెలుగు బి. యే.

అయినా కాదు, ఎందుకూ ఉపయోగం లేని ఎకనమిక్సు బి. యే. పోనీ చూద్దామా అంటే అయి దడుగులేనా మించని, వంద పౌను లయినా దాటని, ఎదు మట్టం శరీరం.''

''ఎందుకొచ్చింది కానీ, నువ్వా అమ్మాయిని మరిచిపో.''

వీర్రాజు శేఖర్ చేతులు పట్టుకుని ''అమ్మమ్మ అలా అనకురా ఏదో ఉపాయం ఆలోచించి నన్ను ఒడ్డు ఎక్కించు" అన్నాడు కళ్ళ నీళ్లు పెట్టుకుంటూ.

''ఎలాగబ్బా? వీడి సమస్యలాగే నీది కూడా దారపుచిక్కు సమస్యేనే—ఎలాగ దీన్ని విడదియ్యడం?''

''నీ గొడవ ఏమిట్రా?'' అని వీర్రాజు కిరీటిని అడిగాడు, కిరీటి తను రేడియో నాటిక రాయడం దగ్గర్నుంచీ, స్త్రీపాత్రకి ఎవర్ని అడగడమా అనే ప్రశ్నదాకా, జరిగిందంతా వివరంగా చెప్పాడు.

''అయితే ఈ సమస్యకి నేనో పరిష్కారం చెప్తాను. నాకా అమ్మాయి చిక్కే మార్గం ఏదో ఆలోచించి చెప్పు'' అన్నాడు వీర్రాజు శేఖర్ కేసి తిరిగి.

''ఆ ఆలోచనే తెగడం లేదు ఆ సరే ఒక పని చెయ్యి ఆ హిరణ్యాక్షుడు ఏ వరాలు కోరాడన్నావు?''

''మధ్యలో హిరణ్యాక్షు డెవడు?''

''అదే నీ ప్రియురాలి మేనమామ! ఆ పిల్లకి కాబోయే వరుడి విషయంలో విధించిన షరతు లేవిటి?''

''సంస్కృత పండితుడు- తప్పితే తెలుగు పండితుడు - తప్పితే తెలుగు ఎమ్మే.''

''ఇన్ని 'తప్పితే' లుపెట్టాడుకదా. కాశీమజిలీకథలో గండభేరుండ పక్షిల్లాగ: అయితే ఫర్వాలేదు. నువ్వు రేపే వేషంమార్చేసి మీ బాబయ్యని కలుసుకో-అదే-నీప్రియురాలి మావయ్యని-ఆ కాకీ పేంటూ, కాకీచొక్కా మెళ్ళో గళ్ళరుమాలూ తీసెయ్యి. ఎగదువ్వుడుక్రాప్ చెరిపెయ్యి. పంచకట్టి పైమీద ఉత్తరీయంవెయ్యి ముఖాన్ని విభూది రాసుకుని కనుబొమలలో కుంకంపెట్టుకో-నువ్వు తెలుగు ఎమ్మే చదూతున్న విద్యార్థివనీ అయన్ని నమ్మించు. అవసరంఅయితే ఈ కిరీటి పుస్తకం ఒకటి చేతిలో ఉంచుకో.''

''పుస్తకంమీదా పేరుచూసి నీ పేరు కిరీటా అనిఅడిగితే?''

''అవునను. ఆ షరతుల షరాబుకి సంబంధించి నంతవరకూ నువ్వే కిరీటివి''

''ఒరేయ్...ఇక్కడ నేనో కిరీటిని ఉండగా, మళ్ళీ వాడికో కిరీటినిచేస్తే అనక ఏం కొంపలు అంటుకుంటాయోయేమో—పైగా, నాది సుబ్బారావు, సూర్యనారాయణలాగ తరుచుగా ఉందే పేరుకూడాకాదు'' అన్నాడు కిరీటి గాభరాపడుతూ

''నీ దుంపతెగా, మధ్యలో అడ్డుపుల్లలు వెయ్యక ఆగరా, చచ్చీ చెడీ తలబద్దలు కొట్టుకొని ఓదారికి వస్తుంటే నువ్వేమిటి మధ్యలో ఊ సరే వీర్రాజూ, ఆ చాదస్తుడిని బోల్తాకొట్టించడంకోసం కిరీటిపేరు ఉపయోగించుకో. ఇకపోతే ''

"ఇంకేం? వాడిని అలా పడగొడితే ఆ తర్వాత ఆ అమ్మాయిని బుట్టలో వేసు కోవడంకోసం నీ రూపం ఉపయోగించుకుంటానులే-"

"అదెలాగ?"

"ఎలాగో నాకు వదిలెయ్యి. ఊ నా సమస్యని ఇలా పరిష్కరించేస్తే, ఇంక నీ సమస్య ఎంత? రేపు నేనా అమ్మాయిని పెళ్ళిచేసేసుకోవడం, ఎల్లుండి సతీసమేతంగా వచ్చి నీ నాటకంలో వేషం వేసెయ్యడం, స్త్రీ పాత్రకోసం వెతికే అవస్థనుంచి మిమ్మల్ని తప్పించడం, రైట్, అన్నీ సర్దుబాటు అయిపోయాయి."

"ఒరేయ్ ఎంత తేలిగ్గా చెప్పేశావు బడ్జెట్ ఉపన్యాసం ఇచ్చే ఆర్థికమంత్రిలాగ. ఒప్పించడం, పెళ్ళిచేసుకోవడం, అవన్నీ అలా నిముషాలమీద అయేపనులేనా?" ఆశ్చ ర్యంగా ప్రశ్నించాడు శేఖర్.

"ఏమో-వాడివన్నీ రెండు రోజుల్లో సాధిస్తాడేమో- కాదని నువ్వెందుకు అను కోవాలి?" అన్నాడు కిరీటి.

"రెండురోజులుకాదు. రెండునెలలు టైమిస్తున్నాను. ఈలోగా వాడు మనకి పెళ్ళి శుభలేఖ ఇయ్యగలిగితే, నేను వాడికి నా చెవి కదపా ఇస్తాను."

"అదిసరేకాని ఇంతకీ నీ ప్రియురాలికి వీణ పాటవచ్చా?" అన్నాడు కిరీటి.

"తెలియదు ఇంకా అలాంటి వివరాలు అడిగేటంత పరిచయం ఏర్పడలేదు. అయినా సంగీతంమీద ఆసక్తి ఉన్న అమ్మాయిలా కనిపించదు."

"అదేం ప్రశ్నరా? ఆ అమ్మాయికి వీణపాట వచ్చునోరాదో, ఆ గొడవంతా నీకెందుకు అయినా"

"అమ్మమ్మ! అది చాలా అవసరం, మన రేడియో నాటికకి. నాటకం మధ్యలో ఆ అమ్మాయి వీణ వాయించాలి. అవీణపాటమీద చాలా కథ ఉంది "

"నీ శ్రార్ధం ఉంది. వెధవ షరతులూ నువ్వూను. ఆ చచ్చు నాటకం తీసికెళ్ళి నీనెత్తినేసుకుని కొట్టుకో అసలే ఆడది దొరక్క ఛస్తుంటే, వీణపాటవచ్చిన ఆడది ఒకటట" పళ్ళు పటపటా కొరికాడు శేఖర్

"ఏమైనా అంత ఆశ పనికిరాదురా. నీది మరీ గొంతెమ్మ కోరికలావుంది. చెప్పొద్దూ. పైగా వీణ, బూర్జువా మన తత్వానికి చిహ్నం" అన్నాడు వీర్రాజు.

శేఖర్, వీర్రాజూ కలిపి "ఏం కోరికలురా నాతండ్రీ!" అంటూ శనిపాతం వాడిని చూసినట్టు చూశారు కిరీటిని.

"ఏం చెయ్యమంటావురా మరి!" అన్నాడు. దీనంగా మొహంపెట్టిన కిరీటిని చూసేసరికి, వీర్రాజుకి జాలేసింది, "పోనీ-వీణ వాయించే అమ్మాయి ఒకత్తె ఉంది. ఆమెని తీసుకుంటారా?" అన్నాడు.

"అసలు స్పెసిమెన్‌లేకే చస్తుంటే మళ్ళీ ఇందులో సెలెక్షన్ ఒకటా? ఆనం దంగా తీసుకుంటాం. దండలతో ఆహ్వానించి మరీ తీసుకుంటాం. చెప్పు. త్వరగా చెప్పు."

"ఈ వీధికి ఆ చివర మేడ ఉందా ? "

"ఉందో లేదో ఎవడు చూశాడు? ఆ చివరకిమాత్రం ఎవడు వెళ్లాడు? మైలున్నర పొడవు ఉంది ఈవీధి. ఊ ఆ మేడలో? వీణ వాయించే అమ్మాయి ఉందా? నీకు పరిచయస్థురాలేనా."

"చంపావు ఫో-నేనేం ఎరగను. అటూ ఇటూ వస్తూంటే. అప్పుడప్పుడు ఆమేడమీంచి వీణపాట వినిపిస్తూ ఉంటుంది. వినిపించినప్పుడల్లా 'ఓహో! ఎవరీ అమ్మాయి? ఎంతబాగా వీణవాయిస్తోంది' అనుకుంటూ ఉంటాను. అంతే."

"ఏడవలేకపోయావు? ఇదా నీ సహాయం? ఇంకా నీకా అమ్మాయి తెలుసునేమో అనుకున్నాను నేను అఘోరించినట్టే ఉంది సర్లే ఆ అమ్మాయినో మరొకర్నో నేనూ కిరీటి వెళ్ళి ప్రార్థిస్తాం. అవసరం అయితే కాళ్లుపట్టుకుని బ్రతిమాలి మరీ తీసుకొస్తాం! నువ్వుమాత్రం వచ్చే ఆదివారం మధ్యాహ్నం మూడు అయ్యేటప్పటికి ఇక్కడ ఉండాలి. మేటనీకి బేరం చూసుకున్నాను. ఆపేటలో జనాన్ని దింపడానికి వెళ్లాను. అంటే ఊరు కొనేదిలేదు."

'వత్సా-నీకు ఆ అనుమాన మేమియూ వలదు ఆ సమయానికి ఎక్కడ ఉన్న వీర్రాజు అయినాసరే. గ్రద్దలా ఇక్కడికివచ్చి వాలును సరా?"

"ఆరోజు పోర్షన్లు పంచుకొని రిహార్సల్సు మొదలెట్టాలి "

'రైట్!" అంటూ మెడని ఉన్న గళ్ళ రుమాలుతీసి, గార్డు జెండాలా ఊపి, 'టాటా' అంటూ వెళ్ళిపోయాడు వీర్రాజు.

బయట ఆటోరిక్షా స్టార్టు అయిన చప్పుడు విని, "గడుసుపిండం! ఇలా చెప్పి, అలా చెప్పి మొత్తంమీద వాడికి కావలసింది ఏదో సాధించుకుపోతాడు అందుకే బతకగలుగుతున్నాడు ఈ లోకంలో. మనం ఉన్నాం. ఎందుకూ? మన కళ్ళజోడు మనం తుడుచుకోలేం" అన్నాడు శేఖర్ నిట్టూరుస్తూ.

కిరీటి ఉలిక్కిపడి, కళ్లజోడు తీసుకుని జేబురుమాలుతో శుభ్రంగా తుడుచుకొని మళ్ళీ పెట్టుకున్నాడు.

# 2

కాలేజీలకి శలవు చీట్లు పంపించేసి, ఆ నాడు నిర్వర్తించ వలసిన కార్యక్రమా న్నంతనీ ఒకటికి రెండుసార్లు రిహార్సల్ వేసుకొని, ఉన్న వాటిల్లో కాస్త ఖరీదైన మంచి బట్టలు తొడుక్కుని, జుట్టు రేగిందేమో అని అద్దంలో మళ్ళీ మళ్లీ చూసుకొని, బయల్దేరారు శేఖర్, కిరీటీను, ఆ వీధి చివర మేడలో వీణ పాటపాడే అమ్మాయిని కలుసుకుని, తమ రేడియో నాటికలో పాల్గొనవలసిందిగా ప్రార్థించడానికి

ఎంత నడిచినా ఆ వీధి ఎంతకీ తరగడం లేదు. ఇంకా చాలా మిగిలిపోయింది.

'ప్లేక్ మనీ' లాగ అయినా పెదిమలు బిగించి ముందుకి వెళుతూనే ఉన్నారు. పోను పోను నడకలో మొదటి వేగం, దూకుడూ తగ్గిపోయింది. ఏదో జంకూ-భయం-ఆమె ఎవరో, ఎలా వుంటుందో, ఏం అంటుందో, అయినా ఎలా పలకరించడం? ఇదే ఆలోచన ఇద్దరి బుర్రల్లోనూ. కాళ్లు తడబడుతున్నాయి. గుండె ఏక దడదడా కొట్టు కుంటోంది. చెప్పలేనంత ఆరాటం. ఆయాసమూను.

"నత్తనడక నడిచినా ఈ ఆయాసం ఏవిటి చెప్మా? ఇదంతా భయంవల్ల కాదు కదా?"

అలా అనుకోడానికి శేఖర్‌కి పౌరుషం అడ్డు వచ్చింది తనకి ఒక ఆడపిల్లని కలుసుకోడానికి భయమా? హుం! —ఎంత ధైర్యాన్ని పుంజుకోవాలని చూస్తున్నా శరీరం ఒక పక్కనుంచి ఒణికిపోతూనే వుంది. కిరీటి కనిపెట్టేస్తాడేమో తను పడు తూన్న కంగారు! పరిస్థితి మహ ఇబ్బందిగా వుంది శేఖర్‌కి.

"ఏవిటిరా? అలా జంకుతూ వెనక్కి నడుస్తావేం?" అన్నాడు ముందు నడుస్తూన్న కిరీటి, వెనక్కి తిరిగి శేఖర్‌కేసి చూస్తూ.

"జంకేవిటి?"-అన్నాడే కాని ముఖంలో కంగారూ విసుగూ కనిపిస్తూనే వుంది.

'వెధవ నాటకం ఒకటి రాసి, లేనిపోని సమస్య తెచ్చిపెట్టావు కదురా' అన్నట్లు న్నాయి అతని చూపులు. గట్టిగా అడుగు వేస్తే కాలికింద వున్న డైనమైటు ఎక్కడ పేలుతుందో అన్నట్లుంది అతని నడక. తను ఇంత తడబడుతూంటే వీడేవిటి పెద్ద ధైర్యవంతుడిలా జబర్దస్తీగా నడుస్తున్నాడు' పరిశీలనగా చూచాడు శేఖర్.

నిజానికి కిరీటి కూడా అంతగానూ భయపడుతున్నాడు. ఒళ్లంతా చెమటలు - నరాలన్నీ పీకడం గుండెల్లోంచి చలిగాలిలా జివ్వుమంటూ భయం. శేఖర్ తంతా డేమో అని కానీ, లేకపోతే ఈపాటికి వెనక్కి తిరిగి రూమ్‌వేపు ఒక్క దౌడు తీసి ఉండేవాడే!

ఇద్దరూ ఒకళ్ళకోసం ఇంకోకళ్ళు ధైర్యాన్ని నటిస్తూ, అడుగులో అడుగు వేసు కుంటూ, చచ్చీ చెడే ఎలాగో ఓలాగ ఆ మేడదాకా రాగలిగారు. వచ్చి నెమ్మదిగా తలెత్తి ఆ రెండస్థుల మేడనీ చూశారు.

అంతే - అది చూస్తూనే గుండె ఆగిపోయింది ఇద్దరికీ.

ఓరి నాయనోయ్! ఈ మేడేవిటి? ఈ పెద్ద పెద్ద కిటికీలూ ద్వారబంధాలూ, గాలికి ఎగురుతూన్న ఈ పువ్వుల కర్టెన్లూ, వెన్నెల రంగులో వెలిగిపోతూన్న ఈ పార్లర్లూ, బిల్డింగులో ఒక భాగంలాగ అ పక్కని, కిందనుంచి పై దాకా ఉన్న ఈ మెట్లగదీ. ఈ రంగురంగుల 'గ్రౌండ్ గ్లాస్' అలంకరణలూ ఏవిటి? ఈ ఒక్క మేడే చేస్తుంది లక్షరూపాయలపైన, వీళ్ల అమ్మాయినా మనం రేడియో నాటకంలో వేషం వెయ్యమని అడగడం? చాలు చాలు! దవడ ఊడిపోవడానికి ఇంతకంటే దగ్గర మార్గం ఏం లేదు.

''నడు పోదాం వెనక్కి'' అన్నాడు శేఖర్.

''బతుకు జీవుడా'' అని తక్షణం వెనక్కి తిరగబోయి, అంతలోనే ఓ చిన్న అనుమానం వచ్చి ఆగిపోయాడు కిరీటి.

''ఏం ఆగావు? బతకాలని లేదేవిటి?''

''అది కాదురా! ఇంత పెద్దమేడలో తప్పకుండా ఒక ఆల్షేషియన్ ఉండి ఉంటుంది. ఏం?''

''అల్షేషియన్ ఏం ఖర్మ? ఆఫ్రికన్ టైగరే ఉండొచ్చు!''

''టైగర్! అంటే పె ద్ద పు లి!'' - కిరీటి ఉలిక్కిపడ్డాడు. ''ఎవిటిరా అలా భయపెడతావు? అసలే కాళ్లలోంచి దడపుట్టి ఛస్తూంటే'' అన్నాడు.

ఆ మేడకేసి బిక్కమొహంతో చూసి. ఆఖరిసారిగా ఆశవదులుకొని, వెనక్కి తిరగబోతూంటే శేఖర్‌కి ఆ మేడలోంచి మెరుపుతీగలాంటి ఒక అందమైన అమ్మాయి ఇవతలికి రావడం కన్పించింది. చేతిలో పుస్తకాలు విలాసంగా ఊపుతూ నడుస్తూన్న ఆ తీరు చూసేసరికి ఎక్కడో చూసినట్లనిపించింది వెనక్కి తిరగబోతున్న వాడల్లా ఆ మట్టున ఆగి పరకాయించాడు

ఆ అందమైన కోలముఖం, చక్రాల్లాంటి కళ్ళూ, కొసదేలిన గెడ్డం, చేతికి పెట్టుకున్న వాచీ చైన్ రంగుకంటే పసిమిగా వున్న చెయ్యీ, మెత్తని ఫుల్‌వాయిల్ చీరలోంచి మెరిసిపోతూన్న ఆ శరీరచ్ఛాయ, నడకలో హుందాతనంతో కూడిన ఆ హొయలూ-ఇవన్నీ తనకి పరిచయ మైనవే-చాలాసార్లు ఈ అమ్మాయిని చూసినట్లు గుర్తు. ఎక్కడో మాత్రం జ్ఞాపకం రావడంలేదు.

సరే-ఏమైతేనేం? తెలిసిన మొహమే కదా? ఓ సారి అడిగి చూద్దాం. ఒప్పుకుంటుందా సరే సరి. లేదూ? మరో అమ్మాయిని ప్రయత్నం చేయవచ్చు.

మళ్లీ ఆశ చిగురించడంతో. కొత్తగా చురుకూ, చొరవా, ధైర్యం వచ్చాయి శేఖర్‌కి. అప్పుడే వచ్చిన వుత్సాహం అప్పటిదాకా వున్న దైన్యాన్ని తోసేసింది. హుషారుగా పక్కనున్న కిళ్ళీకొట్టు వైపు నడిచి గోల్డుఫ్లాక్ సిగరెట్టు ఒకటి కొని ముట్టించి ''కిరీటీ డబ్బులిచ్చెయ్యి'' అన్నాడు

''ఇదేవిటి? కత్తెరమార్కు కాదని ఖరీదైన బ్రాండ్‌లోకి దిగాడు అసలే డబ్బుల్లేక ఛస్తూంటే'' అని లోపల్లోపల విసుక్కుంటూ కిరీటి కిళ్లీకొట్టు వాడికి ఏడుస్తూ డబ్బులిచ్చాడు.

''ఊ రారా అబ్బీ!'' అంటూ శేఖర్ ముందుకి అడుగేశాడు.

ఇప్పుడేగా వెనక్కి పోదాం అన్నాడు! మళ్ళీ ఏం వచ్చింది? భయం ఎక్కువయి, వున్న ఆ కాస్త మతీ పోలేదు కదా!

''ఒరేయ్ వెనక్కి రా-అటెక్కడికి?''

''వెనక్కీ లేదు ఏం లేదు-కళ్ళు మూసుకుని నాతో వచ్చెయ్యి....ఊ '' అంటూ కిరీటి చెయ్యి పట్టుకుని బరబరా ఈడ్చుకు పోసాగాడు శేఖర్.

"పీడినేదో ఆవహించింది. సందేహం లేదు. లేకపోతే ఇప్పటిదాకా లేని ఈ ఆవేశం ఏమిటి, ఈ తెగింపు ఏమిటి? ఇవాళేదో మూడింది వీడికీ, వీడితోపాటు నాకూను. సరే కానియ్యి. అన్నింటికీ ఆ భగవంతుడే వున్నాడు" అని మనస్సు రాయి చేసుకుని, మాయల మరారీ వెనకాల వెళ్లే కుక్కపిల్లలాగ ఇష్టం లేక ఇష్టం లేక నడువసాగాడు కిరీటి శేఖర్ వెనకాల

దార్లో శేఖర్ గొంతు కొంచెం లేచింది. కంఠంలో ఇందాకటి దడా ఒణుకూ లేదు. ముందు వెళ్తూన్న అమ్మాయిని చూపించి "ఆ అమ్మాయిని చూశావురా కిరీటీ! ఆ మేడవాళ్ళ పిల్లా, వీర్రాజు చెప్పిన సదరు వీణ వాయించే యువతీ, దేవుడు చాలా మేలుచేస్తే రేపొద్దున్న నీ నాటకంలోకి రాబోయే హీరోయినూ, ఆ అమ్మాయే!" అన్నాడు.

ఇలా ఇద్దరూ ముచ్చట్లాడుకుంటూ సావకాశంగా వెనకాల వస్తూంటే, ముందు నడుస్తూన్న ఆ అమ్మాయి, చక్రాల్లాంటి తనకళ్ళు ఇటూ అటూ తిప్పి, వచ్చే పోయే ట్రాఫిక్‌ని జాగ్రత్తగా పరకాయించి, మంచి ఒడుపు చూసి, మెరుపులా మైన్‌రోడ్డు దాటేసి అవతల ఉన్న బస్‌స్టాప్ చేరుకుంది.

అది చూసి కిరీటి ఆశ్చర్యపోయాడు. "అరే-ఏం చాకచక్యంగా రోడ్డు క్రాస్ చేసింది! తను చచ్చినా అలా చెయ్యలేడు. వచ్చేపోయే కార్లని, ఆటోరిక్షాల్ని, సైకిళ్ళని తప్పించుకొని తను ఇటునుంచి అటు వెళ్లేప్పటికి అధమం పది నిముషాలైనా పడుతుంది. మధ్యలో ట్రాఫిక్ అంతా గల్లంతు! సడన్‌బ్రేక్ వేసిన ఏ కారు డ్రైవరు చేతో 'ఏవయ్యా బ్రతకాలని లేదేమిటి?' అనే ఆశీర్వచనం తప్పకుండా లభిస్తుంది ఏమైనా ఆల్షేషియన్‌లు వుండే ఇళ్ళల్లో పెరిగిన అమ్మాయిల సంగతే వేరు తెలివీ, చురుకూ, గడుసుదనం ఇవన్నీ వాళ్ళకుండే అందంలాగే, పుట్టుకతోటే పుష్కలంగా వచ్చేస్తాయి."

రోడ్డు అవతలనుంచి శేఖర్ చప్పట్లు కొట్టాడు.

"అరే-వాడూ వెళ్ళిపోయాడే! ఇప్పుడు నేను ఒక్కణ్ణీ ఎలా రోడ్డు దాటడం?" అని తటపటాయిస్తూ, ఏకతోరణంలా అటూ ఇటూ పోతూన్న శకటాలకేసి నిస్సహాయంగా చూస్తూ కొంచెం సేపు శిలా ప్రతిమలా వుండిపోయాడు కిరీటి.

చివరకి ఎలాగో ధైర్యం చేసి, ఆంజనేయ దండకం చదువుతూ కళ్ళు మూసుకుని రోడ్డుకి అడ్డం పడ్డాడు. కార్లు ఆగిపోయాయి. స్పీడుగా పక్కకి తప్పించడంలో ఆటో రిక్షాలు బోల్తా కొట్టబోయాయి. సైకిలు రిక్షాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి మొత్తం ట్రాఫిక్ అంతా స్టిల్ ఫోటోగ్రాఫ్‌లా అయిపోయింది. అంతా కిరీటిని చంపెయ్యాలన్నంత కోపంతో చూస్తూవుండగా, సర్కస్ ఫీట్ లాంటిది ఒకటి చేసి, మొత్తం మీద ఎలాగైతేనేం ఇటువేపుకి వచ్చి పడ్డాడు కిరీటి.

శేఖర్‌తో కలిసి నాలుగడుగులు గబగబా వేసి బస్‌స్టాప్ దగ్గరకి వచ్చేసరికి, బస్సు కోసం వేచి యున్న ప్రయాణికుల 'క్యూ' పెద్ద కొండచిలువలా పొడుగ్గా కనిపించింది

కిరీటికి. ఆ క్యూ మధ్యలో, కొండచిలువ ఒంటిమీది మెరుపులా పచ్చగా ఆ అమ్మాయి.

కిరీటికి కోపం వచ్చేసింది. ఇంత అందమైన అమ్మాయి కూడా ఈ 'క్యూ' లోనా? చింపిరి తలలూ, డోక్కుపోయిన మొహాలూ, చెమట బట్టలూ, చమురు కాళ్లూ, జర్మను సిల్వరు కేరియర్లూ మధ్య?

ఇలాంటి అందమైన యువతుల కోసం ఇంకో ప్రత్యేకమైన 'క్యూ' ఏర్పాటు చేస్తే వీళ్ళ సొమ్మేం పోయింది? ఛీ ఛీ ఏమైనా ఈ సిటీ బస్ కార్పొరేషన్ వాళ్ళకి కళాదృష్టీ, సౌందర్యారాధనా ఏం లేదు. అందుకే దేశం ఇలా తగులడుతోంది.

విశాలంగా ఇలా జాతీయ స్థాయిసో ఆలోచనలు సాగిస్తున్న కిరీటిని, దగ్గరగా వచ్చి నిలబడ్డ బస్సు బిగ్గరగా హారన్ కొట్టి భయపెట్టింది.

బస్సుని చూడగానే 'క్యూ'లో నిలబడ్డ వాళ్ళ మంచితనం అంతా, మంత్రి మండలిలో కాళీ ఏర్పడ్డగానే ప్రభుత్వ పక్షం ఎం. ఎల్. ఏ. లలో వుండే క్రమశిక్షణ లాగ, చటుక్కున మాయం అయింది నేను ముందు అంటే, నేను ముందు అంటూ ఒకళ్ళనొకళ్ళు తోసుకుని బస్సు ఎక్కసాగారు. ఆ త్రొక్కిసలాటలో స్త్రీలకేం సమస్య లేకపోయింది కాని, పురుషపుంగవులకి మాత్రం బస్సులోకి ఎక్కడం పెద్ద పరీక్షే అయింది. ఎలా అయితేనేం అతి ప్రయత్నం మీద శేఖర్, కిరీటీ బస్సు ఎక్కారు. నుంచోడానికి మాత్రమే చోటు దొరికింది అందులో శేఖర్‌కి మరీ కిరీటికి దూరంగానూ, ఆడవాళ్ళ సీట్లకి దగ్గరగానూ లభించింది. కొంతలో కొంత నయం, ఆ అందమైన అమ్మాయికి సమీపంలో వుంది ఆ కాస్త చోటయినా. ఇదీ శుభసూచనే. బస్సు దిగేలోగా ఏదో వంకని మాటలో మాట కలిపి కొంచెం పరిచయం సంపాదించుకోవచ్చు.ఆ తర్వాత అంటావు, అసలు విషయం కదిపి ఎలాగో అలాగ ఒప్పించడానికి ప్రయత్నించవచ్చు. ఈ లోగా మాట కలపడం ఎలాగో ఆలోచించాలి.

శేఖర్ ఊహలు ఇలా పరిగెడుతూంటే, కిరీటి భావాలు ఇంకోలా నడుస్తున్నాయి.

"అంత మేడా,ఆల్సేషియన్ డాగ్గూ వున్న శ్రీమంతురాలు కదా! స్వంత కారులో వెళ్ళక ఇలా సిటీ బస్సులో వస్తోందేవిటి? కారు ఏదైనా రిపైరింగ్‌కి వెళ్ళిందా? లేదా ఇంట్లో వాళ్లెవరైనా ఎక్కడికైనా వేసుకు వెళ్ళారా? డ్రైవరు శలవు పెట్టాడా? ఇవేం కాక పాతకారు అమ్మేసి కొత్త మోడల్‌కి ఆర్డరిచ్చారా? ఏమై వుంటుంది చెప్మా."

ఇలా ఇద్దరూ చెరో లోకంలోనూ వుండడం వల్లనే కండక్టరు వేస్తూన్న కేకలు ఏ ఒక్కరి చెవిలోనూ పడలేదు. చివరకు విసుగెత్తి కండక్టరు శేఖర్‌ని చేత్తో తడుతూ, "ఏవిటి సార్ మాట్లాడరు! టిక్కెట్టు తీసుకోండి. ఎక్కడికి పోవాలి?" అని అడిగాడు.

శేఖర్ ఉలిక్కిపడి "అవును-ఎక్కడికి?" అన్నాడు అటు తిరిగి పక్కనే వున్న అమ్మాయి ముఖంలోకి చూస్తూ. ఆ యువతి కోపంతో ముఖం అటు తిప్పుకుంది.

"ఈమె ఎక్కడ దిగుతుందో తెలియదే-ఎక్కడికని తను టికెట్టు కొనేటట్టు?"



—శాంతి

శేఖర్ ఇబ్బందిలో పడ్డాడు. ఆ అమ్మాయి కనక ఇంకొంచెం దూరంగా వుంటే, "మనలో మన మాట. ఆవిడ ఎక్కడికి తీసుకుంది టికెట్టు?" అని కండక్టరుని లోపాయికారీగా అడిగి వుండేవాడే. ఇప్పుడు చిక్కు పడింది. ఏమిటి చెయ్యడం?

ఇంతలో కిక్కిరిసి వున్న పదిమంది మనుష్యుల అవతలనుంచి, తల మాత్రమే కనిపించేలా కాళ్లు ఎత్తి, "ఏరా టిక్కెట్టు కొననా? ఎక్కడికి కొనమంటావు?" అంటూ అరిచాడు కిరీటి.

"వెధవ అరుపులూ, వీడూను ఎక్కడికని కొంటాడు? బొత్తిగా ఎప్పుడేం అనాలో తెలియదు మట్టిబుర్రా వీడూను" అని మనస్సులో తిట్టుకుని "నీ దగ్గర డబ్బులు లేవుగా-నేను కొంటాలే-నా దగ్గరేనా వందరూపాయల నోటేగా వుంది. అందరికీ టిక్కెట్లు ఇచ్చాక కండక్టరు చిల్లర పట్టుకుని నా దగ్గరకు వస్తాడు. నువ్వీ లోగా తొందరపడకు' అంటూ శేఖర్ గట్టిగా చెప్పాడు, ఇటు అమ్మాయికీ అటు కండక్టరుకీ కూడా వినిపించే లాగ

"నా దగ్గర డబ్బులు లేవూ? తన దగ్గర వంద రూపాయలనోటు వుందా? చచ్చుడాబూ వీడూను. ఆ అమ్మాయి ఏం అనుకుంటుంది. నన్ను ఒక పాపర్‌గా జమ కట్టదూ? ఉండు వీడి బండారం బైట పెడతాను," అనుకొని, ఆ మాటలే పైకి అందా మని నోరు తెరిచాడు కిరీటి

కాని, "నోరు ఎత్తావో జాగ్రత్త! చంపేస్తాను!" అన్నట్లు గుడ్లురిమి చూశాడు శేఖర్. దాంతో హడలిపోయి, తెరిచిన నోరును తెరిచినట్లే ఆమట్టున వుండిపోయాడు కిరీటి.

ఆ పిల్ల బస్సు దిగేలోగానే, ఏదో ఒక వంకని ఓ మారు పలకరించేస్తే, ఆ పరి చయాన్ని పురస్కరించుకుని తక్కినదంతా మాట్లాడవచ్చు. నిజమే! కాని, ఆ పలక రించడమే ఎలాగ? ఏమని?

"మేడమ్! టైమెంతయిందీ?" అంటే-బాగానే వుంటుంది కాని ఖర్మ! తన చేతిని వాచీ ఏడిసిందే! పోనీ-తన వాచీ ఆగిపోయింది అనుకుందాం అయ్యా తాత్కాలిక ప్రాతి పదికమీద. అయితే మాత్రం? బస్సులో ఇంతమంది చేతులకి ఇన్ని వాచీ లుండగా ప్రత్యేకించి ఆమెనే టైము అడగడం ఏమంత సమంజసంగా వుంటుంది?

పోనీ-"మీరెక్కడ దిగుతారండీ?" అని అడిగితే?-అడగొచ్చు. కాని ఆమె రపీ మని దవడ వాయగొట్టినట్లు "తమకెందుకండీ ఆ సంగతి?" అంటే-నిజమే, పది మందీ ఘొల్లున నవ్వడం, తనకీ జన్మలో ఆమెని పలకరించే అవకాశం పోవడం-

మరి అయితే ఏవిటి చెయ్యడం?

ఇలా, తెలివితక్కువ సినీ ప్రొడ్యూసర్‌లాగ తెగ ఆలోచించేస్తూ, బంగారం లాంటి టైముని, సిగరెట్టు పొగలాగా బ్రాందీ వాసనలాగా ఒక ప్రక్కకి శేఖర్ ఖర్చు పెట్టేస్తున్నాడు. మరో ప్రక్కని తన బస్‌స్టాప్ వచ్చి ఆ అమ్మాయి దిగి పోయింది.

కండక్టరు రైట్ రైటంటూ బెల్ కొట్టడం. ''ఒరేయ్ మనం ఇక్కడ దిగొద్దూ,'' అంటూ కిరీటి అరవడం ఒక్క మాటే జరిగాయి.

తుళ్లిపడి శేఖర్ ఆమె సీటులోకి చూశాడు.

ఆ స్థానంలో, రెండు చేతుల నిండా రకరకాల తెల్ల కర్ర గాజులు వేసుకుని, వీపు కనిపించే అతుకుముక్కల జాకెట్టూ, అద్దాల బొంత పరికిణీ కట్టుకొని, అట్టలు కట్టిన జుట్టుకి ఆభరణాలు తగిలించి, మెడలో వింత వింత రంగు పూసల దండ వేసుకుని, ముడతలు పడి వేళ్ళాడిపోతూన్న శరీరంతో, ఓ ముగ్గు బుట్ట ముసలి లంబాడీ కనిపించింది.

కెవ్వున కేకవేసి కళ్ళు నులుపుకొని చూశాడు శేఖర్.

అనుమానం లేదు.

అమ్మాయి లేదు. ఆ స్థానంలో ముసలి లంబాడీ ఉంది.

ఏవిటీ మేజిక్?

''కొంప ములిగిందిరా దేవుడా!'' అనుకుంటూ ఒక్క పొలికేక వేసి, బస్సు ఆపమన్నాడు శేఖర్.

బయలుదేరిన బస్సే సడన్ బ్రేక్‌తో ఆగడంవల్ల, జనం అంతా ముందుకి ఒక్కమారు ఊగి, తిరిగి వెనక్కి పడ్డారు.

''దిగు దిగు ఇంతసేపు ఆగితే దిగకుండా ఏం చేస్తున్నావు?'' అన్న కండక్టరు పల్లవికి, బస్సులోవాళ్ళంతా తక్కిన చరణాలు అందుకొని కోరస్ పాడారు.

కంగారుగా దిగబోతూన్న శేఖర్‌ని పట్టుకొని ''టిక్కెట్టు కొనలేదుగా? ఆ వంద రూపాయల నోటు ఇలా ఇయ్యి. చిల్లర ఇస్తాను'' అన్నాడు కండక్టరు.

''అక్కర్లేదులే. మావాడి దగ్గర చిల్లరుంది'' అంటూ కిరీటిని కండక్టరుకి ఆహారంగా పడేసి, తను మాత్రం ఆ అమ్మాయిని వెంబడించడం కోసం, గబగబా బస్సు దిగి వెళ్ళిపోయాడు శేఖర్.

తీరా కిరీటి వచ్చేసరికి, రోడ్డు వారనున్న లైటు స్తంభానికి జేర్లబడి దిగాలుగా కనిపించాడు.

''ఏరా? ఏమైంది? అలా ఉన్నావేం? ఆ అమ్మాయిని పలకరించావా?'' అన్నాడు కిరీటి.

''లేదురా - తీరా నేను వచ్చేసరికి ఆ అమ్మాయి ఇదిగో, ఈ గేటులోంచి లోపలికి వెళ్ళిపోయింది'' అంటూ మెడికల్ కాలేజీ గేటు చూపించాడు శేఖర్.

''అయితే ఇకనేం? ఆ అమ్మాయి మెడిసన్ చదువుతోందన్న మాట. నిన్ను అడ్డేవాళ్ళెవరూ, నీ కాలేజీయేగా లోపలికి పోలేకపోయావా?''

''కాలేజీ లోపల ఆమెని పలకరిస్తే బాగుండదు. ఆమె ఏమైనా పెడసరంగా

మాట్లాడితే? తెలిసిన ప్రొఫెసర్లూ, సర్జన్లూ వాళ్ళ ముందు అవమానం కాదూ? అందు వల్ల ఆమె తిరిగి వచ్చేదాకా మన మకాం ఇక్కడే.''

''మరి, మన మధ్యాహ్నం భోజనం?''

''ఏం? జేబునిండా డబ్బులున్నాయా?''

''ఎక్కడివిరా? తెచ్చిందే రూపాయి లోపు చిల్లర కదా? మళ్ళీ అందులో నీ షోకు ఒకటి-గోల్డుఫ్లాక్ సిగరెట్టూ నువ్వూను! అదీ, ఇందాకటి సిటీబస్సు ఛార్జీలు పోగా ఇంకే మాత్రమో అర్ధరూపాయి కాబోలు మిగిలింది.''

''మరింకేం? పెద్ద జమీందారులాగ భోజనం కబుర్లూ నువ్వూను. ఆ అర్ధ రూపాయి అలా ఉంచు అదిగో ఆ చెట్టు కింద వేరు శనక్కాయలు అమ్ముడంలేమా - అవో పదిపైసలివి కొనుక్కుని, పంపునీళ్ళు తాగితే, ఈ పూట కిక భోజనం సమస్య ఉండదు ఈ ఒక్కపూటకీ గాంధీగారివి అనుకో. రాత్రి రూమ్‌కి వెళ్ళాక, అయ్యరు అరువు కాతా ఎలాగా ఉందిగా? సుష్టుగా భోజనం చెయ్యొచ్చు. అంతగా ఏడుపు వస్తే కార్తీక సోమవారం జ్ఞాపకం తెచ్చుకో. ఏం తెలిసిందా?''

''ఏం ఖర్మ వచ్చి పడిందిరా భగవంతుడా అనుకుని. కళ్ళల్లో తిరిగిన నీరు కనపడకుండా ముఖం అటు తిప్పి 'అలాగే' అన్నట్లు తల ఊపాడు కిరీటి.

''నువ్వు చాలా మంచివాడివిట. ఎనిమిది పైసలుంటే ఇస్తావుట! ఇయ్యరా ఓ సిజర్ సిగరెట్ తెచ్చుకుంటాను భయపడకు. ఇంక మళ్లీ రూమ్‌కి తిరిగి వెళ్ళేదాకా అడగనులే-దాన్నే సాయంత్రందాకా తాయిలంలా దాచుకొని, కొంచెం కొంచెం కాల్చు కుని ఆర్పేస్తూ ఉంటాను. మా బాబువి కాదూ? ఇయ్యరా!''

దీనంగా పెట్టిన శేఖర్ ముఖం చూసేసరికి కిరీటి కాదనలేక పోయాడు.

సాయంత్రం నాలుగు గంటలకి స్నేహితులతో కలిసి నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ గేటులోంచి ఇవతలకి వచ్చిన ఆ అమ్మాయిని చూసేసరికి, శేఖర్‌కీ కిరీటికీ ప్రాణం లేచివచ్చినట్లయింది. రోడ్డు దుమ్ముతో అసహ్యంగా తయారయి, పొద్దుటినుంచీ చేసిన బలవంతపు ఉపవాసంవల్ల నీరసంగా పీక్కుపోయిన వాళ్ళ ముఖాలు ఆమె కని పించడంతో పొద్దు తిరుగుడు పువ్వుల్లా వికసించాయి. స్నేహితుల్ని పంపించేసి. ఒక్కత్తే బస్సుస్టాప్ దగ్గిరికి నడుస్తూన్న ఆ అమ్మాయి, తనని వెంబడిస్తూన్న శేఖర్‌నీ కిరీటినీ చూసి, 'ఓహో! వీళ్ళు పొద్దుటి జంటేనే' అనుకుంది.

దానికితోడు వాళ్ళు ప్రొద్దుటిలాగ కాకుండా, కాస్త చొరవనీ, మరి కాస్త ధైర్యాన్నీ పుంజుకొని, ఆమెని పలకరించి తాడో పేడో తేల్చేసుకోవాలనే ఉద్దేశంతో ఇంకొంచెం దూకుడుగా తనకేసి వస్తున్నారేమో, ఆమెకి అనుమానం మరికొంచెం ఎక్కువయింది. ఏదో తెగింపు, సరే కానియ్యి ఏదైతే అది అవుతుంది అనే ఒక రకమైన మొండితనం, పారిపోడానికి వీలు లేనప్పుడు పెద్ద పులి వచ్చి మీద పడి పోతూంటే మనుష్యులకి సాధారణంగా వచ్చే ఓ పిచ్చి ధైర్యం, వెఱ్ఱి ఆవేశం. ఇవన్నీ స్పష్టంగా కనిపించాయి వాళ్ళ మొహాల్లో.

వాళ్ళ చేష్టలన్నీ కళ్ళ చివరనుంచి కనిబెడుతూన్న ఆ అమ్మాయి "ఓహో వీళ్ళేదో అఘాయిత్యం చెయ్యడానికే పొద్దుటినుంచీ నన్ను వెంటాడుతున్నారు" అనుకొని, ఎడంకాలి చెప్పు రెడీగా ఉందా లేదా అని ఓమారు చూసుకుంది.

ఇలా ఉండగా శేఖర్, కిరీటీ ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుని, నాలికల్ని తడుపుకొని, ఎండిపోయిన గొంతుల్ని సవరించుకొని "ఊఁ రెడీ" అని ఒకళ్ళనొకళ్ళు మౌనంగా హెచ్చరించుకొని, ఆమెని పలకరించడానికి నోరు తెరిచారు.

ఇంకొక్క క్షణం ఉంటే వాళ్ళా పని చేసి ఉందురు.

ఆమె దగ్గరనుంచి సన్మానంకూడా పొంది ఉందురేమో

కాని ఇంతలో పిటీ బస్సు వచ్చేసింది.

"చేతికి అందింది అనుకున్న అవకాశం కాస్తా జారిపోయిందే!" అని ఘొల్లున మనస్సులో ఏడ్చారు ఇద్దరూ.

ఆ కండక్టరు వాళ్ళ సంకల్పాన్ని కనిపెట్టాడో, లేక కావాలని వాళ్ళ నేడిపించాలనుకున్నాడో, కాక అలా ఆడపిల్లల్నీ, మొగపిల్లల్నీ విడదియ్యడం అంటే అతనికి సరదాయో, రూల్సుని తు. చ. తప్పకుండా అమలు జరిపే చాదస్తుడో-ఏం పాడో కాని, "అమ్మా మీరలా ముందు డోర్‌లోంచి ఎక్కండి ఇదిగో బాబూ, మీ రిలా వెనక డోర్‌దగ్గిరికి వచ్చెయ్యండి" అంటూ బోడి ఉత్తరువు ఒకటి జారీచేశాడు వళ్లు మండిపోయేలాగ.

ఇంకేం ఉంది? ఆ అమ్మాయీ, తామూ ఒకే బస్సులో ఉన్నాం అన్న సంతృప్తే కాని, ఆ అమ్మాయిని చూడడమా, పలకరించడమా? ఒకళ్లు ఇచ్ఛాపురంలోనూ, మరొకళ్లు హిందూపురంలోనూ - సరదాగా నవ్వుకుంటూ హాయిగా పాడుకుంటూ, సెక్రటేరియేట్‌లోని పక్కపక్క సీట్లలో కూర్చుని, గంటల్ని నిముషాలులాగ దొర్లించేసే యు. డి. సీ. నీ లేడీ టైపిస్టునీ చూసి ఓర్వలేక, ఇద్దర్నీ రాష్ట్రానికి చెరో మూలా విసిరేసే రాష్ట్రప్రభుత్వ రాక్షస మనస్తత్వం నీలోకూడా పూర్తిగా జీర్ణించి పోయిందేమిట్రా భగవాన్లూ!" అనుకుంటూ, బస్సు దిగేదాకా, కండక్టరుని రకరకాల నామావళితో పూజిస్తూనే ఉన్నారు, ఆ ఇద్దరు మిత్రులూ కసిగా మనస్సులో.

పొద్దుట ఎక్కినచోటే ఆ అమ్మాయి దిగింది. కిరీటీ శేఖరూ కూడా దిగారు. "అనుమానం లేదు. వీళ్ళు కావాలనే నన్ను వెంబడిస్తున్నారు సరే కానియ్యి" అనుకొంది ఆ అమ్మాయి. కోపంతో ఆమె ముఖం ఎర్ర గులాబీల తోటగా మారడం కానీ, దొండపండులాంటి కింది పెదవిని ముత్యాలలాంటి ఆమె పళ్ళు గట్టిగా నొక్కడం కానీ, చక్రాల్లా ఉన్న కళ్ళు రెండూ విచ్చుకత్తుల్లా ప్రజ్వరిల్లడం కానీ, వాళ్ళిద్దరూ గమనించనే లేదు.

వాళ్ళ తొందరంతా, ఆమె తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయే లోగా ఎలా పలకరించడం అనే.

ఆమె విసురుగా ముందు నడిచేస్తోంది.

వెనకాల శేఖర్ కిరీటీ, పొద్దుటినుంచి భోజనం లేకపోవడంవల్ల నకనకలాడు తూన్న పొట్టలమీంచి మాటిమాటికీ జారిపోతూన్న పేంట్లని పైకి లాక్కుంటూ, దాదాపు పరుగులాంటి నడక సాగిస్తున్నారు.

ముందు వేగంగా ఆమె.

వెనక ఆయాసపడుతూ వీళ్ళు.

ఆ సమయంలో కుర్రాళ్ళు ఎవరేనా ఆ ముగ్గుర్నీ చూస్తే, 'నగరంలో నడకల పోటీ' జరుగుతోందేమిటి చెప్మా అనీ, పెద్దవాళ్ళు అందులో ఆడపిల్లల్ని కన్న తండ్రు లెవరేనా చూస్తే, పాపం ఈ అమ్మాయిని వీళ్ళెవరో తరుముతూంటే ఆమె తప్పించుకు పారిపోతోందనీ తప్పకుండా అనుకొని ఉందురు.

ఇలా ఆ పోటీ, అపూర్వ కౌశలంతో, అసదృశమైన చాకచక్యంతో, అసామాన్యమైన నైపుణ్యంతో, కన్నుల పండుగలా సాగి సాగి, చివరకి పొద్దుటి రెండస్థుల మేడ దగ్గిరికి వచ్చేసింది.

ఆ అమ్మాయి ఇంకో రెండడుగులు వేసి చీడీలు ఎక్కేసి లోపలికి వెళ్ళిపోయిందో, ఇప్పటిదాకా తాము పడిన శ్రమా, చేసిన ప్రయత్నం, ఉన్న కార్తీక సోమవారం ఉపవాసం, అన్నీ వృధా దండగ వేస్ట్!

అందుకే ఇంక ఆగలేక, అలాగని ఆమెని ఆ రెండు అడుగుల్లోనూ వెళ్ళి కలుసుకొనే ఓపిక లేక, చేసిన ప్రయత్నం అంతా చేజేతులా జారిపోతోందే అనే ఆవేదనని భరించలేక, వెఱ్ఱి ఆవేశంతో ఇద్దరూ ఏకకంఠంతో గట్టిగా,

''మేడమ్! మాట!''

అంటూ అరిచారు. వాళ్ళ పిచ్చి కేకక్కి, ఇంట్లో గన్ తుడుచుకుంటూన్న ఆ అమ్మాయి తండ్రి ఇవతలకి వచ్చాడు కాని, ఆమె మాత్రం వెనక్కి తిరగలేదు.

పైగా మరింత తొట్రుపడుతూ ఎలాగో అలాగ లోపలికి వచ్చి పడి, ఎదురైన తండ్రితో, ''డాడీ! ఎవరో రౌడీలు నన్ను తరుముతున్నారు'' అంటూ వణికే కంఠంతో భయంగా అరిచింది.

అంతే.

ఎత్తుగా లావుగా ఏభై ఏళ్ళ విగ్రహం.

నల్లని సూటుపైన పచ్చని పెద్ద ముఖం.

చాకుల్లా ఇటూ అటూ తెల్లని మీసాలు

ఎర్రగా నిప్పులు కురిపిస్తూన్న కళ్లు.

కోపంతో వణికిపోతూన్న చేతులు.

చేతిలో బారెడు గన్!

మృత్యువులా చీడీలమీద ప్రత్యక్షమైన ఆ రూపాన్ని చూసేసరికి శేఖర్‌కీ, కిరీటికీ పై ప్రాణాయి పైకి పోయాయి. సీలలు వేసి బిగించినట్లు వాళ్ల కాళ్లు ఆ మట్టునే అక్కడే ఆగిపోయాయి.

వణికిపోతూన్న మోకాళ్లు ఒకదాని కొకటి కొట్టుకుంటున్నాయి.

పళ్ళు గిట్ట కరుచుకుపోయాయి.

చేష్టలు దక్కి, చైతన్యం నశించి, ప్రాణంలేని శిలావిగ్రహాల్లా అలా నుంచుండి పోయారు, పారిపోడానికికూడా ధైర్యంలేక శేఖర్ కిరీటీనూ.

# 3

బరువైన కిరాణా సరుకుల సంచీ ఒక హేండిల్‌కీ, నిండుగాఉన్న కూరల సంచీ మరో హేండిల్‌కీ తగిలించాడు రవణయ్య. ముక్కుమీదకి జారిపోతూన్న కళ్ళజోడుని పైకి తోసుకుని, చుట్టూ పరకాయించాడు. కనుచూపు మేరలో తూముకానీ, అధమం ఎత్తైన ఓరాయికానీ ఏదీ కనిపించలేదు. మరయితే ఎలాగ తను సైకిలెక్కడం? ఎవడి నెత్తినో కాలెయ్యడం ద్వారానే పైకి రాగలం, అనే నమ్మకాన్ని నరనరాల్లోనూ జీర్ణించుకొన్న రవణయ్య, సైకిలు ఎక్కడంలో కూడా ఆ సిద్ధాంతాన్నే అక్షరాలా అమలుపరుస్తాడు, సాధ్యం అయినంతవరకూ.

ఇప్పుడది సాధ్యపడేలాలేదు. స్వయం కృషి తప్ప శరణ్యంలేదు. సరే తప్పుతుందా? బాధగా మూలిగాడు. చెరో కాలిమీదకీ వచ్చేలా మధ్యకి విరిచి సైకిలు కట్టు కట్టిన పంచెని, మరోమారు బిగించుకున్నాడు. పిక్కలకి ఉన్న క్లిప్పుల్ని సర్దుకున్నాడు. సైకిలు వెనక్కి వెళ్ళి నుంచుని, చేతులు తెగిపోతాయి అన్నంతవరకూ సాగదీసి చాపి, హేండిల్‌బారు పట్టుకొని, ఎడంకాలు వెనక చక్రం ఫోర్కుమీద పెట్టి, కుడికాలితో నేలని తన్నగా తన్నగా ముందుకి కదిలిన సైకిలుమీదకి, అమాంతం ఎగిరి కూర్చోబోయాడు. కాని సైకిలుకి అంతలో రోడ్డు దాటుతూన్న కుర్రాడు అడ్డువచ్చాడు. మరి కొంచెం దూరం మామూలుగా నడిపించుకు వెళ్ళి, మళ్ళీ అదేవిధంగా ఎక్కబోయాడు రవణయ్య. ఈ మాటు కార్పొరేషనువాళ్ళ కారు ఎదురైంది. మూడో ప్రయత్నాన్ని ఓ ముసలాడు పాడుచేశాడు. నాలుగోసారి ఎక్కబోతే, రోడ్డు మధ్యలో నిలబడి రాత్రి చూసిన సినీమా గురించి ఉద్వేగంతో చెప్పుకుంటూన్న బెల్‌బాటమ్ గురూ షర్టుల అమ్మాయిలు అడ్డువచ్చారు. రవణయ్యకి ఒళ్ళు మండిపోయింది. తన సైకిలికి అడ్డు రావడం తప్ప ఈ జనానికేం పనిలేదేమిటి? వీళ్ళంతా తనని సైకిలెక్కకుండా చెయ్యడాని కేదో కలిసి కుట్రపన్నినట్లు కనిపిస్తోంది. తెల్లవారేటప్పటికి అంతా కొంప మునిగి పోయినట్లు ఇలా రోడ్లమీదకి వచ్చి అఘోరించకపోతే, ఇళ్ళల్లో కూర్చోకూడదూ ఇంచక్కా? ఎందుకూ పనికిరాని చట్టాలు చెయ్యకపోతే ఈ గవర్నమెంటు 'పనిలేని

వాళ్ళెవరూ వీధుల్లో తిరగరాదు' అంటూ ఓ చక్కని శాసనం చెయ్యరాదూ? ప్రజలకీ బుద్ధిలేదు, ప్రభుత్వానికీ బుద్ధిలేదు.

ప్రపంచంమీద కోపంతో ఓమారు పళ్ళు పిండుకొని, ఆ ఊపులో, వెనక కేరియర్ మీంచి ఎగిరి అమాంతం సీటుమీదకి ఉరికాడు రవణయ్య. మంత్రిపదవి అధిష్ఠించినంత ఆనందం అయింది అయితే చెరో వైపునా తగిలించిన బరువైన సంచులు కారణంగా, హేండిలు ఇటూ అటూ తెగ ఊగిపోతూ, బలమైన ప్రతి పక్షంలా, అతనికి ఆ ఆనందం మిగల్చడంలేదు ప్రాణాలు ఉగ్గబట్టుకొని, ఏ చిన్న అడ్డంకి వచ్చినా తెగ కంగారు పడిపోతూ, బెల్ ఉంది దాన్ని ఉపయోగించవచ్చు అన్న సంగతే మరిచిపోయి, "ఏయ్ తప్పుకోండి తప్పుకోండి ' అని అరుస్తూ, రోడ్డుమీద యావత్తు ట్రాఫిక్‌నీ తికమక పెట్టేస్తూ, నడిచే జీవకోటిపాలిటి మృత్యువులా, శాంతి భద్రతలకి ఛాలెంజిలా, సైకిలుమీద వచ్చేస్తున్నాడు రవణయ్య.

సరిగ్గా, అదిగో ఆ సమయంలో ఎదురయ్యాడు వీర్రాజు మారువేషంలో. తెళ్ళ పంచెకట్టూ-కప్పు పెట్టవలసినచోట ఎర్రని ఊలు ముడేసిన పొడుగు చేతుల కమీజూ-పైమీద మడత కండువా. నుదుటను దిట్టంగా విభూదీ, కనుబొమల్లో కుంకం. బుద్ధిమంతుడిలా పాపిటతీసి పక్కకి దువ్విన క్రాపూ-చేతిలో, కిరీటి దగ్గర్నుంచి ఎరువు తెచ్చుకొన్న, శ్రీనాథుని శృంగార నైషధం-రవణయ్యని చూడగానే గుర్తుపట్టాడు సైకిలు మీద సర్కస్ చేస్తున్న ఆ ఆసామీ తన ప్రియురాలికి సాక్షాత్తూ మేనమామ అనీ, ఆ శాస్త్రీ కోసమే తానిలా తయారు వేషంలో. అరగంటనుండి వెతుకుతున్నాననీను

గుర్తు తెచ్చుకొని కంగారుగా పుస్తకంతో సహా రెండు చేతులూ జోడించి, "నమస్కారంఅండీ'' అన్నాడు. అనుకోకుండా ఎదురైన ఆ గౌరవానికీ, లభించిన మర్యాదకీ. ఉబ్బి తబ్బిబ్బై "నాకు దణ్ణంపెట్టే దౌర్భాగ్యుదెవడున్నాడ్రా ఈ మహా పట్నంలో'' అని ఆశ్చర్యపోతూ తల పక్కకి తిప్పి చూశాడు రవణయ్య.

అంతే-ఇంకేం ఉంది; గోవిందా; హేండిల్ ఇటూ అటూ ఊగిపోయి, సంచులూ సైకిలుతో సహా, రోడ్డుకి అడ్డంగా పడిపోయాడు రవణయ్య మేష్టారు. పైన సైకిలూ కిందతనూ. చలనం లేకుండా గుడ్లు మిటకరించి చూస్తూ పడిఉన్న ఆ జీవుడిని చూసేసరికి, నవ్వుతో లుంగలు చుట్టుకుపోయిన వీర్రాజుకి, విపరీతమైన జాలివేసింది. "అయ్యో పడిపోయారే!'' అంటూ ఒంగుని సైకిలు ఎత్తి రవణయ్యని లేవదీశాడు. కాని పాపం రవణయ్య లేచే పరిస్థితిలోలేడు చట్ట బెణికింది అప్పటికే ఏం జరిగిందో అని చుట్టూ మూగిన జనంలోంచి, సంఘసేవయందు నమ్మకంఉండి, ముందు ముందు ఎలక్షన్స్‌లో నిలబడదాం అనుకుంటూన్న ఒక పెద్దమనిషి, రవణయ్యకి చెయ్యి ఆసరా యిచ్చి, ఆదుకుని నిలబెట్టాడు. తోటివాడికి సాయంచేస్తే సాటిలేని పుణ్యం వస్తుందని మత గ్రంథాల్లో చదివిన భక్తుడొకడు, సంచుల్లోంచి పడిపోయిన సరుకుల్ని తిరిగి సంచుల్లోకి ఎత్తసాగాడు. మిగిలిన జనం 'ట్రాఫిక్ ఆగిపోయింది. ఏమైంది' అంటూ

కార్లూ స్కూటర్లూ దిగి వచ్చిన ఖరీదైన మనుష్యులూ. నడ్డిపట్టుకుని వంకరగా నుంచుని మూలుగుతూన్న రవణయ్యనీ, సైకిలు పట్టుకుని రవణయ్యకేసి ప్రాధేయ పూర్వకంగా చూస్తూన్న వీర్రాజునీ, మార్చి మార్చి పరిశీలించి, నేలమీద పడిపోయిన వస్తువులేమిటా అని పరీక్షించ సాగారు.

నిజమైన దేశభక్తుల్లో విడదియ్యడానికి వీల్లేనంత తమాషాగా కలిసిపోయిన దొంగల్లా, ఏకం అయిపోయాయి, బద్దలైన ఉప్పు పొట్లంలోంచి బయటపడ్డ సన్నని ఉప్పుకణాలు, పంచదార పలుకులతోటి చింతపండుకి అంటుకున్న మెంతులు, అనాకారి ధరించిన ఆభరణాలులా వెక్కిరిస్తున్నాయి కూరలు కూడా వచ్చి, కిరాణా సరుకుల్లో కలిసిపోయాయేమో, పరమబద్ధ కస్తూరాలి వంటిల్లులా అయోమయంలా ఉంది ఆ ప్రదేశం. చోద్యం చూస్తూన్న ప్రజలకి అన్ని వస్తువులూ అర్థం అయ్యాయి కాని, నల్లగా జిగురు జిగురుగా అక్కడక్కడ తెల్లగా గింజలతో ఎర్రని నీళ్ళల్లో తేలుతూన్న ముద్ద ఏమిటో అర్థంకాలేదు. అడ్డాకులో కట్టించుకు వచ్చిన గట్టివెన్నా, ఉల్లిపొర కాగితంలో పేక్ చేసిన కాఫీపొడుం, సంచీలోంచి దొర్లిపోయిన టొమాటాలూ మహా విప్లవంలో తమతమ విభేదాలు మరిచి కలిసిపోయిన వివిధ వర్గాలులా, ఆ యాక్సిడెంటులో ఏకం అయిపోయి, ఒక కొత్త పదార్థంగా రూపొందాయని ఎవరూహించగలరు?

''ఎందుకిలా జరిగింది? అసలు ఏమైంది?'' అన్నారు అక్కడ జేరిన పెద్దల్లో, పత్రికా విలేఖరులులా ప్రశ్నలు వెయ్యడంలో సరదా ఉన్న ఒకళ్ళిద్దరు ఆసక్తిపరులు.

నీరసంగా మూలుగుతూ రవణయ్యేదో చెప్పబోయాడు అతని మాటలు విని పించ నియ్యకుండా ''ఆ ః అదేదో అలా జరిగిపోయింది లెండి. ఆ సంచులు మళ్ళీ ఇలా సైకిలుకి తగిలించండి. ఆయన్నీ, సైకిలునీ, సంచుర్నీ భద్రంగా ఇంటికిజేరుస్తాను. ఆయన మా బాబయ్యేలెండి'' అన్నాడు వీర్రాజు.

''ఆహా అయితే ఇంకనేం? మనం పోదాం'' అనుకుంటూ, బండరాతి మీద పడ్డకుండ పెంకుల్లా, నలుగురూ నాలుగు వైపులా చెదిరిపోయారు. రవణయ్యా వీర్రాజూ మాత్రం మిగిలిపోయారు. ''పనిమాలా నమస్కారంపెట్టి పడగొట్టింది చాలక పైగా బాబయ్య అంటాడేవిటి? ఎక్కడి చుట్టం వీడు నాకు?'' అంటూ పుల్తాపుల్తా చూశాడు వీర్రాజుని రవణయ్య

బతిమాలుతున్నట్లు ముఖంపెట్టి ''క్షమించండి. నావల్లే పడిపోయారు మీరు. అందువల్ల నేను దగ్గిరుండి మిమ్మల్ని ఇంటికి చేరుస్తాను. మీరు కుంటుతున్నట్లున్నారు. సైకిలు తొక్కలేరు. రిక్షా కట్టించనా?'' అన్నాడు వీర్రాజు.

''అక్కర్లేదు'' విసుగ్గా అన్నాడు రవణయ్య.

వీర్రాజు సైకిలు నడిపిస్తూంటే, నడ్డిమీద చెయ్యివేసుకుని, కుంటుతూ పక్కనే వస్తున్నాడు రవణయ్య.

''నన్ను మీరు ఎరగరు కానీ మీరు నాకు తెలుసు''-నెమ్మదిగా కబుర్లలోకి దింపాడు వీర్రాజు.

రవణయ్య ఏం మాట్లాడలేదు.

''మీదగ్గర ఓనమాలు నేర్చుకొన్న ఒకళ్ళిద్దరు నాకు ఆప్తమిత్రులు.''

'ఒకళ్ళిద్దరేవిటి. తన సర్వీసులో వందలమీద ఉంటారు ఓనమాలు దిద్దినవాళ్లు' అనుకున్నాడు రవణయ్య.

''వాళ్ళు చెబుతూ ఉంటారు మీ శక్తీ, సామర్థ్యం క్రమశిక్షణా,కోపం, ఇవన్నీ ''

''నాలుగు తన్ని చెప్పకపోతే కుర్రాళ్ళకి చదువురా వొద్దూ!'-తల పంకించాడు రవణయ్య.

''మీచలవవల్లే వాళ్ళివాళ ఈ స్థితిలో ఉన్నాం అని, తెగ చెప్పుకుంటూ ఉంటారు.''

మూతిమీద మీసం లేకపోవడంవల్ల మనస్సులోనే మీసం తిప్పుకున్నాడు రవణయ్య.

''నాకు ఎన్నాళ్లనుంచో మిమ్మల్ని కలుసుకోవాలని. కాని ఏమిటో భయం. ధైర్యంలేక ఊరుకున్నాను.''

గర్వంగా నవ్వుకున్నాడు రవణయ్య.

''మా ప్రొఫెసర్‌గారు అంటూ ఉంటారు, ''ఉప్పులో ఊరిన ఊరగాయకీ, రవణయ్య మేష్టారులాంటి ఉత్తమ ఉపాధ్యాయుని దగ్గర నలిగిన విద్యార్థికీ ఇంక డోకా ఉండదు'' అని-''

రవణయ్య ఇంక ఉండబట్టలేక పోయాడు. మనస్సులోంచి పెల్లుబికి వస్తున్న సంతోషాన్ని అతి ప్రయత్నంమీద నిగ్రహించుకుంటూ "ఎవరయ్యా ఆ ప్రొఫెసరు?" అన్నాడు.

'పడ్డావురా నాయనా' అనుకొని ''తెలుగు ప్రొఫెసరు లేరండీ? అదే యూనివర్సిటీలో'' అన్నాడు వీర్రాజు.

'అలాంటి వారెవరూ తనకి తెలియదే!' అని ఒక్క క్షణం ఆలోచించి, ఆ ఆలోచన తాలూకు చిహ్నాలేవీ ముఖంమీద కనిపించనియ్యకుండా, 'ఓ! ఆయనా?' అన్నాడు రవణయ్య

కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు. మౌనంగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండి నడుస్తున్నారు మధ్యలో రవణయ్య తలెత్తి వీర్రాజుకేసి చూశాడు. బిళ్లపంచెకట్టూ, వీభూదీ-కుర్రాడెంతో వినయంగా కనిపించాడు. ఇలా ఉండాలి-ఏవిటో? ఎవర్ని చూద్దాం అన్నా ఈరోజుల్లో పువ్వుల లుంగీలూ, దవళ్ళదాకా పెంచిన చెంపలూను. రౌడీల్లాగ-

''ఏం చదువుతున్నావయ్యా నువ్వు?'' అన్నాడు రవణయ్య, ఎడంచెయ్యి మార్చి కుడిచేత్తో బెణికిన నడ్డి నొక్కుకుంటూ.

''ఎం ఏ అండి తెలుగు, ఎం. ఏ.'' అన్నాడు వీర్రాజు, శేఖర్ ఇచ్చిన సలహాని జ్ఞాపకం తెచ్చుకుంటూ.

ఆ మాటలు వినేసరికి రమణయ్య ముఖం చేటంతైంది. ''అదీ అలా చెప్పు. తెలుగు ఎమ్మే కనకే ఆ ఒప్పు ఓర్పునూ, నేను అనుకుంటూనే ఉన్నాను. నువ్వే భాషా ప్రవీణ విద్యార్థివో, తెలుగు ఎమ్మే స్టూడెంటువో అయి ఉంటావని ఊ ''

అన్నాడు.

వీర్రాజు మరికొంచెం వినయాన్ని అభినయించాడు. రమణయ్యకి మహదానంద మైపోయింది. ఇటువంటి శాస్త్రీ కనిపించి ఎన్నాళ్ళయిపోయిందో-ఈరోజుల్లో ఎవర్ని చూద్దాం అన్నా పొగర్లూ పోకిరీవేషాలేకదా-ఒక్క విద్యార్థిలోనూ వినయం అనే పదార్థం కాగడాపెట్టి గాలించినా కనిపించడంలేదు. అలాంటిది ఈ కుర్రాడిలో ఏం అణకువ! ఏం నెమ్మది! ఆ కట్టూ బొట్టూ మాత్రం? సాంప్రదాయ మార్గంలో ఇప్పుడెవరు ఉంటున్నారు? బాగుంది!

''నీపేరెవరు నాయనా?'' అన్నాడు రమణయ్య ఆప్యాయంగా.

వెంటనే చెప్పలేక వీర్రాజుతడబడ్డాడు. ఆ తర్వాత సర్దుకుని ''కిరీటండి . కిరీటి '' అన్నాడు సైకిల్ కేరియర్‌కి పెట్టిన శృంగార నైషధం అట్టమీద ఉన్న పేరుని చూస్తూ.

ఆ పేరువిని రమణయ్య ఉలిక్కిపడ్డాడు

కి రీ టి!

ఎక్కడో విన్నట్టుంది ఈపేరు ఇలాంటిపేరు అందరికీ ఉండదే ఎక్కడ విన్నాం చెప్మా తల బద్దలుకొట్టుకొని ఆలోచించగా ఆలోచించగా రక్కున జ్ఞాపకం వచ్చింది అవును అయిదేళ్ళకుర్రాడు తన చెల్లెలి ఆడబడుచు కొడుకు వాడిపేరు కిరీటేకదూ పాతరోజుల్ని ఒక్కమారు బాధగా జ్ఞాపకం తెచ్చుకుంటూ'' కిరీటి అంటే మీది నరసాపురంకదూ? నువ్వు సావిత్రికొడుకువి అవునా?'' అన్నాడు.

'ఏమో! నరసాపురమో సావిత్రో ఎవరికి తెలుసు? ఆ కిరీటిగాడిని అడిగినా బాగుండిపోను అయినా ఈ చిత్రగుప్తుడు ఇలాంటి ప్రశ్నలన్నీ వేస్తాడని ఎవరు కలగన్నారు- తోరణంలా ఆపేర్లన్నీ ఏకరువు పెడుతున్నాడు, కొంపదీసి ఇతనికి కిరీటీ వాళ్ళు తెలుసేవిటి? తెలిస్తే ఇంకేమైనా ఉందా' ఏవిరా నువ్వు కిరీటివా? అంటూ నాతోళ్ళు ఒలిచెయ్యడూ? ఇప్పుడు నాకు ఏవిటిదారి? నేరకపోయి వాడిపేరు తగిలించు కున్నానురా భగవంతుడా'-ఇలా కంగారుగా ఆలోచించేసి, సైకిలు అమట్టునే వదిలేసి పారిపోదాం అనుకున్నాడు వీర్రాజు. రమణయ్య కనక ఇంకొంచెం డబాయిస్తే కాళ్ళమీద పడిపోయేవాడే!

కాని రమణయ్య డబాయించే స్థితిలోలేడు. జ్ఞాపకాలు అతని మెదడులో సుడిగుండంలా తిరుగుతున్నాయి.

తల్లీ తండ్రీ పోతే తను అల్లారుముద్దుగా పెంచుకొన్న చెల్లెలు సీత-గారంగా పెంచడంవల్ల కట్టుబాట్లుదాటి ఫైల్వాన్ భీమ్‌సింగ్‌తో సీత కాస్త హద్దుమీరే తిరిగింది. పరిస్థితి చెయ్యిదాటడంతో, తను గుట్టుచప్పుడుకాకుండా సీతకి ఆ మారుమూల గ్రామం నరసాపురంలో పెళ్ళిచేసేసి హమ్మయ్య అని స్థిమిత పడ్డాడు కాని పెళ్ళయిన ఏడు నెలలకే సీత, రాణీని ప్రసవించడంతో, సీతమొగుడు వెంకట్రావుకీ ఆడబడుచు సావిత్రికీ సీతమీద అనుమానం ఏర్పడి, తన స్థిమితంకాస్తా ఎగిరిపోయి, సమస్య మళ్ళీ మొదటి కొచ్చింది.

రాణీని తను తీసుకువచ్చి తనదగ్గరే పెంచుతూ, ఎన్నో అబద్ధాలుచెప్పి, సావిత్రినీ వెంకట్రావునీ నమ్మించి. సీత కాపురాన్ని తను ఎల్లాగో కుదుట పరిచాడు. రెండేళ్ళు కాపురం బాగానే సాగింది. సీతకి ఇంకో అమ్మాయికూడా పుట్టింది. కాని ఇంతలో భీమ్‌సింగ్ నరసాపురం వెళ్ళడం, అతనూ సీతా పెరటిగుమ్మంలో మాట్లాడు కోవడం. అది సావిత్రి కంట బడడం, దానికితోడు ఆరోజే సీత పెట్టె అడుగున ఎప్పుడో సీతా భీమ్‌సింగూ తీయించుకొన్న ఫొటో కనిపించడం జరిగిపోయి, ఆ సాయంత్రమే బోట్‌షైరు వంకని వెంకట్రావు సీతని నావలో నరసాపురం గోదావరి మధ్యకు తీసుకుపోయి దాన్ని ముంచేసి దానితోపాటు తనూ మునిగిపోయాడు.

ఇలా తనచెల్లెలు సీత సంసారం నట్టేట కలిసిపోయిందనే పిడుగులాంటివార్త తనకి ఆలశ్యంగా జేరింది. పుట్టెడు దుఃఖంతో తను రాణీని తీసుకుని నరసాపురం వెళితే, అక్కడ ఏం ఉంది? సీత ఆడబడుచు సావిత్రి తన ఆరేళ్ళకొడుకు కిరీటినీ సీత రెండో కూతురు చంటిపిల్లని తీసుకుని ఊరువదలి వెళ్ళిపోయిందట—

అంతకు మూడురోజులక్రితమే సీతా వెంకట్రావూ నావతో సహా మునిగి పోయారనీ, నావ మునగడానికి ముందు ఒక ఫైల్వాన్ మాత్రం ఒడ్డుమీంచి గోదావరిలోకి వురికి నావలోకి చేరుకున్నాడనీ, కాస్సేపు నావలో ఆ ఫైల్వానూ, వెంకట్రావూ పెనుగులాడారనీ, ఆ పెనుగులాటని గట్టుమీద నుంచున్న ఓ కుర్రాడు ఖరీదైన జపాన్ కెమేరాతో ఫోటోతీశాడనీ ఊళ్ళోవాళ్ళు చెప్పారు. తను ఆ కుర్రాడిని వెతికి పట్టుకుని ఆఫొటో తాలూకు రెండు కాపీలు సంపాదించాడు కాని ఫొటో చూస్తూనే తన రక్తం ఉడుకెత్తింది. ఆ ఫైల్వావ్ ఎవరోకాదు భీమ్‌సింగ్!

దాంతో తనకి ఒక అనుమానం వేసింది. కావాలని వెంకట్రావు సీతతోసహా మునిగిపోయి ఉండడనీ, ఈ భీమ్‌సింగ్ వెంకట్రావుని నీళ్ళల్లోకి తోసేసి సీతని దక్కించుకుని పోదాం అనే దురుద్దేశంతో గట్టుమీంచి నీళ్ళల్లోకి ఉరికి నావలో వెంకట్రావుతో పెనుగులాడి ఉంటాడనీ, అనిపించింది. మరి వాళ్ళతోపాటు భీమ్‌సింగ్‌కూడా మునిగి పోయాడోలేదో! తను పోలీసులికి రిపోర్టుచేసి ఫొటో చూపించేసరికి, వాళ్ళకి అనుమానం బలపడి పరారీ అయిపోయిన భీమ్‌సింగ్‌మీద కేసు బనాయించి, ఈపదిహేను పదహారు సంవత్సరాలనుంచీ అతనికోసం గాలిస్తూనే ఉన్నారు.

తనకి నరసాపురంలో దొరికిన ఫొటో కాపీలురెండూ తీసుకుని వెనక్కివచ్చాడు. పుట్టెడు దుఃఖంతో తనదగ్గర పెరుగుతూన్న సీత పెద్దకూతురు రాణీని కౌగలించుకొని బావురు మన్నాడు. తన చెల్లెలు జీవితాన్ని నీడలా వెంటాడిన ఆ భీమ్‌సింగ్‌మీదా, తన చెల్లెల్ని కులట అని చూపి, ఆమె సంసారాన్ని మంటగలిపిన ఆ సావిత్రిమీదా మాత్రం కక్ష కోపం మిగిలిపోయాయి, తలచెడిన ఆడబడుచుగా ఇంట్లో పడివుండక పచ్చని సీత సంసారాన్ని నట్టేట ముంచుతుందా ఆ సావిత్రి? ఆమె నూరిపొయ్యకపోతే వెంకట్రావు అంతపని చేసి వుండకపోను.

ఏ సీతనైతే కులట అందో ఆ సీతకూతుర్నే కోడలుగా స్వీకరించవలసి వచ్చినప్పుడు తెలిసి వస్తుంది ఆ సావిత్రికి. ఏమైనా, తను నెమ్మదిగా కబుర్లుచెప్పి ఈ కిరీటికి, రాణీలకి పెళ్ళి ఏర్పాటుచెయ్యాలి. అందుకు వీలుగా ఇతణ్ణి ఇంటికి తీసికెళ్ళి రాణీకి పరిచయంచేస్తే. నెమ్మదిగా ఆ పరిచయమే బలపడి

ఇలా ఆలోచించి తల పంకించి రవణయ్య వీర్రాజుకేసి తీక్షణంగాచూసి "మీది నరసాపురం అన్నావుకదూ! అయితే మీ అమ్మపేరు సావిత్రి-అవునా?" అన్నాడు. వీర్రాజు నీళ్ళు నమిలాడు ఏంచెప్పాలో తెలియక. వెంటనే రవణయ్య కృత్రిమంగా ఓ నవ్వునవ్వి "రావయ్యా. ఇంటికిరా-నువ్వుమాకు పరాయివాడివేంకాదు" అన్నాడు.

మొదట వీర్రాజు మొహమాట పడుతున్నట్లు నటించి చివరికి "సరే నడవండి" అన్నాడు, 'హమ్మయ్య మన పథకంపారింది' అని సంతోషిస్తూ.

రవణయ్య దారిలో తెగ ఆలోచిస్తూనే ఉన్నాడు."ఈ కిరీటి కనక తనమేనగోడలు రాణీని పెళ్ళిచేసుకొంటే, బుద్ధిమంతుడైన కుర్రాణ్ణి తను రాణీకి వరునిగా సంపాదించి నట్లూ అవుతుంది, ఆ సావిత్రిమీద కక్ష తీర్చుకున్నట్లూ అవుతుంది అనక సావిత్రి మాత్రం ఏం అనగలదు? 'సీత కులట' అనే ప్రచారమేనా మానాలి. లేదా 'ఆమె ఉత్తమురాలు' అని ఏడుస్తూ బహిరంగంగా ఒప్పుకోనైనా ఒప్పుకోవాలి. ఎలాగైనా సీతకి వచ్చిన మచ్చమాయం అవుతుంది."

"ఇతను కిరీటి అని తెలుగు ఎమ్మే చదువుతున్నాడు. నేను సైకిలుమీంచి పడిపోతే పాపం సాయంచేసి ఇంటికి తీసుకువచ్చాడు" అంటూ వీర్రాజుని రవణయ్య రాణీకి పరిచయం చేస్తున్నప్పుడు, మంచివాడిలా వినయం నటించాడు వీర్రాజు.

"ఇతణ్ణి ఎక్కడో చూసినట్టుందే" అనుకొంది రాణి.

"ఈమె కాలి అందెలు ఘల్లు మంటూంటే నా గుండె ఎలా ఝల్లు మంటుందో! మిసమిసలాడుతూన్న యౌవనపు పొంగుతో చంద్ర బింబంలాంటి ఈపిల్ల ఎంత అందంగా ఉంది?" అనుకొన్నాడు. వీర్రాజు. "మారాణీకూడా భాషా ప్రవీణ చదువుతోందయ్యా! తెలియనివి ఏమైనా ఉంటే చెబుతూ ఉందువుగాని. అప్పుడప్పుడు వస్తూఉండు" అన్నాడు రవణయ్య "రానుమరి!" అనుకున్నాడు వీర్రాజు.

తనకప్పులో కాఫీ చేదుగా వుందని రవణయ్య అన్నప్పుడు, "మీకూ నాకూ వెయ్యవలసిన మొత్తం పంచదార అంతా నాకప్పులోవేసేసింది" అంటూ వీర్రాజు

ఓరగా రాణీకేసి చూశాడు. అప్పటివరకూ పైటకొంగు వేలికి చుట్టుకుంటూ అక్కడే నిలబడ్డ రాణీ, సిగ్గుతో లోపలికి పరిగెత్తింది. రవణయ్య పకపకా నవ్వాడు. వీర్రాజు ఆ నవ్వుతో శ్రుతికలిపాడు.

## 4

తుపాకీని ఇద్దరిమీదకీ బారుచేసి "ఊ దేవుణ్ణి తల్చుకోండి" అన్నాడు జగత్పతిరావు

శేఖర్ కిరీటి బిగ్గరగా 'బేరు' మనలేదు-అంతే

"ఏం? ఆడపిల్లల్ని వేటాడ్డంలా లేదా ఈవేట?"

"వె ..వ్వె వ్వేటకాదు" అన్నాడు శేఖర్.

"మరి ఆటా?"

"ఆటా కాదండి"

"ఇంకేవిటి? మీ రౌడీపనులకి ఒక పేరుకూడానా?"

"మేం రౌడీలం కాదండీ! చాలా మంచివాళ్ళం." దాదాపు ఏడుపుకంఠంతో అన్నాడు కిరీటి.

"ఆ ఆ మీ వాలకమే చెబుతోంది. మీ రెలాంటివాళ్ళో-మాసినబట్టలు, చింపిరిజుట్టూ, జిడ్డుమొహాలూను"

"అవాండీ? . అవీ పొద్దుటినుంచీ మీ అమ్మాయి వెనకాలే తిరుగుతూ ఉండి పోయాం కదాండీ ! రూమ్‌కివెళ్ళి మార్చుకోవడానికి వీలులేకపోయింది" అన్నాడు కిరీటి సంజాయిషీ ఇచ్చుకుంటూ.

"ఏవిటీ? పొద్దుట్నుంచీ వేధిస్తున్నారా దాన్ని? అయితే మిమ్మల్ని అసలు క్షమించ దానికి వీలులేదు ఊ త్వరగా దేవుణ్ణి తలుచుకోండి. అవతల నాకు పనుంది."

"పొద్దుట్నుంచీ కాదండి...మావాడికి బుద్ధిలేదు తమబోటి పెద్దవాళ్ళతో మాట్లాడ్డం ఎలాగో తెలియదు. వరి అమాయకుడండి" అంటూ, శేఖర్ కిరీటికేసి కోపంగా, "ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలియకపోతే నోరుమూసుకుని ఊరుకోలేవూ?" అనే భావం వచ్చేలాగ చూశాడు.

"అమాయకుణ్ణా! ఒక్కడూ ఉండగా రూమ్‌లో ఏం అంటున్నా, పోనీ స్నేహితుడుకదా అని ఊరుకుంటే, ముక్కూమొహమూ తెలియని వాళ్ళదగ్గరకూడా అవమాన పరుస్తావా?ఉండు నీపని చెప్తా"అని మనస్సులో పళ్ళుకొరికాడు కిరీటి. కొరికి అమాయకుణ్ణయితే కావచ్చు కానండి అబద్ధాలకోరుని మాత్రం కాను." అన్నాడు శేఖర్‌ని "కొరకొరా చూస్తూ.

దాంతో శేఖర్ కంగారు పడిపోయి "వాడి మాట నమ్మకండి సార్! వాదన లన్నా, ఎదటివాడు చెప్పింది కాదనటం అన్నా మా వాడికి బలే సరదా. ప్రమాదాలు

వచ్చినపుడు వాడి సరదా మరీ పెరిగిపోతుంది కంగారులో. ఇప్పుడు మీరు ఎక్కడ కాల్చేస్తారో అనే భయంతో కంగారు పడిపోయి, ఉన్న కాస్త మతీకూడా పోగొట్టేసుకుని, ఇలా అంటున్నాడు. నిజానికి మీ అమ్మాయిని మేం అస్సలు వేధించలేదు ''

''వేధించకపోతే వెంట పడ్డారు! ఏమైతేనేం? బాధ. పెట్టారు కదా? అది చాలు మిమ్మల్ని 'షూట్' చెయ్యడానికి'' అంటూ మళ్లీ గురి చూడబోయాడు జగత్పతిరావు.

''ఉండండి ఆమెని బాధపెట్టడం మా ఉద్దేశం కాదు.''

''ఆడపిల్లల వెనకాల పడడానికి వేరే ఉద్దేశాలేం ఉంటాయోయ్! అనవసరంగా వాదించి ఊరికే నా టైం పాడు చెయ్యకండి ఊ త్వరగా దేవుణ్ణి తలుచుకోండి.''

''అది కాదు సార్! అసలు జరిగిం దేవిటంటే ''

''ఏవిటి? దీనికి వెనకాల ఓ కథ కూడానా?''

''కథ కాదు సార్! నాటకం.... రేడియో నాటకం'' అన్నాడు కిరీటి కంగారుగా.

''నాటకమా!'' జగత్పతిరావు కనుబొమలు పైకి లేచాయి. అసలే పెద్దవిగా ఉన్న గుడ్లు ఆశ్చర్యంతో మరింత పెద్దవి అయ్యాయి

''అవునండి మా వాడు ఒక నాటకం రాశాడు.''

''ఏవిటేమిటి? నాటకం? నువ్వు? రాశావా? ..''—గన్ నేలమీద నుంచో పెట్టి, దాని మొనమీద ఎడం అరచెయ్యీ, దానిమీద కుడి మోచెయ్యీ ఆన్చి, మురళి వాయించే శ్రీకృష్ణుడిలాగ వ్యత్యస్త పాదారవిందుడై, చిత్రంగా కిరీటికేసి చూడసాగాడు జగత్పతిరావు.

తప్పు చేసినవాడిలాగ తల వంచుకున్నాడు కిరీటి.

''ఊ అయితే నువ్వు నాటక రచయితవన్నమాట.'

''రచయిత ఏవిటండీ నా మొహం. ఏదో పొరబాటుని ఒకటి రాశాను. అదిలా నా ప్రాణానికి వచ్చింది. ఈ తప్పు క్షమించి ఈ మాటుకి మీరు మమ్మల్ని వదిలేస్తే ఇంకెప్పుడూ రాయను. అలా రాయనని మీరు ఏ ఒట్టు పెట్టుకోమంటే ఆ ఒట్టు పెట్టుకుంటాను'' అన్నాడు కిరీటి జాలిగా.

''అవునండి వాడు రాయనంటే రాయడండి. మాట ఖచ్చితం మనిషి. ఆడి తప్పనివాళ్ళ లిస్టులో హరిశ్చంద్రుడి పక్కని మా వాడి పేరు కళ్లు మూసుకుని రాసెయ్య వచ్చండి.''

''ఇప్పుడు రాసినందుకు లెంపలు వేసుకోమంటే వేసుకుంటాను.''

''వాడి రూమ్‌మేట్ అయిన పాపానికి నేనుకూడా. ఇద్దర్నీ జమిలిగా లెంపలు వేసుకోమంటారా?''

''అలా చూడకండి. పెద్దపులి జాలిగా చూస్తే గుండె పగిలి చచ్చేటంత భయం వేస్తుంది. ఇదిగో దేవుడిమీద ఒట్టేసి చెప్తున్నా. ఇకముందు నేను ఛస్తే నాటకాలు రాయను.''

"రాయవూ?"-గర్జించాడు జగత్పతిరావు.

"చిత్తం చిత్తం తమరు రాయమంటే రాయకేం జేస్తాడు? రాస్తాడండి. హాలో లక్ష్మణా అని నోరు మూసుకుని ఏడుస్తూ చచ్చినట్లు మరీ రాస్తాడండి రోజు కొకటి, ఫీచర్ రచయితలాగ"

"బలవంతంగా రాస్తే అదేం బాగుంటుంది? రాయాలనే తహతహ గుండెల్లోంచి జలపాతంలా పొంగి రావాలి కాని."

"మీ కా సందేహం ఏం అక్కర్లేదు. మా వాడి గుండెల ముందు శివసముద్రం ఎత్తిపోతలు యేం ఆగవు. నయాగరా కూడా ఆగుతుందో ఆగదో-అనుమానం."

"ఊ రాయడమే వృత్తా? లేకపోతే ఏదైనా వృత్తి ఉందా నీకు?"

"వృత్తిదాకా ఎక్కడండి, వాడింకా చదువుకుంటుంటేనూ?"

"వాట్ స్టూడెంటా ఇతను?"

"వాడే కాదండి. నేనూను. వాడు యూనివర్సిటీలో తెలుగు ఎమ్మే - నేను మెడికల్ కాలేజీలో ఎమ్. డి."

"ఏవిటేవిటి? నిజమే! ఇంతింత పెద్దచదువులు చదువుతూ, బికారి రూపాలు వేసుకుని ఆడపిల్లల వెనకాల తిరగడం ఏవిటి. ఈ వ్యవహారం ఏవిటి? ..అబ్బెబ్బె! నాకేం నచ్చలేదు."

"మీరింకా మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నారు. మేం అలాంటి మనుష్యులం కాదు. ఆడపిల్ల వెనకాల జరగవలసిన అవస్థ - అది మాకు అలా వచ్చింది-అంతే."

"అసలు ఏ ముహూర్తంలో రాశాడో కానీ, వీడా రేడియో నాటిక రాయడం తోటే మా అవస్థ ప్రారంభం అయింది. అదంతా మీరు విన్నారంటే కోపపడడం కాదు మా మీద జాలిపడతారు."

"అలాగా పాపం! అయితే సరే లోపలికి రండి సావకాశంగా కూర్చుని వుందాం" అంటూ జగత్పతిరావు గన్ చేత్తో ఊపుకుంటూ లోపలికి దారితీశాడు.

వెనకాలే శేఖర్. కిరీటి వెళ్లాలి.

వెళితే?

ఆ పైన ఆలోచించేసరికి వాళ్ళ వెన్నులోంచి భయం ఒక్కమారు జివ్వుమంటూ పరిగెట్టింది.

తీరా లోపలికి వెళ్లాక తలుపులు మూయించి మెత్తగా తన్నిస్తే? తమకి దిక్కా మొక్కా?

"నోరు ఆవిలించినట్లు పెద్దపెద్ద గుమ్మాలూ-లోపలికేక చస్తే బయటికి వినిపించనంతగా విశాలమైన హాలూ, ఆ పైన లోతట్టు గదులూ-పగలే లైట్లు వేసుకోవలసి వచ్చే మధ్య వసారాలూ-ఆ ఇల్లంతా ఒక పెద్దగుహలాగా, జగత్పతిరావు ఆ గుహలో సింహం

లాగా కన్పించాడు వాళ్ళ కళ్ళకి. సింహాన్ని నమ్మి దాని గుహలోకి వెళ్ళడమా?

ఎముకల్లోంచి చలి పుట్టుకొచ్చింది.

ఈ మట్టున ఇక్కడనుంచి వెనక్కి పారిపోతే?

బాగానే ఉంటుంది. కాని వెనకాలే తరుముకుంటూ వచ్చి కాల్చెయ్యడని గ్యారంటీ ఏముంది?

మరయితే సింహం గుహలోకి వెళ్ళడమా ?

మధ్యన కుక్కచావు వచ్చింది!

వచ్చి వచ్చి ఎంత ఇబ్బందిలో పడిపోయామురా దేవుడా!

ఏవిటి చెయ్యడం!

జగత్పతిరావు వెనక్కి తిరిగి "ఆ మట్టునే నిలబడిపోయారేం? రండి రండి" అన్నాడు గట్టిగా. ఖంగుమన్న అతని కంఠం, గదుల్లోంచీ హాలులోంచీ ప్రతిధ్వనించి, సింహం గుహ భయంకరంగా ఆహ్వానిస్తున్నట్లనిపించింది.

"సరే కానియ్యి. ఈ జీవితం ఎలాగా ఇవాళ్టితో ఆఖరు" అని నిరాశ చేసుకుని తెగించి లోపలికి బయల్దేరారు శేఖర్ కిరీటీను.

కాళ్ళకింద మెత్తని కార్పెట్.

చుట్టూ డిస్టెంపర్ కొట్టిన అందమైన గోడలు

పైన కనిపించకుండా అమర్చిన మెర్క్యూరీ లైట్లు.

మేడపైకి అటూఇటూ మెట్లున్న పెద్దహాల్లో రెండు మూడు సోఫా సెట్లు టీపాయ్‌లూ—

కిటికీలకీ గుమ్మాలకీ ఖరీదైన కర్టెనులు

గోడమూలల్ని ఎత్తులో అమర్చిన కార్నర్ల మీద ఫ్లవర్ వాజులూ, అజంతా బొమ్మల నమూనాలూ, నటరాజ విగ్రహాలూ-

గోడల్ని భీముడు, రావణాసురుడు, రాముడు, శ్రీకృష్ణుడువంటి రకరకాల వేషాల్లో జగత్పతిరావు తీయించుకున్న పెద్దపెద్ద ఫోటోలు - మధ్యన ఉండి హాలుని రెండుగా విడదీస్తూన్న అద్దాలబీరువాతో, సైజువారీగా కప్పులూ, షీల్డులూ.

హాలునిండా, ఎక్కడినుంచి వస్తోందో తెలియని, చిక్కని నీలపుకాంతి.

పక్కనున్న స్టూలుమీద గన్ పెట్టి, తనో సోఫామీద కూర్చుంటూ, ఇటూ అటూ ఉన్న సోఫాల్ని శేఖర్‌కీ కిరీటికీ చూపించాడు జగత్పతిరావు.

"సోఫామీద కూర్చోపెట్టి మరీ చంపుతాడా గౌరవంగా?" - ఇద్దరూ కూచోడమా మానడమా అని తటపటాయిస్తున్నారు. (సశేషం)

Edited and Published by V. Leelavathy Raghavaiah
7-A, Sivaji Street, Madras-600 017 and Printed by
D. Hanumantha Rao, at Kranti Press,
12, Francis Joseph Street, Madras-600 001.

# జ్యోతి నవలానుబంధం



# (రెండవ భాగం)

"ఏవిటి అలా చూస్తారు? కూర్చోండి!"

హడలిపోయి చటుక్కున కూర్చున్నారు శేఖర్, కిరీటీను.

"ఊ? ఈ మారు కానియ్యండి మీ కథ" అన్నాడు జగత్పతిరావు కాలిమీద కాలు వేసుకుంటూ.

నాలికల్ని తడిచేసుకొని, ఎండిపోయిన గొంతు సవరించుకొని, గుటకవేస్తూ, మధ్య మధ్య ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకుంటూ, ఇద్దరూ చెరోకాస్త చొప్పున కబాడీ కూతలా, గుక్క తిప్పుకోకుండా మొత్తంమీద శ్రీరాములు మొదలు చిత్తగించవలెను దాకా జరిగిందంతా చెప్పారు, వీర్రాజూ రాణీల ప్రేమ వృత్తాంతం, అది ఫలించడానికి ఉపదేశించిన చిట్కాలూ, మాత్రం మినహాయించి.

అంతావిని హాలు మారు మ్రోగిపోయేలాగ నవ్వాడు జగత్పతిరావు. నవ్వి "హారి పిచ్చివాళ్ళల్లారా ఈమాత్రం దానికి ఇంత అవస్థపడ్డారా?" అంటూ మళ్ళీ నవ్వబోయి ఆగి వెనక్కి తిరిగి "అమ్మా మాధురీ! ఇటురా అమ్మా" అంటూ కేకేశాడు జగత్పతిరావు

అప్పటికే స్నానంచేసి బట్టలు మార్చుకుని వెన్నెలరంగు చీరా, జాకెట్టూ వేసుకొన్న మాధురి, అప్పుడే పాల్కడలిలోంచి లేచిన లక్ష్మీదేవిలాగా నడిచివచ్చింది.

ఆమెని చూస్తూనే తప్పుచేసినవాళ్ళలాగా తలలు వంచేశారు శేఖర్, కిరీటీను.

"నువ్వు అనవసరంగా గాభరా పడ్డావమ్మా.నువ్వనుకున్నట్లు వీళ్ళు రౌడీలేంకాదు. ఇతను ఎమ్మే, అతను ఎం. డి చదువుతున్నారు" అన్నాడు జగత్పతిరావు

"నిజంగా?" అన్నట్లు ఆశ్చర్యంగా చూసింది మాధురి. కూతుర్ని తన పక్కని సోఫామీద కూర్చోబెట్టుకుని ముంగురులు దువ్వుతూ "నిన్ను పొద్దుటినుంచీ వాళ్ళు ఎందుకు వెంబడించారో తెలుసా?" అని అడిగి, నవ్వుతూ "చెప్పండయ్యా" అంటూ వాళ్ళకేసి తిరిగాడు జగత్పతిరావు.

"నువ్వుచెప్పు" అంటే "నువ్వుచెప్పు" అని ఒకళ్ళనొకళ్ళు సైగ చేసుకోసాగారు శేఖర్, కిరీటీను.

ఇది ఇంతటితో తెమిలేలాగలేదని, "ఎవరో ఒకరు చెప్పండయ్యా" అన్నాడు జగత్పతిరావు గట్టిగా. ఆకేకకి అదిరిపోయి, రాబోయిన రెండుముక్కలూకూడా వాళ్ళ నోట్లోంచి రాకుండా ఆగిపోయాయి.

"అయితే సరే - నేచెప్తానువిను. ఇతగాడు ఒక రేడియోనాటిక రాశాట్ట! అందులో వీణవాయించే ఒక అమ్మాయి కావాలట! అపాత్ర నువ్వువేస్తే వీళ్ళు ఒకట్రూప్ లా రేడియో స్టేషన్‌కివెళ్ళి ప్రోగ్రాం ఇచ్చివేస్తారట! ఏం అంతే కాదుటయ్యా?"

"అంతేనండి అంతే" అన్నాడు శేఖర్ ఉత్సాహంతో.

"ఆ విషయం నిన్ను ఎలాగ అడగాలో తెలియక తికమకపడుతూ పాపం

పొద్దుటినుంచీ నీవెనకాల తిరిగారట!'' ఇలా అంటూన్న జగత్పతిరావు ప్లేబేక్ మాటలకి అనుగుణమైన హావ భావాల్ని కళ్ళూ ముఖం కదపడంద్వారా అందించి, మూగినటుడులా అభినయిస్తూన్న కిరీటిని చూసేసరికి, మాధురికి నవ్వు ఆగలేదు.

ఆమెనవ్వుకి తన మందహాసాన్ని కూడా జోడించి ''ఇంకనేమయ్యా! మా అమ్మాయి ఒప్పుకుంది మీ రిహార్సల్ ప్రయత్నాలేవో మీరు ప్రారంభించుకోవచ్చు ఊ... ఇంకేవిటి?'' అన్నాడు జగత్పతిరావు

''తాము వింటూన్నది కలా నిజమా?'' అన్నంత ఉక్కిరిబిక్కిరి అయిపోయి, సంతోషంతో నోటమాటలేక ఉండిపోయారు శేఖర్ కిరీటీను

వాళ్ళ మౌనాన్నిచూసి మరోలా అర్థంచేసుకుని ''మీకేం భయంలేదు. బ్రహ్మాండంగా నటించేస్తుంది.అది ఎవరనుకున్నారు? నటసమ్రాట్ నటశేఖర, రంగమార్తాండ, అభినవ అభినయ విశారద, జగత్పతిరావు కూతురు అవును కానీ - నాక్కూడా ఓ చిన్న పోర్షన్ ఇవ్వకూడదుటయ్యా, జమాయించి వేసేస్తాను" అన్నాడు జగత్పతిరావు రహస్యం చెప్పబోతున్నట్లు సోఫాచివరికివచ్చి, ఎదురుగుండాఉన్న కిరీటిమీదికి ఒంగుతూ.

''ఈ చిన్న నాటకంలో తమలాంటి పెద్దవాళ్ళకి '' అంటూ నసిగాడు శేఖర్.

''అవునులే - అవునులే ఇప్పుడు వస్తూన్నవన్నీ సాంఘికాలు కదూ? ఈమాటు మాంచి పౌరాణిక నాటకం ఒకటి రాయి. పద్యాలు రసగుళ్లల్లా ఉండాలి. తెలిసిందా?''

కిరీటి ''చిత్తం" అన్నాడు.

''అబ్బే - రచయిత చిత్తం అనకూడదయ్యా అవసరమయితే బెత్తం తీసుకోవాలి - లోకానికి పాఠం చెప్పేవాడివి నువ్వు. ఆమాటకొస్తే మేమే నిన్ను గౌరవించాలి ఏమంటావయ్యా అబ్బాయి! నీపేరేవిటి చెప్పావు?''

''ఇంకా చెప్పలేదండి.''

''ఇప్పుడు చెప్పవయ్యా ''

''నాపేరు శేఖర్ ''

''మరి మన కవిగారిపేరు?''

''కిరీటి ''

' కిరీటి .కిరీటి పాశుపతమున్ గొని మీమూకన్ చెండునప్పుడు ఒక్కండును నీమొర ఆలకింపడు కురుక్ష్మానాథ!'' అంటూ అహానా రంగంలో అందుకొని, జగత్పతిరావు శేఖర్ మీదిమీదికివెళ్ళి అభినయించ సాగాడు

''ఆ పద్యంలో 'కిరీటి' కాదండి - ఫల్గుణుడు'' అంటూ సర్దబోయాడు కిరీటి.

''ఎవరైతేనేం లేవయ్యా- అయినా ఇద్దరూ ఒకరేకదా? అర్జునుణ్ణి కిరీటి అంటే యేం? ఫల్గుణుడు అంటేనేం' ఫల్గుణుడు అంటేకాని పలకడా?''

''హమ్మో! పలకకుండా ఉండటమే? మీరు పిలిచాక పలక్కుండా ఉండటానికి ఎన్ని గుండెలుండాలి?''అన్నాడు కిరీటి అమాయకంగా.

అంతా నవ్వారు.

"ఏవయ్యోయ్!! మెత్తగా కనిపిస్తున్నావు కానీ, నీకూ గట్టి హ్యూమర్ వచ్చే! ఊ! ఏమైనా కిరీటి పేరు బాగుంది. చాలా బాగుంది కాదమ్మా మాధురీ!"

మాధురి సన్నగా నవ్వుతూ తల ఆడించింది.

కిరీటి సిగ్గుపడ్డాడు "హమ్మయ్య! ఈ సమస్య ఇలా పరిష్కారం అయింది" అనుకొని తృప్తిగా నిట్టూర్చాడు శేఖర్

"అమ్మాయ్! బట్లర్‌తో నాలుగు కాఫీలు తెమ్మని చెప్పు" అన్నాడు జగత్పతి రావు.

"కాల్చేస్తానన్న పెద్ద మనిషి కాఫీలు తెప్పించడం ఏవిటి అదృష్టం కాకపోతే!" అనుకున్నాడు కిరీటి

కాఫీలు పట్టించుకు రావడానికి మాధురి లోపలికి వెళ్ళింది.

"రండయ్యా మైడియర్ యంగ్ ఫ్రెండ్స్! ఈలోగా నా కత్తులూ గదలూ చూపిస్తాను" అంటూ లేచాడు జగత్పతిరావు. 'ఈ గన్‌కి తోడు గదలు కూడా ఉన్నాయా నాయనా, మమ్మల్ని చంపడానికి?' అనుకున్నాడు శేఖర్, హాలుకి అటువైపు ఉన్న గది తలుపు తెరిచేసరికి, కత్తులూ ఆభరణాలూ కిరీటాలూ మీద లైటుపడి. కళ్ళు జిగేల్ మన్నాయి.

"ఇదిగో ఇది ఏం గద అనుకున్నారు? వెండి గద! దీన్ని మనకి విజయనగరం పరిషత్తులో బహూకరించారు. ఈ కత్తి చూశారా? దీని పిడిమీద అతికినవి అసలు కెంపులు! దీన్ని రాజమండ్రి సన్మానంలో ఇచ్చారు. ఇదిగో ఈ గద ఎత్తండి చూద్దాం. దీన్ని గుంటూరు పోటీల్లో భీముడు పాత్రకి ప్రధమ బహుమతిగా ఇచ్చారు. అదిగో చెమ్కీ కుట్టిన ఆ ముఖమల్ కోటు నెల్లూరులోనూ, స్టాండ్ మీద ఉన్న ఆ కాశ్మీరు శాలువా బళ్ళారి పరిషత్తులోనూ, బహూకరించారు. అదిగో! టేబిల్ మధ్యలో ఉన్న ఆ కిరీటం చూశారా? అది అట్టదికాదు సుమా, వెండిది. పైన బంగారపు పూత పూశారు. అది మనకి ఎక్కడ వచ్చిందో చెప్పుకోండి చూద్దాం మద్రాసులో మద్రాసులో ఉన్న ఆంధ్రులంతా మన నటనకి మెచ్చి ఇది ప్రజంటు చేశారు. ప్రవాసాంధ్రులంతా కలిసి ఖర్గపూర్ పోటీల్లో ఈ మొమెంటో ఇస్తే, నిజాం నవాబుగారి దివాను ఈ హైదరాబాదు పట్నంలో "

"అంటే సుమారు పాతికేళ్ళ క్రితం ?" అంటూ అనుమానం ప్రకటించబోయాడు శేఖర్.

"అవునయ్యా. అప్పటివే ఇవన్నీను. ఆ తర్వాత మనం నాటకాలు వేసింది ఏదీ? మరీ ఇరవై ఏళ్ళయి, అదే మా మాధురి రెండో ఏటనుంచీ, మొహానికి రంగే కొట్టుకోలేదు."

"అదేవండీ!"

"అది అంతేలే " ఆ మాట అంటూండగా జగత్పతిరావు ముఖం విషాదంతో నిండిపోయింది. పాత జ్ఞాపకాల బరువుతో తలవాలి పోయింది

ఉస్సురంటూ కణతలు నొక్కుకొని, అతి ప్రయత్నంమీద భారంగా అడుగులు వేసుకుంటూ హాల్లోకివచ్చి సోఫాలో కూలబడ్డాడు.

జగత్పతిరావులో హఠాత్తుగా వచ్చిన ఆ పరిణామానికి కారణం ఏమిటో తెలియక శేఖర్, కిరీటీ చేతులు కట్టుకొని వెనకాలేవచ్చి హాల్లో చెరో సోఫామీదా కూర్చున్నారు.

వాళ్లు జగత్పతిరావుకేసి ఆశ్చర్యంగా రెప్ప వాల్చకుండా చూస్తున్నారు.

కళ్లు మూసుక్కూచున్న జగత్పతిరావులో పాత జ్ఞాపకాలెన్నో కళ్ళు తెరుచుకున్నాయి.

అవును! ఆ సంఘటన తర్వాత తను మళ్ళీ ముఖానికి రంగూ కొట్టుకోలేదు. స్టేజి ఎక్కి వేషమూ వెయ్యలేదు.

తన నిజ జీవితంలోనే రంగూ వెలుగూ మాయమై పోయింది తన బ్రతుకులోంచి ఆనందం శాశ్వతంగా నిష్క్రమించింది అంత జరిగాక తనకీ నాటకాల రంగులూ వేషాలూ ఎందుకు తన డార్లింగ్‌ని తననుంచి శాశ్వతంగా దూరం చేసిన ఈ నాటక కళ, తనకి ఇంక ఎందుకు?

తన బతుకులో వెన్నెలలు పండించిన తన భార్య, మామూలుగా అయితే తనకి దూరం అయి ఉండకపోను అది అంతా అలా వచ్చింది, తన దురదృష్టం కొద్దీ ఆ సంఘటన అయితే తర్వాత జరిగింది కాని, మొదట్లో, అంటే, కాపురానికి వచ్చిన కొత్తలో ఆమె తనకి మామూలు భాషలోనే చెప్పింది. "రాత్రిం పగళ్ళూ, నెలకి ముప్ఫై రోజులూ ఈ నాటకాలేవిటి, కీర్తి ధనాలకోసం అంతులేని ఈ ఆరాటం ఏవిటి? విలువైన ఈ రోజులు వేచి ఉండడానికీ, నిద్రలేని కళ్ళతో ఎదురు చూస్తూ ఉండడానికీ ఖర్చు అయిపోవలసిందేనా?" అంటూ, తెల్లవారుతూన్న సమయాల్లో తను ఇంటికి చేరుకున్నప్పుడు, కన్నీళ్ళతో ప్రార్థిస్తూ, నిష్ప్రయోజనంగా జడలో వాడిపోయిన మల్లెల్ని ఒక్కొక్కటే తుంపి నేలమీద పడేస్తూ మనస్సులో వేదనని తనకి చెప్పుకుంది.

తను అర్థం చేసుకుంటేనా? ఆ తర్వాత ఒక రోజున ఓ నాటకంలో శృంగార ఘట్టంలో తను నటించడం, ఆ నాటకాన్ని తన భార్య చూడ్డం తటస్థించింది.

ఇంటికి వచ్చాక పెద్ద పేచీ పెట్టింది. "ఇంక మీరు నాటకాలు వెయ్యడానికి వీలులేదు మనకేం లేదా పోదా?" అంటూ వాదించి వాదించి చివరకి తనచేత ఒట్టు కూడా వేయించుకొంది "ఇంక నేను నాటకాల్లో వేషం వెయ్యను" అని చేతిలో చెయ్యి వేశాక చెవిలో మెల్లగా చెప్పింది "త్వరలో మనింట్లో పాప వెలుస్తోందని." మాధురి పుట్టిన తర్వాత ఏడాది రెండేళ్ళవరకూ ఆ మాట తను నిలబెట్టుకున్నాడు! ఎంత డబ్బు ఇస్తానని ఎవరు వచ్చినా, ఎవరు ఎంత మొహమాట పెట్టినా నాటకంలో వేషం వెయ్యలేదు. చిన్నారి మాధురితో కబుర్లు చెబుతూ ఇంట్లోనే హాయిగా కాలక్షేపం చెయ్య

సాగాడు. సంపాదించింది కావలసినంత ఉంది. డార్లింగ్‌వంటి అనురాగవతితో తనకి రోజులు నిముషాలులా గడిచి పోతున్నాయి.

ఆ సమయంలో వచ్చింది తనకి చిన్ననాటి స్నేహితుడు భీమ్‌సింగ్ దగ్గర్నుంచి ఉత్తరం. అతని కోరిక ప్రకారం ఆ ఉత్తరం సంగతి ఎవ్వరికీ, ఆఖరికి డార్లింగ్‌కి కూడా చెప్పకుండా తను భీమ్‌సింగ్‌ని కలుసుకోడానికి వెళ్ళాడు. "నా మీద ఒక హత్యా కేసు ఉంది. నాకు బాహాటంగా బతకడానికి అవకాశంలేదు"అంటూ అంతటి పైల్వానూ కళ్ళ నీళ్లు పెట్టుకొనేసరికి తను కరిగి పోయాడు "నా దగ్గర ఉండు రహస్యంగా. పోలీసులుకాదు. ఫాలాక్షుడు కూడా నిన్ను పట్టుకోకుండా దాస్తాను"అని తను అన్నాడు. కాని భీమ్‌సింగ్ "అదేం అవసరం లేదు ఒక్క బెనిఫిట్ షో వెయ్యి. ఆ డబ్బుతో నేను ఏ ఉత్తర దేశమో పోతాను" అన్నాడు. ఎంత చెప్పినా వినిపించుకోలేదు. చివరకి నిష్ఠూరంగా "మారు మూలపట్నంలో నువ్వు వేషంవేస్తే నీ భార్యకేం తెలుస్తుంది? నా కోసం ఈ ఒక్క మారూ నీ భార్య కిచ్చినమాట తప్పలేవా?" అన్నాడు.

భీమ్‌సింగ్ కళ్ళల్లో నీళ్లు తనని కరిగించి వేశాయి.

ఆ ఊరు చాలా దూరం, ఆ ఊళ్లో నాటకంలో తను వేషంవేస్తే డార్లింగ్‌కి ఎలా తెలుస్తుంది?

ఆ ధీమాతోనే వేషం వేశాడు రెండేళ్ళనుంచి తను నాటకాలలో పాల్గొనకం లేదేమో కలెక్షన్ విపరీతంగా వచ్చింది. జనం కిటకిట లాడుతున్నారు తను ఎంతో ఉత్సాహంగా సైడ్ కర్టెన్‌లోంచి స్టేజిమీదకివచ్చి అద్భుతంగా నటిస్తున్నాడు

"డాడీ!" అని ముందు వరసలోంచి కేక!

చూస్తే మాధురి, మాధురి ప్రక్క డార్లింగ్!

ఏమైందో తను అర్థం చేసుకొనేలోగా ఆడిటోరియమ్‌లోంచి స్టేజిమీదకి ఉన్న మెట్లు ఎక్కి మాధురి తనని సమీపించి తన చిటికెనవేలు పట్టుకుని నిలబడింది. చివాల్న లేచి డార్లింగ్, ఇంకో ఆమెతోటీ, ఆమెతో ఉన్న ఆరేళ్ళ కుర్రవాడూ అర్నెల్ల పసి పిల్లతోటీ కలిసి హాలు దాటి వెళ్లిపోయింది.

తను నాటకం ఆపి డార్లింగ్ వెనకాలే వెళ్ళి జరిగిన సంగతి చెప్పి క్షమార్పణ అడుగుదాం అనుకున్నాడు కాని నాటకం వేస్తేనేకాని కదలడానికి వీల్లేదని ప్రేక్షకుల రభస-అలజడి-సైడ్ కర్టెన్‌లోకి చూస్తే భీమ్‌సింగ్ మాయం. ఈ అల్లరిలో తన సంగతి ఎక్కడ పొక్కుతుందో అని పారిపోయి ఉంటాడు.

జనాన్ని సర్ది, నాటకం ఎలాగో అలాగ అయిందనిపించి మాధురిని తీసుకుని స్టేషనుకి వచ్చేసరికి రైలు తప్పిపోయింది. కౌంటరులో, తన ఊరికి రెండున్నర ఫస్ట్ క్లాస్ టిక్కెట్లు ఖర్చు కావడాన్నిబట్టి తనకి అర్థం అయింది, డార్లింగ్ ఆమె ఎవరితోటో కలిసి వాళ్ల పిల్లలతోసహా తన ఊరు వెళ్లింది. తను కొంతవరకు కుదుటబడ్డాడు

కాని ఆ రైలు యాక్సిడెంట్ అయిందని వెంటనే వచ్చిన వార్తతో కంగారు పడ్డాడు. కారులో యాక్సిడెంట్ అయిన స్థలానికి వెళ్ళి చూస్తే అంతా భీభత్సంగానూ

భయంకరంగానూ ఉంది. రెండు మూడు పెట్టెలు తుక్కు-తుక్కు అయిపోయాయి. రక్తపు వరద- గుర్తుతెలియని శవాలు. నామరూపాలు లేకుండా తయారైన మాంసపు ముద్దలు-కేకలు-పెడబొబ్బలు-అల్లరి-హాహాకారాలు. తన డార్లింగ్ క్షేమంగానే ఉండి ఉంటుందని ఆశించాడు. కాని కాని ఆమె వేనిటీ బేగ్, దగ్గర్లో తెగిపడిన ఒక అందమైన స్త్రీ హస్తం. పక్కనే గుర్తు తెలియకుండా పూర్తిగా చెక్కుకుపోయిన మొహం!

ఇంకేం కావాలి! తన స్వర్గం కూలిపోయిందనడానికి ఇంతకంటే ఇంకే సాక్ష్యం కావాలి? ఇక్కడింక తనకేం ఉంది? ఇంకా ఆగి ఏం నిశ్చితం చేసుకోవాలి? తునాతునాకలై ఉన్న ఆ మృతదేహాల దగ్గిరికి, వరదలుగా పారుతూన్న ఆ నెత్తురు మడుగులోకి ఇంకా వెళ్లడం ఎందుకు? వికృతంగా మారిన తన డార్లింగ్ మృతదేహాన్ని చూడడానికా? అసలక్కడ మృతదేహం మాత్రం ఏదీ? నెత్తుటిలో తేలుతూన్న మాంసపు ముద్దలుమాత్రం ఉన్నాయి. ఆ దృశ్యాన్ని తాను చూడలేకపోయాడు. తాను ఇంకా అక్కడ నిలబడితే డార్లింగ్ బదులు ఆ మాంస ఖండాల్ని స్వీకరించవలసి వస్తుంది, దహన సంస్కారం చెయ్యడానికి ఆ పరిస్థితిని తను చూడగలడా? చూసి తట్టుకోగలడా

తన లోకం చీకటైపోయింది! తన వెలుగు ఆరిపోయింది. గుండెల్లోంచి భరించ లేని మంట ఉవ్వెత్తుగా లేచింది.

మాధుర్ని గట్టిగా హృదయానికి హత్తుకొని "అమ్మ నామీద కోపగించుకొని వెళ్లిపోయిందమ్మా" అంటూ బావురుమన్నాడు.

అంతే.

ఆ తర్వాత చుట్టూవున్న మనుష్యులతోటీ, ఆ యాక్సిడెంట్‌కి సంబంధించిన వివరాలతోటీ తనకేమి పని అనుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చేసి డార్లింగ్ లేని ఆ ఇంట్లో ఉండలేక ఇల్లూ, ఆస్తీ అన్నీ అమ్మేసి వచ్చిన పాతిక లక్షల రూపాయలూ పట్టుకుని వారం తిరక్కుండా ఈ హైదరాబాదు వచ్చేశాడు. భార్య జ్ఞాపకాల జ్వాలలకి దూరంగా ఉండడంకోసం.

అలా తన నాటకజీవితం నిజజీవితాన్ని విషాదాంతం చేసింది ఆ జ్ఞాపకాలన్నీ ఒక్కమారు మనస్సులో మెదిలి హృదయం అంతా వికలం అయిపోయి కళ్ళు మూసు కుని ఆ మట్టునే సోఫాలో ఉండిపోయాడు జగత్పతిరావు

బట్లర్‌చేత కాఫీలు పట్టించుకొని వచ్చిన మాధురి, తండ్రిని ఆ స్థితిలో చూసి కంగారుగా "డాడీ! డాడీ!" అంటూ అరిచింది. రావు ఉలిక్కిపడి తన ఆలోచనల్లోంచి తేరుకొని తొట్రుపడి సర్దుకుంటూ "అబ్బే ఏం లేదమ్మా" అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

మాధురి విషాదంగా నిలబడిపోయింది.

ఏ ఆయిదారు నెలలకో, తండ్రి ఇలా మానసిన క్షోభకి గురి కావడం, మళ్ళీ

తనని చూసి అంతల్లోనే సర్దుకొని 'అబ్బే-ఏం లేదు' అంటూ నీరసంగా నవ్వడం జరుగుతూ ఉండేదే.

శేఖర్‌కీ కిరీటికీ మాత్రమే ఏం అర్థం కాక ఆ మట్టునే తెల్లబోయి చూస్తూ ఉండిపోయారు.

ఒక్క క్షణంలో రావు మళ్ళీ మామూలు మనిషయి ముగ్గుర్నీ నవ్వించి తాగుతున్న కాఫీని పొలమారేలా చేశాడు. లేని ఉత్సాహంతో కబుర్లూ చెప్పాడు కాని ఏం చేసినా అతని ముఖంలో విషాదచ్ఛాయ మాత్రం అలాగే మిగిలిపోయింది

## 5

బంగారంలాంటి నీరెండ, దేవాలయ శిఖరంమీదా చెట్ల చివళ్ళమీదా, కళ్ళని జిగేల్ మనిపించేలా పసుపుని పండించి, సూర్యుడు పశ్చిమాన కళ్ళు ఎర్ర జెయ్యడంతో, కంపించిపోయి, భయంవల్ల ముఖం అంతా కందగడ్డలా మారి, లోకం మొహాన్ని కుంకం పులిమింది పగల్లా ఎక్కడెక్కడో తిరిగి వచ్చిన పక్షులన్నీ చుట్టూ ఉన్న చెట్లమీదకి జేరి అరుపులతో కూతలతో ఆ ప్రదేశాన్నంతా సందడి చేయసాగాయి గోదావరి మీదనుంచి వస్తూన్న చల్లని గాలులు ధ్వజస్తంభం చివర ఉన్న గంటల్ని కదిపి, గూళ్ళలో ఉన్న పావురాల్ని కవ్వించి ఊరునిండా పరుచుకుంటున్నాయి పగలల్లా ఎండలో వేగిపోయిన శరీరాలకి ఆ గాలులు తల్లి యొక్క చల్లని చేతివేళ్ళలా ఎంతో హాయినీ సుఖాన్నీ ప్రసాదించి సేద దీరుస్తున్నాయి

చల్లని తల్లిలాంటి గాలి!

ఆలోచనల్లోంచి సువర్చల చటుక్కున అదిరిపడి లేస్తూ దీర్ఘంగా నిట్టూర్చింది. అయినా గాలికీ మనుష్యులకీ ఏవిటి సంబంధం? ఎందుకది వాళ్ళని పిల్లగా నిమిరి తల్లిలా ఆదరిస్తుంది? దానికి తన పిల్ల లెవరూ లేరా ఆప్యాయంగా చూసుకోడానికి? పిచ్చిగాలి, అదీ తనలాగే ఊరి సేవచేసి ఆనందిస్తోందన్నమాట!

తనూ అంతే కదా! సావిత్రికి అవసానదశలో ఇచ్చిన మాట ప్రకారం, కిరీటినీ జయనీ కంటికి రెప్పలా పెంచుకుంటూ వస్తోంది! నిజానికి వాళ్ళకీ తనకీ ఏవిటి సంబంధం? వాడు తన స్నేహితురాల కొడుకూ, అది మేనకోడలూను. వాళ్ళిద్దర్నీ తన చేతిలో పెట్టి తన స్నేహితురాలు సావిత్రి కన్ను మూసింది నిశ్చింతగా — ఈ బాధ్యత తన గత జీవితాన్ని గురించి తలచుకోడానికే అవకాశం ఇవ్వకుండా, బరువుగా తనమీద వచ్చి పడింది తలుచుకుని మాత్రం తను ఏం చెయ్యగలదు? తనవాళ్ళని కలుసుకోడానికి చెయ్యవలసిన ప్రయత్నమంతా చేసింది. ఏం లాభం లేకపోయింది తనవాళ్ళు, తనకి ప్రాణసమానమైన వ్యక్తులు ఇద్దరూ, ఇప్పుడెక్కడున్నారో ఏమో — ఇంకా వాళ్ళని కలుసుకుంటాం అనే ఆశవల్లే తను బ్రతికి ఉంది భగవంతుడు తన ఆశని ఏం చేస్తాడో మరి! భవిష్యత్తుగురించి ఆలోచించేసరికి నిలువెల్లా ఒణికిపోయింది

సువర్చల భయం తనచుట్టూ చీకటిలా వ్యాపించింది. భగవంతుడా! నా ఆశని వృధా చెయ్యకు.

సువర్చల కంగారు చూసి, అప్పుడే ఆకాశంలో విరిసిన నక్షత్రం ఒకటి తెల్లగా నవ్వింది. ఎదురుగుండా చెట్టుమీద వాలిన తెల్లకొంగ తపతపమంటూ రెక్కలు కొట్టు కుంది భీతితో సువర్చల గుండెలుకూడా కొట్టుకున్నాయి ఆలోచనల్లోంచి మరిపించి తన మనస్సుకి మరో వ్యావృత్తి కలిగించడంకోసం సువర్చల అక్కడినుంచి లేచింది

సందెగుమ్మా లూడ్చి నీళ్లు చిలకరించి ముగ్గు పెట్టింది తను ఈ పదిహేను పదహారేళ్లనుంచీ కళ్ళల్లో పెట్టుకుని పెంచుతున్న పారిజాతానికి, కడవతో పట్టుకు వచ్చి నీళ్లు పోసింది లైటు వెలిగించి మెళ్లో మంగళసూత్రాలు కళ్లకి అద్దుకొని, నొసటనున్న బొట్టుమీద కుంకం అద్దుకుంది. మొహం తిప్పి చూస్తే గోడ నున్న పాత గడియారం ఆరూ నలభై చూపిస్తోంది.

సువర్చల టైము చూసి ఉలిక్కిపడింది. ఏమిటి ఇంత ఆలశ్యం అయినా జయ రాలేదు! చీకటి పడేదాకా ఎక్కడా ఉండొద్దు అని ఎన్నిసార్లు చెప్పినా మళ్లీ మామూలే. బొత్తిగా చెప్పినమాట వినిపించుకోవడం లేదు ఈ మధ్య. వయస్సు వచ్చిన ఆడపిల్ల లతో ఇదే చిక్కు, పోనీ అని ఊరుకుంటే వాళ్ల ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారు. "ఆఁ!" అని కళ్ళెర్రజేశామో, అలగనేనా అలుగుతారు, ఎదిరించనేనా ఎదిరిస్తారు ఇంతకంటే మొగపిల్లలే నయం బాధ్యత తెలిసి భయభక్తులతో ఉంటారు అంతెం దుకు? కిరీటి ఉన్నట్లు జయ అదుపాజ్ఞలలో ఉంటోందా? అపుడు గానీ పదిహేనురోజు లయింది కిరీటి ఉత్తరం రాయలే దేవిటి చెప్మా? పంపించిన మనిఆర్డరు అందిందో లేదో—ఎలా ఉంటున్నాడో, ఏం చదువుతున్నాడో,

సువర్చలకి ఆలోచనలు తోరణాల్లా వస్తున్నాయి అలా ఆలోచిస్తూ కూర్చుంటే వాటికి అంతు అంటూ ఉండదు. అందుకే, గడప అవతల తలుపుకి జేర్లాబడి కూర్చుని, గజేంద్రమోక్షంలో పద్యాలు ఒక్కొక్కటే నెమరు వేసుకో సాగింది. చదివిన పద్యాన్నే మరిచిపోయి మళ్ళీ మళ్ళీ చదువుతూ విసుగొచ్చి, "ఇంకా దీనికి ఇల్లు కనిపించలేదు కాబోలు" అని కోపంగా లేస్తూన్నసమయంలో, తాళంచెవులులేని ఉత్తి తాళాలగుత్తిని వేళ్ళతో విలాసంగా తిప్పుతూ. ఒంటికి బిగుతుగా చుట్టికట్టిన చీర కుచ్చిళ్ళని మోకాళ్ళతో ముందుకితోస్తూ, కాలినున్న స్లిప్పర్లు మడమలకి తగిలి లయబద్ధంగా చప్పుడుచేస్తూంటే, నడకలో ఒకరకమైన హొయలు కనబరుస్తూ ఇంట్లోకి అడుగు బెట్టింది జయ.

"ఆగు! ఇప్పుడు టైము ఎంతయింది!" అంది గట్టిగా సువర్చల

"ఏం ఎంతైతే?"

"ఇంటికి పెందరాళే రమ్మని నీకెన్నిసార్లు చెప్పాను?"

"నేనూ వద్దాం అనే లేచాను. కాని "

"స్నేహితులు రానియ్యలేదు. అవునా?"

"ఇంక నువ్వు రేపటినుంచి ఇల్లుకదిలి వెళ్ళడానికి వీలులేదు."

"ఇప్పుడు ఏం అయిందని?"

"మాట్లాడితే అనోహాటి ఏమైనా కాకపోయినా, ఆడపిల్లఅన్న తరవాత అర్ధరాత్రి దాటేదాకా అక్కడా ఇక్కడా పెత్తనాలేవిటి. పెందరాళే ఇంటికి జేరుకోవద్దూ?"

"ఆడపిల్ల! ...ఆడపిల్ల! ఆడపిల్లయితే ఇంకేం సరదాలూ ఉండకూడదా?"

"పెళ్ళయాక నీయిష్టం, వాడు ఒప్పుకుంటే ఏపెత్తనాలకెళ్ళినా పేరంటాలకెళ్ళినా కాదనను అందాకా మాత్రం కొన్నిహద్దుల్లో ఉండాలి పెంకితనం చెయ్యక చెప్పినట్లువిను"

"అంతగావస్తే నేనసలు పెళ్ళే చేసుకోను"

"ఊ చేసుకోవు చెవులుమెలేసి. రేపొద్దున్న మెళ్ళో కిరీటి తాళికడితే తలవంచి మరీ ఒప్పుకుంటావు" వస్తున్న నవ్వుని ఆపుకుంటూ అంది సువర్చల.

ఆ మాటలతో జయ తాడెత్తున లేచింది.

"మాట్లాడితే నువ్వేమిటి కిరీటి కిరీటి అంటావు? నేనా బుద్ధావతారాన్ని ఛస్తే చేసుకోనని ఎన్నిసార్లు చెప్పాను?"

"నువ్వు ఎంత ఎగిరినా చివరకి వాడిని చేసుకోకతప్పదు ఎంత మేనత్తకొడుకైనా వాడిలాంటి మొగుడు నీకెక్కడ దొరుకుతాడే!"

"అవునవును అలాంటి బుద్ధావతారం, గట్టిగా మాట్లాడితే సమాధానం చెప్ప లేని పెసరపప్పు. ఎవరేం చెప్పినా తలాడించే గంగిరెద్దూ నిజమే. ఎక్కడా దొరకడు."

"జయా!"

ఆ కేకకి జయ అదిరిపడింది.

"చిన్నపిల్లవి కదా ఎందుకెందుకని ఊరుకుంటూంటే నీ ఆగడం రోజురోజుకీ ఎక్కువవుతోంది. వాడు గంగిరెద్దా? ఊ ఆ గంగిరెద్దుతోటే నీ పెళ్ళి జరిపిస్తాను . ఎలా కాదో నేను చూస్తాను" అని కోపంగా అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయింది సువర్చల.

జయ ఒక్కక్షణం స్తబ్ధురాలై ఉండిపోయింది. అన్నప్రకారం చేసినా చేస్తుంది పిన్ని. మామూలుగా ఉన్నప్పుడు ఫరవాలేదు కాని కోపం, పట్టుదలా వస్తేమాత్రం పిన్నిని ఎవరూ కాదనలేరు ఎంతటివాళ్ళయినా సరే ఆమె చెప్పినట్లు ఒప్పుకోని తీరాల్సిందే. ఒప్పుకోకపోతే వాళ్ళని ఎలా ఒప్పించాలో ఆమెకి తెల్సు చుట్టుపక్కలవాళ్ళకికూడా పిన్ని అంటే తెగ భయం. కిరీటి బావకూడా బహుశా ఇందువల్లే పిన్నిపేరు చెప్తే గడ గడలాడుతూ ఉంటాడేమో!

ఎవర్ని ఏ అదుపాజ్ఞలలో పెట్టినా తనని మాత్రం గారంగానే చూస్తుంది ఇప్పటికి ఏ ఒకటి రెండుసార్లో తప్ప తనని అసలు కేకలే వెయ్యలేదు. అదయినా ఒక సారి "మా అమ్మా, నాన్నా ఏమయ్యారు? ఇద్దరూ గోదావరిలోనే మునిగిపోయారటగా, పట్టుచీర లత్తయ్య చెప్పింది" అన్నపుడూ. మరోసారి "నన్ను కాలేజీలో జేరనియ్య

కుండా, బావని ఎమ్మే చదివించడం ఎందుకు? మానిపిస్తే ఇద్దర్నీ మానిపించెయ్యి చదువు'' అంటూ పేచీ పెట్టినప్పుడూను. అప్పుడు మాత్రం గట్టిగా చీవాట్లు పెట్టింది - ''ఈ మాటు ఆ పట్టుచీరల దానిదగ్గర కెళ్ళావంటే తోళ్ళు ఒలిచేస్తాను జాగ్రత్త'' అంది.

అలాగే ''ఎవర్ని ఎంతవరకూ చదివించాలో నాకు తెలుసు పెద్ద కబుర్లు చెప్పక నోరు మూసుకుని లోపలికి వెళ్లు'' అంటూ గుడ్లురిమి చూసింది - ఆ రెండు సార్లే కేక లేసింది.

అంతే మళ్ళీ తనెప్పుడూ ఇంత గట్టిగా కేకలెయ్యలేదు ఎప్పుడూ కసురుకోని పిన్ని కసురుకుంది కనకే జయకి భయం వేసింది ''ఏం ఇంకా భోజనానికి వేళ కాలేదేవిటి?'' అంటూ లోపలినుంచి సువర్చల కంఠం ఖంగ్ మనడంతో ఆలోచన లోంచి తేరుకొని ఉలిక్కిపడి ''వస్తున్నా పిన్నీ'' అంది జయ.

రాత్రి భోజనాలదగ్గర ఎవరూ ఏం మాట్లాడలేదు. జయ తల వంచుకుని గబగబా రెండు మెతుకులు నోట్లో వేసుకుని లేచింది సువర్చల. జయ వేసుకున్న బట్టల తీరునీ, చెవులమీదకి వచ్చేలా పైకి దువ్వుకొని మధ్యలో రిబ్బను కట్టి చివళ్లు వదిలేసి అల్లుకున్న జుట్టునీ, కళ్ళ చివర గీతలా పొడిగించిన 'ఐ లేష్' నీ చిరాగ్గా చూసి దీర్ఘంగా నిట్టూర్చింది.

భవిష్యత్తు గురించి భయంగా ఊహించుకోవడంతో జయకి రాత్రి తెల్లవార్లూ నిద్దర పట్టలేదు.

గతం అంతా, ఆలోచనల్లో బాధగా సుడి తిరగడంవల్ల, సువర్చలకీ కంటిమీద కునుకు లేదు

ఇద్దరి కళ్ళూ తెల్లవారేసరికి జ్యోతుల్లాగే ఉన్నాయి బద్ధకంగా మనస్సంతా తిక్కగా ఏదో ఇబ్బందిగా ఉంది రాత్రి నిద్రలేమితనం ఇద్దరి మొహాలమీదా స్పష్టంగా కనిపిస్తోంది ఒకరిని ఒకరు పలకరించకుండా ఇద్దరూ ఎవరి పనులు వాళ్లు చేసుకుంటున్నా, విసుగ్గానే ఉంది మొత్తంమీద ఇద్దరికీ

సువర్చల కళ్ళాపుజల్లిన వాకిట్లో, మామూలు ప్రకారం జయపెట్టిన ముగ్గు అష్టవంకర్లుగానూ కనిపించిందారోజు సువర్చలకి క్రితంరోజున సువర్చల, ముందు పెరట్లో చెట్లకి చేసిన బోదెలన్నీకూడా అలాగే ఉన్నాయనిపించింది జయకి రోజూ లాగే సువర్చల పాలు పిండుతూంటే, దూడని పట్టుకున్న జయ పరధ్యానంగా ఒకటి రెండుసార్లు వదిలివేయడంతో, కోపంగా చూసింది సువర్చల జయకేసి బావిదగ్గర బట్టలుతుకుతూన్న సువర్చల మరో రెండు బొక్కెనలు తోడమనే టప్పటికి జయ విసుక్కుంది

ఇలా ఇద్దరిమధ్యా మౌనంగా అంతర్యుద్ధం సాగుతూనే ఉంది మధ్యాహ్నందాకా ఆసమయంలో వచ్చింది కిరీటి దగ్గర్నుంచి ఉత్తరం. సమయానికి కళ్ళజోడు దగ్గర లేకపోవడంవల్ల జయని చదవమని కార్డు ఇచ్చింది సువర్చల కార్డు తీసేసుకుని మౌనంగా

చదువుకుంటూన్న జయనిచూసి విసుగ్గా "లోపల చదువుకుంటావేమిటి? ఎవరు రాశారు?" అంది సువర్చల

"ఇంకెవరు? హైదరాబాదునుంచి" అంది జయ ఎగతాళిగా.

"కిరీటా? హైదరాబాదునుంచి అని పొడిగా అనకపోతే బావదగ్గర్నుంచి అని చెప్పలేవు?"

జయ ఏం మాట్లాడలేదు

"పైకి చదువు ఏం రాశాడు?"

"ఏముంది రాయడానికి? వాగా చదువుతున్నాట్ట-ఈ శలవలకి ఇక్కడే ఉంటాను సంక్రాంతి శలవలకి కాని రాను అని రాశాడు"

"అంత ఉత్తరంలోనూ ఆ నాలుగు ముక్కలే?"

"కాకపోతే, మహాలక్ష్మీ సమానురాలైన అత్తయ్యకు నమస్కారములు అని కూడా ఉంది ఉత్తరం మొదట్లో. చివర చిత్తగించవలెను, సంతకం-ఇంతకు మిక్కిలి ఏం లేదు కావలిస్తే చూసుకో" అంటూ ఉత్తరం సువర్చల ఒళ్లో పడేసి, అవతలి గదిలోకి వెళ్లి పెద్ద పందిరి పట్టిమంచంమీద వెల్లకిలా పడుకొని వారపత్రిక పేజీలు తిప్పసాగింది జయ

సువర్చల విసుక్కుంటూ లేచివెళ్లి, అలమార్లో ఉన్న కళ్ళజోడు తెచ్చుకుని ఉత్తరం చూపింది.

నిజమే: . జయ చెప్పిన ఆ నాలుగు మాటలే ఉన్నాయి ఆ ఉత్తరంలో కానయితే జయ ఎలా ఉంది. అడిగానని చెప్పు అనికూడా రాశాడు వెనకవైపున ఇంత కాళీ వదిలెయ్యకపోతే ఇంకో నాలుగు సంగతులు రాయకూడదూ? ఈ రెండు ముక్కల కోసం ఇంతకార్డు వృధా చెయ్యడమా? కార్డు విలువా ఖర్చు విలువా తెలియకపోతే ఎలా? సువర్చలకి, కిరీటికూడా డబ్బు దుబారాగా ఖర్చుపెట్టే మనిషిగా తయారవుతున్నాడనే అనుమానం వచ్చింది. ఇలా ఓ పక్కని కిరీటీ, మరోప్రక్కని జయా, ఉన్న కాస్త ఆస్తినీ ఖర్చుపెట్టేస్తే ముందు ముందు వాళ్ల పరిస్థితి ఏం అవుతుంది? ఇన్నాళ్ళనుంచీ తను జాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చింది ఇందుకేనా? ఎలాగేనా ఈ ఇల్లు ఆ నాలుగెకరాల భూమీ వాళ్ళకి నిలబెట్టాలనీ, తనమీద నమ్మకం ఉంచి పసివాళ్ళని తన చేతిలో పెట్టి కన్నుమూసిన సావిత్రి ఆత్మ సంతోషించాలనీ కదా, తను ఇంత తాపత్రయపడి పొదుపుగా రోజులు గడుపుతూన్నది.

సువర్చల మనస్సు అసంతృప్తితో నిండిపోయి వెలితిగా బాధగా అనిపించింది 'ఇప్పటి పిల్లలు ఏ బాధ్యతలూ పట్టకుండా ఇలా పెరుగుతున్నారేమిటి' అని మధన పడుతూన్న సమయంలో, చేను కౌలుకి చేస్తూన్న రైతువచ్చాడు వచ్చి ఆ కబురూ ఈ కబురూ చెప్పి అనుకొన్న ప్రకారం ఈ ఏడు మక్తా పూర్తిగా ఇవ్వలేననీ, పంట దిగుబడి చాలా తగ్గిపోయేలా ఉంది అనీ చెప్పాడు.

''అదేవిటి? తగ్గిస్తే ఎలా?''

''ఏం చెయ్యమంటారు? భూసారమేమో ఏడాది కేడాదికీ తగ్గిపోతోందాయెను. ఖర్చులు చూద్దాం అంటే ఆకాశాన్నంటుతున్నాయి కాలవలో నీరా తగ్గిపోయి ఇంజన్‌తో తోడిస్తే కాని చేనుకి ఎక్కడం లేదు ఇంజన్ అద్దె ఇచ్చి, వందలుపోసి ఎరువులుకొని, కూలి మనిషికి రోజుకి ఆరు రూపాయలిచ్చి ఇంక ఈ వ్యవసాయం చెయ్యడంకన్నా ఎక్కడైనా కూలి పని చేసుకుని బతకడం మంచిది'' అన్నాడు ఆవేశంతో రైతు

''అందరూ ఏడాది ఏడాదికీ మక్తా ఓ బస్తా హెచ్చిస్తూంటే నువ్వు తగ్గిస్తాననటా వేమిటయ్యా?''

''కిట్టకపోతే ఏం చెయ్యమంటారు? లేకపోతే మీరు మరో రైతు కిచ్చుకోండి చేను, నాకభ్యంతరంలేదు'' అంటూ తలవంచుకొని, చేతి కర్రని గచ్చునేలమీద నెమ్మదిగా తూలిస్తూ దానికేసే చూస్తూ అన్నాడు.

సువర్చల త్రుళ్లిపడింది. అతనికేసి కళ్ళప్పగించి చూసింది ''ఓహో ఇదా ఎత్తు! ఊళ్లో రైతు కట్టడి ఉండడం మూలాన ఒకడు వదిలేసిన చేనుని మరొకాడు కౌలుకి తీసుకోడు ఇంకో రైతుకి చేను అప్పచెప్పుకోండి అన్నాడు కాని ఎవరికీ అమర్చలేమని అతనికీ తెలుసు. అందుకే ఈ బెదిరింపు ఊ సరే కానీ '' అనుకుంది.

ఆమె మౌనంగా ఉండడాన్ని చూసి, రైతు తలెత్తి సువర్చల ముఖంలోకి చూశాడు తన ముఖంలోని ఆందోళనని అతనికి కనిపించ నియ్యకుండా మామూలుగా చూస్తూ ''నీ కంత కష్టమైతే ఈ పంట కోసేసుకొన్న తర్వాత చేను వదిలెయ్యి'' అంది కంఠంలో ఏ భావమూ కనిపించ నియ్యకుండా.

సువర్చల దగ్గర్నుంచి అటువంటి సమాధానం వస్తుందని అనుకోలేదేమో అతను తెల్లబోయాడు ''ఊ వదిలేస్తే?'' అన్నాడు

''అందు కిష్టమైన వాడే వచ్చి చేను చేసుకుంటాడు ''

గట్టిగా నవ్వి, ''ఏవిటి నాకు కిట్టుబాటు కానిది వాడికి కిడుతుందా? హుం! నేను వదిలేసిన చేను మరొకాడు తీసుకుంటాడా ఊళ్లో?'' అన్నాడు రైతు.

ఆ మాటలో బెదిరింపు ఉంది. ఎల్లా తీసుకుంటాడు అనే ఛాలెంజికూడా ఇమిడి ఉంది.

సువర్చల గ్రహించింది, కొత్తగా వస్తూన్న భూసంస్కరణల బిల్లుని ఆసరాగా తీసుకుని రైతులందరూ ఈనాందార్లని బెదిరించే బెదిరింపు ఇది ఇవాళ దీనికి లొంగిపోతే, రేప్పొద్దున్న మొత్తం భూమి అంతా స్వంతంచేసుకొని వెళ్ళిరా అన్నా అనొచ్చు. కోర్టులూ ప్రభుత్వమూ కూడా రైతుకి అనుకూలంగానే తీర్పులు చెప్తాయి.

సువర్చల ఒక్కక్షణం ఆలోచించింది. ఆమె ఏం సమాధానం చెప్తుందా అని రైతు చూశాడు.

"ఎవరికీ కిట్టుబాటు కాకపోతే మేమే స్వంత వ్యవసాయం చేసుకుంటాం."

"మీరా?"

"అవును ఏం? అంతగావస్తే కిరీటిని చదువు మానిపిస్తాను. బి. య్యేలూ ఎమ్మేలూ పేసయి వీళ్ళు చేసే ఉద్యోగాలూ, చాలీ చాలని జీతాలూ వీటికంటే హాయిగా రెండెకరాలు కొంౘ్ర దున్నుకుంటే సుఖించి వాళ్ళు తినొచ్చు, పదిమందికి పెట్టొచ్చు. చూస్తున్నాంగా వ్యవసాయాలు లాభమో ఉద్యోగాలు లాభమోను ఉద్యోగస్థులు అప్పులు చేసి ఉన్న ఆస్తులు అమ్ముకుంటూంటే రైతులు ఎకరాన్ని పదెకరాలుచేసి మేడలమీద మేడలు కడుతున్నారు-"

రైతు ఏం మాట్లాడలేదు.

అతనికేసి నిశితంగా చూస్తూ మళ్లీ సువర్చలే అంది "నువ్వు చేను వదిలేసే మాటైతే ఒకనెల ముందుగాచెప్పు. చదువూ అదీ కట్టిపెట్టిరమ్మని కిరీటికి రాస్తాను" అని.

"చాల్లెండమ్మా శుభ్రంగా చదువుకుంటూన్న అబ్బాయిని స్వంత వ్యవసాయం పేరిట చదువు మానిపిస్తారట నష్టం అయితే అయింది ఏటా నాలుగేసి బస్తాలు మీరు మరీ అంతకాదూ కూడదంటే ఇవ్వక తప్పుతుందా?"

రైతు అలా దిగిరావడంతో సువర్చలకి కూడా పెద్దభారం తీరినట్లయింది. హమ్మయ్య! 'అయితే ఇదిగో చేను స్వాధీనం చేసుకోండి' అని ఎక్కడంటాడో అని ఓ పక్క భయపడుతూనే ఉంది, సరే చూద్దాం అనుకుని ఆ భయం రైతుకి తెలిస్తే మరీ ఆడిస్తాడనే అలా బింకంగా మాట్లాడింది. నిజానికి ప్రతిమనిషీ ఏదో ఒక క్షణంలో ఇలా తెగించకపోతే లాభంలేదు. లోకం బొత్తిగా లోకువకట్టేస్తోంది అవసరం అయితే అరక దున్నడానికి సిద్ధం అయ్యే రైతుతో అలా మాట్లాడింది తను. నిజంగా అతను చేను వదిలేస్తే ఆపని చేసినా చేసివుండేది మరేం చేస్తుంది? భయపడి లొంగి పోవడంకన్నా ఎదిరించి శ్రమపడడం నయం

ఇలా సువర్చల ఆలోచిస్తూంటే "వెళ్ళివస్తానండి" అంటూ లేచాడు రైతు.

"భోజనంచేసి మరీ వెళ్ళు" అంది సువర్చల.

"ఎందుకండీ చేలకు అడ్డంబడి ఒక గంట కాలు సాగించానంటే ఇంటికి వెళ్ళి పోతాను."

"అన్నం తిన్నాక అలావెళ్ళినా వెళ్ళగలవు."

అతను ఇంక కాదనలేకపోయాడు. అడిగి అడిగి తల్లిలా కడుపునిండా అన్నం పెట్టి మరీ పంపించింది సువర్చల. దారిలో 'అమ్మగారు దేవతకదా!' అనుకొన్నాడు రైతు. తను ఆమెని దబాయించి మోసగించ బోయినందుకు పశ్చాత్తాప పడ్డాడుకూడా.

ఇంట్లోకీ పెరట్లోకీ ఏం తోచక అలంగం తిరుగుతూన్న జయనిచూసి నవ్వుతూ "ఏం? తోచటంలేదా?" అంది సువర్చల. జయ కోపంతో బుంగమూతిపెట్టి మొహం అటు తిప్పేసింది.

"అలా ఓ గంట స్నేహితులతోటి కబుర్లుచెప్పి వస్తావేమిటి?"

ఏడిపించడానికి కాకపోతే పిన్ని నిజంగా అంటున్న మాటలేనా అవి, అయిష్టంగా చూపింది జయ.

"పెందరాళే వచ్చెయ్యి బాగా చీకటిపడేదాకా ఉన్నావంటే ఇంకోమాటు వెళ్ళ విచ్చేదిలేదు, ఆఁ !" "నిజంగా!" జయ కళ్ళు సంతోషంతో మెరిశాయి

"వెఱ్ఱినానా. నీ సరదాలు నేనుమాత్రం కాదంటానా? మన సరదాలతోపాటు సంఘంయొక్క కట్టుబాట్లని కూడా చూసుకుంటూండాలి "

జయ తలవంచుకుని నిల్చుంది.

"వెళ్ళిరా .వచ్చాక ఇద్దరం కలిపి భోంచేద్దాం."

"చెట్లకి నీళ్ళుపోసి వెళతా."

"పిచ్చిపిల్లా అది నేను చూసుకుంటాలే. గట్టిగా కేకలేస్తే వెఱ్ఱినాగమ్మలా అతి మంచిగా అయిపోతావు నువ్విలా నెమ్మదిగా ఉండడంకంటే అల్లరిగా ఆకతాయిగా ఉంటేనే బాగుంటావు కాని " సువర్చల కంఠం బొంగురుపోయింది

జయ కంగారుగా "పిన్నీ!" అంది. కళ్ళల్లో నిలిచిన నీటిని కన్పించనియ్యకుండా అతిప్రయత్నంమీద నవ్వి, జయని తన సందిట పొదువుకుంది సువర్చల. ఆప్యాయమైన ఆ కౌగిలిలో కరిగిపోతూ "అమ్మా " అంటూ అలౌకికమైన సుఖంతో నిట్టూర్చింది జయ సువర్చలకి ఏదో జ్ఞాపకంవచ్చి గుండె కలుక్కుమంది.

## 6

"ఎవరండీ రూమ్‌లో!"

రూములో ఉన్న కిరీటి ఉలిక్కిపడ్డాడు. రాస్తూ రాస్తూన్న పెన్ చేతిలోంచి ఆ మట్టునే జారిపోయింది

"హమ్మో! ఎవరో వచ్చారు ఆడవాళ్ళ గొంతులా వుంది. ఇంటి యజమానురాలు కాదుగదా! మళ్లీ వచ్చింది కాబోలురా భగవంతుడా రెండు నెలల అద్దె ఇస్తారా ఖాళీ చేస్తారా అంటూ, ఈ మహంకాళికి నేనెలా జవాబు చెప్పేది? వాడుంటే ఏదో సర్ది చెప్పి పంపేవాడు ప్రత్యేకం ఈవిడ వాడులేకుండా చూసి వచ్చింది నా ప్రాణానికి. ఎలాగిప్పుడు? అయినా ఇడియట్ బుద్ధిలేకపోతే, రూముకి ఎవరొస్తారో ఏమిటో అని కాస్త ఉండొద్దూ రూములో? ఇరవైనాలుగు గంటలూ పురపర్యటనా కార్యక్రమం నగర సంకీర్తనాను. ఇప్పుడు ఏవిటి దారి నాకు?

తడబడుతూన్న గొంతు సవరించుకొని, "వాళ్ళు ఇంట్లోలేరు మళ్ళీ రండి" అన్నాడు కిరీటి వణుకుతూన్న కంఠంతో సన్నగా అతి సన్నగా శ్రావ్యంగా స్త్రీ స్వరంలా వున్న ఆ కంఠం విని మాధురి అదిరిపడింది. ఆడవాళ్లు ఎవరు వచ్చారు చెప్మా ఈ రూములోకి. వాళ్ళిద్దరూ ఖాళీ చేశారా? ఖాళీ చేసి ఎక్కడికి వెళ్ళారో? వీళ్ళకి తెలిసే వుంటుంది. తలుపు తట్టింది మాధురి.

అబ్బబ్బ! ఈ శని వదిలేలాలేదు.

"ఎవరూ లేరంటే నీక్కాదూ?" అంటూ విసురుగా తలుపు తీశాడు కిరీటి.

ఎదురుగుండా మాధురి!

"మి మ్మి మ్మి మ్మీరా?"

అతను పడుతూన్న కంగారుచూసి, అనుమానంగా తల దగ్గర్నుంచి కాళ్లదాకా ఉన్న అతని పొడవుని కళ్లతో కొలిచి, అతణ్ణి తప్పించుకొని లోపలికి వచ్చింది మాధురి. ఆమె వెనకాలే కిరీటీ వచ్చాడు

"ఏవిటలా వెతుకుతున్నారు?" అన్నాడు కిరీటి కంగారుగా. గది అంతా కలియ చూసింది ఏమైందా అమ్మాయి? మాధురికేం అర్థంకాలేదు. ఎక్కడ దాచాడా అమ్మా యిని? ట్రంకుపెట్టే—చుట్టబెట్టిన బెడ్డింగూ పరుపూ—తలుపుల్లేని అలమారు—కిరీటి మోళీ కట్టేవాడుకాదుగా, వీటిలో ఎక్కడో ఆ అమ్మాయిని దాచాడనడానికి ఇరవై ఏళ్ల అమ్మాయి చీమా దోమా ఎక్కడో అక్కడ దాగుకోడానికి?

స్టూలుకింద చూసింది ఓ కాలు విరిగిపోయిన కర్రకుర్చీ క్రిందకి ఒంగి పరిశీలిం చింది. మూలని గూడులా నిలబెట్టిన చాపని చూసేసరికి మాధురికి అనుమానం బల బడింది. "ఓహో! ఆ అమ్మాయిని కిరీటి ఇక్కడ దాచాడా?"

మాధురి రెండు అడుగులు అటు వేసేటప్పటికి "అటు వెళ్లకండి" అన్నాడు కిరీటి కంగారుగా. "అనుమానం లేదు. అక్కడే వుంది" మాధురి చాప తియ్య బోయింది "ఏమండీ!" అరిచాడు కిరీటి.

మాధురి కాలిఘాటికి ఆగలేక మూలని గుండ్రని గోడలా నుంచోపెట్టిన చాప కూలిపోయింది

మాసిన బట్టలూ, చిత్తుకాగితాలూ, గది ఊడ్చిన తుక్కూ, సిగరెట్టు పీకలూ మాధురిని వెక్కిరించాయి

కావాలని కిరీటి తనని మోసంచేశాడు. ఏడిపించాడు! లేకపోతే మనిషి లేకుండా మాట వినిపించడం ఏమిటి!

మాధురి కళ్ళు ఎర్రబడ్డాయి ఆ కళ్లలో సన్నని నీటిపొర కూడా ఏర్పడింది. కోపంతో గుండెలు అదురుతున్నాయి కిరీటికేసి రుసరుసా చూపి "ఏది? ఎక్క డుంది?" అంది.

"ఎవరు?"

"అదే వాళ్ళులేరు మళ్లీ రండి అన్న అమ్మాయి."

"అదా? అదేం లేదు లెండి అద్దెకోసం మా యింటి యజమానురాలు వచ్చిందేమో అని భయపడి కంగారులో నేనే అలా అన్నాను."

"ఆ కంఠం మీదా?"

"అవును...మీకు అనుమానంగా వుందా? మళ్లీ అననా?" అంటూ కిరీటి అదే

కంఠంతో ''మొగాళ్లులేరు. మళ్ళీ రండి'' అన్నాడు. మాధురి గుడ్లప్పగించి ఆశ్చర్యంగా వింటోంది.

అప్పుడే లోపలికి వస్తూన్న శేఖర్ ''ఒరేయ్ నీ అసాధ్యం గూలా! చెట్టంత మనిషిని ఆవిడని రూములో పెట్టుకునీ కూడా, మొగాళ్లులేరంటావేమిట్రా?'' అన్నాడు అతి సీరియస్‌గా.

శేఖర్ విట్టుకి కిరీటి కంగారుపడి, మాధురి ఏం అనుకుంటుందో అనే భయంతో ''సారీ . ఆమె ఉంది అనుకోలేదు, రూమ్‌లో మన ఇద్దరమే ఉన్నాం అనుకుని అలా అన్నాను'' అన్నాడు తడబడుతూ

అంతక్రితం శేఖర్ వేసిన జోక్‌కి కోపంవచ్చి పుల్లూ షుల్లూ చూస్తూన్న మాధురి, వెంటనే చప్పట్లుకొట్టి ''వెరీ ఫైన్ వెరీ ఫైన్ . అలా ఉండాలి 'రిపార్టీ' అంటే'' అంది.

కిరీటికి ఏం అర్థంకాక బెదురుతూ ఇద్దరి మొహాలకేసీ చూశాడు. శేఖర్ చేసే దేంలేక నీరసంగా నవ్వి ''ఒరేయ్ . నీకు కూడా మాట్లాడ్డం చేతనయిందే!'' అన్నాడు అంతకంటే ఏం అనలేక.

గోడని ఆన్చిఉన్న కుర్చీ లాగి కూర్చోబోయింది మాధురి. వెంటనే శేఖర్ ఆమెని వారిస్తూ ''కుర్చీమీద కాదు. మీ రలా స్టూల్‌మీద కూర్చోండి'' అన్నాడు.

''ఏం ? మీరే కూర్చోండి దానిమీద''-కోపంగా అంది మాధురి ఇంటికి వచ్చిన అతిథిని ఎలా గౌరవించాలో తెలియని శేఖర్ అహంకారాన్ని అసహ్యించుకుంటూ.

''ఆగండి ఆగండి—కుర్చీమీదే కూర్చోదలుచుకుంటే, అది అలా గోడని ఆన్చి ఉండగానే కూర్చోండి.''

'ఎందుకట ?'' మాధురి కంఠంలో ఇంకా కోపమే ధ్వనించింది.

''కోపగించకండి. అది మూడు కాళ్ళ కుర్చీ, నాలుగోకాలు సరిగాలేదు. అందుకే దాన్ని గోడకి చేర్చిఉంచాం. ముందుకులాగి కూర్చున్నారో, పడతారు. ఆనక మీ ఇష్టం'' అన్నాడు శేఖర్.

''ఓ...అదా ? ఐ యాం సారీ'' అని చిరునవ్వు నవ్వుతూ మాధురి స్టూల్ మీద కూర్చుంది.

"ఇంకా వీర్రాజు రాలేదా ?'' అన్నాడు శేఖర్.

కిరీటి జవాబు చెప్పేలోగానే. ''వచ్చేశా'' అన్నాడు వీర్రాజు, మెళ్లోఉన్న గళ్ళ రుమాలు తీసి మొహం తుడుచుకొని ప్రవేశిస్తూ.

''మనం ఇంక ఇవాళ ఫైనల్ రిహార్సల్ వేసెయ్యాలి. రేపే రికార్డింగ్'' అన్నాడు కిరీటి అందరివేపూ చూస్తూ.

''రైట్ ! అయితే బండి స్టార్ట్‌చెయ్యి'' అన్నాడు వీర్రాజు. మామూలు ప్రకారం కుర్చీని వెనక్కి, గోడవారకి చేర్చి దానిమీద కూర్చుంటూ.

పెట్టెమీద ఒకరూ బెడ్డింగ్‌మీద ఒకరూ కూర్చున్నారు, శేఖర్ కిరీటీను.

డైలాగ్ మధ్యలో ఆపి, "ఒరేయ్ కిరీటీ! నువ్వు మరీ అంత సహజంగా నన్ను ఇడియట్, రాస్కెల్ అంటూంటే బాధ వస్తోందిరా" అన్నాడు వీర్రాజు ముఖం చిన్నబుచ్చుకుని.

"ఏంచేస్తారు ఆయన మాత్రం? అది డైలాగ్‌లో ఉంది" అంది మాధురి తన పోర్షన్ కాగితాలు మడిచి చేత్తో పట్టుకుంటూ.

"వాటిని అంత సహజంగా అనకపోతే నాటకం రక్తి కట్టదురా" అన్నాడు శేఖర్.

"అలాగేం?...ఆయితే, కిరీటి నీ చెంపమీద చెళ్ళుమనిపించే సందర్భంలో కూడా. సహజంగా ఉండడం కోసం. నిజంగా దవడ వాయగొట్టనీ" అన్నాడు కోపంగా వీర్రాజు.

మాధురి ఫక్కున నవ్వింది.

శేఖర్ ఏం మాట్లాడలేదు.

"శ్రవ్యనాటికకి శబ్దమేకాని దృశ్యం ప్రధానంకాదు. చెంపమీద కొట్టిన శబ్దాన్ని మనం సృష్టిస్తే చాలు. నిజంగా కొట్టక్కర్లేదు" అన్నాడు కిరీటి శ్రవ్య దృశ్య నాటికలకి గల భేదాన్ని వివరిస్తూ.

"నువ్వు లెక్చరు కొట్టక్కర్లేదు. నోరుమూసుకుంటే చాలు" అన్నాడు ఉడుకుమోతు తనంతో వీర్రాజు.

ముగ్గురూ నవ్వారు. 'ఏమైనా సరే, వాళ్ళ ముగ్గురూ మంచి పోర్షన్లు తీసుకుని తనకో చివాట్లు మారిచిపడేసి ఉంటారు' అనే అనుమానం వచ్చింది వీర్రాజుకి.

అటు చూసి ఇటు చూసి చిటికవేసి. "బ్రిలియంట్ ఐడియా!" అన్నాడు వీర్రాజు.

ముగ్గురూ అతనికేసి చూశారు.

"ఏవిటి?" అన్నాడు కిరీటి.

"పోర్షన్లు మనం ఒకళ్ళవి ఒకళ్ళు మార్చుకుంటే!"

"ఎందుకు?" అంది మాధురి.

"తెల్లారితే రికార్డింగ్ అనగా ఇప్పుడా?" అన్నాడు శేఖర్.

"అంతకంటే నాటకం మానేద్దాం అను. అది మంచిది" అన్నాడు కిరీటి కోపంగా.

"సాఫీగా నడుస్తూన్న దానిని నడవ నియ్యకుండా ఏవిట్రా ఈ పేచీ?" అన్నాడు శేఖర్ బతిమాలే ధోరణిలో.

మాధురి విసుగ్గా "ఎలా మార్చాలంటారు పోర్షన్లు?" అంది.

చాప చివరనున్న ఒక ముక్క తెంపి పళ్లు కుట్టుకుంటూ నిర్లక్ష్యంగా "నా పోర్షన్ కిరీటిని వెయ్యమనండి వాడి హీరో పోర్షన్ నేను వేస్తాను" అన్నాడు వీర్రాజు.

దుమ్ముకొట్టుకుపోయి అక్కడక్కడ ఆయిల్ మరకలతో అసహ్యంగా ఉన్న కాకీ పేంటూ కోటూ, మాసిపోయిన గెడ్డం, కొబ్బరి నూనె తగలక రాగి రంగులోకి మారిపోయి, గాలి కెగురుతూన్న పెరిగిన జుట్టూ, పుల్లని పదార్ధం ఉంచడంవల్ల పొక్కి-పోయిన అల్యూమినం పళ్లెంలా మెటిమలతో ఎగుడు దిగుడుగా ఉన్న మొహం-ఇతని తోటా తను హీరోయిన్ వెయ్యడం?

వెంటనే కళ్ళు తిప్పి కిరీటికేసి చూసింది.

పచ్చని ఒళ్ళూ-పక్క పాపిడితీసి అటూ ఇటూ కొంచెం వెనగ్గా దువ్విన నల్లని బిరుసైన ఉంగరాల జుట్టూ-నున్నని పొడుగైన మెడా-బరువైన కళ్ళల్లో పసివాడి అమాయకత్వం-బలమైన బుజాలూ విశాలమైన ఛాతీ - ఆ తెల్లని లాల్చీపై జమాలో ఆడ పిల్లలా ముడుచుకొని కూర్చున్న ఆకర్షణ.

అతనికీ ఇతనికీ పోలికా అనుకొంది మనస్సులో.

మాధురి మౌనంగా ఉండడం చూసి "పోనీ హీరోగా శేఖర్‌ని వెయ్యమనండి. శేఖర్ పోర్షన్ నేను వేస్తే నా పోర్షన్ కిరీటి వేస్తాడు" అన్నాడు వీర్రాజు.

"ఎందుకీ మార్పంతా?" అంది మాధురి.

"అంతే-ఇలాంటి చివాట్లు తినే పాత్రని సృష్టించినందుకు శిక్షగా ఆ పాత్ర రచయితే వెయ్యాలి. నేను వెయ్యను. ఏం? హీరోగా కిరీటి ఉంటే యేం శేఖర్ ఉంటే యేం? మీకేవిటి అభ్యంతరం?"

ఇలా సూటిగా అడిగే సేటప్పటికి మాధురి ఏం సమాధానం చెప్పలేక పోయింది. అక్కడికీ "నా అభ్యంతరం ఏవిటి: కిరీటి ఒప్పుకుంటే సరి" అంటూ బాధ్యతని కిరీటి మీదకి నెట్టింది అతడు ఒప్పుకోడనే ధైర్యంతో.

కాని వెంటనే కిరీటి 'సరే' అన్నాడు.

మాధురి బిత్తరపోయింది. ఏం పట్టనట్లు రపీమని అలా ఒప్పేసుకుంటాడేమిటి? తనతో కలిసి వెయ్యాలనే సరదా తనలాగే అతనికి కూడా లేదా? ఏవిటా నిర్లిప్తత? కోరగా కిరీటికేసి చూసింది మాధురి. తలవంచుకొని కుడి చూపుడు వేలితో ఎడం అర చేతిలో ఏవో పిచ్చి గీతలు గీసుకుంటూ కూర్చున్నాడు కిరీటి. మాధురికి చిరాకేసింది. తన పక్కని హీరోగా వెయ్యడం ఇతనికి ఇష్టంలేదా? మాధురికి అహం దెబ్బతింది. ఎందుకు ఇష్టం లేకపోవాలి?

ఏమైనా సరే, తన పక్కని అతనే హీరోగా వెయ్యాలి. వేసి తీరాలి: అతన్ని తప్పించి ఎలాగైనా ఆ హీరో వేషం తను వెయ్యాలని చూస్తున్నాడు ఈ శేఖర్. అందుకే ఈ వీర్రాజుని ముందుకుతోసి తనకేం తెలియనట్లు తటస్థంగా కూర్చున్నాడు. ఏమైనా వీళ్ళ ఎత్తు సాగనియ్యకూడదు. కిరీటి సహకరించినా సహకరించకపోయినా వీళ్ల ఎత్తు గడని తను ఎదుర్కొని తీరుతుంది.

ఇలా నిర్ణయించుకొని. "హీరోగా ఎవరు వేసినా ఒకటే అనుకోండి. కాని రచయితే హీరో వేస్తే ఉండే ఆ పద్ధతి వేరు. ఆ పాత్రని ఏ ఉద్దేశంతో సృష్టించిందీ

రచయితకి తెలిసినంతగా ఇతరులికి తెలియదు కదా?''అంది మాధురి ముగ్గురికేసీచూస్తూ.

కిరీటి ఏం మాట్లాడలేదు. గ్లాసులో నీళ్లు కొద్దిగా ఒక గుక్కెడు తాగి, తిరిగి గ్లాసుమీద ఓ పాతకార్డు మూతబెట్టి, జాగ్రత్తగా గ్లాసు పక్కని బెట్టాడు. మాధురి శేఖర్‌కేసి తీక్షణంగా చూస్తూ, కిరీటి ఏం చేసినదీ గమనించలేదు. తర్వాత చాలా సేపటి వరకూ వీర్రాజుకీ మాధురికీ చాలా వాగ్వాదం జరిగింది. చివరకి కిరీటే హీరోగా వెయ్యడానికి నిర్ణయం అయింది. వాదించి వాదించి ఉందేమో, ఆఖరికి తన మాటే నెగ్గడంతో 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని వెంటనే పక్కనున్న గ్లాసులో నీళ్లు రెండు గుక్కలయితే తాగేసింది, ఇంకా ఒక పక్కనుంచి 'ఆగండి. ఆగండి' అని శేఖర్ అంటూన్నా వినిపించుకోకుండా.

గ్లాసుకింద పెడుతూ ''ఏం?'' అంది మాధురి.

''ఆ నీళ్ళు ఎంగిలి నీళ్లు-ఇందాకా కిరీటి కొంచెం తాగాడు.''

మాధురి ఉలిక్కి పడింది ...ఆ . .అవి ఎంగిలి నీళ్లా? కిరీటి తాగినవా?.... నిజంగా? .కిరీటి అవునన్నట్లు తల ఊపాడు .ఇప్పుడెలాగ? ...మాధురికేం తోచలేదు. పైగా వీర్రాజు శేఖర్ నవ్వుతూ తనకేసి చూస్తున్నట్ల నిపించింది. దాంతో మాధురికి కోపం పౌరుషం వచ్చేశాయి. కాని ఆవేం ముఖంమీద కనిపించ నియ్యకుండా తేలిగ్గా నవ్వేస్తూ ''ఆయన ఎంగిలి తాగితే తాగాను లెండి. కాస్త కవిత్వమేనా వస్తుంది అందువల్ల'' అంది నీరసంగా.

పైకి అలా సింపుల్‌గా అనేసిందే కాని మనస్సులో ఏదో చెప్పలేని ఆరాటం, ఏవిటి ఇలా జరిగింది అనే ఆవేదన!

ఆ తర్వాత రిహార్సల్‌లో మాధురి సరిగ్గా నటించలేకపోయింది. మొత్తంమీద ఏదో అయిందనిపించే టప్పటికి బాగా చీకటిపడింది.

టైం చూసుకుని ''అమ్మో చాలా అయిందే!'' అంటూ ఒక్క పరుగుతీశాడు వీర్రాజు.

''బాగా చీకటిపడింది'' తనలోతను అనుకున్నట్లు పైకి అంది మాధురి.

''సాయం రమ్మంటారా?'' అడిగాడు శేఖర్.

మాధురి సాభిప్రాయంగా కిరీటికేసి చూపింది.

''వాడు మీకు సాయం రావడానికి వీలులేదు'' అన్నాడు అరిచేతులు చూసుకుంటూ శేఖర్.

ఆ మాటలో ఏదో వ్యంగ్యం ధ్వనించింది మాధురికి.

''వస్తేయేం?'' కనుబొమలు చిట్లించి కోపంగా అడిగింది మాధురి.

''మీరు వాడినే సాయం తీసుకువెళ్లే మాటైతే నేనూ రావలసి ఉంటుంది మీతో'' దూలాలకేసి చూస్తూ సిగరెట్ పొగని రింగురింగులుగా పైకి వదులుతూ అన్నాడు శేఖర్.

మాధురికి వళ్ళు మండుకొచ్చింది.

''ఆయన్నే తీసుకెళ్తాను. అయినా మీరు రా నక్కర్లేదు.''

"అయితే ఓపని చెయ్యండి. ఈ రాత్రికి మీ ఇంట్లో పడుకోబెట్టి పొద్దుట పంపించండి వాడిని" సిగరెట్టు నుసి యాష్ట్రేలో విదిలిస్తూ నెమ్మదిగా అన్నాడు శేఖర్.

మాధురి సహనం హద్దులు దాటింది.

"ఏయ్ మిష్టర్! ఏం మాట్లాడుతున్నారో తెలుస్తోందా?" అంది గట్టిగా గద్దిస్తూ.

ఆమె కంఠంలోని తీవ్రతకి కిరీటి అదిరిపడ్డాడు.

శేఖర్‌మాత్రం తొణక్కుండా "ఎందుకంతకోపం ఉన్నమాటంటే?" అన్నాడు.

శేఖర్‌ని తినేసేలా చూసింది మాధురి.

"వాడసలే పిరికి సన్యాసి. తీరా మిమ్మల్ని ఇంటిదగ్గర దిగబెట్టాక వెళ్ళిరండి అని మీరంటే ఒక్కడూ వెనక్కి తిరిగి రాలేడు. సాయంలేకపోతే గుండెపగిలి చస్తాడు. అందుకే నేనూ వస్తానన్నాను. లేదా రాత్రికి అక్కడ వుంచేసి పొద్దున్న పంపించ మన్నాను. ఇందులో మీరేదో లేనిపోని అర్థాన్ని ఊహించుకొని కోపం తెచ్చుకుంటు న్నారు." అన్నాడు శేఖర్. "నిజంగా?" అన్నట్లు కిరీటికేసి చూసింది. కిరీటి తల దించేశాడు. మాధురి ముసిముసి నవ్వులు నవ్వుతూ "అయితే మీ ఫ్రెండ్‌ని ప్రొద్దుట పంపిస్తానులెండి" అంది శేఖర్‌తో.

# 7

"రండి, లోపలికి రండి" అంది మాధురి. ఆ మాటలో లక్ష ఆహ్వానాల్నీ కోటి కోరికల్నీ ద్యోతకంచేస్తూ.

"ఎందుకండీ, ఒక్కణ్ణీ వెళ్ళిపోగలను" అన్నాడు కిరీటి మొహమాటపడుతూ.

"ఆ! మీధైర్యం గురించి శేఖర్ చెప్పారుగా? బెట్టుచెయ్యకరండి. పొద్దున్న వెళుదురుగాని. పైగా మాడాడీ కూడా ఊళ్లోలేరు. ఏదో అర్జంటుగా టెలిగ్రాంవస్తే ఊరు వెళ్ళారు. నే నొక్కత్తెనీ ఉండాలి ఇంత ఇంట్లోనూ."

ఆమె ముఖంలో కనిపించిన ఆప్యాయతనీ, ఒక్కత్తే ఉండలేక పడుతూన్న భయాన్నిచూసి కాదనలేకపోయాడు కిరీటి. అన్నీ టేబిల్ మీద పెట్టేసి ఇంటికి వెళ్ళమంది బట్లర్‌ని. వీధితలుపు గడియవేసి హాలులో పక్క వేసుకోమని పురమాయించింది నౌఖరుకి. తను బట్టలు మార్చుకొని, కిరీటికోసం ఉని చాకల్దితెచ్చిన పంచె ఒకటి ఇచ్చింది.

డిన్నర్ టేబిల్‌దగ్గర కూర్చుని తనచేత్తో వడ్డిస్తూ, నవ్వుతూ కబుర్లు చెబుతూ కడుపునిండా భోజనంపెట్టింది కిరీటికి. టేబిల్ దగ్గర్నుంచి లేస్తూ, "అబ్బో ..రోజూ ఇలా తిన్నానంటే ఇంకవేరే అడగక్కర్లేదు ఆరునెలలు తిరక్కుండా పొట్ట చుట్టు కొలత అరడుగులు మించిపోతుంది" అన్నాడు కిరీటి.

"అబ్బ! గొప్ప! ఏం తిన్నారని? స్వీట్సు ఆ మట్టునే ఉండిపోయాయి, గిన్నెలో పాయసం కదల్నేలేదు" అంది మాధురి విషాదంగా.

"చాల్లెండి ఇప్పటికే నామీద ఓవర్‌లోడ్ కేసు పెట్టొచ్చు ఏ బ్రేక్ ఇనస్పెక్టరేనా

చూశాడంటే'' అన్నాడు కిరీటి అటూ ఇటూ పచార్లుచేస్తూ. అతని మాటలు వింటుంటే మాధురికి నవ్వువచ్చి పొలమారింది. నడినెత్తిని అరిచేత్తో అదుముకుంటూ ''ఊహూ! ఒంటరిగావుంటే మీరు కబుర్లు బాగా చేప్తారే! పదిమందిలోనూ బుద్ధిమంతుడిలా ఉంటే ఇంకా ఏమిటో అనుకున్నాను!'' అంది మాధురి. కిరీటి తబ్బిబ్బు పడ్డాడు. బుద్ధిమంతుని. తనానికి లోటువచ్చేమాట ఇప్పుడేం అన్నానా అని ఆలోచించసాగాడు. కంటిచివర నుంచి అతనికేసి కొంటెగా చూస్తూ. ''ఏమిటి ఆలోచిస్తున్నారు? నిద్రవస్తోందా? మేడ మీద ముందువరండాలో పక్క వేయించాను వెళ్ళిపడుకోండి'' అంది మాధురి.

''అబ్బే-ఇంకా నిద్దర రావడంలేదు'' అందాం అనుకున్నాడు. కాని అలా అంటే తను బుద్ధిమంతుడు కాదని ఆమె ఎక్కడ అనుకుంటుందో అనే భయంతో ''అలాగే నండి.'' అని వినయంగా అంటూ, మేడమీదకి వెళ్ళిపోయాడు కిరీటి.

''నిజంగా బుద్ధావతారమే! లేకపోతే ఏవిటి? 'అప్పుడే నిద్దర రావడంలేదు. కాస్సేపు మీకు సాయం కూర్చుంటాను. ఏకంగా ఇద్దరం ఒకమాటే మేడమీదకి వెళదాం' అనొద్దూ? . ఇందాకా భోజనం వడ్డిస్తూన్నప్పుడూ అంతే. 'మీరు కూడా కూర్చోండి కలిసి తిందాం' అంటారేమో అని యెదురుచూస్తే-అబ్బే-ఆ సరదా ఏంలేదు. తలవంచుకొని యేదో తప్పని సరిగా నాలుగు మెతుకులు నోట్లో వేసుకున్నారు. ఇలాంటి ముడిసరుకుని యెంత రిపేరు చెయ్యాలో యేమో, కావలసిన రూపంలోకి మార్చుకోవానికి'' అనుకొంది మాధురి.

కాని, గ్లాసుతో పాలు తీసుకుని పైకి వెళ్లేటప్పటికి, తను భయపడ్డట్టు కాళ్ళ దగ్గర్నుంచి తల దాకా ముసుగుతన్ని గుర్రుపెట్టి నిద్రపోవడంలేదు సరికదా, గుండెల మీద పుస్తకం ఆన్చుకొని, తలాపు దిక్కున ఉన్న స్టాండ్ లైటు వెలుగులో, తన ఫిజియాలజీ పుస్తకం తాలూకు పేజీలు తిప్పుతున్నాడు కిరీటి.

హమ్మయ్య ఫరవాలేదు అనుకొంది.

ప్రక్కనున్న టేబిల్ మీద చప్పుడయేలా గ్లాసు పెట్టింది. ఒక్క నిముషం అక్కడే వేచి ఉండి కిరీటిని నిండుగా చూసి నవ్వుకుంది. కాస్సేపు ఆగి, కావాలని గొంతు సవరించుకొని దగ్గింది.

ఉహుఁ! కిరీటిలో చలనం ఏం కన్పించలేదు.

''ఆ పుస్తకం అంత ఆసక్తికరంగా ఉందా?'' అంది మాధురి, కిరీటి తలెత్తి ''ఆ...ఆ...'' అని మళ్లీ పుస్తకం చూడడం ప్రారంభించాడు.

''ఎదురుగుండా మాట్లాడడానికి మనుష్యులు లేనప్పుడు కదా, ప్రాణంలేని ఆ పుస్తకాలతో కాలక్షేపం చెయ్యడం'' అంది.

కిరీటి జవాబు చెప్పలేదు

''కాస్సేపు ఏదైనా మాట్లాడండి, ఆ పుస్తకం పక్కని పడేసి'' అంది విసుగ్గా.

ఆనమాలు కోసం పుస్తకంలోంచి వేలు తియ్యకుండా, దాన్ని మూసి చేత్తోపట్టుకుంటూ ''ఏవిటి? కబుర్లా? ఏవున్నాయి?'' అంటూ మళ్లీ పుస్తకం తెరవబోయాడు కిరీటి.

"మీరలా పుస్తకంలో తలదూర్చి కూర్చుంటే యెదురుగుండా నేనెందుకు? నేనూ పోయి హాయిగా పడుకుంటాను" అంది మాధురి బెదిరింపుగా.

"రైట్! అలా చెయ్యండి" అందాం అనుకున్నాడు. కాని ఆమె ముఖం చూసేసరికి తడబడుతూ "అబ్బెబ్బే వద్దు. వద్దు" అన్నాడు కిరీటి.

మాధురి నవ్వుతూ "మరయితే యేమైనా కబుర్లు చెప్పండి" అంది, పక్కనున్న పడక కుర్చీ లాక్కుని కూర్చుంటూ.

"కబుర్లా! కబుర్లకేం ఉన్నాయి? తెల్లారితే మన రేడియో నాటిక రికార్డింగు! ఈ సిటీ బస్సులూ అవీ మనకి సరిగ్గా దొరుకుతాయో దొరకవో, ఒక గంట ముందే బయలు దేరడం మంచిది. లేకపోతే మా వీర్రాజు ఆటో రిక్షాలో ఒకళ్ళ వెళితే, ఇంకో దాంట్లో తక్కిన ఇద్దరూ వెళ్లొచ్చు. పాపం వాడివాళ ఇలా ఆటో రిక్షా నడుపుకోవలసి వచ్చింది కాని, ఏ ఉద్యోగంలోనైనా చేరి ఉంటేనా, ఈపాటికి పై ఆఫీసరుని తమాషాచేసి ప్రమోషన్ల మీద ప్రమోషన్లు సంపాదించి ఉండును అంతకంటే వాడి తెలివి బిజినెస్‌లో ..."

"చాల్లెండి!"

ఆ కేకకి అదిరిపడి కిరీటి చేత్తో నోరు మూసుకున్నాడు. మాధురి అతనికేసి కోపంగా చూస్తూ "ఏమిటండీ! కబుర్లు చెప్పండీ అంటే ఇవా? నాలుగు నవ్వొచ్చేవో, సరదాగ ఉండేవో చెప్పాలి కాని బస్సులూ, రిక్షాలూ, ప్రమోషన్లూనా? ఎప్పుడేం మాట్లాడాలో తెలియదేమిటండీ మళ్లీ యెమ్మే చదువుతున్నారు!" అంది.

దాంతో కిరీటికి కోపం వచ్చింది 'ఎమ్మే చదివితే మాత్రం మాట్లాడ్డం తెలియాలని ఉందా? మెడిసన్ చదువుతున్న వాళ్ళందరికీ చాపలల్లడం వచ్చునా అంటే యెలా ఉంటుంది? ఈ మెడిసన్, ఇంజనీరింగ్ చదివే వాళ్ళందరికీ ఎమ్మే వాళ్ళంటే లోకువ. ఆ శేఖర్‌గాడికీ అంతే. మాట్లాడితే తీసి పారేస్తూ ఉంటాడు. ప్రొద్దుటే రూంకి వెళ్ళగానే మరిచి పోకుండా రెండు తన్నాలి వాడిని. అప్పుడు కాని వాడికీ వాడితోపాటు మెడిసన్ చదివే వాళ్ళందరికీ బుద్ధిరాదు...మరీ యెందుకెందుకని పోనిస్తూంటేనూ'

"ఏమిటలా ముఖం అంతా ఎర్రబడిపోయింది. కోపం వచ్చిందా?" అంది మాధురి అనునయంగా. మనస్సులో లేచిన భావాన్ని పైకిరాకుండా దాచుకోలేనందుకు సిగ్గుపడి "లేదు లేదు... అబ్బే. ఉహూ—భలేవారే! కోపం ఎందుకు?" అన్నాడు కిరీటి తడబడుతూ.

"నవ్వొచ్చే కబుర్లు నాలుగు చెప్పండీ" అంది మాధురి గునుస్తూ.

"నాకేంవచ్చు?...కావలిస్తే తెనాలిరామకృష్ణుని కథలు చెప్తాను...చెప్పనా?"

"ఏ అక్కర్లేదుకాని...మీ క్లాసులో అమ్మాయిలు ఎంతమంది వున్నారు?"

"ఉంటారు. ఓ డజనుమందిదాకా."

"అంతమందే!...అందులో ఎవరేనా అందమైన వాళ్ళున్నారా?"

"అందం అంటే...ఖరీదైన బట్టలు కట్టుకుంటారు..... పౌడర్లకీ లిప్‌స్టిక్‌లకీ

ఇంక లో టుండదనుకోండి...కొందరు ఒక జడా కొందరు రెండు జడలూ వేసుకుంటారు. మూడు జడలు వేసుకున్న వాళ్లెవర్నీ చూడలేదు. ఆ...కొందరు, గూనివాళ్ళలా వంగి నడిస్తే, కొందరు ఓ కాలు పొట్టిగా ఉన్నట్లు కుంటుతూ నడుస్తారు...ఇకపోతే...''

వస్తూన్న నవ్వుని ఆపుకొని "ఊరుకోండి!...భలే కొంటెగా మాట్లాడతారే!... ఇదంతా అందమా?'' అంది మాధురి చిరుకోపం నటిస్తూ. "అందంగా వున్నాం అనుకొనేకదా ఇదంతా మరి! కాకపోతే? '' నసుగుతూ అన్నాడు కిరీటి.

"ఇప్పుడు నేను వున్నాననుకోండి...మీ కంటికి ఎలా కనిపిస్తున్నాను?''— ఇలా అడుగుతున్నప్పుడు లైటు కాంతిపడి మాధురి కళ్ళు మెరిశాయి.

ఆమె సిగ్గుతో ముడుచుకుపోతూంటే, పాదాలదగ్గరనుంచి తలదాకా పరిశీలనగా ఆమెని చూసి "మీకేం? అజంతా శిల్పసుందరిలా వున్నారు'' అన్నాడు కిరీటి.

మాధురి హృదయం ఝల్లుమంది. ఆనందంతో వణికిపోతూన్న కంఠాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ, సిగ్గుతో తలవంచుకొని "మీ క్లాస్‌మేట్స్‌లో ఎవరేనా నా కంటే అందంగా ''—ఆ వాక్యాన్ని ఓర చూపుతో పూర్తిచేసింది.

కిరీటి సమాధానం చెప్పలేదు.

అతను రహీమని సమాధానం చెప్పాలనీ, ఆ చెప్పడం కూడా 'మీ కాలిగోటికి సరిపడే వాళ్లెవరూ లేకని'' ఖచ్చితంగా చెప్పెయ్యాలనీ ఆమె కోరిక. తను ఆశించిన ఆ సమాధానాన్ని చెప్పడానికి ఇంత ఆలస్యం ఎందుకబ్బా!

ఒకటి రెండు మూడు...

అయిదు నిముషాలు గడిచినా అతని దగ్గర్నుంచి సమాధానం రాలేదు. ఇంక వుండబట్టలేక తలెత్తి అతణ్ణి చూసింది చూస్తే ?

అతను రెప్పవాల్చక తననే పరిశీలిస్తున్నాడు.

ఆ చూపులో, కోటికోట్ల యుగాలనుండి పురుషుడు స్త్రీ సౌందర్యాన్ని ఆరాధిస్తూన్న వివశత్వం, కాంతివంతమైన చైతన్యరూపాన్ని కళ్ళతో త్రాగేయాలనే గాఢమైన కాంక్ష—

కిరీటి చూపులు చంద్రకిరణాల్లా వచ్చి తన శరీరాన్నంతా తాకడంతో, నవమల్లికలా నిలువెల్లా పులకించిపోయింది మాధురి. అక్కడ ఒక్క క్షణం నిలబడలేక, ఆనందంతో వణికిపోతూ తన పడకగదిలోకి పరిగెట్టింది

ఆ తర్వాత అరగంటకి కాని ఆమె స్థిమితపడలేదు—తలమునకలుగా చుట్టబెట్టేసిన సిగ్గు ఆమెని విడిపోలేదు. అరగంటయ్యాక జ్ఞాపకం వచ్చింది టేబిల్‌మీద గ్లాసు పెట్టేసి వచ్చేశానన్న సంగతి. ఆయన చూసుకుంటారో లేదో! పాల సంగతి జ్ఞాపకంలేక నిద్రపోయినా పోవచ్చు- ఏం చెప్పం? ఉత్త చలిమిడీ, పెసరపప్పూను' నవ్వుకుంది.

లేచి వరండాలోకి వచ్చింది.

లైటు వెలుగుతూనే వుంది. కిరీటి ఇంకా దీక్షగా చదువుతూనే వున్నాడు ఫిజియాలజీ పేజీలు తిప్పుతూ.

"చాలా లేటయింది. ఇంక పడుకోకూడదూ?" సన్నగా తలుపు వెనకనుంచి అంది మాధురి.

కిరీటి ఉలిక్కి పడ్డాడు. అంతలోనే సర్దుకుని, ఏం వినిపించనట్లు మళ్ళీ చదువు తున్నాడు.

'మిమ్మల్నే' మరికాస్త దగ్గరగా వచ్చింది మాధురి.

ఇందాకా ఆమెని వళ్ళంతా కళ్ళుచేసుకుని చూసినందుకు, తప్పుచేసినవాడిలా సిగ్గు పడుతూ, తలఎత్తి ఆమెకి సమాధానం చెప్పలేక, పుస్తకంమీంచి దృష్టిమరల్చకుండా "అలాగేలెండి నాకు ఇంకా నిద్దర రావడంలేదు" అన్నాడు కిరీటి.

ఏదో చిలిపిప్రశ్న వెయ్యాలని నోటివాకావచ్చీ కూడా ఆగిపోయింది మాధురి. కాస్సేపు ఉండి "మీరింకా చదివారంటే లైటార్పేస్తానంతే" అంది బెదిరిస్తూ. వెంటనే కిరీటి కంగారుగా "ఆ పనిమాత్రం చెయ్యకండి మీకు పుణ్యం ఉంటుంది. నా కసలే చీకటి అంటే భయం" అన్నాడు.

శబ్దం రాకుండా నవ్వుకుంది మాధురి.

"మరయితే కళ్ళజోడు తీసేసి నిద్రపొండి "

"పడుకున్నప్పుడు కూడా అప్పుడప్పుడు కళ్ళజోడుతోచే నిద్రపోతానండీ."

వచ్చేనవ్వు ఆపుకొంటూ "ఏం? కలలో ఏవైనా చదవాల్సి వస్తుందనా?" అంది మాధురి

"అని కాదనుకోండి ."

"మారాం చెయ్యక నిద్రపోదురూ" అంటూ చొరవచేసి, చనువుగా దగ్గరికి వచ్చి, వెనకనుంచి సుతారంగా రెండుచేతుల్తోటీ కళ్లజోడు తీసేసింది.

"ఏవండీ ...ఏవండీ!" అంటూ కిరీటిలేచి ఆమెవెనకాల పడ్డాడు

మాధురి కిలకిలా నవ్వుతూ అతణ్ణి మంచంచుట్టూ తిప్పి, ఆ వరండాలో ఉన్న స్తంభాలన్నింటికీ ప్రదక్షిణం చేయించి, చిక్కినట్లే చిక్కి తప్పించుకుంటూ, పేరాపెట్ వాల్ ని ఆనుకొని కిందికి వీధిలోకి ఆ కళ్ళజోడుని జారవిడవబోయింది. కిరీటి గాభరా పడిపోతూ, ఆమె మీదుగా పేరాపెట్‌వాల్ పైకివంగి, ఆమె చేతిలో స్పెట్స్‌ని లాక్కో బోయాడు. ఎవరేనా చూస్తే మాధురిని కిరీటి కౌగలించుకోబోతున్నట్లుంది ఆ దృశ్యం. సరిగ్గా ఆ సమయంలో, ఆవీధిలోకి టర్న్ తిరిగిన టాక్సీ తాలూకు హెడ్‌లైట్ల కాంతి, మేడపైకి వాళ్లిద్దరి మీదకి, ఫోకస్ అయింది.

హఠాత్తుగా మీదపడిన ఆ వెలుగుకి, కిరీటి మాధురీ ఇద్దరూ అప్రతిభులై ఆ మట్టునే నిలబడిపోయారు.

టాక్సీ వాళ్లింటిముందే ఆగడం, అందులోంచి జగత్పతిరావూ, మెడనుంచి పిక్కలదాకా పెద్ద కాశ్మీరు శాలువా కప్పుకున్న మరో గెడ్డపాయనా దిగడం, దిగుతూనే

జగత్పతిరావు గుడ్లురిమి పైకిచూసి, టాక్సీడ్రైవరుకి డబ్బిచ్చి పంపించేసి నౌఖరు తలుపు తెరిచీ తెరవడంతోనే విసురుగా మేడమీదకి వచ్చేయ్యడం ఇవన్నీ ఒక్కక్షణంలో జరిగి పోయాయి. రావు వెనకాలే గెడ్డం ఉన్న ఆ స్వామీజీ కూడా మేడమీద వరండాలోకి వచ్చేసి క్రీనీడలో నిలబడ్డారు.

గుడ్లప్పగించి తెల్లబోయి చూస్తున్న కిరీటినీ మాధురినీ గుడ్లురిమి చూశాడు జగత్పతిరావు.

అతని కళ్ళు ఖణఖణలాడుతున్నాయి.

పెదిమలు కోపంతో వణుకుతున్నాయి.

ఆవేశంతో ఊగిపోతున్నాడు

"యూః .. గెటవుట్!!" మృత్యువులా అరిచాడు. ఆ కేకకి కిరీటి గుండె ఆగి నట్లయింది. చేతిలోవున్న కళ్ళజోడు నేలమీద పడిపోయింది.

"డాడీ!" అంటూ మాధురి వచ్చి రావుని అల్లుకోబోయింది. రావు ఆమెని పక్కకితోసేసి కిరీటివేపు తిరిగి "ఊఁ వెళ్ళిపో ఇక్కడనుంచి, లేకపోతే ." పళ్ళు పటపటా కొరికాడు.

"అ ది కా దండీ" కిరీటి మాటలు గొంతులోనే ఉండిపోయాయి.

"కిరీటీ!" బిల్డింగ్ అంతా మారుమ్రోగింది ఆ కేకకి.

నేలమీదకి వంగికళ్ళజోడు తీసుకుని నెమ్మదిగా అడుగులువేస్తూ బయలుదేరాడు కిరీటి.

"చీకట్లో ఆయన ఒక్కరూ వెళ్ళలేరు డాడి " దాదాపు ఏడుస్తూ అరిచింది మాధురి.

జగత్పతిరావు ఏం మాట్లాడలేదు.

"ఈ అర్ధరాత్రివేళ నిర్దాక్షిణ్యంగా ఆయన్ని పంపించేస్తే నేను ఊరుకోను" పిచ్చి ఆవేశంతో అరిచింది మాధురి.

"మాధురీ!"

మాధురి భయపడి వెనక్కి తగ్గింది.

స్తంభానికి ఆనుకొని నిర్జీవంగా నిలబడిపోయింది.

"ఊఁ ." గద్దించాడు జగత్పతిరావు కిరీటిని.

క్రీనీడలో నిల్చుని ఉన్న బావాజీ యేదో చెప్పబోయాడు. ఆవేశంతో ఊగి పోతూన్న జగత్పతిరావు ఇప్పుడు యెవరి మాటనీ వినిపించుకొనే స్థితిలోలేడు. కిరీటిని కళ్ళతో దహించివేస్తూ నిలబడ్డాడు.

ఓ పక్క భయంకరమైన జగత్పతిరావు కోపాన్ని చూసి ఒళ్ళంతా వణికి పోతూంటే, మరో ప్రక్క 'గెటవుట్' అన్నమాట అనిపించుకున్నందుకు పౌరుషంతో మనస్సు మండిపోతూంటే, అవమానంతోనూ కోపంతోనూ హృదయం అంతా క్రుంగి

పోతూంటే, తన స్థితి తనకే అర్థంకాని ఒక అయోమయ స్థితిలో అచేతనంగా ఒక్క-క్షణం ఉండి పోయాడు కిరీటి.

ఆ తర్వాత దీర్ఘంగా శ్వాసవదిలి, భారంగా అడుగులు వేసుకుంటూ అక్కడ నుంచి కదిలాడు.

తలవంచుకొని అలా చీకట్లో వెళ్ళిపోతూన్న కిరీటిని చూసేసరికి, మాధురికి ఆపుకోలేనంత దుఃఖం వచ్చింది. తన నిస్సహాయ స్థితికి తనమీద తనకే కోపంవచ్చి మౌనంగా ఏడుస్తూ ఆ మట్టునే కూలబడి పోయింది.

పౌరుషం, కోపం, అవమానం, వీటితో ఒళ్లు తెలియకుండా, ఏదో ఒక పిచ్చి తెగింపుతో, చీకటి అనే సంగతే మరిచిపోయి, అంధకారాన్ని చీల్చుకుంటూ తన రూం వైపు వెళ్లిపోయాడు కిరీటి.

గుండెలు అవిసేలా మాధురి యేడుస్తూనే ఉంది.

జ్వాలల్లా మండుతూన్న ఆలోచనలతో జగత్పతిరావు ఆ మట్టుని నిలబడే ఉన్నాడు.

ఏమీతోచక జావాజీ ఆ వరండాలో అటూ ఇటూ పచార్లు చేస్తూనే ఉన్నాడు.

దీపాలు వెలుగుతూనే ఉన్నాయి.

తెల్లవారింది! పాపం. కిరీటి ఒక్కడూ ఆరాత్రి రూంకి యెలా చేరుకున్నాడో. ఏమో పిచట్లో!

## 8

"తనతో తీసికెళ్తే తీసి కెళ్ళాల్సిందే తప్ప ఇంకెవ్వరితోటీ యెక్కడికీ పంపించడే మావయ్య!" ఇలా మనస్సులో అనుకున్నాను అనుకొంది రాణీ కాని పక్క-పక్కనే నడుస్తూన్న వీర్రాజు పకపకా నవ్వి "మరయితే ఇవాళ నాతో యెందుకు పంపించినట్టు?" అంటూ నవ్వుతూ తన కళ్ళల్లోకి చూసేసరికి అర్థమైంది రాణీకి, తను ఆ మాటలు పైకే అన్నాను అన్న సంగతి. నాలిక కరుచుకుంది. వీర్రాజు ముఖంలోకి చూడలేకపోయింది. రాణీ సిగ్గుమాసేసరికి వీర్రాజుకి ముచ్చటేసింది. "ఎంత ముద్దరాలు! ఇటువంటి అమాయకురాలినా తను వేషం మార్చి మోసం చేస్తూన్నది? తను నిజంగా తెలుగు యెమ్మే చదవడం లేదనీ, ఆటో రిక్షా నడుపుకుంటూ పొట్ట పోషించుకుంటూన్న ఒక దురదృష్టవంతుడిని అనీ చెప్పేస్తే? "

"ఏమండీ "-ఎంతో ఆప్యాయతతో వీణలా పలికిన రాణీ కంఠం వినేసరికి ముగ్ధుడయిపోయాడు వీర్రాజు. తనలో ఉవ్వెత్తుగా లేచిన సంతోష తరంగాల్ని అదుపులో పెట్టుకుంటూ, "అలా ఆడవాళ్ళు యెవర్ని పిలుస్తారో తెలుసా?" అన్నాడు నవ్వుతూ.

వెంటనే రాణీ ముఖంలో రంగులు మారాయి. గులాబీలు విరిసినట్లు అప్పటి

దాకా అందంగా కనిపించిన ఆ చెక్కిళ్లు, కోపంతో యెఱ్ఱబారాయి. కళ్లు పెద్దవిచేసి వీర్రాజు కేసి కోపంగా చూసింది.

ఇంతలో ఈ మార్పేమిటి, ఈ కాళికా రూపం ఏవిటి. చెప్మా అని గాభరాపడి పోయాడు వీర్రాజు. వెంటనే తడబడుతూ "అంటే . నా అభిప్రాయం యేమిటంటే." అంటూ నీళ్లు నమలసాగాడు.

"ఇదిగో చూడబ్బాయ్ చనువుగా ఉంటున్నానని మరోలా అనుకుంటున్నావేమో . నా మనస్సుకి నచ్చాలంటే యెలా ఉండాలో తెల్సా నువ్వు?"

"మళ్లీ ఏ కరువు పెట్టకు మహాతల్లీ! నాకు తెలుసు-అయిదున్నర అడుగుల యెత్తూ, నూట యేభై పౌన్ల బరువూ, ముప్పై ఎ, ముప్పై ఎ అయిదు ఛాతీ-నీకు గామా లాంటి రాక్షసుడు తప్ప నాలాంటి బక్క జీవి ఓ పట్టాన నచ్చడు. అందుకేగా ఈ అవస్థంతా" అనుకున్నాడు వీర్రాజు మనస్సులో.

వీర్రాజు మనస్సులో మాటవింది కాబోలు, తనకి నచ్చే వరుడియొక్క వివరాలు మళ్ళీ చెప్పడం మొదలెట్టలేదు రాణి. కాని మౌనంగా తలవంచుకొని నిలబడిఉన్న వీర్రాజుకేసి చూస్తూ ఉండిపోయింది.

"తను తొందరపడి అనేసిన మాటలకి ఏమనుకున్నాడో! పాపం బాధపడుతున్నాడో ఏమో-నిజమే మరి పాతికేళ్లు వచ్చిన యువకుణ్ణి పట్టుకుని మొహంమీద "ఇదిగో చూడబ్బాయ్' అంటూ చంటికుఱ్ఱాణ్ణి విదిలించి పారేసినట్లు పారేస్తే ఎవరేనా చిన్నబుచ్చుకుంటారు. అందులో అలా అవమానించిన వ్యక్తి పద్దెనిమిది ఇరవై యేళ్ళ అమ్మాయి అయితే మరీను. తను నిజంగానే తొందరపడింది, కోపంతో అనేసింది. నిజానికి తనకి కోపం రావలసినంత మాట అతడేం అన్నాడని? 'ఏవండీ!' అని ఆడది ఎవర్ని పిలుస్తుందో తెలుసా? అన్నాడు. ఆ మాత్రానికే తను వళ్ళంతా చేసేసుకొని శివం ఎక్కిపోవాలా!—తన చేత అలా పిలిపించుకొనే వ్యక్తి రావాలనీ. త్వరలో వస్తాడనీ తనూ అనుకుంటోందిగా? ఎంత గాఢంగా ఎదురుచూస్తోంది కూడా! తను మనస్సులో అనుకున్న మాటనే ఇతను పైకి అన్నాడు. అందులో తప్పేం ఉంది?

ఇలా తనలో తను వితర్కించుకొనేసరికి రాణికి వీర్రాజుమీద తాత్కాలికంగా వచ్చిన కోపం, గాలి వేసిన మేఘంలా ఎక్కడి దక్కడ చెల్లాచెదరై పోయింది. తిరిగి ముఖం ప్రసన్నంగా తేటగా హాయిగా మారిపోయింది. పెదవులమీద చిరునవ్వు, చోటు చేసుకుంది. అలా నవ్వుతూనే వీర్రాజుకేసి చూసింది రాణి. వీర్రాజు ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు. తన మాటలవల్ల అతని మనస్సు గాయం అయిందో ఏమో-అతను ఇంకా బాధపడుతున్నాడు కాబోలు. రాణి ఇంక ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా "ఏవండీ. అయిందేదో అయింది. ఇంక దానిగురించి మరిచిపోండి" అంటూ జాలిగా వీర్రాజువైపు చూసింది. వీర్రాజు దీర్ఘంగా నిట్టూర్చాడు. "మీరింకా మనస్సులో మథనపడుతున్నారు. నామీద కోపం వచ్చిందా?" అంది బేలగా.

వీర్రాజు తల అడ్డంగా ఊపి "నా మాట అలా ఉంచు, అసలు సంగతి తెలిస్తే నామీద కోపం వస్తుంది" అన్నాడు తప్పుచేసినవాడిలా తలవంచుకుంటూ. వినయంగా, పెద్దమనిషిలా ప్రవర్తిస్తూన్న వీర్రాజుని చూసేసరికి రాణీకి అతనంటె ఎంతో గౌరవం ఏర్పడింది. తను అనవసరంగా అతని మనస్సు నొప్పించినందుకు బాధపడింది. మనిషి చాలా మంచివాడు. మర్యాదస్తుడు. తమాషాగా సరదాగా మాట్లాడతాడు. అన్నీ బాగానే ఉన్నాయి. కానయితే మనిషి బాగా పొట్టి, సన్నం. లేకపోతే మావయ్య కోరిక ప్రకారం ఇతణ్ణి పెళ్ళిచేసుకోడానికి తనకి అభ్యంతరం ఏమిటి? వీర్రాజుని చూసిన కొలదీ అతనిమీద అభిమానం పెరగసాగింది రాణీకి.

"నా అసలు సంగతి తెలిస్తే నీకు కోపం వస్తుందా?" మళ్ళీ అడిగాడు వీర్రాజు.

"అలా ఎందుకు అనుకోవడం మీరు? రాదు. ఒక్కనాటికి రాదు" అంది రాణీ, వీర్రాజు మంచితనాన్ని మనస్సులో మననం చేసుకుంటూ.

"నాపేరు ఏవిటనుకుంటున్నావు?"

"కి. రీ—టి!"

"కాకపోతే?"

"కాకపోతే కృష్ణుడు, రాముడు, సుబ్బారావు, సూర్యం, ఎవ్వైతేనేం? కావలసింది మనిషికాని, పేరు కాదుగా?"

'హమ్మయ్య!' అనుకున్నాడు వీర్రాజు. రాణీ మాటలతో అతని మనస్సు కొంత తేలికపడింది.

"నేను ఏం చదువుకుంటున్నానని నీ అభిప్రాయం?"

"తెలుగు ఎం. ఏ. అని మీరేగా చెప్పారు?"

"అది కాదనుకో. అప్పుడు?"

"అయితే ఏం? ఏదో ఒక చదువు. అంతా ఆ తెలుగు ఎం. ఏ యే చదవాలని ఏం ఉంది? మా మావయ్యలాంటి వాళ్ళ కెవరికేనా ఉంటే ఉండొచ్చు ఆ చాదస్తం."

'సరే.' తృప్తిగా నిట్టూర్చాడు వీర్రాజు.

"నేను ప్రస్తుతం చదువు మానేశాను."

"ఆ!" అన్నట్లు ఆశ్చర్యంగా చూసింది రాణి "అంతేకాదు. రోజు గడవక ఆటోరిక్షా నడుపుతున్నాను."

"ఆ టో. రి. క్షా!"—రాణీకి చటుక్కున జ్ఞాపకం వచ్చింది. అవును ఇతణ్ణి ఎక్కడో చూసిన జ్ఞాపకం అనుకుంటోంది ఇన్నాళ్ళూ. తనకి ఆటోరిక్షా కట్టాడు కమా రెండు మూడు సార్లు! అతనా ఇతను? ఆ గళ్ళ రుమాలూ, ఎగదువ్వేడు క్రాపూ, కాకిబట్టలూ ఏవయ్యాయి? ఈ పంచే, లాల్చీ, పక్క పాపిడి ఇదంతా ఏవిటి? ఈ వేషం ఎందుకు వేసినట్టు? ఇన్ని అబద్ధాలు ఎందుకు ఆడినట్టు? మావయ్యా, మావయ్యతోపాటు, తనూకూడా ఇతను యూనివర్సిటీలో చదువుకుంటూన్న తెలుగు ఎం. ఏ. అనుకున్నారు

కాని ఇలా ఆటోరిక్షా తొక్కే వాడు అనుకోలేదే! ఎందుకు చేసినట్లు ఈ మోసం ఇతను-?
రాణీ ఏక ఆలోచిస్తూ వీర్రాజుకేసి చూస్తూ వుండిపోయింది.

"అబద్ధాలు చెప్పి మోసం చేశానని కోపంకదూ?" ప్రాధేయపూర్వకంగా అన్నాడు వీర్రాజు.

రాణీ తడబడుతూ "అబ్బెబ్బె అదేంలేదు" అంది. మరెందుకలా మౌనంగా వుండిపోయావు?'' అన్నాడు వీర్రాజు.

"ఆహా . మీరెంత తమాషా అయిన మనిషా? ఎంత చిత్రంగా వేషం మార్చి నమ్మించారా అని ఆశ్చర్యంగా చూస్తున్నాను'' అంది రాణీ.

"నిజంగా? అయితే నీకు నామీద కోపం లేదన్నమాట! థేంక్సు అయితే అలా వెళదాం వస్తావా? గేరేజీలోంచి బండితీసి, నిన్ను ఎక్కించి టేంక్‌బండ్‌మీదుగా అలా అలా తిప్పి తీసుకువస్తాను ఏం?''

రాణీ ఏం మాట్లాడలేదు.

"నాతో రావడానికి సంశయిస్తున్నావా? వీడు అబద్ధాలకోరు. వేషాలు మార్చే రకం. ఏం మోసం చేస్తాడో ఏమో అని తటపటాయిస్తున్నావు అవునా?''

"ఉహూ అబ్బే . కాదు ...అదేంకాదు.'' దాంతో ఇంక ఆమెకి అవకాశం ఇవ్వకుండా "అయితే రా వెళదాం'' అంటూ రాణీని తీసుకుని మరికొంతదూరం నడిచి, తన షావుకారు దగ్గర బండి తీసుకుని, ఆ ఆటోరిక్షాలో రాణీని కూర్చోపెట్టి టాంక్ బండ్ వేపు పోనిచ్చాడు వీర్రాజు .....

ఆటోరిక్షా వీర్రాజుతోపాటు దిగి, అటూ ఇటూ అడుగులు వేస్తూన్న రాణీ శరీరాన్ని హాయిగా నిమురుతోంది, చల్లనిగాలి-

వీర్రాజు మాటలు నవ్వు తెప్పిస్తూ మనస్సుని గిలిగింతలు పెడుతున్నాయి.

హృదయం సుఖంగా తేలిగ్గా ఏ స్వర్గాలవైపో దూదిపింజలా మెత్తగా తేలిపోతోంది.

రాణీకి ఈ విచిత్రమైన అనుభూతి ఆనందంగా, హాయిగా, ఉన్నా, 'ఇతని శరీరం ఇంకా దృఢంగా బలంగా ఎత్తుగా ఉండి, తను కోరుకున్న రీతిగా ఉంటే ఎంత బాగుండేది?' అనే ఆలోచనవచ్చి, ఉండుండి మనస్సంతా వికలం కాసాగింది. ఈ తెలివితేటలకీ, గడుసుదనానికీ మంచితనానికీ తోడు, మనిషి ఆకారంకూడా బాగా ఉంటేనా?... తియ్యగా ఆలోచించసాగింది రాణీ. వీర్రాజు యేదో చెప్పుకొని పోతూంటే పరధ్యానంగా ఊకొడుతోందే కాని, ఆమె ఆలోచనలన్నీ, వీర్రాజు చుట్టూనే తిరుగుతున్నాయి.

మాటల మధ్యలో వీర్రాజు వేసిన ప్రశ్నలకి రాణీ సమాధానం చెప్పక తబ్బిబ్బు పడడంతో, ఆమె దృష్టి ఎటో వుందని కనిపెట్టాడు అతను. కనిపెట్టి "యేమిటి ఆలోచిస్తున్నావు?'' అన్నాడు. కనురెప్పవాల్చకుండా అతనికేసి చూస్తూ "అదికాదు .. భగవంతుడు మీకే అందమైన శరీరాన్ని ఇస్తేనా. అంటూ వాక్యం పూర్తి చెయ్యబోయి. వెంటనే, తను పరధ్యానంగా అనబోయిన మాటకి సిగ్గుపడి, అంతటితో ఆగి

పోయింది రాణీ.

వాక్యం పూర్తి చెయ్యకపోయినా ఆమె భావం అర్థం అయిపోయింది వీర్రాజుకి. రాణీ మనస్సులో గాఢంగా నాటుకుపోయిన ఆ అభిప్రాయాన్ని ఎలాగైనా పోగొట్టా లనుకున్నాడు. అనుకొని, వాచీ చూసుకున్నాడు అయిదున్నర కావస్తోంది.

ఈ పాటికి శేఖర్ పబ్లిక్ గార్డెన్స్‌కి వస్తూ వుంటాడు!

''తాలింఖానాకి వెళదామా? అక్కడ మంచి మంచి వస్తాదులూ, గామాలూ, కుస్తీపడుతూ వుంటారు. నీకు అలాంటి వాళ్ళని చూడాలని మహ సరదా అనుకుంటాను. యేం? వెళదామా?''

రాణీ సమాధానం చెప్పలేదు.

''రా-కూచో-రిక్షాలో'' అన్నాడు వీర్రాజు.

ఆటోరిక్షా శక్రటరియేట్‌నుంచి అడ్డంగా రవీంద్ర భారతివైపు రాసాగింది. డౌన్ దిగుతూండగా అనుకొన్న ప్రకారం శేఖర్ కనిపించాడు. తెల్లకేన్వాస్ బూటూ, బనీనూ నిక్కరూ వేసుకుని, చేతిలో రేకెట్ తరవాయిగా టెన్నీసు ఆటగాడిలా దర్జాగా హుందాగా నడిచివెళుతున్నాడు.

అతణ్ణి చూడగానే వీర్రాజుకి ప్రాణం లేచివచ్చింది.

తను ఊహించిన రూపంలో, బలంగా ఎత్తుగా ఉన్న ఆ యువకుణ్ణి చూసేసరికి, రాణికీ ప్రాణం లేచివచ్చే వుండాలి. లేకపోతే రోడ్డు దాటుతూన్న శేఖర్‌మీదకి, ఆటో రిక్షా వేగంతో ఉరికినప్పుడు. అంతకంగారుగా కెవ్వుమని ఎందుకు అరుస్తుంది?

వీర్రాజు సడన్‌బ్రేక్ వేసి, ఆటో రిక్షా పక్కకితీసి. దిగడం, శేఖర్ తనమీదకి విసురుగా ఆటోరిక్షాని నడపబోయిన వాడెవడా అని కోపంతో వెనక్కి తిరిగి చూడడం రెండూ ఒక్కక్షణంలోనే జరిగిపోయాయి. వీర్రాజుని చూస్తూనే సంతోషంతో శేఖర్ అరవబోయాడు. వెంటనే వీర్రాజు కళ్ళతో సంజ్ఞచేసి ''ఏమయ్యా? అలా ఇష్టంవచ్చి నట్లు రోడ్డుక్రాస్ చేస్తే ఎలా? ఇంకొంచెం ఉంటే ఆటోరిక్షా కిందపడివచ్చి ఉందువు'' అన్నాడు దురుసుగా.

వీర్రాజు చేసిన సంజ్ఞని అర్థంచేసుకుని శేఖర్ మరింత కోపంతో ''ఆటో రిక్షా తగలవలసింది చెబుదును'' అన్నాడు.

''ఏవిటయ్యా నువ్వుచెప్పేది?'' అంటూ మీదమీదకి వెళ్లాడు వీర్రాజు.

''అలా మీదమీదకివస్తే జాగ్రత్త!''

''ఏం చేస్తావేం?''

''ఏం చేస్తానా? . రెండుచేతుల్తోటీ నిన్నూ నీ రిక్షానీ కలిపి ఎత్తి అవతల పడేస్తాను.''

రాణీ అతని మాటల్ని కుతూహలంగా వినసాగింది. 'మగాడంటే అలా బలంగా ధైర్యంగా ఉండాలి. నిజంగా అతను అన్నంతపనీ చేసినా చేస్తాడు' అనుకొంది. విశాల మైన శేఖర్ ఛాతీనీ, బలమైన అతని బుజాల్నీ రెప్పవాల్చకుండా చూస్తూ.

"ఏమిటీ? పడేస్తావా? ముందు నిన్ను నేనే పడేస్తాను చూడు" అంటూ శేఖర్‌ని ఒక్కతోపు తోశాడు వీర్రాజు. తూలి పడబోయిన శేఖర్‌ని చూసి ఆశ్చర్యపోయింది రాణీ. "పైకి సన్నంగా ఉన్నా కిరీటి బలమైనవాడనే!" అనుకొంది. పడకుండా నిల (ద్రొక్కుకొని) శేఖర్ ముందుకి అడుగేశాడు.

ఇద్దరూ కాస్సేపు ఒకళ్ళ నొకళ్ళు తోసుకున్నారు. చుట్టూజనం పోగయ్యేసరికి. శేఖర్ చేతులు రెండూ వెనక్కి విరిచి పట్టుకుని "లావుగా బలంగా ఎత్తుగా ఉన్నాం కదా అని ఎగిరావంటే జాగ్రత్త! నీకంటే రెట్టింపు బలమైన వాళ్లని తన్ని తరిమేస్తాను ఏమనుకున్నావో-ఊరికే మాంసం కండా కాదు . ఎముకబలం ఉండాలి-తెలిసిందా ఎముక బలం! నాతో ఆట్టే గొడవపెట్టుకోక పో ఊ .పొమ్మంటూంటే!" అంటూ ఒక్క అదలింపు అదిలించి వదిలాడు వీర్రాజు. అతని రెండు చేతులూ-శేఖర్ మారుమాట్లాడకుండా తలవంచుకొని వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. వీర్రాజు చేసిన సంజ్ఞని అర్థం చేసుకుని.

"ఏమైంది అసలు?" అంటూ చుట్టూ మూగిన జనం వీర్రాజుని అడిగారు.

"ఆ ఏదో అయింది పోనిద్దురూ ." అంటూ చేతులు దులుపుకొని, నిర్లక్ష్యంగా ఆటో రిక్షా ఎక్కి స్టార్ట్‌చేశాడు వీర్రాజు.

కళ్ళు ఇంత లేసిచేసి వీర్రాజుని ఆశ్చర్యంగా చూసింది రాణీ. ఆమె కళ్ళకి అతను ఒక వీరాధివీరుడులాగో, శాపగ్రస్తుడై పొట్టిగా సన్నని రూపంలో తిరిగి జన్మించిన ఏ భీమసేనుడులాగో కన్పించాడు. నిజమే. ఈయన అన్నట్లు ఎముక బలం ఉండాలి కాని ఊరికే లావుగా ఉంటే ఏం లాభం? ఇన్నాళ్ళూ తను యెంతో తప్పుగా ఊహించింది. బలంగా. గామాలా ఉన్నవాడే మనిషిలా కనిపించేవాడు తనకి ఇప్పటివరకూ, ఇప్పుడర్థం అయింది మనిషి రూపానికీ బలానికీ సంబంధంలేదని-ఇందాకటి వ్యక్తి యెంత బలంగా ఉన్నాడు! అయితే ఏం లాభం?

"దిగు" అని వీర్రాజు అనడంతో, రాణీ తన ఆలోచనలకి స్వస్తి చెప్పి, ఆటో రిక్షా దిగుతూ "ఏమిటి యిక్కడికి తీసుకువచ్చారు? తాలింఖానాకి వెళదాం అన్నారు కదూ?" అంది. ఎదురుగుండా ఉన్న అందమైన మొక్కల్నీ అల్లిబిల్లిగా అల్లుకున్న పొదరిండ్లనీ చూస్తూ.

ఆటోరిక్షాని పక్కని ఆపి, ఆమెకేసి చిలిపిగా చూసి, "ఆ .. ఆ . .ఇదోరకం తాలింఖానాలే! ఇక్కడ కుస్తీపట్టే ఇసుక స్థలాలు కావు, కులాసాగా కబుర్లు చెప్పుకొనే చక్కని 'లాన్స్' ఉంటాయి. దండేరో బస్కీలూ తీసే హారిజాంటల్ బార్స్ కనిపించవు. దర్జాగా కూర్చుని కబుర్లు చెప్పుకొనే సిమెంటు బెంచీలు దర్శనమిస్తాయి. ఈ తాలింఖానాలో మనుష్యులు చెడుగుడు ఆడరు, చక్కగా చెట్టపట్టాలు వేసుకొని ఆడా మగా ఇంచక్కా తిరుగుతూ ఉంటారు" అన్నాడు వీర్రాజు,

"అవునవును ...ఇక్కడ ఆంజనేయ విగ్రహాలుండవు....మీలాంటి వీరాంజనేయులు గస్తీ తిరుగుతూ ఉంటారు" అంది రాణీ వచ్చే నవ్వు ఆపుకొంటూ.

"కరెక్ట్! ఓ మాటు అంజనేయులు ఏం చేశాడో తెల్సా?"

"ఏం చేశాడేం?"-కనురెప్ప లాడిస్తూ తమాషాగా చూపింది రాణీ. "నీలాంటి సంజీవిని అమాంతం ఎత్తుకుని .."

"చాలు చాలు అంతటితో ఆపండి ...మీ ప్రత్యక్ష రామాయణాన్ని ఎవరైనా చూశారంటే సిగ్గు చేటు."

"చూస్తారనా నీ భయం? లేకపోతే అభ్యంతరం లేదన్నమాట!"

రాణీకి నవ్వు వచ్చింది. కాని వెంటనే కోపంగా ముఖంపెట్టి "మరీ చిలిపిగా మాట్లాడకండి. ఇంతవరకూ పెద్దమనిషికదా ఎందుకెందుకని ఊరుకున్నాను. ఇదే మరొకరైతేనా?" అంది.

"ఊ మరొకరైతే? ఏం చేసి ఉందువు?"

"ఏం చేద్దునా? ఏం చేద్దునంటే...రెండు దవడలమీదా మెత్తగా నాలుగంటించి ఉందును."

"అయితే-ప్లీజ్ .దయఉంచి నన్ను మరొకడిలా చూద్దూ" అంటూ వీర్రాజు దగ్గరగావచ్చి, తన రెండు చెంపలూ ఆమె చేతులదగ్గరగా వచ్చేలా ఒంగున్నాడు.

పంటితో కింది పెదవి నొక్కి, వచ్చేనవ్వుని ఆపుకొంటూ "మీరిలా అల్లరిచేస్తే నేను వెళ్ళిపోతానంతే" అది రాణీ బుంగ మూతి పెట్టి.

"హమ్మమ్మ .ఆ పని మాత్రం చెయ్యకు. నీకు పుణ్యం ఉంటుంది" అంటూ లేచి మామూలుగా నిలబడ్డాడు వీర్రాజు.

"మరైతే అలా బెంచీమీద కూర్చుందాం నడవండి."

"ఇక్కడా? .నలుగురూ నడిచే ఈ చోటులోనా? అబ్బెబ్బె . లాభంలేదు."

"ఏం?"

"ఇక్కడ కూచుంటే నే నేదో చిలిపిమాట అనకా మానను. నువ్వు చేత్తో నా చెంపని సర్దకా మానవు. దాంతో దారిన పోయేవాళ్ళు అంతే మహ ముచ్చట పడిపోయి, "మా చెంపలుకూడా కాస్త సర్దండి ప్లీజ్!" అంటూ పెద్ద క్యూలో వచ్చి నిలబడి పోతారు, నీ ఆటోగ్రాఫ్ కోసం. నీకు చెడ్డ ఇబ్బంది అయిపోతుంది .. ఎందుకొచ్చింది దంతా! హాయిగా గుబురుగావున్న ఆ పొద దగ్గర కెళ్ళి కూచుందాం పద."

"అక్కడికా? ...ఆ మూలకి నేను రాను."


"ఏం? నేను కొంటెగా ప్రవర్తిస్తానని భయమా? నిన్ను తాకకుండా దూరంగా కూచుంటాను. సరా?"

రాణీ కోపంగా చూపింది. (సశేషం)

---

Edited and Published by V. Leelavathy Raghavaiah, 7-A, Sivaji Street, Madras-600 017 and Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600 001.

జ్యోతి నవలానుబంధం



# (మూడవ భాగము)

"అలా కోపంగా చూడకు. పోనీ దూరంగా కూచోనులే"

"ఏయ్!" అంటూ రాణీ ఒక్కటి వెయ్యిబోయింది.

వీర్రాజయితే తెలివిగా తప్పుకున్నాడు. కాని ఆ దెబ్బమాత్రం వచ్చి, "వేరు శెనక్కాయలు కావాలా?" అంటూ అప్పుడే వాళ్ళ మధ్యకి వస్తూన్న ఓ పన్నెండేళ్ళ కుర్రాడికి తగిలింది దాంతో వాడి జంగిడిలో కాయలు ఇటూ అటూ చెల్లాచెదరై పోవడం, వాడు బిక్కమొహంతో రాణీకేసి చూడడం, అనుకోకుండా జరిగిన ఆ పొరబాటుకి రాణీ బాధపడడం "ఏం జరిగిందా?" అని వీర్రాజు విస్తుపోవడం, అన్నీ ఒక్కసారిగా జరిగిపోయాయి

వీర్రాజు కంగారుగా క్రిందపడిన కాయలన్నీ ఏరి వాడి జంగిడిలో పోసేసి తనో పావలా కాయలు వాడిదగ్గర కొని, వాడిని బుజ్జగించి పంపించాడు.

"పొరబాటయింది" అన్నట్లు రాణీ వీర్రాజుకేసి చూసింది.

"నువ్వు కొడితే, ప్రేమించిన నేరానికి కిరీటి అనబడే ఈ వీర్రాజు పడతాడు కాని, వీధినిపోయే వాళ్ళందరూ పడతారా మరి?"

బేలగా చూసింది రాణీ

"ఇంతటితో కాలేదు జనాన్ని తీసుకువస్తాడిప్పుడు. వాళ్ళకి నువ్వు సంజాయిషీ ఇవ్వాలి వాడిని ఎందుకు కొట్టావో అడుగుతారు."

"నిజంగా?"

"ఆ! ఇందాకటి పైల్వాన్ ఉన్నా బాగుండిపోను ఇప్పుడు నిన్ను రక్షించి వుండును"

"మీరున్నారు కదా?"

"నేనేం చెయ్యగలను అంతమంది వస్తే, బక్కవాడిని."

"అలా అనకండి. ఇప్పుడు తెలిసిందిగా? మీరు ఎంతమందినైనా ఎదిరించ గలరు."

"నేనేం గామానా, పైల్వానునా? అధమం నూటఏభై పౌన్లేనా లేనే? ఎత్తు కూడా అయిదడుగులకి తక్కువే. పోనీ ఛాతీ చూద్దాం అంటే ." వీర్రాజు మాట మధ్యలో ఆగిపోయాడు ఆమె కన్నీళ్ళు చూసి. 'ఎందుకు నన్నిలా ఏడిపిస్తారు?' అన్నట్లున్నాయి ఆమె చూపులు

మరి ఆమెని ఏడిపించ కూడదనుకున్నాడో ఏమో, "సరే అయితే- నేను వెళ్ళి వాళ్ళని సర్ది వస్తాను. అందాకా నువ్వు ఎక్కడ వుంటావు? వాళ్ళ కంటికి కనిపించ కుండా ఎక్కడేనా దాక్కుంటే మంచిది. ఆ పొదరింట్లో అయితే బాగుంటుంది. కాని నువ్వు వెళ్ళనంటున్నావుకదా అక్కడికి?" అన్నాడు వీర్రాజు

"వెళతాను."

"అయితే నడు" అని ఆమెని తీసికెళ్ళి గుబురుగా వున్న పొదకింద కూర్చో బెట్టి, తను పదినిముషాలు అటూ ఇటూ తిరిగివచ్చాడు. రేగిపోయిన జుట్టుతోనూ నలిగి పోయిన బట్టలతోను. అతని రూపాన్ని చూసి రాణీ వణికిపోసాగింది. "ఏమిటలా వణికిపోతున్నావు?" అన్నాడు ఆమెని దగ్గరగా తీసుకుంటూ వీర్రాజు.

"మీకేం దెబ్బలు తగలలేదు కదా?" అతని వళ్ళంతా నిమురుతూ అడిగింది రాణీ.

"తగిలినా ఫరవాలేదు. తర్వాత ఇలాంటి హస్తస్పర్శ లభించే మాటయితే" అన్నాడు అరమోడ్పు కన్నులతో తన్మయత్వంలో తేలిపోతూ. రాణీ సిగ్గుపడి చేతులు అతనిమీంచి తీసేసి దూరంగా జరగబోయింది.

"వద్దు రాణీ-ఇలాగే వుండిపో" అంటూ ఆమెని మరింత దగ్గిరగా తీసుకున్నాడు వీర్రాజు ఎంతో తమకంతో.

అతని కౌగిలిలో కరిగిపోతూ, మాటలకందని మధురానుభూతిలో తేలిపోతూ, అపురూపమైన ఆనందంలో మునిగిపోతూ, రాణీ ఏంతసేపు ఉండిపోయిందో అలా.

చుట్టూ ముసురుకుంటున్న చీకట్లు చూసి ఉలిక్కిపడి "అమ్మో ఎంత ఆలస్యం ఆయిపోయిందో మావయ్య తిడతాడు" అంటూ లేచింది రాణీ-వీర్రాజు కూడా లేచి, రాణీని కొంతదూరం ఆటోరిక్షాలో తీసుకువచ్చి, ఆటోని, యజమాని గేరేజీలో వుంచి, బయలుదేరినప్పటిలాగే తిరిగి నడిపించి తీసుకువచ్చాడు ఇంటికి. అంత ఆలశ్యంగా వచ్చినా రాణీ అనుకున్నట్లు రవణయ్యేంకేక వెయ్యలేదు వాళ్ళని చూసే చూడనట్లూరుకున్నాడు.

# 9

పారం మధ్యలో, ప్రస్తావన వశాత్తూ ప్రొఫెసర్ చెప్పిన చిత్రమైన న్యూరాలజీ కేసుల గురించి ఆలోచిస్తూ, తలవంచుకొని పరధ్యానంగా కేంటిన్‌వేపు నడిచి వస్తూన్న శేఖర్, వెనకనుంచి ఎవరో తనని పిలిచినట్లు అలికిడి అయి, వెనక్కి తిరిగి చూశాడు.

మాధురి!

పెదిమలమీద మందహాసం చిందిస్తూ, చేతిలోవున్న నోట్‌బుక్‌ని విలాసంగా ఊపుకుంటూ, గబగబా అడుగులు వేసుకుంటూ తనవేపే వస్తోంది ఆమెని చూడగానే శేఖర్ హృదయం, ఆనందంతో నిండిపోయి, వెంటనే ఏదో అర్థంకాని నిరుత్సాహంతో కృంగిపోయింది.

మొట్టమొదట, రేడియో నాటికలో పాల్గొనవలసిందిగా ఆమెని అభ్యర్థించడానికి తనూ కిరీటీ వెళ్ళినపుడు. వాళ్ళ చీడీ మెట్లమీద విద్యుల్లతలా మెరిసినప్పుడే, మాధురి తన ఆలోచనల్లో చోటుచేసుకొంది. ఆ తర్వాత ఆమెతో పరిచయం అయి, రేడియో

నాటిక రిహార్సల్స్ కోసం తరుచు కలుసుకోవడంతో చనువు పెరిగి చిత్రమైన స్నేహంగా రూపొందింది. ఆ స్నేహానికి మమతని జోడించి జీవిత మాధుర్యాన్ని పండించుకోవాలనే కోర్కె, సన్నని మొలకలా గుండెల్లో చిగురించేసరికి, ముందు సంకోచించి తటపటాయించినా, తర్వాత ఆమె నవ్వుతూ మాట్లాడే తీరునీ, ఎరమరికలు లేకుండా ప్రవర్తిస్తున్న పద్ధతినీ చూసి, ఆశల్ని పెంచుకొని ఆత్మీయతని అధికం చేసుకున్నాడు.

కాని ఇంతలో మాధురికి కిరీటిమీద మనస్సు వుందని అనుమానం తగిలింది తనకి. దానికితోడు రేడియోనాటికలో తనప్రక్కన వేసే హీరోగా కిరీటినే ఆమె ఎన్నుకోవడం. ఏదైనా వాదన వచ్చినపుడు విధిగా ఆమె వాడినే సమర్థించడం, ఆఖరికి అతని ఎంగిలినీళ్ళు తాగినప్పుడు కూడా ఆమె ఏం బాధ పడకపోవడం, ఇవన్నీ చూసేసరికి మాధురి, కిరీటిని ప్రేమిస్తోందనే నమ్మకం తనకి బలంగా ఏర్పడింది. ఆ నమ్మకాన్ని పరీక్షించడంకోసమే, తెల్లారితే రేడియో రికార్డింగ్ అనగా, 'వాడిని తీసుకువెళితే తెల్లవారికాని పంపవద్దు అని ఒకమాట అని చూశాడు. ఆమె అలాగే చేసి తన నమ్మకాన్ని నిర్ధారణ చేసింది. అయితే ఓ రాత్రివేళ వాడు రూంకి ఎందుకు తిరిగివచ్చాడో, మర్నాడు రికార్డింగ్ రోజున అటు మాధురీ, ఇటు కిరీటీ కూడా ఎందుకు ముభావంగా వుండి ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోలేదో, తనకి ఈ నాటికి అర్థం కాలేదు ఎన్నిప్రశ్నలు వేసినా కిరీటి సమాధానం చెప్పలేదు. మాధురిని ప్రశ్నించడానికి తనకి అవకాశమే లేకపోయింది వాళ్ళిద్దరి స్నేహంలోనూ కన్పించిన ఈ చిన్న మార్పు మినహా, మరి ఏదో వాళ్ళ ఆత్మీయతని తక్కువగా చూడడానికి కానీ, తన మనస్సులో తలయెత్తిన ప్రేమని పెంచుకోడానికి కానీ, దోహదం చెయ్యలేదు. ఫలితంగా 'మాధురి కిరీటిని ప్రేమిస్తోంది' అనే నమ్మకం బలంగా స్థిరపడింది.

తను ఎంతగానో అభిమానిస్తూ ప్రాణానికి ప్రాణంగా చూసుకుంటూన్న కిరీటిని మాధురి ప్రేమిస్తూన్నప్పుడు, తను ఆమెమీద ఎలా ఆశలు పెంచుకుంటాడు? అందుకే మనస్సులో జనించిన మమతని మనస్సులోనే అణిచేసుకుని పైకి మామూలుగా ఉంటున్నాడు. ఇలా మాధురిపట్ల ఒకవైపు ప్రేమా, మరోవైపు ఉదాసీనత తన గుండెల్లో ఒకదానిపక్క ఒకటి వుంటూనే వుంది ఇన్నాళ్ళ నుంచీను. అందువల్లే, ఆమెని చూసినప్పుడు హృదయం ఆనందంతో పొంగిపోవడం అంతలోనే నిస్పృహతో క్రుంగి పోవడమూను.

"ఏమిటి పరధ్యానంగా వున్నారు?" అంది మాధురి మడిచి చేత్తో పట్టుకున్న స్టెతోస్కోపు కేసి చూస్తూ నిలబడ్డ శేఖర్‌ని పరిశీలిస్తూ.

శేఖర్ ఏం మాట్లాడలేదు.

"క్లాసు అయిపోయిందా? ఇంక వర్క్ లేదా?"

తల అడ్డంగా ఊపాడు శేఖర్.

"వెరీగుడ్. నాకూ గంటదాకా ఇంక క్లాసు లేదు. అలా కేంటీన్‌లోకి వెళ్ళి కాస్సేపు కూర్చుందాం రండి."

శేఖర్ మౌనంగా ఆమె వెనకాలే నడవసాగాడు.

"ఏవిటి అలా ముభావంగా వున్నారు? అయినా మీరీమధ్యన చాలా రిజర్వుడుగా వుంటున్నారు. ఎందువల్ల?"

ఆమె కళ్ళల్లోకి చూసి, "చెప్పమంటావా? చెప్పినా ఏమని చెప్పాలి? నాలో ఆశలు రేకెత్తించి అంతలోనే అణచేశావు కనక ఇలా అయానని చెప్పాలి. చెప్తే ఏం లాభం? నీలో మార్పురాదు. కిరీటిని మాని నువ్వు నన్ను ప్రేమించవు. ఒకవేళ ప్రేమించినా, ఆ ప్రేమ నాకు ఆనందాన్నివ్వదు కిరీటి బాధపడితే నాకు కామా? అందు కని ఇంక ఇది ఇంతే" అనుకున్నాడు శేఖర్ మనస్సులో.

క్లాసులు జరుగుతున్న సమయం కనక కేంటీన్‌లో జనం లేరు. శేఖర్‌తో కలిసి వెళ్ళి ఓ మూల టేబిల్ దగ్గర కూర్చుంది మాధురి. దగ్గరకొచ్చి నిలబడ్డ సర్వర్‌కి రెండు కాఫీ ఆర్డరిచ్చి మళ్ళీ శేఖర్‌కేసి తిరిగింది.

నవ్వుతూ "మీ ఫ్రెండ్ ఎలాగా పెసరపప్పే! మీరుకూడా ఏవిటి ఈ మధ్య ఇలా తయారయ్యారు! ఆయనగాలి సోకలేదు కదా?" అంది.

శేఖర్ నీరసంగా నవ్వాడు

"మొదట్నుంచీ బుద్ధావతారాలయితే ఫరవాలేదు కాని, కొన్నాళ్ళు జోక్స్ వేస్తూ నవ్వుతూ నవ్విస్తూ ఔట్‌పేషెంటు వార్డులాగ సందడిగా వుండే మనుష్యులు, హఠాత్తుగా ఆపరేషన్ థియేటరులా సీరియస్‌గా మారిపోతే మాత్రం కష్టం సుమాండీ చూసే వాళ్ళకి అసలు అంతకంటే ట్రాజెడీ వుండదు"

శేఖర్ నవ్వి "ఆపరేషన్ థియేటర్‌ని కూడా ఔట్‌పేషెంట్ వార్డు చేసెయ్య గలరు మీరు" అన్నాడు

'మీకు పుణ్యం వుంటుం ఆ సర్టిఫికేట్ మాత్రం పడెయ్యకండి రేప్పొద్దున్న ఎవ్వరూ హౌస్‌సర్జన్ ఇవ్వరు నాకు"-మాధురి భయంతో బతిమాలుతున్నట్లు ముఖం పెట్టింది. సర్వర్ తీసుకువచ్చిన కాఫీని సిప్‌చేసి ముఖం వెగటుగా పెట్టాడు శేఖర్.

"ఏం కాఫీ బాగోలేదా?" అంటూనే తన కాఫీ రుచి చూసింది మాధురి

మాధురి ముఖంలో వచ్చిన మార్పులు చూసి "మీ కాఫీలో కూడా పంచదార వెయ్యడం మరిచిపోయాడా?" అన్నాడు శేఖర్.

"మరిచిపోవడమా? మణుగున్నర పంచదార వేస్తే-మీకు అసలు వెయ్యలేదా? అదీ అలా చెప్పండి మీ కప్పులో వెయ్యవలసిన పంచదార కూడా నాదాంట్లో వేశాడు. వెరసి మీకు చేదు కషాయం, నాకు తీపి పానకం."

"సరే ఇంకనేం! ఎవరికెలా ఇవ్వాలో అలాగే ఇచ్చాడు. అతనికి తెలుసు. కొందరు ఎప్పుడూ చేదే మింగాలనీ, కొందరికి తీపి తప్ప మరేదీ ఇవ్వకూడదనీను."

"వాడి మొహం, ఇప్పుడెలా? మొత్తం రెండు కప్పుల్లో రుచీ కలిపి రెండెట్టి సమానంగా భాగహారి స్తేనేకాని అసలు రుచి రాదు."

శేఖర్ ఉలిక్కిపడ్డాడు. యధాలాపంగా అందా లేకపోతే ఇందులో వేరే అర్ధం ఏమైనా ఉందా? కాఫీ వంకతో, తమ ఇరువురి జీవితాలూ మేళవించి, బ్రతుకుని సమానంగా పంచుకొని హాయిగా జీవిద్దాం అనే అభిప్రాయాన్ని వెల్లడించడంలేదుకదా? మళ్ళీ అతని హృదయంలో ఆశ తలెత్తింది చూస్తే మాధురి ముఖంలో అతను ఆశించిన భావాలేం కనిపించలేదు. అయినా నిరాశ చెందకుండా సంభాషణని ఆ మార్గంగా పోనిచ్చాడు.

"ఇద్దరం కొద్ది కొద్దిగా రుచి చూశాంకదా? ఇప్పుడీరెండు కప్పులలో కాఫీ కలిపేస్తే ఎలా?" అన్నాడు శేఖర్.

"అబ్బే ఊరికే థీరీ చెప్పాను, ప్రాక్టికల్‌కోసమా?" అంటూ మాధురి సర్వర్‌ని పిలిచి అవిపట్టికెళ్ళి అవతలపోసి వేరే కాఫీలుచేసి పట్టుకురమ్మని ఆర్డర్ ఇచ్చింది.

మాటల్లో దొరకడంలేదు మాధురి. మరి మనస్సులో ఏం ఉందో. తనగురించి ఆమె అభిప్రాయం ఏమిటో తెలుసుకోవడం ఎలా? ఇలా ఆలోచిస్తూ టేబిల్ అంచుని వేళ్ళతో నిమురుతూ ఉండిపోయాడు శేఖర్.

సర్వర్ తిరిగి తీసుకువచ్చిన కాఫీని సిప్‌చేస్తూ "అవును కానీ ఈమధ్య మీఫ్రెండ్ దర్శనాలు పూర్తిగా కరువయిపోయాయేం? రేడియోనాటిక అయిపోయింది. మన అవసరం తీరిపోయింది. ఇంక వీళ్ళతో స్నేహం ఎందుకులే మనకి అనుకున్నారా ఏమిటి?" అంది మాధురి సీరియస్‌గా.

నోటిదగ్గర పెట్టుకోబోయిన కప్పుని టేబిల్‌మీద ఉంచి ఆశ్చర్యంగా "అదేవిటి? కిరీటి. మీకు కనిపించనే లేదా అప్పటినుంచీ? ఒకటి రెండుమార్లు రూమ్‌కి ఆలశ్యంగా వచ్చావేమిటిరా అని అడిగితే, మాధురితో కబుర్లుచెబుతూ కూర్చుండిపోయాను అని చెప్పాడే!" అన్నాడు శేఖర్.

"ఏమిటి నాతోటి కబుర్లా? రికార్డింగ్ అయిన తర్వాత నాకు ఆయన అసలు కనిపిస్తేనా? ఒకటి రెండుసార్లు మీరూమ్‌కివస్తే తాళంవేసి ఉంది. మీరూలేరు ఆయనా లేరు. అక్కడికీ ఒకసారి ఆబిడ్స్‌లో కనిపిస్తే ఆయన్ని గట్టిగా కేకేసిపిల్చాను. వెనక్కి తిరిగి చూసీ కూడా పలక్కుండా వెళ్ళిపోయారు" మాధురి కంఠం గద్గదికం అయింది ఈమాటలు చెప్తూంటే.

"చిత్రంగా ఉందే! వాడామో ఈమెని తరుచు ఎక్కడో అక్కడ కలుసుకుంటు న్నట్లే చెప్తాడు. ఈమె ఏమో వాడినీమధ్య అసలు చూడనేలేదని చెప్తోంది. ఇద్దర్లో

ఎవరిది నిజం! వాడింత నిలువునా అబద్ధం ఆడగలడా? మరైతే మాధురే తమాషా చేస్తోందా? తనదగ్గర ఈ సంగతి దాచడనవల్ల ఈమెకి ఏం లాభం?'' ఇలా తనలోతాను తర్కించుకొంటూన్న శేఖర్ తలెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె చెప్తూన్నది నిజమే అనిపించింది. వివర్ణమైన ముఖం దైన్యంగాఉన్న కళ్ళు చూస్తే ఆమె ఎంత బాధపడుతూన్నదీ అర్థమైంది శేఖర్‌కి. అతని మనస్సు కళవళ పడింది. గుండె జాలితో నిండిపోయింది ఆమెని ఆస్థితిలో చూడలేకపోయాడు అందుకు కారణమైన కిరీటిమీద విపరీతమైన కోపం వచ్చింది ఆ కోపంతోనే అన్నాడు ''వాడొక ఇడియట్ వాడు కని పించలేదనీ మాట్లాడలేదనీ మీరు బాధపడడం దేనికి?'' అని

మాధురి చకితురాలైంది ఆమాటకి. 'ఇలా అంటాడేవిటి?'అని ఆశ్చర్యపోయింది. వెంటనే సర్దుకుని ముఖంలో సాధ్యమైనంత నిర్లక్ష్యాన్ని కనబరుస్తూ ''అవును నాకేం? ఆయన మాట్లాడకపోతే నాకు తోచదా? అయినా ఆయనేమంత పెద్ద మాటకారిఅని! పోనీ మీలాగ నాలుగు జోక్స్‌వేసి నవ్వించి కబుర్లుచెప్పే మనిషి అయితే అయ్యో ఆయన మాట్లాడడంలేదే అని అనుకోవచ్చును.'' అంది

తనగురించి మాధురికి అంత అభిప్రాయం ఉన్నందుకు సంతోషించాడు శేఖర్. అంతేకాకుండా ఈమె కిరీటి కంటే తననే ఎక్కువ అభిమానించడం లేదుకదా అనే అనుమానం వచ్చింది అతనికి ఏమైనా ఇవాళ అటో ఇటో తేల్చుకోవాలి. దానినిబట్టి ఈమెమీద ఆశలు పెంచుకోవడమో, ఇంతటితో ఈమెని మరిచిపోవడమో నిర్ణయించు కోవచ్చు అనుకున్నాడు.

''మీకిప్పుడు తొందరగా వెళ్ళవలసిన క్లాసేంలేదుకదా?'' అన్నాడు శేఖర్

''ప్రాక్టికల్స్ ముందుగా అయిపోయాయి అందువల్ల ఇంకో అరగంటదాకా క్లాసు లేంగలేదు'' అంది మాధురి వాచీ చూసుకుంటూ శేఖర్ 'హమ్మయ్య' అనుకున్నాడు. కుర్చీలో వెనక్కి జేర్లబడి స్థిమితంగా కూర్చుంటూ జేబులోంచి సిగరెట్టుపేకెట్ తీశాడు. అగ్గిపుల్ల గీయబోయి వెంటనే ''సారీ అన్నట్లు మీకు సిగరెట్టుపొగ పడదుగా?'అంటూ పేకెట్ తిరిగి జేబులో పెట్టేసుకున్నాడు.

మాధురి 'థేంక్స్' అంది తన ఇబ్బందిని గుర్తించి అతను సిగరెట్టు మానేసినందుకు కృతజ్ఞతగా.

అగ్గిపెట్టెని తమాషాగా టేబిల్‌మీద దొర్లిస్తూ ''మీరు కనీసం ఈవాసననేనా అలవాటు చేసుకోవాలి కొద్దిగా. లేకపోతే రేపొద్దున్న ఇబ్బంది పడతారు ఒక్కమాటుగా సర్దుకోవాలంటే'' అన్నాడు శేఖర్ కంటిచివరనుంచి ఆమెకేసి చూసి.

మాధురి నవ్వుతూ ''ఎందుకు ఇబ్బంది?'' అంది

శేఖర్ చుట్టూ కలయజూసి, ఎవరూ తమమాటల్ని వినటంలేదని నిర్ధారణ చేసుకుని, గొంతు బాగా తగ్గించి నెమ్మదిగా ''అహ! రేపొద్దున్న ఆ వచ్చే ఆయన

కెవరికో సిగరెట్టు అలవాటుంటే?'' అన్నాడు, కావాలని ఆమె కళ్ళల్లోకి కొంచెంగా చూస్తూ.

ఆ మాటలకి సిగ్గుతో మాధురి ముఖం మందారం అయింది. కాని వెంటనే గాంభీర్యాన్ని తెచ్చుకుని సీరియస్‌గా ''ఇప్పుడా ప్రస్తావన ఎందుకు? ప్రస్తుతం నాకు ఆవాసన కిట్టదు. అంతే '' అంది

''ఇప్పుడు కాకపోయినా ఓ ఏడాది రెండేళ్ళతర్వాత అయినా మీకా ఇబ్బంది రాకుండా ఉంటుందా?''

''రావాలని ఏం ఉంది?''

శేఖర్ గతుక్కుమన్నాడు ఈమె అసలు పెళ్ళే చేసుకోదా? ఆ ఉద్దేశంలోనే అన్నదా ఇలా-అంతలోనే అతనికి మరో ఆలోచన వచ్చింది. బహుశా సిగరెట్లు కాల్చని వాళ్ళని చేసుకుంటాను, లేదా ఆ అలవాటుని ఏమైనా మానిపిస్తాను అని కాబోలు ఈమె అభిప్రాయం.

''ఈరోజుల్లో సిగరెట్టు కాల్చని వారెవరు? అలవాటంటూ ఒకమారు అయ్యాక మానగలిగినవారెవరు?'' అన్నాడు శేఖర్ మాధురి సమాధానం చెప్పలేదు ఈ సంభాషణ ఆమెకి రుచించినట్లులేదు. మర్యాదకోసం కూర్చునిఉంది కాని, లేకపోతే ఈపాటికి 'లేద్దామా?' అని ఉండును.

''మనం చూస్తున్నాంకదా? ప్రతి మెడికోకి ఓ చేతిలో స్టెత్, మరో చేతిలో సిగరెట్టూ''

ఈమాటా మాధురి మాట్లాడలేదు.

''మీరెలాగా డాక్టర్ని వివాహం చేసుకుంటారు ''

''అని మీకు రూఢిగా తెలుసా?''

ఆ మాటలోని తీక్షణతనిచూపి, దెబ్బతిన్నవాడిలా ఆగిపోయాడు శేఖర్, ఏదో అనబోయినవాడల్లా. కళ్ళప్పగించి చూస్తూన్న శేఖర్‌వైపు కొంచెంఅయినా తిరక్కుండా, ఎటో చూస్తూ'' మెడిసన్ చదువుతున్నానుకదా అని నాకీ చదువంటే ఇష్టమనీ, డిగ్రీ తెచ్చుకున్నాక ప్రాక్టీసు పెడతాననీ, డాక్టర్నే పెళ్ళిచేసుకుంటాననీ మీరూహించారు అఫ్‌కోర్స్ ఎవరేనా అలాగే అనుకుంటారనుకోండి. కాని '' అంటూ వాక్యం పూర్తి చెయ్యకుండానే కుర్చీని పెద్ద చప్పుడయ్యేలా వెనక్కిజరిపి, విసురుగాలేచి, ''మరి నాకు క్లాసుంది. మీరింకా కాస్సేపు కూర్చుంటారా?'' అంటూ అతని సమాధానంకోసం ఆగకుండా అక్కడనుంచి వెళ్ళిపోయింది మాధురి.

ఆమె వెళ్ళినదిక్కే విస్తుబోయి చూస్తూ ఉండిపోయాడు శేఖర్. చాలాసేపటి తర్వాత అతను విడిచిన దీర్ఘమైన నిట్టూర్పుకి, అంతవరకూ అతను కట్టుకున్న పేక మేడలు, పడిపోనారంభించాయి. అప్పటివరకూ మిణుకు మిణుకు మంటూన్న ఆశకాస్తా అదృశ్యం అయిపోయింది. ఇదీ అని తన మనస్సులోని భావాన్నేమీ ఆమె స్పష్టంగా చెప్పలేదు. అయినా శేఖర్‌కి ఆమె హృదయం అర్థం అయిపోయింది. ఆమె మనస్సులో

కిరీటి ఉన్నాడో లేడో కాని తనుమాత్రం లేదు. అంతవరకూ తనకి తెలిసింది. వివరంగా ఆమె చెప్పలేకపోయినా తెలిసింది ఆ సంగతి.

ఇది జరిగిన వారంరోజుల తర్వాత "ఏవిటిరా మనస్సులోఉన్నది చెప్పవు. పలకరించినా మాట్లాడవు. కాలేజీకి వెళ్ళడం మానేసి, ఇరవైనాలుగు గంటలూ శరీరాన్ని నడ్డిదాకా అలా చాపమీదపరిచి, కాళ్ళని గోడకి నిలువుగాజేర్లేసి సిగరెట్లుకాలుస్తూ వెల్లకిలా ఆ పడకేవిటి? నీకేం వచ్చింది? అద్దంతెస్తాను గెడ్డంచూసుకో ఎలా మాసిపోయిందో! అస్తమానూ అరుస్తూ పాడుతూ అల్లరిచేసే కొక్కిరాయి వెధవ, కళ్ళుమూసుకుని ఏదో ఆలోచిస్తూ ఇలా మౌనంగా పడి ఉంటే ఏడుపు వస్తుందిరా చూడలేక" అన్న కిరీటి మాటలకి, జవాబేంచెప్పక తడి అయిన కళ్ళని కనిపించనియ్యకుండా మొహం అటు తిప్పుకున్నాడు శేఖర్.

# 10

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుంటూ "అమ్మా మాధురీ!" అంటూ కేకేశాడు జగత్పతిరావు. హాలూ గదులూ ప్రతిధ్వనించాయి కాని మాధురి మాత్రం జవాబివ్వలేదు. కాస్సేపాగి మళ్ళీ పిలిచాడు. రెండుమూడుసార్లు అలా పిలిచాక ఎక్కడో మారుమూల గదిలోంచి "ఏం?" అంటూ విసురుగ్గా వచ్చింది మాధురి బాగా చిక్కిపోయి, కాళ్ళూ చేతులూ వసి వాడిపోయి, ముఖం నీరసించి పదిపదిహేను లంకణాలు చేసినదానిలా ఉంది. కూతురుని ఆస్థితిలో చూసేసరికి జగత్పతిరావు మనస్సంతా వికలం అయిపోయింది కడుపులో చెయ్యిపెట్టి కలచివేసినట్లయింది. తనపక్కన కూర్చుని భోజనంచేసీ, తనతో నవ్వుతూ మాట్లాడీ సుమారు రెండు నెలలు అవుతోంది అదిగో ఆరోజున అర్ధరాత్రి వేళ బావాజీతో తనువచ్చి, మాధురితో సరసాలాడుతూన్న కిరీటిని అప్పటికప్పుడు ఇంట్లోంచి పంపించేసింది లగాయతు, ఇదీ వరస కలిసి భోంచెయ్యదు, పూర్వంలాగ నవ్వుతూ కబుర్లుచెప్పదు. ఎంతసేపటికీ ముభావం, విసుగూ, కోపం, ఇరవైనాలుగు గంటలూ మూల గదిలో కూర్చుని ఉంటుంది "ఏం?" అంటే 'నాకు పరీక్షలు నన్ను పలకరించకు' అంటూ కస్సుమంటుంది.

జగత్పతిరావుకేం పాలుపోవడంలేదు. అది ఎందుకిలా ఉంటోంది? తనమీద ఏదో విపరీతమైన కోపంవచ్చి ఉండాలి. లేకపోతే ఇలా సత్యాగ్రహం చెయ్యదు గెంతుతూ. నవ్వుతూ తన మాధురి ఎలా ఉండేది? సరదాగా కూనిరాగాలు తీస్తూ, ఇల్లంతా అలంగం తిరుగుతూ, నౌకర్లని ఏడిపిస్తూ బట్లర్‌ని వెక్కిరిస్తూ, మధ్యలో తన మెడచుట్టూ చేతులువేసి చిలిపిపేచీలుపెడుతూ, చలాకీగా ఉండేపిల్ల, మాట్లాడకుండ ఓ మూల కూచుంటే ఇల్లెంత చిన్నబోతుంది! తన ప్రాణం ఎంత విలవిల్లాడిపోతుంది! ఇంకీ కోపాన్ని ఇలా ఉండనియ్యడానికి వీలులేదు. తన మాధురి మళ్ళీ మామూలుగా ఉండాలి. ఇల్లు తిరిగి కలకల్లాడాలి.

"అన్నం తిందాంరా అమ్మా" అన్నాడు జగత్పతిరావు.

"నేను ఇందాకే తినేశాను"-విసురుగా అంది మాధురి.

"ఎప్పుడు తిన్నావమ్మా పొద్దుటినుంచీ కోపగృహంలోనే కూర్చున్నావు కదా?"

"తిన్నాను కావలిస్తే బట్లర్‌ని అడుగు"

"పిచ్చి తల్లీ! బట్లరే చెప్పాడు నువ్వు తినలేదని."

మాధురి మాట్లాడలేదు

"ఎందుకమ్మా నామీద కోపం? ఏం కావాలో నాకు చెప్పకూడదూ? నాతో నువ్వు సరిగ్గా మాట్లాడి, నా పక్కన కూర్చుని భోజనంచేసి ఎన్నాళ్లయిందో తెలుసా?"

మాధురి కళ్లు నీళ్ళతో నిండిపోయాయి.

జగత్పతిరావు లేచి మాధురి దగ్గరగా వెళ్ళి ఆప్యాయంగా తలమీద చెయ్యివేసి నిమురుతూ "నాకు నువ్వు తప్ప ఇంకెవరున్నారు చెప్పమ్మా" అన్నాడు. మాధురి కళవళ పడి 'డాడీ!' అంది గద్గదికమైన కంఠంతో.

"అవునమ్మా. నీ మనస్సులో ఉన్నదేదో చెప్పకుండా ఇలా కోపంగా ఉంటే ఎలా తెలుస్తుంది? చెప్పు అమ్మా-నీకేం కావాలో చెప్పు"

"ఏం వద్దులే డాడీ! నువ్వేం బాధపడకు."

"అలా కాదు. ఏదో ఉంది చెప్పాలి"

"అలాగే చెప్తాలే ముందు భోజనం చెయ్యి. బట్లర్! డాడీకి అన్నం వడ్డించు. పోనీ ఈ పూట నా చేత్తో వడ్డిస్తాను తిను డాడీ" అంటూ పైట బొడ్డులో దోపుకొని చేత్తో గరిటె తీసుకుంది మాధురి

"తింటాను కాని రెండు షరతులు."

"ఏమిటవి?" అన్నట్లు చూసింది మాధురి.

"ఒకటి-నువ్వు నాతో కలిసి భోజనం చేసి, ఇప్పటినుంచీ మామూలుగా నవ్వుతూ అల్లరిచేస్తూ సరదాగా వుండాలి. రెండు-ఇన్నాళ్ళూ నువ్వు ఇలా ఎందుకు నామీద కోపగించావో చెప్పాలి ఏం? ఒప్పందమేనా?"

ముంజేత్తో కళ్లు తుడుచుకుని. ఆ తర్వాత అతి ప్రయత్నంమీద నవ్వి. అలాగే అన్నట్లు తల ఊపింది.

ఆ పూట భోజనాల దగ్గర జగత్పతిరావు ఎన్నిసార్లు మారు వేయించుకొన్నాడో-నవ్వుల మధ్యలో మాధురికి ఎన్నిమార్లు పొలమారిందో లెఖ్ఖలేదు.

టవల్‌తో చెయ్యి తుడుచుకొని హాల్లోకి వెళ్ళి సోఫామీద కూర్చుంటూ "ఊ ఈమాట చెప్పు నా బంగారు తల్లికి వాళ్ల డాడీమీద కోపం ఎందుకు వచ్చింది?" అన్నాడు జగత్పతిరావు. మాధురి ఏం మాట్లాడలేదు. చేతివేళ్లకేసీ గోళ్లకేసీ చూసు కుంటూ తల వంచుకొని నిలబడి ఉంది. అమ్మ వుంటే తన మనస్సులో మాట చెప్పి

ఉండేది. కాని నాన్నకి ఎలాగ? మొదటిసారిగా అమ్మ లేని లోటు ఏమిటో తెలిసింది మాధురికి. తలఎత్తి తండ్రికేసి ఒకమాటు చూసి తల దించేసుకుంది. ఏదో చెప్పలేక సంకోచిస్తోంది అని గ్రహించాడు జగత్పతిరావు. అంత చనువుగా ఉండేదానికి, తన దగ్గర మొహమాటం ఏమిటి? అర్థం కాలేదు జగత్పతిరావుకి. "సరే ఇప్పుడు కాకపోతే తర్వాత అయినా చెప్పు నీ ఇష్టం. నేనలా ఓమారు సికింద్రాబాద్ స్టేషన్‌కి వెళ్లి రావాలి" అంటూ బట్టలు వేసుకోడానికి లేచాడు జగత్పతిరావు.

"స్టేషన్‌కి యూనివర్సిటీ మీంచే కదూ వెళ్ళడం?" అని అడిగి, వెంటనే ఎందుకు అడిగానా అని నాలుక కరుచుకుంది మాధురి

జగత్పతిరావు ఆగి, "అవునమ్మా. ఏం?" అన్నాడు. మాధురి కాలి బొటన వేలితో నేలమీద గీస్తూ, "ఇవాల్టితోటి ఎమ్. ఏ వాళ్ళకి పరీక్షలు అయిపోతాయి. ఇవాళే ఆఖరి పరీక్ష" అంది.

"అహా "

"పరీక్షలు రాశాక అందరూ ఇళ్ళకి వెళ్ళిపోతారు కాబోలు!"

జగత్పతిరావుకి కూతురు అమాయకత్వం చూస్తే నవ్వు వచ్చింది. "మరి వెళ్ళరూ? పరీక్షలయ్యాక ఎవరి ఊరు వాళ్లు వెళ్ళకుండా ఇక్కడ ఉండిపోతారా?" అన్నాడు.

"కిరీటికూడా?" అనుకోకుండా అనేసింది మాధురి

"ఆ! ఏం? వెళ్ళనని అతను చెప్పాడా?"

"ఎదీ? మళ్లీ నాకతను కనిపిస్తేగా చెప్పడానికి? రేడియో రికార్డింగ్ రోజున తప్ప, నువ్వా అర్ధరాత్రివేళ అతన్ని మనింట్లోంచి పంపించేశాక, నాకు తిరిగి కనిపించనే లేదు" అంది మాధురి బొంగురుపోయిన కంఠంతో.

ఒక్కమాటు, జరిగిన సంఘటన వచ్చి జగత్పతిరావు కళ్ళముందు నిలిచింది. అప్పటికప్పుడు మాధురిని కిరీటి తరుముతున్నట్లూ, ఆమె మీదకి వాలి స్వాధీనం చేసుకోబోతున్నట్లూ ఆ దృశ్యం తను చూస్తున్నట్లూ ఫీలయ్యాడు కోపంతో కళ్ళు ఎర్రబడ్డాయి

"అవును పంపించను మరీ? నయం కీలుకి కీలు విరిచి మరీ పంపి ఉందును, బావాజీ కనక అడ్డుకోకపోతే "

"కానీ, అందులో ఆయన తప్పులేదు డాడీ! నేనే ఆయన కళ్ళజోడు తీసుకుని పరిగెట్టాను "

"అయితే?"

"నా దగ్గరనుంచి తిరిగి ఆ జోడు తీసుకోవడం కోసం, నాతో ఆయన పెనుగులాడారు. ఆ సమయంలో నువ్వు చూశావు. అంతే."

"మరైతే ఆ సంగతి నాకు చెప్పొచ్చుగా? పొమ్మనగానే అలా తల వంచుకు పోతే ఏం అర్థం అవుతుంది? తప్పు చేశాడు కనకే తల వంచుకు వెళ్ళాడు అను కున్నాను."

"పైగా అర్ధరాత్రివేళ అలా ఇంట్లోంచి పంపించేస్తే ఒక్కరూ రూమ్‌కి ఎలా వెళ్ళారో ఏమో ఆయన కసలే భయం కూడాను చీకటంటే."

"ఆహా! అయితే చాలా అవస్థపడి ఉంటాడే పాపం! పోనీ నువ్వయినా చెప్పకపోయావా అప్పుడు నాతో."

"నేను చెప్పబోయాను. కాని నువ్వొక్క ఉరుమురిమి 'నోరు మూసుకో' అన డంతో భయంవేసి ఊరుకున్నాను"

"అలాగా? చాలా అన్యాయం జరిగింది అయితే మరి తర్వాతయినా నువ్వు నాకీ సంగతి చెప్పలేదేం?"

"చెప్తే ఏం లాభం? పాపం ఆ అర్ధరాత్రి నిర్దాక్షిణ్యంగా ఆయన్ని ఆ చీకట్లోకి తరిమేశాక?" అంది కోపంతో మాధురి తండ్రికేసి పుల్తూ పుల్తూ చూస్తూ.

"అదా అమ్మా నీ కోపం ఇన్నాళ్ళనుంచీ? సరే అర్థం అయిందిలే. ఏదో ఆ ఆవేశంలో అలా కేకలేసి పంపించేశాను కాని, అతను దాన్ని మనస్సులో పెట్టుకుని బాధ పడుతున్నాడనీ, నువ్వూ అందుకే కోపగించి నాతో మాట్లాడ్డం మానేశావనీ నేను అనుకోలేదు. నేను ఆ సంగతి అంతటితో మరిచేపోయాను"

"అయితే నీకు ఆయనమీద కోపం లేదన్నమాట!" ఉత్సాహంగా అడిగింది మాధురి.

"కోపంలేదు కాని, అతను నీతో అంత చనువుగా ఉండడం నాకు నచ్చ లేదమ్మా నువ్వా పెళ్ళి కావలసిన పిల్లవి! అతనా పరాయివాడు!"

"ఆయన్ని అలా అనకు డాడీ!"

"ఇంకెలా అనమంటావమ్మా. కిరీటి మనకి పరాయివాడు కాకపోతే కావలసిన వాడా?"

"నేను అలా అనుకోవడంలేదు" అంది నెమ్మదిగా మాధురి తల వంచుకుని.

"మాధురీ!"

జగత్పతిరావు ఇంకేం అనలేదు. అలా అనుకోవడం లేదూ? అంటే? అత నిలో ఆలోచనలు శరవేగంగా తిరిగిపోతున్నాయి కిరీటి మంచితనం - అతని అమాయ కత్వం - అతని కబుర్లు చెబుతూ మాధురి మురిసిపోవడం - అతని ప్రస్తావన వచ్చినప్పు డల్లా ఆమె కళ్ళు కాంతితో వెలిగిపోవడం-అతనిపట్ల మాధురి చూపిస్తూన్న అప్యాయత.

వీటి అన్నింటినీ కలిపి ఆలోచిస్తే?-కాస్సేపాగి జగత్పతిరావు "కిరీటి తెలివైన వాడే మంచివాడే - కాని అతని తల్లిదండ్రు లెవరో, అతని స్థితిగతులేవిటో " అన్నాడు.

"అవన్నీ మనకెందుకు డాడీ?"

"అయితే సరే - వాటి గురించి ఆలోచించక పోయినా, అతని అభిప్రాయం ఏమిటో, నువ్వంటే అతనికున్న ఆప్యాయత ఏమిటో-ఇదైనా "

"ఆ సందేహం ఏం అక్కర్లేదు, నాకు తెలుసు."

"అలాగా? ఇంకేం అయితే? నీ కోరిక ప్రకారం కానియ్యడంకంటే నాకు కావలసిందేముంది తల్లీ!"

"డాడీ!"

జగత్పతిరావు మాధురిని దగ్గరగా తీసుకుని తలమీద ముద్దు పెట్టుకుంటు న్నప్పుడు, రెండు కన్నీటి చుక్కలు ఆమె పాపిట్లో పడి ముత్యాలులా మెరిశాయి

"అయితే అతను ఊరు వెళ్ళిపోకుండా ఇప్పుడే వెళ్ళి మనింటికి తీసుకు వస్తాను "

"ఇప్పుడాయన యూనివర్సిటీలో ఆఖరి పరీక్ష రాస్తూంటాడు."

"అక్కడికే వెళతాను."

* * *

"నమస్కారం అండీ "

తలెత్తి, సిల్కులాల్చీ, సిల్కుపంచే, పైమీద జరీ ఉత్తరీయం, పచ్చగా మెరుస్తూన్న బట్టతలా, కంటికి ఖరీదైన ఫ్రేమ్ కళ్ళజోడూ ఈ రూపంతో సంపన్న గృహస్థులా కనిపించిన జగత్పతిరావుని చూసి "కూర్చోండి" అని ఎదురుగుండా ఉన్న కుర్చీని చూపించి, "జస్ట్-వన్ మినిట్" అంటూ ఏవో కాగితాలమీద సంతకాలు పెట్ట సాగాడు తెలుగు ప్రొఫెసర్

జగత్పతిరావు గది అంతా కలయజూశాడు.

ఎదురుగుండా గాజు పలక అమర్చిన టేబిల్‌కి అటువైపున ఖరీదైన గాడ్రెజ్ స్ప్రింగ్ ఛైర్‌లో, చెంపలు బాగా నెరిసి నల్లని వెడల్పాటి ఫ్రేమ్ ఉన్న దళసరి కళ్ళ జోడుని మాటిమాటికీ సరిజేసుకొంటూ పచ్చగా మిసమిసలాడుతూన్న ప్రొఫెసర్. ఆయనకి కుడిపక్క పెడస్టల్ ఫేనూ, ఎడంపక్క టేబిల్‌కి అమర్చిన బజర్ నొక్కే బటనూ, ఎదురుగుండా గాజుపలక టేబిలూ, దాని చుట్టూ విజిటర్స్‌కోసం వేసి ఉంచిన కుర్చీలూ, టేబిల్‌మీద ఓ పక్క స్టీల్ ట్రే, మరోపక్క పెద్దపెద్ద రిఫరెన్స్ పుస్తకాలూ కాగితాలూ, పేపర్ వైటులూ. ప్రొఫెసర్‌కి వెనకగా వున్న గాడ్రెజ్ బీరువా, దానిని ఆనుకొని ఉన్న చిన్న కర్టెనూ కలిసి ఆ గదిలో వెనకభాగాన్ని దాచి ఉంచితే, గాలికి ఎగురుతూన్న కర్టెన్ మాత్రం దాపరికాలు లేవంటూ, ప్రొఫెసర్‌గారు విశ్రాంతి తీసుకొనే ఆ భాగాన్నే, మధ్యమధ్య అందరికీ స్నేప్‌షాట్స్‌లా చూపిస్తోంది కర్టెన్ ఎగిరినప్పుడల్లా ఒకమారు ఈజీఛైరూ, మరోమారు వాష్ బేసినూ, ఇంకోమారు కూజా, గ్లాసూ, వేరొక మారు గోడకి అమర్చిన చిన్న అద్దం పౌడరూ, దువ్వెనా, హేంగర్‌మీద ఉన్న నేప్

కిన్నూ, తమాషా తమాషాగా కనిపిస్తున్నాయి. ఎదురుగుండా కూర్చున్న జగత్పతి రావుకి

ప్రొఫెసర్ కాగితాలు పేడ్‌లో పెట్టి ముడివేస్తూ, ఎడంపక్క నున్న బటన్ నొక్కాడు బజర్ మ్రోగి బయట స్టూలుమీద కూర్చున్న బంట్రోతు వచ్చాడు "ఈ ఫైల్ తీసికెళ్లి వైస్ ఛాన్సలర్‌గారి స్టెనోకి ఇయ్యి" అని బంట్రోతుని పంపించి. టేబిల్ మీద నున్న పేపర్ వైట్స్‌ని మాట వరసకి ఓమారు ఇటూ అటూ కదిపి, కళ్ల జోడు సర్దుకుని, కుర్చీలో వెనక్కి జేర్లబడి ఈజీగా కూర్చుంటూ, "ఊ చెప్పండి, మీరు వచ్చిన పనేమిటో!" అన్నాడు ప్రొఫెసర్.

"అఫీషియల్ వర్కేం కాదండి. చిన్న పెర్సనల్ ఫేవర్ "

"చెప్పండి."

"మీ దగ్గర ఎమ్ ఏ. చదువుతున్నాడు కిరీటి అని "

"దట్ యంగ్ చాప్? ఫైనలియర్?"

"ఫైనలియరే ఏదో పల్లెటూరునుంచి వచ్చాడు, సిగ్గు ఎక్కువ పచ్చని ముఖం. పద్యాలూ, నాటకాలూ రాస్తూంటాడు."

"మీ రంత వివరంగా చెప్పక్కర్లేదు. ప్రీవియస్‌లోనూ, ఫైనల్‌లోనూ కలిపి ఉన్నది ఒక్కడే కిరీటి. ఆ పేరుతో ఇంకెవరూ లేరు "

"అయితే అతనే. అతను హాల్లో పరీక్ష రాస్తున్నట్లున్నాడు. పరీక్ష అయాక ఒకమాటు మా యింటికి రమ్మని చెబుదాం అని వచ్చాను."

"అందాకా కూర్చుంటారా? లేకపోతే నేను తర్వాత కబురుచేసి పంపించ మంటారా?"

"మీ ఇష్టం ఎలా చేసినా సరే. కాని ఒక్క సంగతి మిమ్మల్ని అడుగువాం అని వచ్చాను "

"చెప్పండి "

"మరేం లేదండీ. అతను ఎలా చదువుతాడో, అతని కాండక్టు ఏమిటో."

అప్పటిదాకా చూపిస్తూన్న బింకాన్నీ, ముఖావాన్నీ వదిలేసి, కుర్చీలో ఇంకొంచెం వెనక్కి వాలి పకపకా నవ్వాడు ప్రొఫెసర్. నవ్వి, ఆ తర్వాత సర్దుకుని కూర్చుంటూ సీరియస్‌గా ముఖం పెట్టి "మీకు అతని గురించి అనుమానం ఎందుకొచ్చిందీ?" అన్నాడు

"అనుమానం కాదు సార్-తెలుసుకుందాం అని "

"అతనికేం అవుతారు మీరు?"

"ప్రస్తుతానికి ఏం కానండి. రేపొద్దున్న పిల్లనిస్తే మావగారిని అవుతాను "

"ఐ. సీ అదా మీ ఇంట్రెస్టు?"

జగత్పతిరావు తల ఊపాడు.

"అయితే వినండి. అలాంటి కుర్రాడు ఒక్క మా తెలుగు ఫేకల్టీలోనే కాదు, మొత్తం ఈ యూనివర్సిటీలోని ఆర్ట్సు కాలేజీలోనే లేడు. మంచి బుద్ధిమంతుడు. తెలివికి తెలివి, వినయానికి వినయం అన్నీ ఉన్నాయి. ఈ రెండేండ్లలోనూ కాంప్లిమెంటే కాని, ఎవరూ ఎప్పుడూ ఏ కంప్లైంటూ ఇవ్వలేదు అతని గురించి. ఇంక చదువు సంగతి అంటారా "

"చాలండి ఇంక నాకేం అక్కర్లేదు. అతని చదువు యెలా వున్నా యేమైనా, రేపొద్దున్న అతను వుద్యోగం చేసినా చెయ్యకపోయినా నాకేం ఫరవాలేదు. రెండు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి నాకుంది. ఒక్కర్తే కూతురు. నాకు కావలసిందల్లా అతని కాండక్టు గురించే. రోజూ చూసేవారు మీకు బాగా తెలుస్తుంది కదా అని అడిగాను. మీరు మంచిమాట చెప్పారు. అది చాలు."

"వెరీగుడ్. అయినా అతని చదువుకూడా కాండక్ట్‌కేం తీసిపోదు. తొంభై పాళ్లు ఫ్లస్ట్ క్లాసు రావచ్చు అతనికి వస్తే యిక్కడే రీసెర్చికి అవకాశం కల్పించి సెంట్రల్ గవర్నమెంట్ స్కాలర్ షిప్పుకి రికమెండ్ చేస్తాను."

జగత్పతిరావు కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి "వస్తాను సార్! థేంక్స్" అంటూ లేవబోయాడు.

"అవును ఇంతకీ అతనితో యెవరు వచ్చారని చెప్పమంటారు? మీపేరు? మీరేంచేస్తూ వుంటారు?"

"నాపేరు జగత్పతిరావు. ప్రస్తుతం ఏం చెయ్యడంలేదు. ఇదివరలో నాటకాలు వేసేవాడిని."

"ఏవిటి? పాతిక ముప్పైయేళ్ళ క్రితం వుద్యోగ విజయాలు, పాదుక, తులాభారం, చింతామణి, రంగూన్ రౌడీ, విడాకులు నాటకాల్లో ?"

జగత్పతిరావు నవ్వుతూ "అవునండి "

ప్రొఫెసర్ ఆశ్చర్యంగా కుర్చీలోంచి లేచి "అరే-ఆ జగత్పతిరావుగారు మీరేనా? ఇవాళ యెంత సుదినం? మిమ్మల్ని చూశాను. ఆ రోజుల్లో అంటే నాకు పదిహేను ఇరవై యేళ్లు వున్నప్పుడు మీ నాటకం వుందంటే టిక్కెట్లకోసం యెలా యెగబడి పోయేవాళ్ళం అని? ఓ మాటు కొత్తగా ఆ రోజునే కుట్టించుకున్న నా సిల్కు షర్టు చిరిగి పోయింది కూడా ఆ హడావిడిలో ఊ చాలా సంతోషం మిమ్మల్ని కలుసుకున్నందుకు" అంటూ, టేబిల్ మీంచి అడ్డంగా చెయ్యి చాపి షేక్‌హేండ్ యిచ్చాడు. మర్యాద కోసం జగత్పతిరావు కూడా కుర్చీలోంచి, సగానికి లేచి చెయ్యి అందించాడు.

ఇద్దరూ తిరిగి కుర్చీలలో కూర్చున్నాక "కిరీటిలాంటి అల్లుణ్ణి సంపాదిస్తున్నందుకు మొదట మిమ్మల్ని అభినందించాలి అనుకున్నాను. కాని ఇప్పుడు అతణ్ణే అభినందించాలి, మీలాంటి మావగారు దొరికినందుకు" అన్నాడు ప్రొఫెసర్.

జగత్పతిరావు, కళ్ళజోడు తుడుచుకొనే వంకని, లాల్చీ జేబులోంచి చేతి రుమాలు తీసుకుని, కళ్ళజోడు తుడుస్తూ, ఆ చేత్తోనే కళ్ళల్లో నిలిచిన నీళ్లు అద్దుకుని సర్దుకొని కూర్చున్నాడు

అవధులులేని సంతృప్తి, జీవిత ధ్యేయాన్ని సాధించిన గర్వం కళ్ళల్లోనూ, ప్రొఫెసర్‌పట్ల విపరీతమైన గౌరవం, ఆయన అందించిన అభినందనలకి ఆనందం ముఖంలోనూ, ప్రతిఫలిస్తూంటే, మౌనంగా కూర్చున్నాడు జగత్పతిరావు సంపదా, సౌజన్యం, సంస్కారం సహృదయతా వున్న ఒక వుత్తమశ్రేణి కళాకారుణ్ణి కలుసుకున్నాం అన్న సంతోషం గుండెల నిండా నిండి పోవడంతో, అతనికేసే చూస్తూవుండి పోయాడు ప్రొఫెసర్.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "మరి వెళ్ళివస్తానండి, కిరీటి పేపరు రాయడం పూర్తి చేశాక నేనో మీరు మా యింటికి రమ్మన్నానని కబురు చేస్తారు కదూ?" అంటూ లేవబోయాడు జగత్పతిరావు

"ఉండండి కాఫీ తీసుకొని వెళుదురుగాని" అంటూ బటన్ నొక్కాడు ప్రొఫెసర్. బజర్ మ్రోగింది. కాని బంట్రోతు రాలేదు "ఓ అన్నట్టు వాడిని అలా పంపాను కదూ? కూర్చోండి ఇప్పుడే వస్తాను" అంటూ, జగత్పతిరావు మాట వినిపించుకోకుండా పక్క డిపార్ట్‌మెంటుకి వెళ్ళాడు ప్రొఫెసర్, ప్యూన్ యెవరేనా కనిపిస్తే కాఫీ కోసం, కిరీటికోసం కూడా కబురుచేసే వుద్దేశంతో.

ప్రొఫెసర్ అలా వెళ్ళిన రెండు నిముషాలకి "అయ్యా లోపలికి రావచ్చా?" అంటూ చేత్తో పుస్తకం ఒకటి పట్టుకుని రవణయ్య లోపలికి ప్రవేశించాడు జగత్పతిరావుని చూసి అతనే ప్రొఫెసర్ అనుకొని "నమస్కారం అండి" అన్నాడు

"కూర్చోండి" అంటూ జగత్పతిరావు పక్కనున్న కుర్చీ చూపించాడు.

"కూర్చోడానికి కాళీలేదు వెళ్ళాలి. ఎమ్ ఏ. వాళ్ళకి పరీక్షలవుతున్నాయని ఇందాకా యెవరో అంటేనూ 'అయ్యో కిరీటి పుస్తకం మన దగ్గరే వుండి పోయిందే! పాపం పరీక్షల్లో అతనికి అవసరమేమో అనుకున్నాను. అతని రూం తెలియదు. అందువల్ల సరాసరి ఇక్కడికే పట్టుకొచ్చా. కాని అతను పరీక్ష హాల్లో వున్నాడు ఇప్పుడు కలుసుకోడానికి వీలులేదు అన్నాడు ప్యూన్. పోనీ మీకిస్తే అతనికి అందే యేర్పాటు చేస్తారని " అంటూ రవణయ్య శృంగార నైషధాన్ని అందించాడు జగత్పతిరావుకి.

"అలాగే, ఇలా యివ్వండి. అవునూ? కిరీటి మీకెలా తెలుసు? మీ బంధువా?" అంటూ పుస్తకాన్ని అందుకున్నాడు జగత్పతిరావు. రవణయ్య అదో మాదిరి నిర్లక్ష్యం నవ్వు నవ్వి" ఏదో దూరపు బంధుత్వం వుందనుకోండి! రేపు పెళ్లి అయితే అదే దగ్గరవుతుంది."

"పెళ్ళా?"

''అవునండి. మారాణీని అతనికిచ్చి పెళ్ళిచేస్తే ''

''ఏమిటి మీరంటున్నది? ఏ కిరీటి గురించి మీరు మాట్లాడేది?''

''ఇంకే కిరీటి? ఇక్కడ తెలుగు ఎమ్మే చదువుతున్నతనే. అతణ్ణి చేసుకోడానికి మారాణీకూడా యిష్టపడింది.''

''ఆ! మీ అమ్మాయికి యిష్టమా? అదిసరే-అతను యిష్టపడొద్దూ?''

''అతనా?'' రవణయ్య ఒక నవ్వునవ్వి ''అతనికి యిష్టం వుంది కనకే రోజూ మా యింటి చుట్టూ, అంతకంటే ముఖ్యంగా మారాణీ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు. పైగా ఒకటి రెండుసార్లు అతని నోటి వెంట అతను 'నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అని రాణీతో అంటూండగా నేను రహస్యంగా విన్నాను కూడా'' అన్నాడు.

జగత్పతిరావుకి ఒక్క క్షణం తల తిరిగి నట్లయింది మరు క్షణంలో యితను చెప్తున్నదంతా అభూత కల్పన అనిపించింది. అనుమానంగా రవణయ్యకేసిచూశాడు.

రవణయ్య నిర్లక్ష్యంగా నవ్వి ''ఏవిటలా చూస్తారు ఆశ్చర్యంగా? ఇంత బుద్ధి మంతుడైన కిరీటి యేవిటి ప్రేమించడం యేవిటి అనా? బుద్ధికీ ప్రేమకీ సంబంధం లేదండీ-కుర్రాళ్లు పైకి బుద్ధిగానే కనిపిస్తూ వుంటారు సాగించే గ్రంధం సాగిస్తూనే వుంటారు. అది అంతే. మరి వస్తాను. ఆ పుస్తకం అతనికి అందించే యేర్పాటు చేయించండి. చాలా రోజుల క్రితం చదువుకుంటుందని మారాణీకిచ్చాడు. అప్పటి నుంచీ పట్టు కెళ్లనేలేదు వస్తాను శలవు'' అంటూ వెళ్ళిపోయాడు.

జగత్పతిరావుకి కాళ్ళ క్రిందనేల కదిలినట్లూ కళ్ళు తిరిగినట్లూ అనిపించింది. రవణయ్య యిచ్చి వెళ్ళిన పుస్తకంమీది 'కిరీటి' అనే అక్షరాలు వెక్కిరిస్తూ కనిపించాయి. పట్టలేనంత కోపంవచ్చి ఆవేశంతో ఊగిపోయాడు జగత్పతిరావు.

'మాధురి మనస్సులో కోటి కోరికల్ని రేపి, ప్రేమిస్తున్నట్లు నటిస్తూ, వెనకాల ఈ కిరీటి ఆడుతూన్న నాటకం యిదా? తన కూతుర్ని మోసంచేసి దాని బతుకుతో చెలగాటం ఆడుతూన్న వీడిని ' పళ్లు పటపట కొరుకుతూలేచి, ప్రొఫెసర్ వచ్చేదాకా ఆగి చెప్పి వెళదాం అనే ధ్యాసేనా లేకుండా, వెంటనే బయలుదేరాడు యింటికి, అగ్ని పర్వతంలా అడుగులు వేసుకుంటూ.

గుమ్మంలో అడుగు పెడుతూనే ''అమ్మా మాధురీ!'' అంటూ పిల్చాడు జగత్పతిరావు అపుకోలేని ఆవేదనని కంఠంలో ధ్వనిస్తూ.

నౌఖరు వచ్చి ''అమ్మాయిగారు యిప్పుడే అలా వెళ్లారండీ'' అన్నాడు. వాడికేసి తేరిపార చూడ్డం తప్ప యేం మాట్లాడలేదు జగత్పతిరావు

అతని హృదయం మండి పోతోంది

మెదడు కాగిపోతోంది

ఆవేశంతో వళ్ళంతా ఊగిపోతోంది.

'ఈ కిరీటి తన బంగారు తల్లి కలల్ని యిలా కాలరాచేస్తాడా? పుట్టినప్పటినుంచి మాధురిని కంట తడిపెట్టనియ్యకుండా తను యెంతో గారాబంగా పెంచాడే! అలాంటి దిప్పుడు ఈ స్కౌండ్రల్ కారణంగా అది గుండెలు మండేలా బాధపడడమా? వీల్లేదు! ఒక్కనాటికి అలా జరగడానికి వీలులేదు వీడిని తలదన్నేలాంటి కుర్రాణ్ణి తెల్లారేటప్పటికి తను తీసుకువస్తాడు మాధురికిచ్చి పెళ్లి చేసేస్తాడు. ఆతణ్ణి చూశాక మాధురి ఈ కిరీటిని మరిచి పోతుంది ఆ! . కాని ఇప్పుడిలా తన కన్నతల్లిని మోసంచేసినందుకు వీడిని యెలా శిక్షించడం? ఏం చేస్తే తన హృదయాన్ని దహించేస్తూన్నమంట చల్లారుతుంది? వీడి మీద యెలా తను కక్ష తీర్చుకోవడం?"

అస్థిమితంగా అటూ ఇటూ తిరిగాడు.

ఒకమాటు గన్ తీశాడు

ఇంకోమాటు యెదురుగుండా మేకుని వేళ్ళాడుతూన్న పెద్దకొరడాకేసి చూశాడు.

మరోమాటు డ్రాయర్ సొరుగులో వున్న పిస్టల్ తీసి అందులో యెన్నిరౌండ్స్ వున్నాయో లెఖ్ఖపెట్టాడు

ఎటూ నిర్ణయించుకోలేక సతమతమౌతూ, నుదుటిని రెండు గుప్పిళ్ళతోనూ నొక్కుకుంటూ, మోచేతుల్ని టేబిల్‌మీద ఆన్చివేగిపోతున్నాడు జగత్పతిరావు

ఆ సమయంలో ' నమస్కారం అండీ! ఏమిటి నా కోసం యూనివర్సిటీకి వచ్చారట!'' అంటూ ప్రవేశించాడు కిరీటి

అంతదూరంలో కిరీటిని చూడగానే, జగత్పతిరావు గుండెల్లో మండుతూన్నమంట ఒక్కమారుగా లేచి నాలికల్ని జాపుకుంటూ భగ్గుమని జ్వలించింది.

భయంకరమైన సింహంలా లేచాడు

''యూ స్కౌండ్రల్! గెటవుట్!''

బిల్డింగ్ అంతా ప్రతిధ్వనించిన ఆ అరుపుకి పైప్రణాలు పైకేపోయి, ఆ మట్టునే నిర్జీవంగా నిలబడి పోయాడు కిరీటి.

నౌఖరూ, పని మనిషీ, బట్లరూ, తోటమాలీ అంతా హడిలిపోయి పడుతూలేస్తూ పరిగెట్టుకుని వచ్చారు హాల్లోకి

అదే సమయంలో, ప్లాస్టిక్ సజ్జలోంచి పెద్ద పూల చెండు ఇవతలకి కొద్దిగా తొంగి చూస్తూంటే, ఆ సజ్జని విలాసంగా ఊపుకుంటూ మధురమైన ఆలోచనల్లో తేలిపోయి తనలో తాను సన్నగా యేదో పాడుకుంటూ, పార్లర్‌లోకి అడుగుపెట్టిన మాధురి, తండ్రి కేకవిని, చేష్టలు దక్కివణికిపోతూన్న కిరీటినిచూసి, ఏం జరిగిందో అర్థం కాక, నోటమాట లేక దిగ్భ్రాంతురాలై నిలబడిపోయింది.

' ఫో! మళ్ళీ కనిపించావంటే ప్రాణాలు తీస్తా-జాగ్రత్త!''-పిచ్చిగా అరుస్తూ మూలనున్న గన్ తీశాడు జగత్పతిరావు.

"డాడీ!"

"అయ్యగారూ!"

"ఆగండి!"

"బాబయ్యా!"

అంతా ఒక్కసారి వెఱ్ఱిగా అరిచారు

ఒళ్లు తెలియని ఆవేశంతో ఒక్క పరుగున తండ్రి దగ్గరికివెళ్ళి "ఏమిటిది డాడీ!" అంటూ చేతిలో వున్న గన్ లాక్కుంది మాధురి.

జగత్పతిరావు కోపంతో ఊగిపోతున్నాడు

అగ్ని గోళాల్లాంటి కళ్ళతో కిరీటిని దహించేస్తూ చూస్తున్నాడు.

ఎదురుగుండా కిరీటి!

వేష్టలు దక్క, భయంతో ఒళ్ళంతా బిగుసుకుపోయి. ప్రాణంలేని కట్టెలా నిల బడి వున్నాడు ముఖం పాలిపోయి, పళ్ళు గిట్ట కరుచుకుపోయి, గాజు గుడ్లతో చూస్తున్నాడు

ఆ చూపులో జీవంలేదు

ఆ ముఖంలో చలనం లేదు.

ఆ శరీరంలో ప్రాణంలేదు.

తండ్రినీ కిరీటినీ మార్చిమార్చి చూసింది మాధురి.

ఇద్దరూ చలనంలేని స్థాణువుల్లా నిలబడి వున్నారు ఒకరినొకరు చూసుకుంటూ.

ఒకరి కళ్ళల్లో ప్రాణం తీసేసే కోపం.

మరొకరి కళ్ళల్లో ప్రాణాలు పోయేటంతటి భయం

మాధురి, తండ్రి దగ్గర్నుంచి లాక్కున్న గన్‌ని దూరంగా విసిరేసి, కిరీటివైపు తిరిగి బొంగురుపోయిన కంఠంతో "వెళ్లిపోండి ప్రస్తుతానికి దయవుంచి వెళ్లిపోండి" అంటూ బావురుమంది.

ఒక్కగంట క్రితం. ప్రత్యేకం యూనివర్శిటీకివచ్చి, తనని ఇంటికి రమ్మని చెప్పవలసిందిగా ప్రొఫెసర్‌తో అన్న జగత్పతిరావు ఇప్పుడిలా అవమానపరచి బయ టికి గెంటించడానికీ ఆఖరికి చంపడానికీ కూడా యెందుకు సిద్ధం కావలసి వచ్చిందో అర్థంకాక, దిగ్భ్రాంతుడై నిలబడిపోయిన కిరీటికి, మాధురి మాటలు కాని యేడుపుకాని వినిపించనేలేదు.

గద్గదికమైన కంఠంతో "అలా చూస్తారేమర్రా? ఆయన్ని పంపించేసి తలుపు వేసెయ్యండి" అంటూ నౌఖర్నీ బట్లర్నీ హెచ్చరించింది మాధురి ప్రాణంలేని కట్టెని తోసినట్లు కిరీటిని బయటకు తోసి వాళ్లు తలుపులోపల గడియపెట్టారు.

"హమ్మయ్యా!" పెద్ద గండం తప్పినట్లు భారంగా నిట్టూర్చింది మాధురి.

"వెళ్ళండిరా-మీపని చూసుకోండి" అని నౌఖర్లనీ వాళ్లనీ కసురుకొని పంపించేసి, జంకుతూ జంకుతూ తండ్రిని సమీపించి "ఏమైంది డాడీ!" అంది.

జగత్పతిరావు వెంటనే సమాధానం చెప్పలేదు

కొంచెం సేపయ్యాక దీర్ఘంగా శ్వాసవదిలి "ఏమైందా? చెప్తా అంతా చెప్తా" అంటూ ప్రొఫెసర్ గదిలో తను ఒంటరిగా కూర్చున్నప్పుడు రమణయ్యారావడం దగ్గర్నుంచి, జరిగిందంతా సవిస్తరంగా చెప్పాడు జగత్పతిరావు ఆ సంగతి వినేసరికి మాధురి ముఖం పాలిపోయింది "నిజంగానా? కిరీటి ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడా?" ఏమో. ఎంతసేపు ఆలోచించినా నమ్మకం తోచలేదు, కిరీటికి ప్రేమించడమే తెలిస్తే తనకీ ఇబ్బందులన్నీ ఎందుకు? అది తెలియకనే కదా ఈ అవస్థలు ?

"నువ్వు విన్నది అబద్ధమేమో డాడీ?"

"ఈ పుస్తకం అతను ఆ అమ్మాయికి యివ్వడం కూడా అబద్ధమేనా? ఈ పుస్తకం కిరీటిది అనడం? ఇదీ అబద్ధమేనా?" అంటూ జగత్పతిరావు శృంగార నైషధాన్ని టేబిల్ మీదకి గిరవాటేశాడు అంది మీద కిరీటి పేరు చూసి మాధురి మారు మాట్లాడలేదు

"వాడు నిన్ను మోసం చేశాడమ్మా " తండ్రి మాట విని మాధురి గతుక్కుమంది. కిరీటి తనని ఏం మోసం చేశాడు? నిన్ను ప్రేమించానని ఒక్కమాటైనా అన లేదే ఇంతవరకూ తనతో?

"వాడి తల దన్నినవాడిని తీసుకువచ్చి నీకు పెళ్ళిచేస్తాను"-మాధురి దిగ్భ్రాంతురాలైంది? అదేవిటి? పెళ్ళా? అయినా యిప్పుడా ప్రసక్తి దేనికి?

"తను ఎంత అదృష్టాన్ని పోగొట్టుకొన్నాడో ఆ కిరీటికి తెలిసిరావాలి బాధతో కుమిలి కుమిలి కృశించాలి, ఇది మనకేం అవమానం కాదనీ, తన సంబంధం తప్పిపోయినందుకు మనకేం విచారం లేదనీ, ఆ తెలివి తక్కువ వాడికి తెలియాలి. అందుకేనా నీకు పెళ్ళి చేస్తాను నీ మనస్సు గొంచి, జరిగిన ఈ పీడకలని చెరిపేసి, నవ్వుతూ నువ్వు ఆనందంగా వుండడం కోసం, వెంటనే నీకు పెళ్ళి చేస్తాను."

"డాడీ "

"నువ్వింకేం మాట్లాడకు నేనొక నిర్ణయానికొచ్చాను దీనికింక తిరుగులేదు నీ పెళ్ళి జరగాలి, అది తెలిసి వాడు నిలువునా క్రుంగిపోవాలి. అది అంతే!" ఆ మాటలు వింటూ నిస్సహాయంగా నిలబడ్డ మాధురి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

## 41

అరుగుమీంచి వసారాలోకి, వసారాలోంచి అరుగుమీదకీ పచార్లు చేసిచేసి, ఎంతో సేపు ఆలోచించి,ఆలోచించి చివరకి ఓ నిర్ణయానికివచ్చి వుయ్యాలా బల్లమీద కూర్చుంటూ 'రాణీ' అని పిల్చాడు రమణయ్య.

"పిల్చావా మావయ్యా" అంటూ తడిచెయ్యి పైటతో తుడుచుకుంటూ హాల్లోకి వచ్చింది రాణీ. ఆమె చేతులకేసి చూసి "ఏం చేస్తున్నావు? వంట! అవునా? ఈ పరీక్ష నాలుగు రోజులూ నువ్వు చదువుకో. నేను వండుతా అని చెప్పాను కదా?.' అన్నాడు రవణయ్య.

రాణీ నవ్వి. "భలేవాడివి మావయ్యా పరీక్షలైతే ఇంక వంట వండకూడ దేమిటి? అయినా ఆడవాళ్ళకి వంట వండు కోవడం ఇల్లు సర్దుకోవడం ఇవి ముఖ్యం కాని పరీక్షలు, పేసవడం, డిగ్రీలు ఇవి యెందుకు? ఎంతయినా చివరకి వంటింట్లోకీ రావలసిందేగా?" అంది.

"అందుకని పరీక్షల్లో చదవడం మానేసి తాలింపులూ తిరగమోతలూ పెడుతూ కూర్చుంటావా?

"నిజానికి వీటిలో వున్న సరదా వాటిలో ఏం వుంది? కావ్యాలు చదవడంకంటే కాకరకాయ కూరవండడం సుఖం. చిన్నయసూరిని బట్టీ పట్టడం కంటే చింతకాయ పచ్చడి నూరడం నయం, ఆవకాయ అన్నంలో పెరుగు వేసుకుతిన్న ఆనందం ఎన్ని అలంకారాలు చదివితే వస్తుంది మావయ్యా?"

"అవునవును. పాకశాస్త్ర ప్రవీణ అనే బిరుదుతో పోలిస్తే భాషా ప్రవీణ అసలు బిరుదేకాదు. ఏవంటావు?"

"ఉన్న విషయం చెప్పకపోవడం యెందుకు మావయ్యా నాకు ఇంటి పనుల మీదవున్న ఆసక్తి ఆ పుస్తకాలమీదలేదు "

"మరీ సంగతి ఇన్నాళ్లూ చెప్పలేదేం? ఇంకా నువ్వేదో కష్టపడి చదువుతున్నావు అనుకున్నాను నేను "

"చెబుదాం అనుకున్నాను కాని నువ్వు చెప్పిన ప్రకారం చదవకపోతే నీకు కోపం వస్తుందనీ, చదివితే కాని నీ కిష్టం వుండదనీ "

"నా ఇష్టం కాదే తల్లీ! ఈ రోజుల్లో చదువుకోపోతే ఆడపిల్లలకి పెళ్ళి కావడం లేదు. చదువులేదంటే, వాళ్లు, ఆ పెళ్ళి కొడుకులు, ఇష్టపడడంలేదు. వాళ్ళకోసం కాని నా కోసముటే చదువుకోమన్నది?" అన్నాడు రవణయ్య విసుక్కుంటూ

"ఎవిటి? ఎవరికో యిష్టం వుండదనా నేను చదువుకోవడం? అయితే అసలు చదవను."

"మరి పెళ్ళి?"

"కాకపోతే కాకపోతుంది, చదువే ముఖ్యం, పిల్ల ముఖ్యంకాదు అనే పుస్తకాల పురుగుని నేనసలు చేసుకోను.

"రెండూ ముఖ్యమే-అధమం భాషా ప్రవీణ అయినా చదవకపోతే నిన్ను యెవడు పెళ్ళి చేసుకుంటాడనే కదా నిన్ను చదివిస్తున్నది?"

"వాళ్ళ కోరికల ప్రకారం మనం ఎక్కడ తయారౌతాం మావయ్యా! మన అంచనాల ప్రకారం వాళ్లుంటారా? ఏదీ వుండమను ఆరడుగుల పొడవూ. నూట ఎనభై పవునుల బరువూ, గాలిపీలిస్తే "

రవణయ్య కోపంగా చూడడంతో రాణీ వాక్యం పూర్తి చెయ్యకుండా ఆపేసింది.

"నువ్వా పెళ్ళి అయ్యేదాకా నేనా కాస్త చదువు.ఆ తర్వాత అంటావు-నీ ఇష్టం."

రాణీ ఏం మాట్లాడలేదు.

"పెళ్ళికూడా తొందరలోనే చేసేస్తాను. పెళ్లికొడుకుని కూడా నిర్ణయించాను."

రాణీ అదిరిపడింది.

"ఇంకా పెళ్ళికొడుకు నీకు నచ్చాడో లేదో తెలుసుకోవటం ఒక్కటే తరవాయి. అది అడుగుదాం అనే నిన్నసలు ఇప్పుడు పిలిపించింది "

రాణీ గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. రవణయ్య ముఖంలోకి వేలగా చూసింది.

"కిరీటి గురించి నీ అభిప్రాయం ఏవిటి?"

రాణీ హృదయం కుదుట బడింది.

"అతను మంచివాడే కదూ?"

రాణీ అవునన్నట్లు తల ఊపింది.

"బుద్ధిమంతుడు. అవునా?"

రాణీ కాదనలేదు. రవణయ్య నవ్వుకున్నాడు.

"అతనికి నువ్వంటే ఇష్టం అని నేను గ్రహించాను. మరి నీకు అతనంటేనో?"

"ఫో ఏం ప్రశ్నలివి మావయ్యా" అంటూ చేతుల్లో ముఖం కప్పుకుని సిగ్గుతో అక్కడనుంచి వెళ్ళిపోయింది రాణీ. ఇంతలో వీధిలో ఆటోరిక్షా ఆగిన చప్పుడైంది

"ఎవరొచ్చారో చూడు రాణీ" అని ఇంకా రవణయ్య అంటూండగానే. విజిల్ వేసుకుంటూ కాకీపేంటూ కాకీచొక్కా మెళ్లో గళ్ళ రుమాలూ ఎగదువ్వుడు క్రాప్‌తో వీర్రాజు వసారాలోకి ప్రవేశించి, ఎదురుగుండా ఉయ్యాల బల్లమీద కూర్చున్న రవణయ్యను చూసి విస్తుపోయి వెంటనే కంగారుతో తొట్రుపడ్డాడు. ఆ రూపంలో అతణ్ణి చూసి కొంచెంసేపు ఎవరో అర్థంకాక తెల్లబోయి ఆ తర్వాత గుర్తువచ్చి ఆశ్చర్యంగా "ఎవరూ? నువ్వా కిరీటీ?" అన్నాడు రవణయ్య

వీర్రాజు తడబడుతూ "మి మి మ్మీరు ఇంకా షైరు వెళ్ళలేదూ?" అన్నాడు.

"ఈపాటికి వెళ్ళాళలసిందే. కాని రాణీతో ఏదో మాట్లాడుతూ వుండిపోయాను అవునుగానీ-నువ్వీ వేషం ఏవిటి?"

"నే నా? వేషమా?... అవును! వేషం. ఇవాళ మా కాలేజిలో ఫేన్సీడ్రెస్ వేశాం 'కాలేజీ డే' సందర్భంలో."

"కాలేజీ డే ఇవాళేమిటయ్యా, పరీక్షలెప్పుడో మొన్నే అయిపోతేనూ?"

"మొన్నా? ఆ అవును మొన్నే!"

"నేను నీకు పుస్తకం కూడా పంపించాను మీ ప్రొఫెసరుద్వారా. అందిందా?"

"పుస్తకమా? ప్రొఫెసరా?.. యూనివర్సిటీకి వెళ్లారా మీరు?" వీర్రాజు వణికిపోతూన్న కంఠంతో భయపడుతూ అడిగాడు.

"అదేవిటయ్యా-శృంగారనైషధం పుస్తకం నీ కిస్తానని పుచ్చుకున్నాడు మీ ప్రొఫెసర్, ఇవ్వలేదూ?"

తప్పనిసరిగా ఇంక గతిలేక నవ్వి "ఓ ఆదా? ఇచ్చారండి" అన్నాడు వీర్రాజు.

"అవునూ? కాలేజీలు మూసేశాక ఇప్పుడు 'కాలేజీ డే' ఏవిటి, ఫంక్షను ఏవిటి?"

"ఇవాండీ? ఇవీమధ్యన ఇలాగే చేస్తున్నారు ఇదేం చూశారు? ఈ ఏడు సంవత్సర ప్రారంభంలో జరగవలసిన మా సారస్వత సంఘ ప్రారంభోత్సవమూ, సంవత్సరాంతాన్న జరిగే ముగింపు సమావేశమూ రెండూ ఒకేరోజున ఒకే వేదికపై తెల్లారితే కాలేజీలు మూసేస్తారనగా, యిద్దర్ని ఇద్దరు అధ్యక్షుల్ని పెట్టి జరిపించేశారు"

"నిజంగా?" అంది రాణీ

వీర్రాజు రాణీకి రవణయ్య చూడకుండా సంజ్ఞ చేశాడు

"ఇనాగరల్, వెలిడెక్టరీ అల్లా జరిపించి, కాలేజీ మూసేశాక కాలేజీ డే అన్నారా?" అన్నాడు రవణయ్య

"అవునండీ, ఈ మధ్యన కాలేజీ వ్యవహారాలన్నీ ఇలా అస్తవ్యస్తంగానే జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న ఓ కుర్రాడు "నేను పరీక్షకి కూచోలేదు మొర్రో" అంటే యూనివర్సిటీవారు అలా కాదని చెప్పి, వాడి నోరు మూయించి "నువ్వు పేసయ్యావు. పో" అని చెప్పి సెప్టెంబరు ఫలితాలు మార్చిలో ప్రకటించి, అప్పటికి కాన్వొకేషన్ అయిపోయింది కనుక డిగ్రీని పోస్టులో పంపించేశారు. తీరా చూస్తే అది థర్డ్‌క్లాసు ఎమ్మే డిగ్రీ, వాడు చదివిందేమో ఎమ్. ఎస్‌సీ. "బాబోయ్ నాకీ థర్డ్‌క్లాసు ఎమ్మే డిగ్రీ ఎందు కుపయోగిస్తుంది" అని లబోదిబోమంటూ వాడు ఒకటే గోల. సిండికేట్‌కి అప్లికేషన్ పెట్టుకుంటే "ఇచ్చిన డిగ్రీ కేన్సిల్ చెయ్యడం యూనివర్సిటీ ప్రతిష్టకి భంగకరం. అందువల్ల ఆ డిగ్రీ అలాగే అట్టే పెట్టుకో. కావలిస్తే ఈ ఏడాదికి థర్డ్‌క్లాసు వాళ్ళనికూడా సెకండ్‌క్లాసు వాళ్ళతో సమానంగా చూసి ఉద్యోగాలు ఉదారంగా ఇవ్వవలసిందిగా అనుబంధ కళాశాలలకి ఆజ్ఞాపత్రం పంపుతాం అన్నారు."

"పోవయ్యా-నువ్వు మరీ తమాషాగా చెప్తావు" అన్నాడు రవణయ్య నవ్వుతూ.

"నిజం అండీ" అన్నాడు వీర్రాజు అమాయకంగా.

"అది సరే-నువ్వీ ఆటోరిక్షా డ్రైవరు వేషం ఏమిటి?"

"ఆ సంగతే కదాండీ చెప్తున్నా. కాలేజీ డే అని తలొకళ్ళం, తలో ఫ్యాన్సీ డ్రెస్సూ వేశాం. అందులో నేనిది వేశాను."

"మరిల్లా వచ్చేశావేం? ఫంక్షన్ అయిపోయిందా"

"లేదండి తీరా అంతా సిద్ధం అయ్యాక స్టూడెంట్సుకీ స్టాఫ్‌కీ ఒడవాళ్ళ సీట్లు ఏర్పాటు చెయ్యడం దగ్గర తగాదా వచ్చింది లేడీస్ సీట్లు మా ముందు ఉండాలి అంటే మా ముందు ఉండాలి అన్నారు వీళ్ళ తగాదా తీర్చలేక చివరికి మా యూనివర్సిటి కాలేజీ ప్రిన్సిపాలు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలరూ కలిపి ఈ ఏటి కాలేజీడేని, వచ్చే ఏటికి పోస్టుపోన్ చేసి, ప్రస్తుతానికి ఈ సమస్యని ఇలా పరిష్కారం చెయ్యగలిగాం కదా అని ఒకళ్ళనొకళ్ళు అభినందించుకున్నారు"

"ఈ వేషం వెనకాల ఇంతకథ ఉందన్నమాట!"

రవణయ్య ఏ ఉద్దేశంతోటి ఆ మాట అన్నాడో కాని, అది వినడంతో వీర్రాజు గుండె కలుక్కుమంది "ఈ ముసిలాడు అసలు రహస్యం కనుక్కోలేదు కదా కొంపదీసి యూనివర్సిటీకి కూడా వెళ్ళాననటున్నాడు కిరీటిగాడిని కలుసుకున్నాడేమో దుర్మార్గుడు అసలే ఆవలిస్తే పేగులు లెక్కపెట్టేరకం"-ఇలా అనుకొని రాణీకేసి చూశాడు వీర్రాజు, "నువ్వేం చెప్పలేదుకదా" అన్నట్టు ముఖంపెడుతూ "భయంలేదు భక్తా!" అనే అర్థం వచ్చేటట్లు నవ్వింది రాణీ-దాంతో వీర్రాజు గుండెలు కుదుటపడ్డాయి

"కాలేజీల్లో ఇలా ఫేన్సీడ్రెస్‌లు వెయ్యడం ఎందుకో ఇపుడు నాకు అర్థం అయింది" అన్నాడు వీర్రాజు ఏదో మాసి ఆలోచిస్తూ

"ఎందుకుట" అన్నట్లు చూశారు రవణయ్య రాణీను.

"ఎందుకంటే-ఈ బియ్యేలూ ఎమ్మేలూ పేసయి డిగ్రీలు చేత్తోపుచ్చుకుని దేశాటన చెయ్యడం, ఎక్కేగుమ్మం దిగే గుమ్మం అంటూ అన్ని ఆఫీసులూ దర్శించడం, ఇంటర్వ్యూ అనే నాటకంలో ప్రతి అనామకుడూ అడిగే తెలివితక్కువ ప్రశ్నలకి వినయంగా సమాధానం చెప్పడం, ఇలా ఉద్యోగ ప్రయత్నం అనే వైకుంఠపాళీ ఎంత ఓపిగ్గా నువ్వు ఆడినా, ముగింపు దగ్గరకొచ్చి నీ శ్రమ ఫలించబోయేసరికి, ఏ అందమైన అమ్మాయి రూపంలోనో, అమాత్యవర్యుని మేనల్లుడు వేషంలోనో, ఐశ్వర్యవంతుని కుమారుని ఆకారంలోనో, పెద్దపామువచ్చి గుటుక్కున నీకు రావలసిన ఉద్యోగాన్ని కాస్తా తను మింగేస్తుంది. దాంతో ఉద్యోగంలేక, బ్రతుకుతెరువు దొరక్క, నువ్వు మలమల మాడిపోవలసి వస్తుంది అలాంటి ప్రమాదం జరక్కుండా ఉండాలంటే, నీకు అప్పటికే మొలతాళ్ళూ పిన్నీసులూ రిబ్బన్లూ అమ్ముకునే తెలివో, రిక్షాలూ ఆటోరిక్షాలూ

షేక్సీలూ నడపగలిగేనేర్పో వచ్చి ఉండాలి. ఇలాంటివేవో నేర్చుకుంటే ఉద్యోగం లేకపోయినా ఆ వృత్తులు చేసుకుని బ్రతుకవచ్చు. అందువల్ల "నాయనా, కాలేజీలో చదువుకొనే రోజుల్లోనే ఈ వృత్తుల మెళుకువలు నేర్చుకో అని పెద్దలు ఫేన్సీడ్రెస్‌లు ఏర్పాటు చేశారు''-వీర్రాజు మాటలువిని, రాణీ,పైటచెంగు నోటికి అడ్డుపెట్టుకుని నవ్వితే రమణయ్య పగలబడి నవ్వాడు. ఇద్దరూ అలా నవ్వుతుంటే, అతి సీరియస్‌గా నిలబడి ఉన్న వీర్రాజు, జీవితంలో తను ఎదుర్కొన్న భయంకర సత్యం వికటాట్టహాసంతో తనని పరిహాసం చేస్తున్నట్లు ఫీలయి, తన గతచరిత్రా, ప్రస్తుత పరిస్థితీ జ్ఞప్తికివచ్చి, తలవంచుకొని విషాదంగా ఉండిపోయాడు. తనేదో నవ్వులాటకి చెప్పాడనుకుంటున్నారు వీళ్ళు-ఇది తన బ్రతుకులో చవిచూసిన చేదునిజం అని వీళ్ళకేంతెలుసు! హుం! విదూషకుడి కన్నీళ్ళలోకూడా వినోదాన్నే చూసే లోకం ఇది, అనుకున్నాడు.

''అయితే ముందు ముందు పనికొస్తుందని ఈ ఫేన్సీ డ్రెస్ వేశావన్నమాట!'' వస్తూన్న నవ్వుని ఆపుకొంటూ అన్నాడు రమణయ్య. వీర్రాజు ఏం మాట్లాడలేదు. అతని జీవితానికి సంబంధించిన ఒకటి రెండు నిజాల్ని ఇంత క్రితమే తెలుసుకున్న రాణీ మాత్రం, వీర్రాజు ముఖంలో కన్పించిన విషాదరేఖల్ని గమనించి కళవళ పడింది. మాట మార్చడంకోసం ''మావయ్యా నీకు షైరు వెళ్ళవలసిన టైమయింది'' అంది.

రమణయ్య ''అవునవును, వెళ్ళాలి. ఏమయ్యా కిరీటీ! నువ్వు కాస్సేపు కూర్చుంటావా, వస్తావా?'' అంటూ లేచాడు. వీర్రాజు తన ఆలోచనల్లోంచి తేరుకొని, ప్రయత్నపూర్వకంగా నవ్వి ''మొత్తం ముగ్గురం వెళదాం. ఆటో రిక్షా ఉందిగా!''-అన్నాడు

''ఏవిటీ? నువ్వివాళ కొత్తగా ఈ ఫేన్సీ డ్రెస్‌కోసం ప్రాక్టీసు చేసిన ఆ డ్రైవింగ్ ప్రావీణ్యాన్ని నమ్ముకుని నీ ఆటోరిక్షా ఎక్కమన్నా? చాలు చాలు స్వర్గానికి దగ్గరదారి అంతకంటే ఉండదు.''

''అలా భయపడనక్కర్లేదు మావయ్యా - ఆయన ఆటోరిక్షా బాగానే డ్రైవ్ చేస్తారు'' అంది రాణి

''నీ కెలాగ తెలుసు?''

రాణీ ఇబ్బందిలో పడింది. ఎలా చెప్పడం? ఏమని చెప్పడం?

''ఇంతక్రితం ఎప్పుడేనా డ్రైవ్ చేశావేమిటయ్యా?''

వీర్రాజు కొంచెంసేపు తికమకపడి, తర్వాత తేలిగ్గా నవ్వేస్తూ ''నే నింత క్రితం ఆటోరిక్షా నడపాలేదు, రాణీ ఆ రిక్షా ఎక్కాలేదు, అయితే మామూలుగా ొంచెం తెలివితేటలున్నవాడు ఏ విద్యనైనా ఇట్టే గ్రహించేస్తాడుకదా! ఆ దృష్టిలో ాణీ అనేసి ఉంటుంది నన్ను తెలివైనవాడిగా జమ కట్టేసి. ఏం అంతేకమా రాణీ!'' ఃన్నాడు.

"హమ్మయ్య! రక్షించారు!" అని మనస్సులో అనుకొని "అంతే అంతే" అంది రాణి

"కిరీటి తెలివీ, నేర్పూ, సామర్థ్యం - వీటిమీద అంత నమ్మకం నీ కుంటే సరే- బయలుదేరు. అలా టేంక్ బండ్ కేసి వెళ్ళివద్దాం అతని ఆటోరిక్షామీద" అంటూ లేచాడు రవణయ్య.

టేంక్ బండ్ మీద ఉన్న ఒక సిమెంట్ బెంచీ దగ్గరికి నడుస్తూ "నిజమేనయ్యా! మంచి ప్రావీణ్యం ఉన్న డ్రైవరులా నడిపావు ఆటోరిక్షాని. మధ్యలో ఏం ప్రమాదం తీసుకువస్తావో అని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని కూర్చున్నాను ఇంతసేపూ" అన్నాడు రవణయ్య.

వీర్రాజు ఏం సమాధానం చెప్పలేదు. వాళ్ళకి ఎడంగా నడుస్తూ, దూరంలో బోట్ షైరు చేస్తూన్న ఒక నవదంపతులుకేసి కళ్ళప్పగించి చూస్తూన్న రాణిని పరిశీలిస్తూ ఉండిపోయాడు

రాణీ తమ ఇద్దరికీ కొంచెం దూరంలో ఉండడాన్ని గమనించి "మరైతే పరీక్ష లయి పోయాయికదా నువ్వు నరసాపురం వెళ్ళవ్?" అన్నాడు రవణయ్య.

వీర్రాజు పరధ్యానంగా "ఎందుకు?" అన్నాడు

"ఎందుకేవిటయ్యా? మీ అమ్మగారిని చూడాలనీ స్వంత ఊరు వెళ్ళాలనీ లేదా ఏవిటి నీకు?"

"అవు నవును వెళ్ళాలి . వెళ్తాను "

"వెళ్ళబోయేముందు నీతోటి కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. నాతో చెప్పకుండా మాత్రం వెళ్ళకు సుమా."

"అబ్బే ఎందుకు వెళ్తాను? వెళ్ళను అఫ్ కోర్స్ వెళతాననుకోండి మీకోటి చెప్పి వస్తా ఈ ఆటోరిక్షా ఇచ్చెయ్యాలి టైమయిపోయింది" అంటూ, "ఉండ వయ్యా కాస్సేపు ఆగితే అంతా కలిసే వెళ్ళొచ్చు" అంటూన్న రవణయ్య మాటని వినిపించుకోకుండా! ఆటోరిక్షా స్టార్ట్ చేసి రయ్ మని వెళ్ళిపోయాడు వీర్రాజు. "భలే వాడే!" అంటూ తృప్తిగా నిట్టూర్చాడు రవణయ్య. రాణీ మాత్రం బోట్ షైర్ చేస్తూన్న ఆ దంపతుల్ని చూస్తూనే ఉండిపోయింది.

# 12

చుట్టబెట్టిన పక్క బట్టల్ని ఆనుకొని, దాదాపు పడుకున్న భంగిమలో జేర్లాబడి కూర్చుని, దూలాలకేసి చూస్తూ సిగరెట్టు కాలుస్తూ పరధ్యానంగా ఆలోచిస్తూన్న శేఖర్ని చూసేసరికి, వీర్రాజుకి మనస్సులోంచి ఆపుకోలేనంత వెఱ్ఱి బాధ వచ్చేసింది.

''ఒరేయ్ ఏవిట్రా ఇది? నెల్లాళ్ళనుంచి చూస్తున్నాను ఆ పరకా ఆలోచనా ఇంక తెమర్దేమిటి?''

శేఖర్ మాట్లాడలేదు

'' రీక్ష లేమైనా పాడు జేశావా? ఎంత పలకరించినా మాట్లాడవేమిట్రా?''

''నన్ను విసిగించకు ఒరేయ్!''

''నిక్షేపంలా నవ్వుతూ తుళ్ళుతూ సరదాగా ఉండేవాడివి ఏం వచ్చిందిరా నీకి మళ్ళ''

జవాబు లేదు

''ఎన్నాళ్ళయిందిరా నువ్వు నాతో సరదాగా మాట్లాడి?''

వీర్రాజు కంఠంలో వినిపించిన ఆవేదనకి ఉలిక్కిపడి తల తిప్పి చూశాడు శేఖర్.

వీర్రాజు కళ్ళల్లో నీళ్లు

వెంటనే గదిమూలకి సిగరెట్టుని విసిరికొట్టి లేచికూచుంటూ ''ఏమిట్రా అది? ఆడపిల్లలా'' అంటూ కసురుకున్నాడు శేఖర్.

వీర్రాజు మాట్లాడలేదు.

''ఆ కన్నీళ్ళు ఏవిట్రా బుద్ధి లేకపోతేనూ?''

''ఎవరెన్ని కన్నీళ్ళు కార్చినా నీ మనస్సేం కరగదుగ?''

శేఖర్ నీరసంగా నవ్వి ''నా మనస్సు గురించి నీ కంత బెంగ ఎందుకురా?''

''అవున్లే, నీకు నే నేమైనా అన్నగారినా తమ్ముడినా? అధమం కిరీటిలా రూమ్‌మేట్‌ని అయినా కాదాయెను. ఏ సంబంధం లేనివాడిని, నువ్వేమైపోతే నాకేం?''

''ఓరి పిచ్చి సన్నాసి - నే నేం అయిపోవడంలేదురా నువ్వు అనవసరంగా కంగారు పడుతున్నావు కాని''

''అదీ- నేను కంగారు పడుతున్నాను అవునా? ఒరేయ్! ఎందుకురా నా దగ్గర దాచుస్తావు!''

శేఖర్ ఏం మాట్లాడలేదు.

''నేను కనిపెట్టడం లేదనుకున్నావా? ఓ మారు నెలా పదిహేను రోజులనుంచి నువ్వు కడుపునిండా భోజనం చేశావా? కంటినిండా నిద్రపోయావా? ఏ వేళ వచ్చి చూసినా నువ్విలా వెల్లకిలా పడుకొని సిగరెట్టు కాలుస్తూ ఏదో ఆలోచిస్తూ ఉండడం లేదూ? ఏవిట్రా ఇది అంటే పైగా మీదపడి కరుస్తావా? సర్లేరా సరే నువ్వు నన్నంత పరాయివాడిగా చూస్తూ నీకున్న సమస్యేదో నాకు చెప్పకపోతే, నే నే నేమిటి నీకోసం వెఱ్ఱివాడిలా బాధపడేది?''

''వీర్రాజూ!'' అన్నాడు శేఖర్ బొంగురుపోయిన కంఠంతో.

కింది పెదవిని పై పంటితో నొక్కి, వచ్చే కన్నీటిని ఆపుకొంటూ ''ఇన్నాళ్ళ

నుంచీ ప్రాణానికి ప్రాణంగా ఉంటున్నాం మనిద్దరిమధ్యా రహస్యాలు లేవనుకున్నాను ఇద్దరం ఒకటే అనుకున్నాను. అది కాదని ఇవాళ నువ్వు నాకు బుద్ధి చెప్పావు పోన్లేరా పోనీ ' అన్నాడు వీర్రాజు.

ఆ స్థితిలో వీర్రాజుని చూసేసరికి శేఖర్ కదిలిపోయాడు. దగ్గరగా వచ్చి మీద చెయ్యివేసి "ఎందుకురా అలా బాధ పడతావు? నువ్వు తీర్చే సమస్య అయితే నీకు చెప్పకుండా ఉంచునా?" అన్నాడు.

"తీర్చకపోతే ఉధమం అర్థం అయినా చేసుకోలేనా? నా మీద ఆ మాత్రమేనా నమ్మకం లేదా?"

"ఒరేయ్ నువ్వు మరీ సెంటిమెంటల్‌గా తయారవకు"

"అంతకంటే, నీ కేసంగతీ చెప్పనబ్బాయ్ అని ఒక్క మాట చెప్పు చాలు. ఆ తర్వాత నిన్ను మళ్ళీ అడిగితే ఒట్టు"

శేఖర్ తుళ్ళిపడి "బాధ పడకురా. అంతా చెప్తాను సమయం వచ్చినప్పుడు. నీకు చెప్పకపోవడం ఏమిటి? నువ్వూ కిరీటీ తప్ప నాకు మాత్రం ఆప్తు లెవరున్నారు?" అన్నాడు

కాస్సేపు ఆగి దీర్ఘంగా నిట్టూర్చి "సరే- నీ నీ ఇష్టం వచ్చినప్పుడు చెప్పు. మరి నే వస్తా"

"ఉండు. నేనూ నీతో అక్కడిదాకా వచ్చి టీ తాగివస్తా" అంటూ శేఖర్ లేచాడు.

టీ తాగి ఓ అర గంట అటూ ఇటూ తిరిగి రూమ్‌కి చేరుకొనేసరికి, అక్కడ చాలాసేపటినుంచి వేచి ఉన్న మాధురి కనిపించింది శేఖర్‌కి. ఆ సమయంలో అక్కడికి మాధురి రావడాన్ని చూసి విస్తుపోయాడు. ఆమె ఎందుకు వచ్చినట్టు? తనకోసమా? తనకోసం ఎందుకు వస్తుంది తనపట్ల ఆమెకి ఉన్న అభిప్రాయం ఏమిటో ఆ రోజున కేంటీనులోనే తెలిసిపోయిందిగా? ఇంకా ఎందుకు తనకీ ఆశ? శేఖర్ తనలో తనే విషాదంగా నవ్వుకున్నాడు తల వంచుకొని ఆమెని చూడనట్లే ముందుకి నడిచి గది తాళం తెరవబోయాడు శేఖర్.

వెనకనుంచి "ఏమండీ!" అని మాధురి పిలుపు! ఆ కంఠంలోని దైన్యాన్నీ బాధనీ గ్రహించి, తెల్లబోయి ఆ మట్టునే ఆగిపోయాడు శేఖర్.

"మీతో ఒక్క క్షణం మాట్లాడాలి" ప్రార్థిస్తున్నట్లున్నాయి ఆ మాటలు.

తనతోనా? ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు.

మాధురి కళ్ళల్లో పల్చని నీటితెర!

నిర్లక్ష్యంగా ముందుకి వెళ్ళలేక పోయాడు శేఖర్ ఎటో చూస్తూ నిలబడి ఉన్నాడు.

"ఖాళీ చేసుకుని ఒక్క అర గంట ఇంటికి రాగలరా?"

శేఖర్ తుళ్ళిపడ్డాడు. వెటకారంగా అంటోందా? లేకపోతే ఏవిటి? కేంటీను నుంచి అలా విసురుగా వెళ్ళిపోయిన తర్వాత, తనతో ఎప్పుడూ ముఖం విప్పారి మాట్లాడని మనిషి. ఎదురైనా ఏదో వంకని పక్కకి తప్పించుకొని పోయేవ్యక్తి. ఇలా ఇంటికి రమ్మని పిలవడం ఏమిటి?

ఆమెకేసి నిశితంగా చూశాడు శేఖర్.

మాధురి కళ్ళల్లో నీళ్ళు, చూపుల్లో బేలతనం అతని పట్టుదలని సడలించాయి.

"సరే రేపు సాయంత్రం" అన్నాడు అప్రయత్నంగా.

"నిజంగా? మరిచిపోరుకదూ?" అంటూన్నప్పుడు మాధురి కళ్ళు సంతృప్తిగా మెరిశాయి

మర్నాటి సాయంత్రం బయలుదేరే దాకా, సముద్రంలో అలలు లాగ ఎడ తెరపి లేకుండా ఒకటే ఆలోచనలు శేఖర్ మనస్సులో కెరటాలు లాగే ఎవేవో కొత్త కొత్త ఆశలు ఉవ్వెత్తుగా లేచి కింద పడుతున్నాయి. తన అభిప్రాయాన్ని అర్థం చేసుకునీ కూడా ఆరోజున కేంటీన్ తనని మర్యాదగా తిరస్కరించిన వ్యక్తి ఇవాళ ఇలా ఇంటికి ఆహ్వానించడం ఏమిటి? ఆమెలో ఏదైనా మార్పు వచ్చిందా? గతంలో ప్రవర్తనకి పశ్చాత్తాప పడుతోందా? కొత్తగా తనంటే అనురాగం ఏర్పడిందా? అయితే కళ్ళల్లో నీళ్ళెందుకు?

గుమ్మం దగ్గరే ఎదురై 'రండి' అంది మాధురి.

ఆ ఆహ్వానంలో ఏ భావమూలేదు కానయితే చాలా సేపటినుంచి తనకోసం ఆమె వేచి ఉందని మాత్రం గ్రహించాడు శేఖర్.

శేఖర్‌ని సోఫామీద కూర్చోమని, లోపలికివెళ్ళి తనే కాఫీ తెచ్చింది మాధురి. ఆమె తెచ్చుకోలేదు బట్లర్ తెస్తున్నాడేమో అని చూశాడు శేఖర్ అతని అభిప్రాయాన్ని గ్రహించి "నే నిప్పుడే తీసుకున్నాను. మీరు పుచ్చుకోండి" అంది మాధురి.

ఆమె కంఠంలో పూర్వపు చురుకుతనం కాని చిలిపితనం కాని లేదు విషాదంగా సౌమ్యంగాఉన్న కంఠం కొత్తగా వినిపించింది శేఖర్‌కి

నిరాడంబరంగా ఉన్న మాధురి రూపాన్ని చూస్తూ కాఫీ తాగుతున్నాడు శేఖర్.

ఇల్లంతా అతి నిశ్శబ్దంగా ఉంది.

పనివాళ్ళ సందడి కూడా ఏం వినిపించడం లేదు.

"నాన్నగారు ఇంట్లోలేరా?"-ఏదో మాట్లాడాలి కనుక మాట్లాడాను అన్నట్లుంది అతను అడగడం ఆ ప్రశ్నకి ఆమె దగ్గరనుంచి సమాధానాన్ని శేఖర్ ఊహించలేదు.

ఆ ప్రశ్నతో మాధురి హృదయం అంతా కలగిపోయింది, కళ్లనీళ్లతో నిండి పోయాయి బాధతో ముఖం అంతా వాడిపోయింది. అతి కష్టంమీద వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొని "రండి చూపిస్తా" అంటూ పక్కగదిలోకి దారితీసింది.

శేఖర్‌కి ఏం అర్థంకాలేదు మౌనంగా మాధురి వెనకాలే పక్కగదిలోకి నడిచాడు.

అక్కడ:

నరాలు ఉబ్బి, ముఖం జేవురించి, శరీరం అంతా కుష్కించి, కళ్ళు మూసుకుని మంచంమీద అచేతనంగా పడుకొని ఉన్నాడు జగత్పతిరావు. పక్కని స్టూలుమీద ఉన్న మందు సీసాలో, గ్లూకోజు పేకెట్టూ, దగ్గర్లోఉన్న ఐస్‌బేగూ, అతను చాలా రోజుల నుంచి అస్వస్థతగా ఉన్నట్లు చెప్తున్నాయి

"ఏవిటిది? ఎప్పటి నుంచి ?"

"పదిహేను ఇరవై రోజుల నుంచి" — మాధురి కంఠం బొంగురు పోయింది

కొంత సేపయాక, మాధురి వెనక్కితిరిగి మళ్ళీ హాల్లోకి వచ్చేస్తే, చేతుల వెనక్కి పెట్టుకుని ఆమెతోపాటూ తనూ ఇవతలకి వచ్చాడు శేఖర్

చాలా సేపటివరకూ ఎవరూ మాట్లాడలేదు

"ఏమైంది? ఏవిటి జబ్బు?" అన్నాడు శేఖర్.

"హైపర్ టెన్షన్ తీవ్రమైన ఆవేశంవల్ల పట్టలేని ఆందోళనా ఆవేదనావచ్చి రోజుకి నాలుగైదుసార్లు ఇలా స్పృహలేకుండా ఉంటున్నారు"

"ఆవేశం, ఆవేదనానా?" ఆశ్చర్యంగా అడిగాడు శేఖర్.

తను కూర్చున్న సోఫామీద వేలితో ఏవో అర్థంలేని గీతలు గీస్తూ, ఆరోజు కిరీటిమీద జగత్పతిరావు వెఱ్ఱి ఆవేశంతో విరుచుకుపడిన సంగతి కొద్ది కొద్దిగా చెప సాగింది మాధురి, మధ్య మధ్య ఆగుతూ

అంతా విని, "అలాగా? ఈసంగతి నాకింతవరకూ తెలియదే! అందుకవ మాట ఆరోజు కిరీటి అంత హఠాత్తుగా వెళ్ళిపోయాడు ఆఖరి పరీక్ష రాసేసి!" అనుకున్నాడు శేఖర్.

"కిరీటి నన్ను మోసం చేశాడనుకోవడంతో ఆయన మనస్సు బాగా దెబ్బతింది నిజానికి ఇందులో కిరీటినన్ను మోసంచేసింది ఏం లేదు. నన్ను ప్రేమించానని అతను నాతో ఒక్కమాటు అనలేదు. అటువంటప్పుడు అతనా ముసలాయన మేనకోడలి ప్రేమిస్తే ఏం, మరొకర్ని ప్రేమిస్తే ఏం? నన్ను ప్రేమిస్తున్నా డనుకోవడం నిజాని నాదే తప్పు" ఈ మాటలంటున్నప్పుడు మాధురి కంఠం బొంగురు పోయింది,

"కిరీటీ ప్రేమించడమూనా అయ్యోరాత వాడికామాత్రం తెలిస్తే ఇంకే కావాలి?" అనుకొన్నాడు శేఖర్.

"మామూలుగా అయితే మా డాడీ ఆ ముసలాయన చెప్పింది నమ్మి ఉండి పోను. ఈ పుస్తకం కూడా చూపేటప్పటికి " అంటూ మాధురి లేచి వెళ్ళి ఉ మారులో పుస్తకాల వెనకాల దాచి ఉంచిన శృంగార నైషధాన్ని తీసుకువచ్చిం

ఈ పుస్తకాన్ని చూస్తూనే శేఖర్ గతుక్కుమన్నాడు కిరీటిచేత వీర్రాజుకి ఆ పుస్తకాన్ని
లవంతంగా ఇప్పించింది తను. ఆ రోజున కిరీటి అననే అన్నాడు 'ఒరేయ్—ఇక్కడ
నో కిరీటిని ఉండగా వాడి నింకో కిరీటిని చేస్తే అనక కొంపలేం అంటుకుంటాయో.
ని-చివరకి అనుకున్నంతా అయిందన్నమాట. శేఖర్ ఆలోచనలో పడ్డాడు

"నాగురించి కిరీటి అభిప్రాయం ఏమిటో నాకింతవరకూ తెలియదు మా డాడీ
మాత్రం కిరీటి మొదట నన్ను నమ్మించి, తర్వాత ఆ అమ్మాయి నెవర్నో పెళ్ళిచేసుకో
తున్నాడనీ అనుకుంటున్నారు "

శేఖర్ ఇంక అసలు విషయం చెప్పకుండా ఉండలేకపోయాడు అందుకే
ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నవాడు కిరీటికాదు. వీర్రాజు! అసలు జరిగిం
విటంటే " అంటూ మాధురి ఆశ్చర్యపోయింది.

"నిజంగా? అయితే ఈసంగతి డాడీకి ఇప్పుడే చెబుదాం" అంటూ పట్టలేని
త్సాహంతో లేచింది మాధురి

కాని శేఖర్ వెంటనే ఆమెకి వారించాడు. 'న్యూరాలజీ' లో తనకి తెలిపిన
జ్ఞానాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ" అంత హైపర్ టెన్షన్‌లో ఉన్న వ్యక్తికి బాధ కలి
ంచేవి ఎలా చెప్పకూడదో ఆశ్చర్యం, పశ్చాత్తాపం కలిగించే విషయాలు కూడా,
లాగే చెప్పకూడదు. అసలు సంగతి నెమ్మదిగా స్థిమిత పడ్డాక చెప్పవచ్చు. ప్రస్తు
నికి ఆయన బ్లడ్‌ప్రెషర్ తగ్గేపద్ధతి ఆలోచించాలి" అన్నాడు. మాధురి ఏం
ట్లాడలేదు. తలవంచుకొని కూచుంది.

"కిరీటిమీద అలా కేకలు వెయ్యడంతోటే ఆయనకి బ్లడ్‌ప్రెషర్ వచ్చిందా?లేక,
ర్వాత ఇంకేమైనా సంఘటనలు జరిగాయా?"-ఆ ప్రశ్నలో, ఏం జరిగిందో తెలుసుకో
లనే కుతూహలం కంటే, అసలాయనకి ఆ షాక్ ఎందుకు వచ్చిందో వివరంగా
గ్రం చేసుకోబోయే డాక్టర్‌యొక్క ఆదుర్దా, ఎక్కువగా కనిపించింది.

ఆ ప్రశ్నకి మాధురి వెంటనే సమాధానం చెప్పలేదు. కాస్సేపాగి ఆ తర్వాత
ంకేసి చూస్తూ నెమ్మదిగా చెప్పసాగింది. "అఫ్ కోర్స్-ఆ రోజల్లా నమ్మించి మోసం
ాడన్న బాధతో వుండుండి కిరీటి గురించి కోపంగా ఏవేవో అంటూనే వున్నారు ఐతే
కోపం క్రమంగా మర్నాటికి మరో రూపం దాల్చింది "

శేఖర్ "ఏమిటి?" అన్నట్లు చూశాడు.

"మర్నాటినుంచీ" ఇది నాకు తీరని అవమానం. తను తృణీకరించడానికి నా
తురికి ఏం లోటని? తల్చుకున్నానంటే వారం తిరక్కుండా తనని తలదన్నే కుర్రాడిని
ంకువచ్చి నీకు పెళ్ళి చేస్తాను ఏవనుకున్నాడో ఏమో అలా చేస్తేనే వాడికి అర్థం
తుంది వాడు యెంత అదృష్టాన్ని పోగొట్టుకొన్నదీ వెయ్యాలి నీ పెళ్ళి గ్రాండ్‌గా

చెయ్యాలి అప్పుడు కాని మండుతూన్న నా మనస్సు శాంతించదు. అవమానం పొందిన నా హృదయానికి ఊరట వుండదు'' అంటూ మొదలెట్టారు.''

''ఊఁ''

''కాని నేనే ఆ ప్రయత్నాన్ని సాగనివ్వలేదు ఇప్పుడు నా పెళ్ళి ప్రయత్నాలేం చెయ్యొద్దనీ, నేను కొన్నాళ్ళదాకా పెళ్ళి చేసుకోననీ గట్టిగా చెప్పాను కాని, కాని నేనంత దృఢంగా చెప్పి ఆయన ప్రయత్నాన్ని యెదిరించడం వల్లనే ఏమో— డాడీకి ఈ షాక్ ఇలా వచ్చింది''-మాధురి గొంతు జీరబోయింది

''అంటే-ఏం జరిగింది? మీరు కాదన్నాక ఆయన ఏం అన్నారు ''

''ఏం అనలేదు నాకేసి తెల్లబోయి చూసి ఆ మట్టునే కుర్చీలో కూర్చుండి పోయారు. తర్వాత కళ్ళుమూసుకుని వెనక్కి జేర్లబడి చాలాసేపు వుండి తనలో తానేదో అదే పనిగా అనుకోసాగారు ''

''ఆ అనుకున్న దేవిటో చెప్పగలరా?''

''ఆ ఏం వుంది? నాకు తెలుసమ్మా నీకా కిరీటి మీదే మనసుంది వాడేమో నిన్నిలా మోసం చేశాడు నువ్విలా వేదనతో బాధపడుతూంటే చూసి నేనిలా విలవిల్లాడిపోతూ వుండి పోవాలి ..అవునా? నువ్వు పెళ్ళి చేసుకుంటే నీకు నాకూ కొంత ఊరట కలుగుతుంది జరిగింది మరిచి పోవచ్చు కాని నువ్వు చేసుకోవుగా? చేసుకోవు . అంటూ అదే పనిగా అనసాగారు.''

''ఆ తర్వాత స్పృహ గోల్పోయి యిలా పడిపోయారు. అవునా?''

మాధురి మాట్లాడలేదు.

శేఖర్ ఆలోచిస్తూ ''మీరు తాత్కాలికంగానైనా పెళ్ళికి ఒప్పుకొని వుండవలసింది అలాచేసి వుంటే ఆయనకీ మానసికమైన వేదనా బాధా వచ్చి వుండేది కాదు. కావలిస్తే ఆ పెళ్ళి జరక్కుండా కొన్నాళ్లు జాప్యంచేసి, నిర్ణయం అయిన ఆ పెళ్ళి కొడుకుతో సంప్రదించి మీతో కొన్నాళ్లు సహకరించి నటించి, మీ డాడీ కోలుకొన్నాక అసలు సంగతిచెప్పి, ఆ తర్వాత అతణ్ణి తెర వెనక్కి తప్పుకొనే యేర్పాటు చెయ్యవల్సింది అయితే అలా తప్పుకోడానికి ఒప్పుకొనే పెళ్ళికొడుకు దొరకాలి, అది కొంచెం కష్టం'' మాధురి ఆలోచనలో పడింది.

నిజమే' తనకి కిరీటిని తప్ప యింకెవరినీ పెళ్ళి చేసుకోవడం యిష్టంలేదు. ఈ పరిస్థితిలో డాడీ చెవిని అతనిపేరు పడడానికి వీలులేదు అలాగని తను పెళ్ళి సంగతి రానియ్యకుండా యిలాగే వుండిపోతే డాడీ కోలుకొనే యెత్తు కనిపించడంలేదు డాడీకి మామూలు ఆరోగ్యం రావాలంటే, తను అనుకూలుడైన ఒక వరుణ్ణి పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా వున్నట్లు నటించాలి, ఆ వరుడు కూడా ఆ విషయంలో తనతో సహకరించాలి. తమ ఇద్దరి అన్యోన్యతనే చూసి, జరిగినదంతా మరిచిపోయి డాడీ మళ్ళీ మామూలు మనిషి అవుతాడు. అప్పుడు నెమ్మదిగా డాడీకి జరిగిందంతా చెప్పి ఒప్పించి ఆ వరుణ్ణి

కాదని కిరీటిని తాను పెళ్ళాడాలి. ఈ ప్రయత్నంలో తనకి ఏ వుదారుడు తాత్కాలికంగా వరుడుగా నటించి, సహకరిస్తాడు?

ఎంత ఆలోచించినా మాధురికి ఒక మార్గం కన్పించలేదు. మొదట దాడీకి కూడా నచ్చే యోగ్యుడైన వ్యక్తి దొరకాలి కదా! అతను సానుభూతితో తన పరిస్థితిని అర్థం చేసుకోవాలి కదా? చివరకి తనని కిరీటికి అర్పించే త్యాగబుద్ధి చూపించాలి కదా! ఇన్ని యోగ్యతలున్న వ్యక్తి యెవరు దొరుకుతారు? చాలాసేపు ఆలోచించాక కాని మాధురికి ఒక ఆలోచన రాలేదు. వచ్చినా ఆ తర్వాత నిరుత్సాహంతో నిట్టూర్చింది.

కొంచెంసేపు తటపటాయించింది.

చివరకి ఒక నిర్ణయాని కొచ్చింది.

తలెత్తి శేఖర్ వంక చూసింది.

శేఖర్ ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు.

మాధురి తల ఒంచుకొని "మీరు సహ క రి స్తే " అంటూ మాటని మధ్యలోనే ఆపేసింది.

విద్యుద్ఘాతం తగిలినట్లు నిస్తేజుడైపోయి 'ఆ!' అంటూ అర్థంలేని ఒక వెఱ్ఱి అరుపు అరిచాడు శేఖర్

తల యెత్తకుండా యింకా నేలకేసే చూస్తూ "ఈ త్యాగం చెయ్యమని మిమ్మల్ని ప్రార్థించడానికి నాకు అర్హతలేదు కాని కాని" అంటూ నిశ్శబ్దంగా యేడ్చింది, మాధురి.

అతను కాదన్నా, నిర్దాక్షిణ్యంగా తిరస్కరించినా, 'ఏం ఆనాడు నా మనస్సులో అభిప్రాయాన్ని వినకుండా విసురుగా వెళ్ళిపోయావే ఇవాళ ఈ త్యాగానికి నేను కావలసి వచ్చానా' అని అతను అవమాన పరిచినా, అతని దగ్గర్నుంచి ఏ రకమైన సమాధానం వచ్చినా, అందుకు సిద్ధం అయే, అన్నింటికీ కొంగు పట్టడానికి తయారయే, ఆ మాట అంది మాధురి

శేఖర్‌లో చలనం లేదు

ముఖంలో చైతన్యం లేదు

మెదడులో శూన్యత. హృదయంలో స్తబ్దత

నిర్జీవంగా వుండి పోయాడు.

ఎదురుగుండా కన్నీళ్ళతో దోసిలిపట్టి నిలబడ్డ మాధురి!

—(సశేషం)

Edited and Published by V. Leelavathy Raghavaiah, 40/1 Moosasait Street, Madras-600 017 and Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600 001.

## (చివరి భాగం)

త్రను ఒక రోజున హృదయ పూర్వకంగా ప్రేమించిన ఈ మాధురినే ఇవాళ ప్రేమిస్తు
న్నట్లు నటించాలా? తన నిజమైన ప్రేమని ఆమె తృణీకరిస్తే ఆమె. అబద్ధపు ప్రేమని తను అంగీకరించాలా? ఆనాడు తన ప్రార్థనని ఆమె కాదంది ఈనాడు తనూ ఆ పనే చేస్తే?

శేఖర్ ఆమెకేసి చూశాడు.

ఆ ముఖం నిండా దైన్యం. ఆ కళ్ళనిండా ఆవేదన.

ఆమె మళ్ళీ అంది.

"ఈ సహాయం, అయితే మీవల్లే కావాలి. తర్వాత కిరీటిని ఒప్పించి మా ఇద్దర్నీ ఒకటి చెయ్యగల సామర్థ్యం కూడా మీకే వుంది. మీరు కాదంటే, ఇంక నేను మా నాన్నగారి మానసిక క్షోభ తగ్గించడం కోసం యెవర్నో ఒకర్ని విధిగా పెళ్ళాడి తీరాలి. అంటే కిరీటికి శాశ్వతంగా దూరం అయిపోవాలి. నా కోసం కాకపోయినా పోనీ మీ మిత్రుడు కిరీటి కోసమేనా మీరీ త్యాగం చేస్తే ."

మాధురి చెంపల మీదుగా కన్నీళ్ళు కారుతున్నాయి.

తన కేవిటీ పరీక్ష!

నిజంగా తను ఎప్పుడూ మాధురిని ప్రేమించి ఉండకపోతే, జగత్పతిరావుగారు కోలుకోవడం కోసం కొన్నాళ్ళు నటించమంటే నటించవచ్చు. కాని గుండెలనిండా నిజమైన కోరికని దాచుకొని, పైకి అబద్ధంగా నటిస్తూ బ్రతకడం ఎంత కష్టం —ఎంత క్షోభ! అనుక్షణం ఈ నిజం అబద్ధాలమధ్య జరిగే పోరాటానికి తను తట్టుకోగలడా? అసలింతకీ తను ఎందుకు చెయ్యాలీ అర్థంలేని త్యాగం?"

"ఈ ఉపకారం చెయ్యలేరా మీరు?" కళ్ళు తుడుచుకుంటూ ఆఖరుసారిగా అడిగింది మాధురి

ఆ మాటలో మండుతూన్న గుండెలు అరిచిన ఆవేదన.

కాలిపోతూన్న జీవితం చేసిన ఆక్రోశం.

దైన్యం అంతా కరడుకట్టి జాలిగా క్షోభించిన ఆరాటం.

శేఖర్ "సరే" అన్నాడు నెమ్మదిగా.

"నిజంగానా? మీరు అంగీకరించారా?" అంది మాధురి ఉత్సాహంగా.

ఆ ఉత్సాహం వెనక ఆపుకోలేనంత దుఃఖం.

అంతు లేనంత దిగులు.

మనస్సు ముక్కచెక్క లవుతూంటే, బరువు తీరేలాగ ఏడ్చే ధైర్యం లేక, ఉత్సాహంగా వేసిన వెఱ్ఱికేక అది.

కాస్సేపు మౌనంగా కూర్చున్నాక, ఇంక శేఖర్ లేవబోతూంటే పక్క గది లోంచి దగ్గు వినిపించింది.

"మీ నాన్నగారు లేచినట్లున్నారు" అన్నాడు శేఖర్.

"ఆ దగ్గు డాడీదికాదు. బావాజీది."

"బావాజీ? ఆయ నెవరు?"

మాధురి నాలిక కరుచుకుంది. బావాజీ సంగతి బైట ఎవరికీ తెలియకూడదని కట్టడి చేశాడు డాడీ—రెండు పూటలా ఆ గదిలోకి అన్నం పట్టికెళ్లే బట్లర్‌కి తప్ప ఇంట్లో నౌకర్లెవ్వరికీ తెలియదు ఆ గదిలో ఎవరుంటున్నదీ—అసలా ఛాయలకే ఎవరూ వెళ్ళడానికి వీలులేదు—ఇలా ఇంత రహస్యంగా ఉన్న బావాజీ సంగతి తను అనుకో కుండా ఇప్పుడు శేఖర్‌కి చెప్పేసింది. అందుకే జరిగిన పొరబాటుకి నాలుక కరుచు కొంది మాధురి.

మాధురి అలా ఎందుకు తొట్రుపడిందో అర్థం కాలేదు శేఖర్‌కి. "సరే - వెళ్ళి వస్తాను" అంటూ అడుగు కదిపాడే కాని, శేఖర్ మనస్సులో బావాజీ ప్రశ్నార్థకం గానే మిగిలిపోయాడు.

# 13

"నీమాట నే నెప్పుడు కాదన్నాను అత్తయ్యా" అన్నాడు కిరీటి తలవంచుకొని పాదాలకేసి చూసుకుంటూ.

దాంతో సువర్చల ముఖం ఆనందంతో విప్పారింది. "నాకుతెలుసు నువ్వు నామాటెప్పుడూ కాదనవు. నా భయం అల్లా జయ గురించే-పైగా ఈ మధ్యన అది బొత్తిగా చెప్పినమాట వినడంమానేసి నువ్వెంతంటే నువ్వెంత అనేలా తయారయింది." అంది

కిరీటి ఆమాట విని ఆశ్చర్యంగా తలెత్తిచూసి వెంటనే తేలిగ్గా నవ్వేసి "నీచాదస్తం కాని జయ మాత్రం ఎందుకు వినదూ?" అన్నాడు.

"అలా అనకు. అదిప్పుడు పూర్వపు జయకాదు. నామాట అబద్ధం అయితే దాన్నిప్పుడు పిలిచి నీ ఎదురుగానే అడుగుతాను. ఏం సమాధానం ఇస్తుందో విందువు గాని" అంటూ "జయా! ..విన్నే . ఓమాటిలారా" అంటూ పిలిచింది సువర్చల

"చదువుతూన్న కథల పత్రికని ఆ మట్టునే చేత్తో మడిచి పట్టుకుని విసుక్కుంటూ వచ్చి "ఏం?" అంది జయ.

"ఏం చేస్తున్నావు?"

సువర్చల ప్రశ్నకి జయ జవాబు చెప్పలేదు.

"మాట్లాడితే ఇదొహటి! మంచం నడుం ఎక్కి కూర్చోవడం మాసపత్రికలూ వారపత్రికలూ తిరగెయ్యడం, అర్థంలేని కథ ఒకటి దొరికితే చాలు అన్నం కూడా

అక్కర్లేదు. ఇప్పటి పిల్లలకి!'' అంది సువర్చల జయ చేతిలోవున్న పత్రికకేసి చిరాగ్గా చూస్తూ.

''ఇప్పుడింతకీ ఎందుకు పిల్చావు?''

''ఎందుకా? కూచో చెప్తాను 'నీ మాటకాదనను అత్తయ్యా' అన్నాడు కిరీటి. నువ్వు కూడా నాకా భరోసా ఇస్తేనా ..''

''ఏ విషయంలో? ఏ సందర్భంలో?''

''తర్వాత చెప్తాను. ముందు మాటియ్యి నువ్వు చెప్పింది కాదననని.''

''ఆ చెప్పేదేవిటో తెలియకుండా ముందెలాగ మాటియ్యడం?''

''చూశావా కిరీటీ! నీకూ దానికీ వున్న తేడా అది'' అంది సువర్చల నిట్టూరుస్తూ.

కిరీటి కంగారుగా ''నువ్వు బాధపడకు అత్తయ్యా జయ కూడా నీమాట కాదనదు. ఆ మాటచెప్పు జయా! అత్తయ్య ఏం చెబుతుందో అని నీకు అనుమానం ఎందుకు? ఏం చెప్పినా మన శ్రేయస్సుకోరే కదా?'' అన్నాడు.

జయ మాట్లాడలేదు.

''మనని ఇంతగా పెంచి పెద్దచేసిన ఆ అత్తయ్యంటే నీకు అభిమానం ప్రేమాలేవా?''

''ఉంటే? షరతులులేని దస్తావేజుమీద దస్కతు చెయ్యాలా? ప్రేమ వేరు, ప్రమాణాలు చెయ్యడం వేరూను'' అంది జయ దృఢమైన కంఠంతో.

ఆమె మాటలకి సువర్చలా కిరీటీ ఇద్దరూ గతుక్కుమన్నారు. కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

''ఇంతకీ నువ్వు పిలిచింది ఎందుకో చెప్తావా వెళ్ళిపోమంటావా'' అంది జయ చిరాగ్గా.

సువర్చల జయని నఖశిఖ పర్యంతం నిశితంగా చూసి ''క్రూరపిల్లవి. నీతోనాకేవిటి గానీ. చెప్తావిను. కిరీటి చదువా అయిపోయింది. ఇవాళో రేపో ఉద్యోగం వస్తుంది ఎక్కడో అక్కడ. ఈలోగా పెళ్ళిచేసేస్తే ..'' అంటూ మధ్యలో ఆగింది.

'ఇదా అత్తయ్య చెప్పదలుచుకున్న విషయం! ఇందుకన్నమాట ముందు నేను చెప్పినట్టు వింటావా అని అడిగింది.' అనుకున్నాడు కిరీటి.

జయ వెటకారంగా నవ్వి ''చేసెయ్యి. ఆ సంగతి నాకుచెప్పడం ఎందుకు?'' అంది.

''ఎందుకా? ఇందులో నీకు కూడా సంబంధంవుంది కనకే చెప్తున్నాను. కిరీటి పెళ్ళి ఎవరితోటో అయే మాటయితే నీకు చెప్పడం ఎందుకు?''

''అంటే?''

''ఇంకా విడమరిచి చెప్పాలా?''

''నేను చచ్చినా నీ మేనల్లుడిని చేసుకోనని ఇంతక్రితం ఎన్నిమార్లో చెప్పాను.''

''ఏవిటే ...వాడు నా మేనల్లుడేనా? నీ బావకాదూ?''

"అయితే? పెళ్ళిచేసుకోవాలని ఉందా?"

''అలాంటి మొగుడు నీకు దొరకొద్దూ?''

"అవునవును. స్వంతంగా ఏం ఆలోచించలేక ఎవరేది చెబితే అలాగే తలాడించే బుద్ధావతారం దొరకడం కష్టమేమరి'' వెటకారంగా కిరీటికేసి చూస్తూ అంది జయ.

తన మొహంమీద ఆమాట అన్నందుకు కిరీటి మనస్సు కించపడింది. ఇంతక్రితం ఎన్నిమాట్లో జయ తనని ఈసడించింది. పరోక్షంగా అవమానపరిచింది. తను ఎంతో ఆసక్తితో ఏదైనా చెప్పబోతే వినకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోవడమో, వింటే తేలిగ్గా నవ్వేసి ''ఓస్-ఇదా'' అనడమో చేసేది. అప్యాయంగా పలకరించబోతే కోపంతో విసిరికొట్టేది. ఇలా ఎన్నిమాట్లు ఎలా ప్రవర్తించినా అంతగా మనస్సుకి పట్టించుకోకుండా "ఏదో విసుగులో వుందికాబోలు. పోనిద్దూ'' అంటూ సరిపెట్టుకుంటూ వచ్చాడు. మళ్ళీ మామూలుగా మేనత్త కూతురనే అభిమానాన్ని పెంచుకుని ఆత్మీయంగా చూస్తూనే వున్నాడు. ఈ చీదరింపూ ఛీత్కారం మరీ రెండు మూడేళ్ళనుంచి ఎక్కువైంది. ఇలా అనుకుంటూ మొహం చిన్నబుచ్చుకొని ఎటో చూస్తూ వుండి పోయాడు కిరీటి.

అతని మొహంచూస్తే సువర్చలకి జాలేసింది. ఆజాలి జయపట్ల పట్టలేని కోపంగామారింది. కళ్ళు పెద్దవిచేసి కోపంతో దవళ్లు కదిలిపోతూంటే, జయమీదకి చెయ్యి ఎత్తుతూ ''ఏవిటే ఏవిటన్నావు? వాడు బుద్ధావతారమా?'' అంటూలేచింది.

ఆ కోపంలో సువర్చల ఆడపులిలా కనిపించింది.

ఆమె ముఖం మండుతూన్న కొలిమిలా వుంది.

కళ్లు ప్రాణంతీసె కత్తుల్లా వున్నాయి.

ఎత్తిన చెయ్యి నెత్తిని పడబోతూన్న పిడుగులా భయంకరంగావుంది.

ఎప్పుడూ సువర్చలని ఆరూపంలో చూడలేదేమో, గుండె చెదిరిపోయే ఆరూపం చూసి, భయంతో కెవ్వున అరిచి, ఆ తర్వాత నోటమాటలేక, నిలువుగుడ్లు పడిపోయి, ఆ మట్టునే వుండి పోయింది జయ.

జయ పరిస్థితి చూసేటప్పటికి కిరీటి కంగారుపడ్డాడు. కోపంతగ్గి ఏంజరిగిందో అర్థంచేసుకొనేసరికి, సువర్చలా కంగారుపడింది.

నేలమీదికి ఒరిగిపోతూన్న జయని పొదివి పట్టుకున్నాడు కిరీటి. కిరీటికి సువర్చల సాయంచేసింది ఇద్దరూ కలిపి జయని మంచంమీద పడుకోబెట్టారు. కిరీటి గ్లాసుడు నీళ్ళయితే పట్టుకొచ్చి జయ ముఖంమీద జల్లాడు. సువర్చల పక్కన కూర్చుని విసురుతూ కళ్ళనీళ్ళు పెట్టుకోసాగింది అదిచూసి ''అదేవిటి అత్తయ్యా. నువ్వు మరీను. కళ్లు తిరిగినట్లున్నాయి. కాస్సేపట్లో అదే సర్దుకుంటుంది'' అన్నాడు కిరీటి ధైర్యంచెబుతూ.

పైటతో కళ్లుతుడుచుకుంటూ ''నాది దురదృష్ట జాతకం కిరీటీ! నా కెప్పుడో కాని కోపంరాదు. వచ్చినప్పుడు ఇలాగే ప్రళయంలావస్తుంది ఓమారు వచ్చి నా

అదృష్టాన్నీ ఆనందాన్నీ పోగొట్టుకున్నాను. ఆ తర్వాత ఒకమారు నువ్వు పైకి ఎగరేసిన ఇనపముక్క వచ్చి పక్కింటి వారి అబ్బాయి తలమీదపడి "మీ కిరీటి మా అబ్బాయిని చంపేశాడో" అంటూ ఆవిడవచ్చి పెద్దరగడచేస్తే ఆకోపంతో వళ్లుతెలియక నీ వీపుమీద పేక బెత్తంతో పిచ్చిగా కొట్టేసి, శాశ్వతంగా నీలో చురుకుతనాన్ని చంపేశాను. లేక పోతే ఎంత చలాకీగావుండే కుర్రాడివని నువ్వు! ఆ తర్వాత కోపం తెచ్చుకోకూడదని ఒట్టుపెట్టుకున్నాను. అందుకే జయ ఎలా పెరిగితే అలా పెరగనిచ్చాను. కాని ఇవాళ అది నిన్ను అలా అవమానపరిచేసరికి కోపం ఆపుకోలేక " నోటికి గుప్పెళ్ళు అడ్డం పెట్టుకుని మౌనంగా ఏడ్చింది సువర్చల.

"బాధపడకు అత్తయ్యా. జయకేం కాదు. కాస్సేపట్లో కళ్లుతెరుస్తుంది."

"కాదు నాయనా-నాకేదో భయంగావుంది, కదలకుండా జయ అలాపడుకొనివుంటే నేను చూడలేను ఏమైందో, డాక్టర్ని ఓమారు తీసుకురా."

"ఏం అవసరంలేదు."

"అలా అనకు-నేను ఎందుకు చెప్పానో వెళ్లు ఊ."

"సరే అయితే"—

డాక్టరువచ్చి జరిగిందంతా విని, జయని పరీక్షించి, ఇంజక్షను ఇచ్చి, రియాక్షను ఎలా వుంటుందో అని కాస్సేపు అక్కడే కూచున్నాడు.

ఒంటినిండా పైట కప్పుకొని గడప అవతల నిలబడ్డ సువర్చల "ఏమండీ-ఎలా వుంది. అమ్మాయికి?" అంటూ అడిగింది గద్గద స్వరంతో.

"ఏం ఫర్వాలేదండి-కొంచెంసేపట్లో కళ్ళు తెరుస్తుంది. కొంచెం బలాన్నిచ్చే పాలూ హార్లిక్సులాంటివి ఇవ్వండి. కొన్నాళ్ళదాకా అయిష్టం అయిన మాటలు మాత్రం అమ్మాయి దగ్గర అనకండి."

"ఏం అనంలెండి" అంటూ సువర్చల తరపున కిరీటి హామీ ఇచ్చాడు.

"అమ్మాయికి ఇంతక్రితం ఎప్పుడేనా ఇలా వచ్చిందా?"

"లేదండి" అంది సువర్చల.

"పోనీ నెర్వస్‌గా వుండేదా?" అన్నాడు డాక్టరు.

అంటే ఏవిటో అర్ధంకాలేదు సువర్చలకి.

"ఏమాత్రం మాట అన్నా పడకపోవడం, ప్రతి చిన్న విషయానికీ వుద్రేకం కోపంతెచ్చుకోవడం, ఆవేశాన్ని ఆపుకోలేకపోవడం "

"ఆ...అందుకేం లోటు లేదు" అన్నాడు కిరీటి పాతవన్నీ జ్ఞాపకం తెచ్చు కుంటూ.

"అయితే కొన్నాళ్లు ఆవేశంకానీ కోపంకానీ రాకుండా చూడండి అమ్మాయికి"

ఇంతలో జయ నీరసంగా కళ్లుతెరిచింది.

సువర్చల కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"సాయంత్రం మళ్ళీ వస్తాను" అంటూ డాక్టరు వెళ్ళిపోయాడు, జయని ఇంకో మ్మారు పరీక్షించి తృప్తిగా తలపంకిస్తూ—

జయకి వైద్యం జాగ్రత్తగానే చేయిస్తున్నారు. డాక్టరు చెప్పినప్రకారం మందులు వాడుతూనే వున్నారు మనస్సుకి నొప్పికలిగించే ప్రస్తావన తేవడంలేదు. అన్ని విధాలా జయకి ఆరోగ్యం చేకూరడానికే ప్రయత్నం చేస్తున్నారు కిరీటి సువర్చలాను.

కాని అదే చేకూరడంలేదు.

రోజు రోజుకీ నీరసపడుతోంది కాని బలం ఏర్పడడంలేదు.

రెండేసి రోజులకోమారు పిచ్చిగా అరిచి స్పృహతప్పి పడిపోవడం, డాక్టరువచ్చి ఇంజక్షన్ ఇచ్చాక కళ్ళు తెరిచి చూడడం. చూసినా ఎవరితోనూ మాట్లాడకపోవడం. కిరీటినీ, సువర్చలనీ కొత్తవాళ్ళనీ, పరాయివాళ్ళనీ చూసినట్లు చూడడం.

వారాలు నెలలు గడుస్తున్నాయి.

కాని రోగం మళ్ళ ముఖంపట్టలేదు.

సువర్చల తప్పుచేసిన దానిలా లోపల్లోపల కుమిలి ఏడుస్తోంది.

కిరీటికి ఏం చెయ్యడానికీ పాలుపోవడంలేదు.

అత్తయ్య వేదనని చూడలేకపోతున్నాడు.

జయ మామూలు ఆరోగ్యవంతురాలు కావడం ఎలా?

ఈ డాక్టరువల్ల నయంకాదా?

ఆలోచిస్తూ జయ మంచం దగ్గర కూర్చున్న కిరీటిని పూట పూటా 'అన్నానికి లేవమ'ని సువర్చల హెచ్చరించవలసి వస్తోంది. కిరీటి నాలుగు మెతుకులేనా నోట్లో వేసుకుంటున్నాడు. సువర్చల నోటికి అసలు అన్నమే పోవడంలేదు.

ఓరోజున జయ మంచందగ్గర కిరీటి ఒక్కడే కూర్చుని వున్నాడు. పనులన్నీ పూర్తిచేసుకొని సువర్చల పెరట్లో పారిజాతం దగ్గర కూర్చుంది. వీలు చిక్కినప్పుడూ మనస్సు బాగుండనప్పుడూ అలా కూచోడం ఆమెకి అలవాటు దెబ్బతిన్న తన జీవితానికీ, పోగొట్టుకొన్న ఆనందానికీ, ప్రాణం విలవిల్లాడి పోతూంటే, పదిహేను పద్దెనిమిదేళ్ళక్రితం, తన మనస్సులో ఏ మూలోవున్న ఆశకి ప్రతీకగా నాటిన పారిజాతం అది. అది ఏపుగా పెరుగుతూంటే, పరిమళాలతో నిండిన పువ్వుల్ని అది తెల్లారేటప్పటికి వాకిటనిండా పరుస్తూవుంటే, ఎప్పటికేనా తన జీవితం కూడా అలా పారిజాత పరిమళాలతో నిండుతుంది అనే ఆశ మనస్సులో మారాకు వేస్తూవుంటుంది. గతస్మృతుల్ని తలుచుకుంటూ గాలికి ఊగుతూన్న పారిజాతాన్ని వింతగా చూస్తూ పరధ్యాన్నంగా కూర్చుంది సువర్చల.

జయకి సమీపంలో కూర్చున్న కిరీటి మనస్సులో ఏవో ఆలోచనలు. ఏవేవో జ్ఞాపకాలు.

జయ తనని ఈసడిస్తుంది కాని మాధురి ఇలాకాదు. తనంటే ఎంతో అభిమానం అప్యాయతాను. మధ్య మధ్య ఏదో చిలిపిగా వేళాకోళంచేసినా ఎప్పుడూ ఇలా అవమాన పరచలేదు. శేఖర్ వీర్రాజూ కలిసి తనని ఏడిపించబోయి నప్పుడల్లా అడ్డుకొని తన తరపున నిలబడేది. తనంటే ప్రాణంగా వుండేది కనకే తనకి కూడా మాధురి అంటే అదోరకమైన ఇష్టం. అలాంటిది ఆరోజున, ఆఖరి పరీక్షరాసిన రోజున అలా ఎందుకు ప్రవర్తించింది? నౌకర్ల చేత తనని బయటకి గెంటించి తలుపు వేయించింది? తనని ఎందు కలా అవమాన పరచాలి? తనేం చేశాడని? ఆ జగత్పతిరావుగారు మాత్రం? పనిమాలా యూనివర్సిటీకివచ్చి తనని ఇంటికి రావలసిందని ప్రొఫెసర్‌గారి ద్వారా కబురుచేసిన పెద్ద మనిషి, తీరా ఇంటికివస్తే, కాలుస్తాను అంటూ గన్ తీస్తాడా? ఏమిటీ అన్యాయం, అర్థం లేనికోపమూను? తండ్రీ కూతురు కలిసి తననలా అకారణంగా అవమానపర్చడందేనికి? అవున్లే మంచివాళ్ళంటే ప్రతిమనిషికీ లోకువే-గడుసుదనంలేని వాళ్లంటే మరీను. శేఖర్‌ని ఇలా అవమానపరచమను చూద్దాం. గట్టిగా జవాబుచెప్తాడు. అయినా వాళ్ళననవలసిన పనేం వుందిలే. తక్కువగా కనిపించిన వాడినల్లా తొక్కిపడేసే లోకం ఇది. అలా కనిపించడం తనదే తప్పు. జయ అంది కాని నిజంగా తను బుద్ధావతారమే। అందుకే జగత్పతిరావుగారూ మాధురీ తనని అవమానించారు. ఆయనసరే-పిచ్చివాడు. ఎప్పు డెలా వుంటాడో తెలియదు. ఆగ్రహం వచ్చినా అనుగ్రహం వచ్చినా పట్టలేం మాధురి ఎందుకలా అయింది చెప్మా?...వాళ్లిద్దరి మీదా కోపంతో మనస్సంతా వికలం అయి పోయి ఆరోజున రెండురోజులు వుండరా అని శేఖర్ ఎంత బతిమాలుతున్నా వినకుండా తను బయల్దేరి వచ్చేశాడు. శేఖర్ ఏమనుకున్నాడో ఏమో-పాపం వాడిమధ్యన ఎందుకో మరీడల్‌గా తయారయ్యాడు. పరీక్షలు ఎలారాశాడో-శలవలకి ఇంటికి వెళ్ళాడో అక్కడే ఉన్నాడో! ఒక్కమాటు వెళ్లి వాడినిచూస్తే బాగుణ్ణు. తన బాగుకోరినవాడూ, మనస్సా తనని అభిమానించేవాడూ అతనొక్కడే-ఒకమాటు ఎలాగేనా శేఖర్‌ని చూస్తే బాగుండును.

ఇలా ఆలోచిస్తూ యధాలాపంగా తల తిప్పి జయకేసి చూశాడు కిరీటి.

ఎప్పుడు తెరిచిందో జయ కళ్లుతెరిచింది.

ఎప్పటినుంచి చూస్తోందో ఏమో తనవేపే గుడ్లప్పగించి చూస్తోంది.

కిరీటి కంగారుగా ఆలోచనలోంచి తేరుకొని "ఏంకావాలి జయా? పళ్ళరసం తీసుకురానా? తాగుతావా?" అన్నాడు. ఆ కంఠంలో జాలితప్ప మరేభావంలేదు. జయ అతనికేసి అలాగే పరిశీలనగా చూస్తోంది. ఈ నెల్లాళ్ళనుంచీ తనకి ఎంతో సేవచేస్తు న్నాడు. ఒక్కక్షణం వదలడంలేదు. తనంటే ఎందుకింత అప్యాయత? నిజానికి తనంటే అసహ్యం, కోపంవుండాలి. అలాంటిది ఏమిటిది?

"ఎందుకు నీకీశ్రమ?" అంది జయ నీరసంగా.

"శ్రమేమిటి?"

''నేనంటే నీకు కోపంగాలేదూ?''

''ఎందుకు?''

పెసరపప్పు, గంగిరెద్దు, బుద్ధావతారం అంటూ ఈసడించుకొన్నందుకు-అని అందాం అనుకొంది జయ, కాని నిష్కల్మషం అయిన కిరీటి మొహం చూస్తే మళ్ళీ ఆమాటలు అని, అతని మనస్సు నొప్పించలేకపోయింది. ఒక్కమాటు తనలోతను నిట్టూర్చి నీరసంగా మూలిగింది.

''ఏం బాధగా వుందా?''

ఆ కంఠంలో ఎంత ఆప్యాయత!

''డాక్టరు గారిని తీసుకురానా?

వెఱ్ఱివాడా డాక్టరేం తీసెయ్యగలడు నాబాధ?

''ఎలావుంది జయా?''

ఎందుకింత అభిమానం నేనంటే.

''ఏవిటలా చూస్తావు? ఏం కావాలి?''

ఏంకావలిస్తే మాత్రం నీవల్లేం అవుతుంది?

''మందు తాగుతావా? రసం ఇవ్వనా?'.

నీ మనస్సులో ఇంతప్రేమ వుందా బావా నేనంటే.

''చెప్పు జయా.''

ఏం చెప్పమంటావు? నీ అభిమానం చూస్తూంటే నాకు ఏడుపువస్తోంది.

''నాతో మాట్లాడవా?''

నీలాంటి మంచివాడిని ప్రేమించగలిగితే ఎంత బాగుంటును! నన్నింత ఆత్మీయతతో చూసే మనిషిని నేను అనురాగంతో చూడలేకపోవడం నా దురదృష్టం.

''కోపమా నేనంటే?''

అయ్యో పిచ్చిబావా!

జయ కంటి చివరలనుంచి కారిన కన్నీటిని చూసి కిరీటి కంగారుగా, పైమీదవున్న తువ్వాలుతో ఒత్తి ''ఛ ఏవిటిది? .డాక్టరుగారు ఏమన్నారో తెలుసా? ఇలా బాధ పడుతూవుంటే ఆరోగ్యం చప్పుని కుదుటపడదన్నారు?' అన్నాడు.

జయ నీరసంగా నవ్వింది. ఆ నవ్వులో ప్రాణంలేదు.

''నాలుగు రోజులు అలా నవ్వుతూ వున్నావంటే ఎక్కడి జబ్బు అక్కడికి పోతుంది.''

నీరసంగావున్న జయ కళ్ళు ఒక్కమారు మెరిశాయి. ముఖంలోకి ఒక కొత్త వుత్సాహాన్ని తెచ్చుకొని నవ్వుతూ, ''ఊ....జబ్బు నయం అయితే. .'' అంది.

''నయం అయితే ''

"నన్ను పెళ్ళిచేసుకోవచ్చు నువ్వు. అవునా?" కొంటెగా చూస్తూ అంది జయ.

కిరీటి తొట్రుపడి "అబ్బెబ్బే ఉహుఁ అదేంకాదు ..." అన్నాడు.

"నాకీ పెళ్ళి ఇష్టంలేదు అన్నాననేకదా నీకూ కోపంవచ్చింది?"

"అబ్బే నాకేం కోపంరాలేదు."

"నిజంగా?"

"ఒట్టు జయా నామాట నమ్ము. అత్తయ్య బాధపడింది కాని నేనేం అది మనస్సులో పెట్టుకోలేదు."

"అయితే నిన్ను నేను పెళ్లిచేసుకోపోతే నువ్వేం బాధపడవు. అవునా!"

"కాని అత్తయ్య "

"మనిద్దరికీ ఇష్టంలేనప్పుడు అత్తయ్యేంచేస్తుంది?"

కిరీటి ఏం మాట్లాడలేదు.

"ఊఁ సరే .మనపెళ్ళి నాకిష్టంలేదు. నన్నే పెళ్ళిచేసుకోవాలని నీకూ పట్టుదల లేదు. ఇంక సమస్యేం వుంది? మనిద్దరం కలిసి పిన్నికి చెప్పేస్తేసరి."

"హమ్మో."

జయకి ఈమారు నిజంగా నవ్వువచ్చింది.

"ఎంత పిరికివాడివి బావా నువ్వు? పిన్నికి కోపంవస్తుందని, ఇష్టంలేకపోయినా నన్ను పెళ్ళిచేసుకోడానికి సిద్ధపడతావా?"

"అదికాదు జయా!"

"నీకేం తెలియదు. నువ్వలా ఊరుకో. నీ మనస్సులోవున్న అభిప్రాయం ఇప్పుడు చెప్పావు కదా! ఇన్నాళ్ళూ నువ్వుకూడా పిన్నితోపాటే అనుకుని ఇద్దరి మీదా బలే కోపంగా వుంటూవచ్చిందినాకు. ఇంక నువ్వు నా పార్టీ అయిపోయావు. నాకేం భయంలేదు. పిన్నిని ఎలా ఒప్పించాలో నేను చూసుకుంటాను "

"అత్తయ్య ఒప్పుకుంటే సరే " అన్నాడు కిరీటి గోళ్లు చూసుకుంటూ.

"పిచ్చిబావా!" అంటూ జాలిగా కిరీటి తలమీద చెయ్యివేసి చిలిపిగా అతనిక్రాపు చెరిపేసింది. జయ తనజుట్టు అలా చిందరవందరచేస్తూంటే. తల దువ్వించుకోవడం కోసం తల్లిచేతికి జుట్టు ఇచ్చి కదలకుండా కూచున్న మంచిపిల్లవాడిలాగ ఆ మట్టునే కూర్చున్నాడు కిరీటి. అతని తలనిమురుతూన్న జయకి వళ్ళంతా ఒక్కమారు పులకించింది. "కిరీటి బావ ఎంతమంచివాడు! ఇలాంటివాడి నా పెళ్లిచెసుకోనని తను తృణీకరిస్తున్నది!"—జయ మనస్సులో కల్లోలం రేగింది. నిజానికి బావలాంటి దేవుడు తనకి దొరకడు. పిన్నిచెప్పింది నిజమే-కాని తనకి ఏమిటో అతనంటే మనస్సు పోవడం లేదు. చలాకీగా చురుగ్గావుండే గడుసువాడు భర్త అయితే ఆనందంకాని ఇలా మెత్తగా అడదానికంటే సున్నితం అయిన హృదయం వున్నవాడు మొగుడేమిటి?

జయ కళ్ళుమూసుకొని ఆలోచిస్తోంది

ఆమె చేతివేళ్ళు ఇంకా కిరీటి జుట్టుతోనే ఆడుకుంటున్నాయి.

అయిదారేళ్ల పెద్దవాడైన కిరీటి, అయిదేళ్ల పసివాడిలాగ, జయచేతికి జుట్టు ఇచ్చి ఆమె మంచం పక్కనున్న స్టూలుమీద ఒదిగి కూర్చున్నాడు.

ఇలా జయా కిరీటి ఎవరిలోకంలో వాళ్ళున్న సమయంలో, సువర్చల అక్కడికి వచ్చి ఆ దృశ్యం చూసి, సంభ్రమాశ్చర్యాలతో తొట్రుపడి "హమ్మయ్య ఈ సమస్య ఇలా తీరింది. ఇంక జయకి ఆరోగ్యం కుదుటపడితే ముహూర్తం పెట్టించెయ్యొచ్చు" అనుకుంది. సంతోషంవల్ల చెమర్చిన కళ్ళని ఒత్తుకుంటూ, పక్కగదిలోవున్న వెంకటేశ్వరస్వామి ఫొటో దగ్గిరికి వెళ్ళింది.మనస్సా ఆ దేవదేవుడికి నమస్కారం చెయ్యడం కోసం.

ఆరోజు జయకి కొద్దిగా అన్నం సహించింది.

రాత్రి నిద్దరాపట్టింది.

రోజూలాగ నరాలు వణికి స్పృహ కోల్పోలేదు.

డాక్టరు కూడా "ఫరవాలేదు. త్వరలో పూర్తి ఆరోగ్యం చేకూరుతుంది" అన్నాడు.

మబ్బువిడి ఆకాశం నిర్మలంగా మారుతూన్న సంతోషంలో మర్నాడు "కిరీటీ—ఇంక నాకు బెంగతీరిపోయింది. నీచేత జయకి ఆ మూడుముళ్ళూ వేయించేస్తినా ఇంక నేను కృష్ణా రామా అనుకుంటూ ఎక్కడున్నా ఎలా వున్నా ఫరవాలేదు." అంది సువర్చల.

ఆ మాటవిని గతుక్కుమన్నాడు కిరీటి.

పక్కమీదవున్న జయ వులిక్కిపడింది. భయంతో ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. "పిన్ని పట్టుదల ఇంకా అలాగే వుంది, ఎలాగ ఒప్పించడం? కిరీటి తనతో సహకరిస్తాడా? ధైర్యంగా పక్కని నిలబడతాడా?"

ఆలోచనలతో ఆరోజల్లా జయ వేగిపోయింది. మర్నాడు మళ్లీ ఆమె హృదయం, మెదడూ కదిలిపోయాయి.

ఆరోజు జయకి రెండుమాట్లు స్పృహతప్పింది.

"ఇదేవిటి మళ్ళీ ఇలా చేశావు భగవంతుడా!" అంటూ సువర్చల దేవుని పటం ఎదురుగుండా కన్నీళ్లు పెట్టుకుంది.

కిరీటి జయ పక్కవదలకుండా కూర్చున్నాడు.

"నిన్న బాగానేవుంది—అలాంటిది మళ్ళీ మార్పువచ్చి ఇవాళ ఎందుకయింది అర్థంకావడంలేదు. పోనీ ఏ న్యూరాలజీ స్పెషలిస్టుకేనా ఓమారు చూపించండి" అన్నాడు డాక్టరు, సాలోచనగా వేళ్ళతో గెడ్డాన్ని నిమురుకుంటూ.

తెలివివచ్చి నప్పుడు, పక్కనున్న కిరీటినిచూపి నీరసంగా "ఇంతక్రితం లేదుకాని ఇప్పుడు బతకాలని కోరికగావుంది బావా!" అంది జయ.

కిరీటి ఆ మాటలకి చలించిపోయాడు।

డాక్టరు అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి.

న్యూరాలజీ!

శేఖర్ స్పెషలైజ్ చేసింది అదేకదా!

హైదరాబాదు తీసుకెళ్ళి జయని అతనికి చూపిస్తే! అమాటే అన్నాడు సువర్చలతో-

"నీ ఇష్టం. మళ్లీ అది మామూలుమనిషి అయితేచాలు" అంటూ సువర్చల కళ్ళు ఒత్తుకుంది.

శేఖర్‌కి టెలిగ్రాం ఇచ్చి హైదరాబాద్‌కి మూడు టిక్కెట్లు కొన్నాడు కిరీటి.

# 14

"మనం ఇంతప్రయత్నం చేస్తున్నాం కదా ఆయన తప్పకుండా వస్తారంటారా?" అంది మాధురి, బట్లర్‌కీ నౌకర్లకీ గార్డెన్‌లో ఏర్పాటు చెయ్యవలసిన పనులన్నీ పురమాయించివచ్చి గదిలో కుర్చీలో కూర్చుంటూ.

చేతికప్స్ పెట్టుకుని కోటు తొడుక్కోవడంకోసం స్టేండ్ దగ్గరికి వెళుతూన్న వాడల్లా అగి. "షూర్. తప్పకుండా వస్తాడు. ఆ వుత్తరం అందాక రాకుండా వుండడానికి వాడికెన్నిగుండె లుండాలి?" అన్నాడు శేఖర్.

అయినా మాధురి గుండెల్లో అదటుగానేవుంది. 'కిరీటివచ్చి అన్నీ సవ్యంగా జరిగితేనేసరి కాని లేకపోతే హమ్మో ఇంకేమైనావుందా? అతితెలివిగా వేశాం, అనుకొన్న పథకం కాస్తా అయోమయంగా మారి, చివరకి తనమెడకే వురిత్రాడులా చుట్టుకుంటుంది. ఆ తర్వాత శేఖర్ తనూ, ఎంత గింజుకున్నా ఆ ప్రమాదంనుంచి తప్పించుకోలేక, జీవితాంతం పశ్చాత్తాపంతోనూ వేదనతోనూ క్రుంగిపోవలసివస్తుంది. ఏమో ఏం జరగనుందో!'—పైన సీలింగ్‌ఫేన్ తిరుగుతున్నా మాధురి నుదురంతా చెమట పట్టేసింది.

ఆ సమయంలో చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ జగత్పతిరావు ఆ గదిలోకి వచ్చాడు. వచ్చి, చేతులు వెనక్కివంచి కోటుని అతిప్రయాసమీద తొడుక్కుంటూన్న శేఖర్‌నిచూసి వెంటనే మాధురికేసి ప్రశ్నార్థకంగా చూశాడు అతని చూపులో అర్థాన్ని అర్థంచేసుకొని మొహం అటువైపు తిప్పింది మాధురి.

తను వీధిలోకివెళ్లబోయేముందు, చేతిలో ఎంతపనివున్నా వదిలేసివచ్చి చొక్కాబొత్తాలు సర్ది కండువా చేతికిచ్చి కళ్ళనిండా నవ్వుతూ మరీ పంపించేది తన డార్లింగ్. పాతజ్ఞాపకాలు గుండెల్లో మెదిలేసరికి జగత్పతిరావుకి మనస్సంతా వికలం అయిపోయింది.

దీర్ఘంగా నిట్టూర్చి "ఆరోజులే వేరు ఈరోజులే వేరు" అన్నాడు.

ఆ మాటలు జగత్పతిరావు ఏ సందర్భంలో అన్నవో అర్థంకాక "దేనిగురించి మీరంటున్నది?" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

వెంటనే జగత్పతిరావు సర్దుకొని "అబ్బే-అహః మరేం లేదు. నువ్వు కోటు తొడుక్కోడానికి ప్రయాసపడుతూంటే అమ్మాయి చూస్తూ కూచుందికాని కాస్తంతయినా సాయం చెయ్యడంలేదు. స్నానానికి వెళ్ళేటప్పుడు టవల్ అందించడం. కాఫీ తనచేత్తో ఇవ్వడం, నువ్వు హాస్పిటల్‌నుంచి వచ్చేసరికి నీ చేతిలో స్టైత్ అందుకోవడం వగైరా లేవీ చేస్తూన్నట్లు నాకేవీ అనిపించడంలేదు" అన్నాడు నవ్వుతూ.

శేఖర్ ఇబ్బందిగా మాధురికేసి చూశాడు.

జగత్పతిరావు కూడా అటే చూశాడు.

ఆమె ముఖం చిట్లించి ఇంకోవైపు చూసింది. మాధురి మాట్లాడకపోవడంతో తనే మాట్లాడవలసి వచ్చింది శేఖర్‌కి. నీరసంగానవ్వి "ఇవ్వడవన్నీ ఎందుకండీ?" అన్నాడు.

"అదేవిటయ్యా! కాబోయే భార్యా భర్తల మధ్య ఆప్యాయతలు ఎలా పెరుగుతాయి? ఇలాంటి చిన్న చిన్న పనులవల్లే-నువ్వుకూడా అలా దూరందూరంగా వుంటున్నావు కాని అమ్మాయితో సరదాగా చనువుగా వుంటున్నట్లులేదు."

"ఈ సాయాలూ సేవలూ బీదవాళ్ళకీ, మధ్య తరగతి వాళ్ళకీ కాని మనకేవిటండీ! కాఫీ మాధురే ఇవ్వాలని ఏంవుంది-బట్లర్ ఇస్తాడు. అలాగే స్నానానికి కావలసిన ఏర్పాటులన్నీ నౌఖర్ చేస్తాడు" అన్నాడు శేఖర్ అద్దంలో చూసుకొని తలదువ్వుకుంటూ.

"నౌఖర్లుంటే మాత్రం? నీకు కావలసిన సౌకర్యాలన్నీ తను చూసుకోవడంలో వున్న ఆనందం ఎంతమంది నౌఖర్లచేత చేయిస్తే వస్తుంది? మీ అత్తగారు ఒక్కక్షణం ఏమరిపడేదా? నాకు కావలసిన సమస్త సౌకర్యాలూ స్వయంగా తనే చూసుకొనేది " ఇలా అంటూ వెంటనే ఆగి, కంగారుగా "అయినా ఆరోజులు వేరూ ఈ రోజులు వేరూలే" అన్నాడు జగత్పతిరావు లేస్తూ, మనస్సులోంచి వువ్వెత్తుగాలేచిన ఆవేదనని కనపడనీయకుండా—

"ఇవన్నీ చూసుకోడానికి మాధురికి ఎక్కడ వీలవుతుందండీ-తనుకూడా హౌస్ సర్జను చేస్తోందాయె" అన్నాడు శేఖర్ మాధురిని సమర్థిస్తూ.

"నుప్వేంచెప్పు . మీరిద్దరూ ఏ కోశానా కాబోయే భార్యాభర్తలుగా వుండడం లేదు. మరిద్దరికీ సిగ్గో, మొహమాటమో అర్థంకావడంలేదు. ఓ షైర్లా షికార్లా సినీమాలా కబుర్లా కేరింతలా ఎలా వుండాలని? పరాయివాళ్ళయిన యువతీ యువకులే ఇంతకంటే చనువుగా వుంటున్నారు ఈ రోజుల్లో."

"అబ్బెబ్బె, మేమూ చనువుగానే వుంటున్నాం అండీ ...కానయితే పెద్దవారు— మీ ఎదురుగుండా అలా వుండాలంటే . ." అంటూ నీళ్ళు నమిలాడు శేఖర్.

"సరే . సరే. . అందువల్లా? .అయితే సరే నేనేమో వీళ్ళేవిటా ఇలా వుంటున్నారని అనుమానపడ్డాను." అంటూ అనుమానంగా మాధురికేసి చూశాడు జగ

త్పతిరావు. జగత్పతిరావుకి అనుమానం తగలకుండా వుండడంకోసం "మాధురీ!" అంటూ ఆప్యాయంగా పిల్చాడు శేఖర్. అతని కంఠం కొత్తగా వినిపించడంతో చిరాకువేసి కోపంగా చూసింది మాధురి.

"నా కూలింగ్ గ్లాసెస్ ఇలా ఇయ్యి" అన్నాడు శేఖర్ అధికార స్వరంతో.

పట్టలేని ఆగ్రహంతో కొరకొరా చూసింది మాధురి.

కళ్ళతో సంజ్ఞ చేశాడు శేఖర్. మనం నటించాలన్న సంగతి మరిచిపోయావా అనే అర్థం వచ్చేలాగ.

విసుగ్గా లేచి వెళ్ళి, గాగుల్స్ తీసుకువచ్చి ఇచ్చింది.

అదిచూచి సంతృప్తిగా నవ్వుకుంటూ "నువ్వు అలా వీధిలోకి వెళ్తున్నట్లున్నావు. చప్పున వచ్చెయ్యి. మళ్ళీ గెస్టులు వచ్చే వేళయింది. ఏర్పాట్లన్నీ అయినట్లేనా?" అంటూ ఇంటికి వెనకవున్న గార్డెన్ వైపు నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళాడు జగత్పతిరావు.

తండ్రిని పూర్తిగా వెళ్ళనిచ్చి, శేఖర్‌వైపు కోపంగా తిరిగి "మీరు అతి సహజంగా నటిస్తారే! పొరబాటున మీరు, నిజంగా ఈ ఇంటికి అల్లుడనుకుంటున్నారేవిటి?" అంది మాధురి, హేళనగా—"నటిస్తే సహజంగానే నటించాలి మరి. లేకపోతే అదిగో ఆయనకి అలాగే అనుమానం వస్తుంది" అన్నాడు శేఖర్ నవ్వుతూ. "ఆయన అనుమానం మాట ఎలా ఉన్నా మీకు ఆనందంగా వున్నట్టుంది అలా వుండడం-" ఆ మాటలోని తీవ్రతకి గతుక్కుమని, "నాకు ఆనందమా?...హుం!! ..నటనలో ఎవరికేనా ఆనందం వుంటుందా?" అన్నాడు శేఖర్ విషాదంగా.

"మీరలా అనుకోవడం లేదుగా? నిజం అని భ్రమిస్తున్నారు."

"పొరబాటు. నేనలా ఎక్కడ భ్రమిస్తానో అని నువ్వు అడుగడుగునా నాకు తీవ్రంగా జ్ఞాపకం చేస్తూనే వున్నావు. నేను కూడా జాగ్రత్తగా నా హద్దుల్లోనే వుంటున్నాను. కాని ఆయన ఎదురుగుండా ఇలా దొరికిపోయినప్పుడు మాత్రం కాస్త అతిగా ప్రవర్తించవలసివస్తోంది. అలా ప్రవర్తించకపోతే ఆయనకి అనుమానం వస్తుంది. ప్రవర్తిస్తే నీకు కోపం వస్తుంది. ఎలా? మధ్యన నా ఇబ్బందిని కూడా నువ్వు సానుభూతితో అర్థం చేసుకోవాలి," అన్నాడు శేఖర్ బాధగా ముఖంపెట్టి. మాధురి గతుక్కుమంది, శేఖర్‌కి నొప్పి కలిగిందా?

"నిజమే—ఆ రోజున తను అంతగా ప్రాధేయపడడం వల్లే శేఖర్ తనతో సహకరించడానికి అంగీకరించాడు. చివరకి రూమ్‌లోంచి కూడా మకాం మార్చేసి డాడీని నమ్మించడంకోసం ఇక్కడికి వచ్చేశాడు. డాడీ చూస్తున్నప్పుడు చనువుగా వుంటున్నాడు కానీ, తక్కిన సమయాల్లో దూరదూరంగానే వుంటూ తనకేం బాధ కలిగించడం లేదు. కాని ఎప్పుడో ఒకప్పుడు అతనిలా అతిసహజంగా, ఆప్యాయంగా ప్రవర్తిం

చడం. తనకి చిరాకు కలగడం, జరుగుతోంది. నటించి నటించి చివరకి ఇతనికి తన మీద అధికారం, అభిమానం సహజం అయిపోవు కదా అనే భయంకూడా కలుగుతోంది. ఏమైనా ఇది ప్రమాదకరమైన నాటకమే! ఇందులోంచి ఎలాగో అలాగ బైటపడాలి. ఇదిగో-ఇవాళ్టి గార్డెన్ పార్టీ కనుక అనుకున్న ప్రకారం విజయవంతం అయితే కొంచెం ఈ చిక్కుల్లోంచి తప్పుకోవచ్చు'' ఇలా ఆలోచిస్తూ వుండిపోయింది మాధురి.

''నేనలా భర్తలా అధికారంతో ఆజ్ఞాపించి నందుకు కోపం వచ్చిందా?'' శేఖర్ కంఠం పశ్చాత్తాపంతో వణికింది.

ఆ కంఠం విని మాధురి అదిరిపడింది. ఏవిటి? శేఖర్ బాధపడుతున్నాడా? తను తొందరపడి అతని మనస్సు గాయపరచిందా? ఆ రోజున తన కన్నీళ్ళు చూడలేక, డాడీకి తిరిగి ఆరోగ్యం కుదుటపడడంకోసం, అతను తనకి సహాయం చెయ్యబోతే, అతనికి తను చూపిస్తున్న కృతజ్ఞత ఇదా? మాధురి హృదయం కొట్టుమిట్టాడింది.

మాధురి సమాధానం చెప్పకుండా నిలబడి వుండడంతో "సారీ-నేను అతిగా ప్రవర్తిస్తే క్షమించు'' అంటూ బరువుగా అడుగులువేసుకుంటూ అక్కడినుంచి కదిలాడు శేఖర్.

''శేఖర్!''

మాధురి కళ్లల్లో కన్నీళ్ళు-ఇబ్బందిగా గుటకవేసి కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ బైటికి వెళ్ళిపోయాడు శేఖర్-ఇద్దరికీ ఇష్టంలేని ఇబ్బంది అయిన ఈ నాటకం ఇంకా ఎన్నాళ్ళు భగవాన్!

బిల్డింగ్‌కి వెనక విశాలంగావున్న గార్డెన్‌లో మాంచి సందడిగావుంది. గార్డెన్ నిండా అక్కడక్కడ గుండ్రని టేబిల్సూ, వాటిచుట్టూ నాలుగేసి అయిదేసి కుర్చీలూ అమర్చబడ్డాయి. ప్రతి టేబిల్‌మీదా తెల్లనిక్లాత్, టీపాట్, పింగాణీ ప్లేట్లు కప్పు సాసర్లు చెంచాలూ వున్నాయి. ఓమూల వుంచిన కేసెట్‌లోంచి 'పాప్' సంగీతం సన్నగా వినిపిస్తూ ఆ ప్రదేశాన్నంతా మత్తుగా వుత్తేజంగా మారుస్తోంది. అందమైన రంగురంగుల దుస్తులు ధరించి రకరకాల వయస్సులోవున్న పై అంతస్థు మనుష్యులు నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరేసీ ముగ్గురేసీ చొప్పున రాసాగారు. తన ఈడువాళ్ళ నందర్నీ జగత్పతిరావు చిరునవ్వుతో ఆహ్వానించి కుర్చీల్లో కూర్చోపెడుతుంటే, పాతికా ఇరవై వయస్సులోవున్న అతిధుల్ని షేక్‌హేండ్ ఇస్తూ పలకరించి స్వాగతం చెబుతోంది. మాధురి వస్తూన్న గెస్ట్‌ల్ని యాంత్రికంగా మర్యాదచేస్తోంటే కాని ఆమె మనస్సు ఎక్కడో వుంది కళ్ళు ఎవరికోసమో ఎదురుచూస్తున్నాయి.

జగత్పతిరావు వయస్సులోవున్న అతిధులంతా ''ఇది జగత్పతిరావు కూతురికి పెళ్ళి నిశ్చయం కాబోతూన్న సందర్భంలో ఇచ్చే ఎంగేజ్‌మెంట్ పార్టీ'' అని చెప్పుకుంటున్నారు.

మాధురి ఫ్రెండ్స్ అందరూ "ఎమ్. బి. బి. యస్. పేసయిన సందర్భంలో ఈ పార్టీ మాధురి ఇస్తోంది" అనుకుంటున్నారు.

శేఖర్ ఆహ్వానాన్ని అందుకుని వచ్చిన స్నేహితులు మాత్రం "న్యూ రాల జీ ఎమ్ డి. తో బాటు ఉద్యోగం కూడా వచ్చినందుకు శేఖర్ ఇస్తూన్న అల్పాహార విందు ఇది." అంటూ అంచనా వేయసాగారు.

ఇలా ఎవరికి తోచినట్లు వాళ్లు అనుకుంటూ కబుర్ల తో కేరింతాలతో నవ్వులతో పువ్వులతోటలో తుమ్మెదల్లాగా సీతాకోక చిలుకల్లాగా గుంపులు గుంపులుగా టేబిల్స్ చుట్టూ జేరుతూ సందడిగావుంటే, మాధురి మాత్రం ఈ పార్టీ ఎందుకు ఏర్పాటుచేసిందీ ఎవరికీ చెప్పకుండా మాటి మాటికీ టైమ్ చూసుకుంటోంది.

కిరీటి ఇంకా రాలేదు.

వీధిలోకి వెళ్ళిన శేఖరూ రాలేదు.

తెల్లటి దుస్తులు ధరించిన సర్వర్లు కాఫీ ఫలహారాల్ని టేబిల్స్ దగ్గరికి చేరుస్తున్నారు. వచ్చిన అతిథుల కబుర్లతోటీ నవ్వులతోటీ, గార్డెన్ అంతా కోలాహలంగా వుంది. రకరకాల ఆ శబ్దాల నన్నింటినీ మింగేస్తూ పాప్ సంగీతం, తారస్థాయిని చేరుకుంటోంది.

కిరీటి వస్తూన్న జాడలేదు.

అతణ్ణి తీసుకురావడానికని వెళ్ళిన శేఖరూ రాలేదు. మాధురి ఏక కంగారు పడుతోంది.

"ఏమిటమ్మా. ఇంకా ఏవిటి ఆలశ్యం?" అన్నాడు జగత్పతిరావు మాధురి దగ్గరికి నెమ్మదిగా నడిచివచ్చి "ఇంకా కిరీటి రాలేదు" అంది మాధురి పరధ్యానంగా ఆలోచిస్తూ.

"ఏ కిరీటి· ఆ స్కౌండ్రలా? ఎవరు పిలిచారతణ్ణి?" జగత్పతిరావు రుద్రుడై పోయాడు.

వెంటనే మాధురి తన పొరబాటుని గ్రహించింది. అనుకోకుండా అతనిమాట అనేసింది. అందువల్ల తడబడుతూ .."కిరీటికాదు డాడీ! శేఖర్-శేఖర్ అనబోయి కిరీటి అన్నాను. అంతే!" అంది. కూతురుకేసి చూశాడు. ఆమె తలదించేసుకుంది. జగత్పతి రావుకి జాలేసింది. ఆ కిరీటిని ఎంత మరిచిపోలేకపోతుంది! పాపం మనస్ఫూ ప్రేమించింది కాబోలు, ఆ దుర్మార్గుడు అలా చేశాడు. లేకపోతే నిజమే-ఈ శేఖర్ స్థానంలో అతడుండేవాడు.

దగ్గరగావచ్చి తలనిమిరి "ఆ కిరీటిని ఇంకమరిచి పో తల్లీ!" అన్నాడు లాలనగా.

"నేను మరిచిపోవాలనే ప్రయత్నిస్తున్నాను."

"కాని మరిచిపోలేకపోతున్నావు. అవునా? పిచ్చితల్లీ—"

"అయినా మనం అనుకున్నాం కాని కిరీటి అలాంటివాడు కాదు డాడీ!"

"కాకపోవడం ఏవిటమ్మా ఆ పెద్దమనిషి అంత స్పష్టంగా చెప్తేనూ! పైగా అతని చేతుల్తో అతనిచ్చిన పుస్తకం కూడా వుందికదా!"

"అవుననుకో .. కాని. .."

ఇంతలో "నమస్కారం అండీ ప్రొఫెసర్‌గారూ! ఆరోజు అయిదు నిముషాల పరిచయాన్ని పురస్కరించుకొని మీరు నాకు ఆహ్వానం పంపారంటే, మీ మనస్సు ఎంత వున్నతం అయిందో నాకు అర్థం అయింది. ఏదో, మీ అమ్మాయికి పెళ్ళి నిశ్చయం అయిన సందర్భంలో ఇస్తూన్న పార్టీ టగా ఇది?" అంటూ గట్టిగా అంటూ ప్రవేశించాడు రవణయ్య.

"ఎవరా ఇతను నన్ను ప్రొఫెసర్ అంటూ పిలుస్తున్నాడు" అంటూ ఆశ్చర్యంగా ఎగా దిగా చూశాడు జగత్పతిరావు. వెంటనే జ్ఞాపకం వచ్చింది. అవును! ఇతని మేన కోడల్నే కాదూ కిరీటి ప్రేమిస్తూన్నది! ఇతనివల్లే కదా తన మాధురి కన్న బంగారు కల లన్నీ బండలైపోయాయి! కోపం, అసహ్యం ఒక్కమాటు కళ్ళల్లో కనిపించాయి. ముఖం చిట్లించి "ఇతణ్ణి ఎవరు ఆహ్వానించారు!" అన్నట్లు ప్రశ్నార్థకంగా మాధురివైపు చూశాడు.

మాధురి తలవంచి పక్కకి చూసింది.

వచ్చిన అతిథి, సరే, మర్యాద చెయ్యక తప్పుతుందా అనుకొని, అసహజమైన చిరునవ్వు ఒకటి పెదిమలకి అంటించుకొని "దయచెయ్యండి" అంటూ రవణయ్యని ఆహ్వానించాడు జగత్పతిరావు. గొప్ప గొప్పవాళ్ళందరూ వున్న ఆ పార్టీలో పాల్గొనేందుకు తనకి అవకాశం లభించింది కదా అదే సంతోషంతో గాలిలో తేలిపోతూ వెళ్ళాడు, రవణయ్య. ఏ టేబిల్ దగ్గరా ఒక్కకుర్చీ కూడా ఖాళీలేదు. పైగా పరిచయం అయిన ముఖం ఒక్కటీ కనిపించలేదు. దాంతో ఒ మూల ఖాళీగావున్న టేబిల్ దగ్గరికి వెళ్ళి ఒక్కడూ కూర్చునున్నాడు.

"7గంటలువచ్చి చాలాసేపయింది. ఇంకా శేఖర్ రాలేదని మనం ఆలశ్యంచేస్తే బాగుండదు. అతనేవస్తాడు ఈలోగా పార్టీ మొదలుపెడదాం" అంటూ మాధురి సమాధానంకోసం ఆగకుండా, జగత్పతిరావు అతిథుల మధ్యకి వెళ్ళిపోయాడు.

మాధురి అక్కడే నిలబడిపోయింది, కిరీటీ శేఖర్‌లకోసం ఎదురుతెన్నులుచూస్తూ.

అందరూ పార్టీ తీసుకోవడం మొదలుపెట్టారు. కబుర్లూ కల్లోలం తగ్గి, పింగాణీ ప్లేట్లకి స్టెయిన్‌లెస్ స్టీలు చెంచాలు తగులుతూన్న 'క్లిక్' 'క్లిక్' ధ్వనులు గజిబిజిగా వినిపించసాగాయి. సర్వర్లు హడావిడిగా తిరుగుతున్నారు. అందరిదగ్గరికీ వెళ్ళి అన్నీ అందుతున్నాయో లేదో కనుక్కుంటున్నాడు జగత్పతిరావు.

వీధిగేటు దగ్గరికి ఒకటి రెండుమార్లు వెళ్ళివచ్చింది మాధురి గంటక్రితమే రైలు వచ్చి వుండాలి. ఇంకా వీళ్ళురాలేదేవిటి? బహుశా రైల్లో కిరీటిరాలేదేమో! ఆ ఆలోచ

నతో మాధురి మనస్సు ఒక్కమాటు దిగాలు పడిపోయింది. భయంవల్ల గుండెలువేగంగా కొట్టుకోసాగాయి. రాకపోతే ఇంకేమైనావుందా? తన ప్లాను అంతా తలకిందులై పోతుంది. అనుకున్న ఫలితం నెరవేరదు. పైగా తనకీ శేఖర్‌కి వివాహం నిశ్చయం చేసినట్లు ఇంతమంది ఎదటా డాడీ ఎంగేజ్‌మెంట్ ఫిక్స్ చేస్తాడు. అది జరిగితే ఇంకేం వుంది? తను శాశ్వతంగా కిరీటికి దూరం అవుతుంది. శేఖర్‌తో కలిపి జీవితాన్ని పంచుకో వలసివస్తుంది. అలా జరక్కూడ దనేకదా, తనూ శేఖరూ ఆలోచించి, పార్టీకి రవణయ్యని రప్పించి, అతని ఎదురుగుండా కిరీటిని ప్రదర్శించి కిరీటి ఇతడు కాదని చెప్పించి. తద్వారా కిరీటి నిర్దోషిత్వాన్ని డాడీకి నిరూపించాలని పెద్దపథకం వేసుకున్నది! ఇప్పుడు కిరీటి రాకపోతే, అతనిపట్ల డాడీకి అనుమానం కోపం వుండిపోవడం అలా వుంచి, తనకి శేఖర్‌తో వివాహం స్థిరపడిపోయే ప్రమాదం ఒకటి ఏర్పడుతుంది

భయంతో మాధురికి ఒళ్ళంతా ఒక్కమారు కంపించింది.

కిరీటి ఎందుకు రాలేదు? తన ఉత్తరంచూసి తప్పకుండా వస్తాడని కదా ఈ టీ పార్టీ ఏర్పాటు చేయించాడు శేఖర్! శేఖర్ అంచనా తప్పు అయిందా? అతని ఉత్తరం కిరీటికి అందలేదా! శేఖర్ అంటున్నాడు కాని నిజంగా ఉత్తరం రాశాడా? రాయకుండా రాశానని తనని మోసంచేశాడా? ఇలా కిరీటిని రప్పిస్తున్నానని అబద్ధంచెప్పి తనచేత పార్టీ ఏర్పాటు చేయిస్తే, డాడీ ఈపార్టీలో తమపెళ్ళి నిశ్చయం చేస్తాడని. అలా అయితే నిరాఘాటంగా తనని వివాహం చేసుకొనే అవకాశం లభిస్తుందనీ శేఖర్ ఎత్తువేశాడా? అందుకేనా, డాడీ మొదట ఈపార్టీ ఎందుకంటే, "ఎందుకేమిటి మీరు తిరిగి వ్యాధినుండి కోలుకొన్నందుకు-లేదా మీ అమ్మాయి ఎమ్ బి బి యస్. పేస్ అయినందుకు, కాదంటారు త్వరలో మీ ఇంట్లో ఒక శుభకార్యం చెయ్యబోతున్నట్లు పదిమందికీ తెలియబరిచేటందుకు-ఎందుకో ఒకందుకు" అంటూ సమాధానం చెప్పాడు! ఆ సమాధానం విన్నాకే డాడీ "అవును తప్పకుండా ఎంగేజిమెంటు ఫిక్సింగ్ పార్టీ చెయ్యవలసిందే" అంటూ ఉత్సాహం చూపించింది ఇదంతా ఆలోచిస్తే శేఖర్ ఏదో దుర్బుద్ధితో, వల పన్నినట్లు కనిపిస్తోంది. తెలియకుండా తను అందులో చిక్కుకొంది. నిజమా? నిజంగా తను మోసపోయిందా? కిరీటి రాడూ? ఉత్తరం రాశానన్న శేఖర్ మాటలు అబద్ధమేనా. మాధురికి తలతిరిగినట్లయింది, కళ్ళు చీకట్లు కమ్మాయి తూలి పడబోయి పక్కనున్న టేబిల్‌ని ఆనుకొని నిలబడింది.

వెనక, కబుర్లతో నవ్వులతో కేరింతాలతో కోలాహలంగా ఉన్న వాతావరణం.

ఎదురుగుండా, అనుకొన్న ప్రకారం కిరీటి రాకపోవడంవల్ల నిరాశగా నిస్సహాయంగా కనిపిస్తూన్న సూన్యత.

అలా హడావిడికీ ఆందోళనకీ మధ్య నిలబడి, ఆశగా కళ్లుతెరిచి చూస్తూ నిముషం ఒక యుగంలా గడుపుతూన్న మాధురికి, ఎదురుగుండా ఎవరో వస్తూన్న జాడఅయింది.

చూస్తే శేఖర్! నిరాశగా వస్తున్నాడు.

పక్కని కిరీటిలేదు. ఖరీదైన దుస్తుల్లో వీర్రాజు కాబోలు వస్తున్నాడు అతని పక్కని మాధురికి కాలిక్రింద నేల కదిలినట్లయింది.

మనస్సు క్రుంగిపోయింది.

అనుకున్నంతా అయింది-కిరీటి రాలేదు.

శేఖర్ ఏదో చెప్పాడు. మాధురికేం వినిపించలేదు. జరగబోయే ప్రమాదాన్ని తలుచుకొన్న కొద్దీ ఆమె మెదడులో భయంకరమైన తుఫానులా భరించలేని రకరకాల ధ్వనులు బయలుదేరాయి శేఖర్‌వైపు ఒకమారు అనుమానంగా చూసి, సర్వప్రపంచాన్నీ పోగొట్టుకొన్న దురదృష్టవంతురాలిలాగ వెనక్కి తిరిగింది. ఆమె నడుస్తోంది. కాని ఆ అడుగులు గాలిలో తేలిపోతున్నాయి. చూస్తోంది కాని ఆ చూపులు దేన్నీ చూడలేక ఏ భావాన్నీ చెప్పలేక నిర్జీవంగా వున్నాయి తిన్నగా నడిచి నడిచి, పార్టీకి దూరంగా కేసెట్ లౌడ్ స్పీకర్లూ ఏర్పాటు చేసిన టేబిల్ దగ్గరికివెళ్లి ఒక్కర్తీ ఒక కుర్చీలో కూర్చుండి పోయింది

''తను చెప్పింది విందో లేదో, గుడ్లప్పగించి, ఓమారు చూసి అలా వెళ్ళిపోయిందేమిటి మాధురి! కిరీటి రాలేదని చెప్పేటప్పటికి ఆమె మనస్సు వికలం అయిపోయిందా? లేక కిరీటిని రప్పించలేకపోయినందుకు తనమీద కోపంవచ్చిందా? అదీ ఇదీ కాక తన నిజాయితీని శంకించి అనుమానిస్తోందా?''—ఏమీ అర్థంకాలేదు శేఖర్‌కి. కిరీటి రాడని తనుమాత్రం అనుకున్నాడా? సరే-ఇలా జరిగింది. ఇప్పుడేమిటి చెయ్యడం? ఏదో ఒక కొత్త ప్లానువేసి కావలసినపనిని పూర్తిచేసుకోవాలి. ఆ వుద్దేశంతోనే. కిరీటి ఇంక రాడని తెలుసుకున్నాక ఈ వీర్రాజుని వెతికిపట్టుకొచ్చింది తను. ఈ మార్గం ప్రయత్నించాలి. ఫలితం ఎలా వస్తుందో చూడాలి. ఇలా నిర్ణయించుకొని వీర్రాజు చెవిలో ఏదో చెప్పాడు శేఖర్.

ఆ ప్రకారం వీర్రాజు వెళ్ళి- రమణయ్య కూర్చున్న టేబిల్‌కి కనిపించేలాగ దూరంగా మరో టేబిల్ దగ్గర కూర్చున్నాడు శేఖర్ తన కోటుతీసి చేతిమీద వేసుకొని, కనిపించిన మిత్రులందరితోనూ కరచాలనం చేస్తూ, అందరికీ అన్ని పదార్థాలూ అందాయో లేవో కనుక్కుంటూ, జగత్పతిరావు దగ్గరికివచ్చాడు అప్పటికి జగత్పతిరావు, వచ్చిన అతిథుల్ని అందర్నీ పలకరించి బట్లర్‌చేత ఒక ట్రేలో టిఫెన్ కాఫీ వగైరాలన్నీ పెట్టించి ఇంట్లోకి పంపిస్తున్నాడు.

''అవి ఎవరికండీ? ఇంకా ఇంట్లో ఎవరుండి పోయారు?'' అన్నాడు శేఖర్, ఉండిపోయింది బావాజీ అని తెలియక —జగత్పతిరావు ఆ ప్రశ్నకి తొట్రుపడి ''అబ్బే ఎవరూలేరు, ఏంలేదు. అవునుకానీ-నువ్వు ఏమిటి ఇప్పుడు వచ్చావు? ఇంతసేపటిదాకా ఎక్కడికెళ్లావు? మాధురి ఏదీ? ఎక్కడ కూచుంది?'' అంటూ తెగ ప్రశ్నలు కురిపించసాగాడు.

శేఖర్ ఆ ప్రశ్నలకేం సమాధానం చెప్పకుండా "నా బాల్యమిత్రుడు ఒకడు వచ్చాడు. అతణ్ణి పరిచయం చేస్తానురండి" అంటూ జగత్పతిరావుని వీర్రాజు దగ్గరికి తీసుకువెళ్లాడు.

"వీరు జగత్పతిరావుగారు " అంటూ శేఖర్ జగత్పతిరావుని వీర్రాజుకి పరిచయంచేశాడు.

"నాపేరు వీర్రాజండి. శేఖర్ నేనూ చిన్నప్పటినుంచీ స్నేహితులం" అన్నాడు వీర్రాజు వినయంగా.

జగత్పతిరావు మర్యాదకోసం కొద్దిగా నవ్వి "అహ! మీరేం చేస్తూ వుంటారు?" అన్నాడు.

"అది అడక్కండి. ఉదరపోషణార్థం బహుకృతవేషం"—ఇద్దరూ నవ్వుకున్నారు.

"సరే సరే పెళ్లాంపిల్లల్ని పోషించుకోడానికి ఏ మార్గం అయితే ఏంలెండి."

"పెళ్ళా? కాబోతోంది త్వరలో అదిగో చూడండి ఆ మూలకూచున్నాడు! . . ఆయన మేనకోడలుతో."

"ఏమిటి? ఆ పెద్దమనిషా? ఆ అమ్మాయిని కిరీటికి ఇస్తానన్నట్టుగా చెప్పాడు ఆ మధ్య ఆయన నాతో."

వీర్రాజు పగలబడినవ్వి "మీతోనూ చెప్పాడూ? ఆయన కిదో వేలంవెర్రి అయిపోయింది. పేర్లమీద ఆయనకి ఉన్నంతమోజు మరెవ్వరికీ ఉండదు ఆయన కేమిటో కిరీటి పేరంటే బలే ఇష్టం. వీర్రాజు అనేపేరు నాకు బాగోలేదనీ, కిరీటి అని పెట్టుకోమనీ నన్ను చాలా రోజులనుంచి వేయించుకొని తింటున్నాడు. ఇది న్యాయమా మీరు చెప్పండి? పెద్దవాళ్ళు పెట్టిన పేరుని, ఈయన మేనకోడల్ని ఇస్తాడు కదా అని మార్చుకొని మరో పేరు పెట్టుకోవాలా?" అన్నాడు.

జగత్పతిరావు ఏం అర్థంకాక అయోమయంగా చూశాడు.

"నేను తెలుగు ఎమ్మే చదివితే బాగుంటుంది అని అన్నాడు ఒకమాటు."

"అని అంతటితో ఊరుకుంటే బాగుణ్ణు. ఏవీ నీ ఎమ్మే పుస్తకాలు అంటూ చంపాడు. దాంతో మన కిరీటి పుస్తకం ఇచ్చాను ఇది పట్టిగెళ్ళి అయనకి చూపించరా అని" అన్నాడు శేఖర్.

"అంతే అప్పటినుంచీ యూనివర్సిటీ చుట్టూ తిరగడం ప్రారంభించాడట, ఇక్కడ మా కిరీటి వుండాలి ఏడీ? అంటూ."

"ఆయనకేమైనా కొంచెం మతి స్థిమితం తక్కువా?" అనుమానంగా అడిగాడు జగత్పతిరావు.

"ఆ . అదీ వుండి వుంటుంది"

"అందుకే కాబోలు నన్ను ఇందాకా ప్రొఫెసర్‌గారూ అంటూ పిల్చాడు."

"పిల్చాడూ? ఇంకనేం? ఈ పాటికి మీకూ అర్థం అయే వుంటుంది.''

జగత్పతిరావు ఆలోచనలోపడ్డాడు. ఈ పిచ్చివాడి మాటని పట్టుకొనా తను ఆ రోజున కిరీటిని అలా అవమానపరిచింది! ఇదే నిజం అయితే పాపం మాధురి చెప్పినట్టు ఆ కిరీటి నిర్దోషి.

జగత్పతిరావు ముఖకవళికల్ని గమనిస్తూ ''ఆయన పాపం ఒక్కడూ కూర్చున్నాడు. వెళ్లి పలకరించ కూడదురా వీర్రాజూ" అన్నాడు శేఖర్.

''ఈ అరగంటయినా నేను సుఖంగా బతకడం నీ కిష్టంలేదేవిటి?''

''ఆయన అంత ప్రమాదకరమైన మనిషా?'' దూరంగా సాసర్లో కాఫీ పోసుకుని ఊదుకుంటూ తాగుతూన్న రవణయ్యని అనుమానంగా చూస్తూ అన్నాడు జగత్పతిరావు.

''అవునో కాదో మీరొక్కమాటు ఆయన్ని పలకరించి రండి.''

''పోరా నీది మరీ విడ్డూరం గండి ఆయనతో ఓమారు మాట్లాడి వద్దాం. పైగా పాపం ఆయన ఒక్కరూ కూచున్నారు'' అన్నాడు శేఖర్.

ఈ వ్యవహారం ఏదో విచిత్రంగానేవుంది. అదీకాక ఈ అబ్బాయి చెప్పింది ఎంతవరకూ నిజమో ఆయనతో కూడా మాట్లాడితే కాని తెలియదు. ఈ సంగతేదో తెలుసుకోవడం ఒకరకంగా తనకీ అవసరమే. ఈ దెబ్బతో కిరీటి మంచివాడో మోసగాడో తేలిపోతుంది. అలాతేలడంవల్ల ప్రస్తుతం తనకేమి లాభం లేకపోయినా నిజం ఏమిటో బైటపడుతుంది. ఇలా అనుకొని ''సరే నడు'' అన్నాడు జగత్పతిరావు.

దగ్గరగావచ్చి కూచుంటూన్న శేఖర్‌నీ జగత్పతిరావునీ చూసి, మర్యాదతోకూడిన కంగారుతో లేవబోయాడు రవణయ్య. ఆ తొట్రుపాటులో, సాసర్‌లోవున్న కాఫీ వయ్యారంగా ఊగి రవణయ్య పంచెనీ చొక్కానీ పక్షపాతంలేకుండా సమానంగా పరామర్శచేసింది.

''కూచోండి కూచోండి అన్నీ అందాయా?'' అన్నాడు జగత్పతిరావు మర్యాదగా పలకరిస్తూ.

''అందుకేం లోటులేదు. అన్నీ భేషుగ్గా అందుతున్నాయి.''

''అదిసరే-మీరేవిటి ఒక్కరే కూర్చున్నారు?'' అన్నాడు శేఖర్.

''అవునండి. నా కిక్కడ ఎవరూ తెలియదు. వచ్చేటప్పుడు కూడా ఇదే అనుమానించాను రానా మాననా అని. కాని పెద్దవారి దగ్గర్నుంచి వచ్చిన ఆహ్వానం కదా? పైగా తప్పకుండా రమ్మని మరీ మరీ చెప్పారని ఆ ఆహ్వానం పట్టుకొనివచ్చిన వ్యక్తి చెప్పాడు. సరే బైలుదేరాను అతను చెప్పిన ఆనమాలు ప్రకారంవస్తే, ఇది ప్రొఫెసర్ గారి ఇల్లయి ఊరుకొంది హి హ్హి '' అంటూ జగత్పతిరావుకేసి తిరిగి మర్యాదపూర్వకంగా నవ్వాడు రవణయ్య.

"అరే.. మళ్ళీ నన్ను ప్రొఫెసర్ అంటున్నాడు! ఆ వీర్రాజు చెప్పినట్లు ఇతనికి నిజంగానే కొంచెం మతిస్థిమితం లేదేమో" అనుకొన్నాడు జగత్పతిరావు.

"ఇక్కడ మీకు ఎవరూ తెలియకపోవడం ఏమిటి? ఆమూలదూరంగా కూర్చున్న వ్యక్తిని చూడండి" అంటూ శేఖర్ వీర్రాజుని చూపించాడు.

రవణయ్య కళ్లకి చెయ్యి అడ్డంపెట్టుకొని పరిశీలనగా చూసి "అరే! మాకిరీటి వచ్చాడే!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అతనేనా మీరన్న కిరీటి! అతనేనా మీ మేనగోడల్ని ప్రేమించాడన్నారు మీరు నాతో" అన్నాడు జగత్పతిరావు.

రవణయ్య జగత్పతిరావు మాట వినిపించుకోకుండా "కిరీటీ ..కిరీటీ" అంటూ పిలిచాడు. వీర్రాజు పలకలేదు. చాలా సేపటివరకూ ఇటు తిరిగిచూడనేలేదు. చివరకి వాళ్ళదగ్గరికి వస్తూ 'చూశారా ఆయన నన్ను ఎలా పిలుస్తున్నాడో' అన్నట్లు జగత్పతిరావుకీ శేఖర్‌కీ కళ్ళతో సంజ్ఞచేశాడు.

"ఏం కిరీటీ ఈ మధ్య ఏమిటి కనిపించడం మానేశావు? మీ ఊరుగాని వెళ్లావా? వెళితే నాతో చెప్పమన్నాను కదా?" అన్నాడు రవణయ్య.

వీర్రాజు ఏం సమాధానం చెప్పిందీ జగత్పతిరావు విననేలేదు అతని మనస్సులో ఏక ఆలోచనలు సుడితిరిగి పోతున్నాయి. ఈ పిచ్చివాడి మాటలు పట్టుకొనాతను కిరీటిని ఆరోజున నానామాటలూ అన్నది! ఆ రోజున మాధురి చెప్పనే చెప్పింది. తను వింటేనా ఆ కోపంలో-పాపం ఆ నిర్దోషిని మరోమాటు అవమానపరిచి ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. అతనేం బాధపడ్డాడో ఏమో-తనుతొందరపడి అటు కిరీటినీ బాధపెట్టాడు, ఇటు మాధురి హృదయాన్నీ గాయపరిచాడు. మాధురి కేదో అన్యాయం జరిగిందని, తన మనస్సూ క్లేశపెట్టుకున్నాడు. ఆ కిరీటిని మరిచిపొమ్మనీ, తొందరలో ఎవర్నో ఒకర్ని పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకోమనీ కన్నకూతుర్ని కట్టడి చేశాడు. తన మాట కాదనలేక కాబోలు పాపం అది ఈ శేఖర్‌నిపెళ్ళి చేసుకుంటానంది ఏం జరిగిందో ఏమో మొత్తం మీద జరగకూడని పొరబాటే జరిగిపోయింది.

జగత్పతిరావు ముఖాన్ని పరిశీలిస్తూన్న శేఖర్‌కి అతను పడుతూన్న ఆవేదన స్పష్టంగా అర్థంఅయింది. హమ్మయ్య! తనుచేసిన ప్రయత్నం ఫలించింది. పెద్ద బరువు తీరినట్టు దీర్ఘంగా శ్వాసవదిలాడు. ఇంక జగత్పతిరావుగారి మనస్సు కిరీటి మీదకి నెమ్మదిగా తిప్పాలి పోతే ఈ రవణయ్యనే ఇంకొంచెం మరమ్మతు చెయ్యాలి. ఎప్పటికేనా వీడు వీర్రాజు అనీ కిరీటి కాదనీ, వీడి ప్రస్తుత వ్యాపకం తెలుగు ఎమ్మే చదవడంకాదనీ ఆటోరిక్షాని నడపడం అనీచెప్పవలసిందే కదా ఈయనకి. ఆ చెప్పడం ఇప్పుడే చెప్పేస్తే సరి. నెమ్మదిగా మనస్సు సరిపెట్టుకొని ఆ తర్వాత క్రమంగా ఒప్పుకుంటాడు, వీడికి తన మేనకోడల్ని ఇవ్వడానికి. ఈ సమస్యలు రెండూ ఇలా పరిష్కారం అయితే తనకి

బాధ్యత తీరుతుంది; తీరి కూచుని నవ్వులాటగా మొదట్లో ఈ సమస్యలు సృష్టించింది తనే కనుక ఈ చిక్కులు విడదీయవలసిన బాధ్యత కూడా తనదే.

ఆలోచనల బరువుతో భారంగా అడుగులు వేసుకుంటూ జగత్పతిరావు వెళ్ళిపోయాక "అవునూ! ఇంతకీ ఈ పార్టీ జగత్పతిరావుగారు ఎందుకు ఎరేంజ్ చేశారో తెలుసా?" అన్నాడు శేఖర్.

"జగత్పతిరావుగారు ఎవరు?"

"అదే-ఆయనే-మీరు ప్రొఫెసర్ అనుకుంటున్నారూ."

"అనుకోవడం ఏవిటి, ఆయన ప్రొఫెసర్ కాదూ?"

"కాదులెండి మీరు పొరబడ్డారు."

"ఆ మరైతే ఈయనెవరు?"

"ఈయన ఎవరైతే ఏంలెండి. ఈ పార్టీ ఎందుకు ఇస్తున్నారో తెలుసా?"

"నాకేంతెలుసు! ఆహ్వానం వచ్చింది-వచ్చాను. అంతే" అన్నాడు రవణయ్య తనకి తెలిసింది ఎంతవరకూ నిజమో అనే ఆ అనుమానంతో.

"అయితే వినండి. ఆయనకూతుర్ని కిరీటికి ఇచ్చి పెళ్ళిచెయ్యడానికి నిశ్చయించారు. అందువల్ల దీన్ని ఎంగేజ్‌మెంటు పార్టీగా ఎరేంజిచేశారు."

"ఏవిటి మీరంటూన్నది?" గట్టిగా గద్దించాడు రవణయ్య.

"అవును, నామాట అబద్ధం అయితే మా వీర్రాజుని అడగండి ఏరా వీర్రాజూ?"

వీర్రాజు అవునన్నట్లు తల ఊపాడు.

"వీర్రాజేవిటి? నిన్ను వీర్రాజంటా దేవిటి కిరీటీ?"

"నాపేరు వీర్రాజేనండి! ఇన్నాళ్ళూ మీరు నన్ను కిరీటి అనుకొని పొరబడ్డారు" తలవంచుకొని సమాధానం చెప్పాడు వీర్రాజు.

"అబ్బాయ్! నువ్వు నాదగ్గర ఈ కబుర్లు కట్టిపెట్టు, నువ్వు కిరీటివికామా? మీ అమ్మ సావిత్రికాదూ? మీది నరసాపురం కాదూ?"

"కిరీటి అమ్మగారిపేరు సావిత్రే. వాళ్ళది నరసాపురమే-కాని ఆ కిరీటి వీడుకాదు."

"అదేవిటయ్యా . . మొదటినుంచీ ఇతను కిరీటే-తెలుగు ఎమ్మే చదువుతూన్న కిరీటి. మధ్యలో మరొకాడిగా ఎలా మారతాడు?"

"ఏం మారలేదు. కంగారుపడకండి. వీడు మొదటినుంచీ వీర్రాజే-ఆటోరిక్షా నడిపి పొట్టపోసుకుంటూన్న వీర్రాజు! తెలుగు ఎమ్మే చదువుతున్నానంటే కాని మీరు దగ్గరకు రానియ్యరనీ, మీ మేనకోడల్నిచ్చి పెళ్ళిచెయ్యరనీ తెలిసి, నేనే వీడిచేత కిరీటి వేషం వేయించాను."

"ఆ! .. ఇతను తెలుగు ఎమ్మేకాదూ? ఆటోరిక్షా డ్రైవరా?" అన్నాడు రవణయ్య నమ్మలేను అన్నట్లు. అతనికి హఠాత్తుగా, వీర్రాజు ఆటోరిక్షాని అతి చాక చక్యంగా

నడపడం, ఫేన్సీ డ్రెస్సువేశానని చెప్పడం, అన్నీ జ్ఞాపకంవచ్చాయి. నిజమే-ఇతను ఆటోరిక్షా డ్రైవరేనేమో—

"నాకు మతిపోతోంది" అన్నాడు రవణయ్య తలపట్టుకొని.

"ఎందుకండీ అలా అనవసరంగా పోగొట్టుకోవడం. వీడు కిరీటి ఐతే నే వీర్రాజు అయితేనేం? పేరులో ఏంవుంది పెన్నిధానం? శుభ్రమైన కుర్రాడు, ఆటోరిక్షా లాగితే ఏం సైకిలు రిక్షాలాగితేం ఏం? పెళ్ళాన్ని పోషించుకోగలడు. ప్రేమగా చూసుకుంటాడు. నిక్షేపంలా ఇచ్చి పెళ్ళిచేసెయ్యండి మీ మేనకోడల్ని-ఆ కిరీటిని మీరు ఎరగరు కాని వాడు తైతక్కలాడుతాడు. ఏ జగత్పతిరావు వంటి ధనవంతులకో అల్లుడుగా దఖలుపడి, వాళ్ళింట్లో ఓ పెంపుడు జంతువుగా ఇల్లరికపు అల్లుడై బతకవలసినవాడే కాని మనలాంటి సామాన్యుల ఇంటికి అల్లుడు కావలసినవాడు కాదు. తెలివితేటలూ, చాకచక్యం, మాట నేర్పరితనం ఏ కోశానాలేవు. వాడికంటేవీడు లక్షరెట్లు నయం!"

"ఆపు చెయ్యి నీ ఉపన్యాసం. నేను నమ్మను. ఇతనే కిరీటి." అంటూ లేచాడు రవణయ్య.

ఇంతలో పార్టీలో జనం అంతా తొందరతొక్కిడిగా లేచారు. "ఏం జరిగిందంటే ఏంజరిగింది"' అంటూ. ఎక్కడ చూసినా కల్లోలం-కంగారు-పరుగులు-అంతా కలియ దొక్కుకుంటూ ఒకే దిక్కుగా పోతున్నారు. ఏవిటో ఈ హడావిడి, ఏం జరిగిందో అర్థంకాలేదు కబుర్లలో మునిగివున్న ముగ్గురికీను. వెళుతూన్న ఓ మనిషిని పట్టుకుని ఆపి "ఏం జరిగింది?" అన్నాడు శేఖర్. "రికార్డులున్న ఆ మూల టేబిల్ దగ్గర జగత్పతి రావుగారి అమ్మాయి స్పృహతప్పి పడిపోయిందిట!"-అని జవాబు.

"ఆ!" అంటూ శేఖర్, వీర్రాజు అటు పరిగెత్తబోయారు.

ఇంతలో ఒకరిక్షావాడు వీధి గేటు తీసుకొని బిల్డింగ్ చుట్టు తిరిగి, గార్డెన్‌లోకి వచ్చి "జగపతిరావుగారిల్లిదేనా అండీ-ఇక్కడెవరో సేకరం బాబుగారంట ఆరికోసం కిరీటంగారంట ఒచ్చారు. ఈది మూల రికసాలో కూసున్నారు" అన్నాడు.

"ఆ!. కిరీటి వచ్చాడా?" అంటూ సంభ్రమాశ్చర్యాలతో శేఖర్, వీర్రాజు ఒక్క అదుటున వీధిలోకి వచ్చిపడ్డారు. అసలు సంగతేవిటో ఈ దెబ్బతో అర్థం అవు తుందని వాళ్ళతో రవణయ్య కూడా వీధిలోకి వచ్చాడు

కిరీటిని సమీపించి కౌగలించుకొన్నంత పనిచేసి "ఏరా? నువ్వు ఇందాకటి రైల్లోనే వచ్చావా? నాంపల్లి రాకుండా సికింద్రాబాదులోనే తిగిపోయావేమిటి? అదీ అలా చెప్పు. నా వుత్తరం అందిందా? ఇదేవిటి ఇవతలే వుండిపోయావు? లోపలకి రా" అంటూ గబగబా మాట్లాడేశాడు శేఖర్.

కిరీటి ఏం సమాధానం చెప్పకుండా తాపీగా "నా టెల్కిగాం అందలేదా నీకు? అవుస్లే నువ్వు రూమ్ ఖాళీచేసి ఇక్కడికి మకాం మార్చావటగా, ఇప్పుడు నేను రూమ్‌కి

వెళితే తెలిసింది. అత్తయ్యనీ జయనీ రూమ్‌లో కూర్చోమని నీ కోసం ఇలా వచ్చాను. ఓమాటు రూమ్‌కి రా నీతో పనివుంది'' అన్నాడు.

''సరేగాని ముందోమాటు లోపలికి వెళదాం రా-మాధురి స్పృహతప్పి పడి పోయింది ఇప్పుడే.''

''ఆ॥'' అన్నాడు కిరీటి ఆదుర్దాగా-అంతవరకూ; జగత్పతిరావుగారి ఇంట్లోకి ఇంక అడుగు పెట్టనని భీషణ ప్రతిజ్ఞ చేసుకుని కూర్చున్న కిరీటి, ఆమాట వినడంతో ప్రతిజ్ఞ సంగతే మరిచిపోయాడు. జగత్పతిరావుగారంటే వున్న భయం, మాధురీ జగత్పతిరావుగార్ల మీద పెంచుకున్న కోపం, ఆ క్షణంలో ఏమయ్యాయో ఏమో-శేఖర్, వీర్రాజులతో కలిసి లోపలికి బయల్దేరాడు.

రమణయ్య వుండలేక ''ఇతనేనా కిరీటి?'' అంటూ అడిగాడు శేఖర్‌ని. ''ఆ॥ ఇతనే॥'' అంటూ కంగారులో విసుగ్గా సమాధానంచెప్పి, వీర్రాజునీ కిరీటినీ తీసుకొని తొందరగా లోపలికి వెళ్ళిపోయాడు శేఖర్. ''ఊ .. సరే '' అంటూ తలపంకించి అక్కడినుంచి అలాగే వెళ్లిపోయాడు రమణయ్య.

# 15

"కేసు హిస్టరీ అంతా చెప్పావు కదా॥ ఇంక జయసంగతి నేను చూసుకుంటాను. మరి నేను చెప్పిన విషయం ఏం ఆలోచించావు?'' అన్నాడు శేఖర్.

కిరీటి ఏం మాట్లాడలేదు.

''నువ్వు చూశావు కదా జగత్పతిరావుగారు ఎంతో పశ్చాత్తాప పడుతున్నారు. ఇంక మాధురి సంగతి సరేసరి: తను పెళ్ళి అంటూ చేసుకుంటే నిన్నుతప్ప ఇంకెవర్నీ చేసుకోనని కూర్చుంది. ఏదో ఆరోజున జరిగిన పొరపాటుని మనస్సులో పెట్టుకోక నువ్వు మామూలుగా వుండు.''

కిరీటి ఈ మారూ సమాధానం చెప్పలేదు.

"ఆలశ్యంగా నైనా మొత్తంమీద ఆ టీపార్టీ రోజున నువ్వు వచ్చావన్నసంగతి విని ఎంత సంతోషించిందో, తనకి స్పృహవచ్చేటప్పటికి నువ్వు అక్కడవుండకుండా వెళ్ళిపోయావని తెలిసి అంతబాధ పడింది మాధురి.''

కిరీటి ఆమాటలేం వినిపించుకుంటూన్నట్లు లేదు. టేబిల్ మీదవున్న శేఖర్ స్టెత స్కోపుని ఇటూ అటూ తిప్పుతున్నాడు. అది చూసి చిరాకేసి కిరీటి చేతులోంచి దానిని లాక్కుని ''ఏం నేను చెప్పిందేమన్నా వింటున్నావా॥ నాకు తెలియక అడుగుతాను ఏవిటా మొండిపట్టుదల?'' అన్నాడు శేఖర్.

కిరీటి గంభీరంగా ముఖంపెట్టి ''అంటే నీ ఉద్దేశం ఏవిటి? వాళ్లు ఛీ పో అన్నప్పుడు పోయి, రా ఫరవాలేదన్నప్పుడు రావాలన్నమాట పెంపుడు జంతువు లాగ?'' అన్నాడు.

ఆ మాటలు వినేసరికి శేఖర్ బిత్తరపోయాడు. ఏవిటి? ఈమాదిరిగా అంటూన్నది కిరీటేః సిగ్గుతో మొహమాటంతో ముడుచుకుపోయి, ఏమన్నా సమాధానం చెప్పలేని అమాయకుడైన కిరీటికి, ఇంతమాటకారితనం పౌరుషం ఎప్పుడొచ్చాయి, ఎలావచ్చాయి?

''ఒరేయ్ మనమంచితనాన్ని వాళ్ళు చేతకానితనంగా జమకట్టి ఆటవస్తువుగా ఆడిస్తూంటే ఆడడమేనా నువ్వుచెప్పు. అయినా నా తత్త్వం తెలుసునుకదా నీకు-ఒకళ్లని అనవసరంగా నేను అనను-ఒకళ్ళంటే పడను.''

శేఖర్ ఆలోచనలో పడ్డాడు.

"అసలు మొదటినుంచీ తప్పంతా నాదేలే-మనిషి అన్నవాడు ఇంత మెతక తనంగా వుండకూడదు. ముందు మెత్తగావుండి తర్వాత మొత్తారని బాధపడితే ఏం లాభం?''

కిరీటి పడుతూన్న వేదన శేఖర్‌కి అర్థం అయింది. నిజమేః ఇలాంటి మంచి వాళ్లకికోపం రానేరాదు. వస్తే ఓ పట్టానపోదు. ఇప్పుడు కిరీటితో వాదించి లాభంలేదు. వాదించిన కొద్దీ వ్యవహారం చెడుతుంది. కొన్నాళ్లుపోతేనే కాని పరిస్థితులు సర్దుబాటు కావు. అంతదాకా తను జగత్పతిరావుగారి ఇంట్లో మాధురికి కాబోయే భర్తలా వ్యవహరించక తప్పదు. శేఖర్ తల ఎత్తి కిరీటకేసి చూశాడు. కిరీటి ముఖం కోపంతో ఎర్రగా అందంగావుంది. అదిచూసి నవ్వుతూ ''ఒరేయ్ నువ్వుకోపంలో కూడా అందంగా వుంటావురా'' అన్నాడు.

ఆమాటకి కిరీటి నవ్వలేదు. చిరాగ్గా చూశాడు.

"అయినా ఒరేయ్ అబ్బీ-నే నొక్కటి అడుగుతాను. దాపరికంలేకుండా చెప్తావా?'' అన్నాడు శేఖర్. కిరీటి శేఖర్ ముఖంలోకి చూశాడుకాని ఆ చూపులో ఏ భావంలేదు.

''అవునూ-ఇంతకీ నీకు ప్రేమంటే ఏమిటో, ప్రేమించడం ఎలాగో, ఇదేమన్నా తెలుసా? దబాయించకు తెలిస్తే తెలుసనిచెప్పు. లేకపోతేలేదు.''

కిరీటి ఆ ప్రశ్నవిని వులిక్కిపడ్డాడు. నిజమే, తనకి ఈ వ్యవహారాలు ఎంత వరకూ తెలుసు? ఇంతవరకూ ఎప్పుడూ తనని తానీ ప్రశ్న వేసుకోలేదు. తను ఎప్పుడేనా ఎవరినేనా ప్రేమించాడా? ఒక్క క్షణంలో, గతజీవితాన్నంతా మహావేగంగా నెమరు వేసుకున్నాడు. ఉహుఁ! ఎప్పుడూ లేదు. ఎవర్నీ ప్రేమించలేదు. మరి మాధుర్ని? మాధుర్నిమాత్రం తనేం ప్రేమించాడు? కానయితే ఆమె తనతో[illegible]న వాదించేదనీ తనంటే ఇష్టంగా వుండేదనీ, సరదాగా మాట్లాడేదనీ, ఆమెతో వీలైనప్పుడల్లా కబుర్లు చెబుతూ కాలం గడపాలని ఉవ్విళ్ళూరేవాడు. నవ్వుతూ మాధురి మాట్లాడుతూంటే తనకి గంటలు క్షణాలుగా గడిచిపోయేయి. మాధురి తనకేసి చల్లగా చూస్తే ప్రాణానికి హాయిగావుండేది. ఆమెకి ఎలావుంటే ఇష్టమో తెలుసుకుని అలాగే వుండ బుద్ధివేసేది. ఆమె కళ్లల్లో బాధ కనిపిస్తే తన మనస్సు విలవిల్లాడిపోయేది. ఆమెగురించి ఆలోచించకుండా ఏక్షణం

గడిచేదికాదు తనకి-మొన్నటికి మొన్న స్పృహ తప్పి పడిపోయిందని వినగానే, కోపం పట్టుదలా సంగతి మరిచిపోయి గబగబా ఆమెని చూడ్డానికి లోపలికి వెళ్లాడు. ఇప్పటికీ ఆమెని మనస్ఫూ ద్వేషించలేకపోతున్నాడు. ప్రతి నిముషం మాధురి తాలూకు ఆలోచన తన మనస్సులోకి వస్తోంది. ఇలా వుండడాన్నే ప్రేమ అంటారా? ఏమో!

"ఏరా మాట్లాడవు-నేను అడిగినదానికి జవాబు చెప్పు."

"ఏం చెప్పమంటావు? నాకేం తెలియడంలేదు." అంటూ తన మనస్సులో అనుకున్నదంతా, ఒక్క అక్షరం పొల్లుపోకుండా అంతా శేఖర్‌కిచెప్పి, "మరి ఈ మానసిక స్థితిని ఏమని పిలుస్తావో నాకుతెలియదు. ఇదీ పరిస్థితి" అన్నాడు కిరీటి ఇబ్బందిగా.

శేఖర్ పొట్టచెక్కలయ్యేలాగ నవ్వి "ఓరి పిచ్చిసన్యాసీ! ప్రేమంటే మరి ఏమిటనుకున్నావు? ఇదే!" అన్నాడు.

కిరీటి విద్యుద్ఘాతం తగిలినవాడిలా విస్తుపోయి, "ఆ .ఏవిటీ? . ఇదేనా ప్రేమంటే? . మరయితే . " అని మాట మధ్యలో ఆగిపోయాడు.

"ఒరేయ్ నీ చదువంతా ఎందుకురా. మళ్ళీ తెలుగు ఎమ్మే చదివాడట తెలుగు ఏమ్మే! ఇన్ని శృంగార కావ్యాలు చదివావు కదా ప్రేమంటే అర్థంకాలేదురా?"

"ఏడిశావ్. చదివింది ప్రతీదీ అర్థం అవాలని ఏముంది? ప్రేమంటే ఇదేనా? నేనింకా ఇన్నాళ్ళూ శృంగారం ప్రేమా అనేవి ఊర్వశీ, శకుంతలా, పురూరవుడూ దుష్యంతుడూవంటి మహోత్తమ నాయికా నాయకుల మధ్యవుండే ఉదాత్తభావనావిశేషం, మహోన్నత మానసిక విధానం అనుకున్నాను."

"అఘోరించలేకపోయావు. గట్టిగా అనకు. ఎవరేనావింటే నవ్విపోతారు. ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా నీలాంటి మనుష్యులున్నారంటే ఎవరూ నమ్మరు మానవ సంఘంలో వుండవలసిన వాడివికాదు. జంతు ప్రదర్శనశాలలో రాణించవలసిన 'రేర్ స్పెసిమన్'వి నువ్వు. నీలాంటి జంతువుని ఆమాధురి ఎలా ప్రేమించిందో నాకు అర్థం కావడంలేదు" అంటూ శేఖర్ చివాట్లుపెడుతూంటే కిరీటి తప్పుచేసిన వాడిలా తలవంచుకొని నిలబడ్డాడు. ఆ సమయంలో గాలివానలా వచ్చిపడ్డాడు వీర్రాజు. వచ్చి శేఖర్ కాళ్ళ దగ్గర వటవృక్షంలా కూలిపోయాడు. అదిచూసి శేఖర్ తత్తరపాటుతోలేచి, "ఒరేయ్ నిన్ను తగలెయ్యా! సుడిగాలిలా ఈ రావడం ఏవిటి. ఎలక్షన్‌లో చిత్తుగా ఓడిపోయిన వాడిలా ఆ ముఖం ఏమిటి?" అన్నాడు.

వీర్రాజు శేఖర్ కాళ్లు చుట్టేసి బేర్‌మన్నాడు. కాస్సేపాగి నమలకుండా మింగేలాగ చూసి చెడామడా తిట్టేసాడు. మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు. తర్వాత తిట్టడం-ఏడవడం-తిరిగి తిట్లూ ఏడుపూ-ఇలా ఒకటి మార్చి ఒకటి మొదలెట్టాడు.

కొంచెంసేపు చూసి "ఒరేయ్-డోలూ సన్నాయీ ఒకదే వాయించినట్లు ఏవిటిరా ఆ తిట్లూ ఏడుపూను. ఏవిటి? ఏం జరిగింది?" అన్నాడు శేఖర్. వీర్రాజు కచేరీమాన

లేదు. "ఆ బాకా, బాజా, ఆపి అసలు సంగతి చెప్తావా, కోడి మెడ తిప్పేసినట్లు నీ గొంతు నులిమేసి చంపెయ్యమంటావా?" అన్నాడు శేఖర్ కోపంగా మీదకి వంగుతూ.

అతికష్టంమీద ఏడుపు దిగమింగి దీర్ఘాలుతీస్తూ "ఇంకేంవుందిరో!.. కొంప మునిగిపోయింది నీబోడి సలహావిన్నాను .. నా ప్రేమవృక్షం కూల్చేసుకున్నాను . నా కలల స్వర్గం కరిగించేసుకున్నాను. గుమ్మంలోకివస్తే కాలు విరగ్గొడతానంటున్నాడు ఆ రవణయ్య. మావయ్యని కాదని నేను నీతోరాలేనంటోంది నా రాణీ ఇంక నాకేం దారిరోయ్ నీచచ్చు సలహాలూ నువ్వూన్రోయ్ నాకెక్కడదొరికావురోయ్ నువ్వోయ్! అసలోయ్" అని దండకం మొదలెట్టాడు వీర్రాజు.

శేఖర్ దీర్ఘంగా ఆలోచించసాగాడు.

కిరీటి సానుభూతితో వినసాగాడు.

"తెలుగు ఎమ్మే చదువుతున్నాను. కిరీటిని అంటూ నాటకం ఆడతావా? ఈ మాటు నీమొహం చూపించావో పోలీసులికి రిపోర్టు చేస్తాను జాగ్రత్త అంటూ తన్న బోయాడు ఆతోడేలు ముఖం వాడు."

శేఖర్ దూలాలకేసి చూస్తున్నాడు. కిరీటిమాత్రం తన ముఖంలోకే జాలిగా చూస్తున్నాడు. అందువల్ల వీర్రాజు కిరీటితోనే తనగోడు చెప్పుకోసాగాడు.

"ఈ వారంరోజులనుంచీ అన్నం నోటికి సయిస్తే ఒట్టు అనుకో."

"పాపం" అన్నాడు కిరీటి.

"కంటికి నిద్దర కూడా లేదు."

"అ౦!"

"ఎంతసేపటికీ కన్నీళ్ళ విరహగీతాలూను."

"ప్చ్"—కిరీటి నిట్టూర్చాడు.

"వారం అయింది సినీమాచూసి."

"అరెరే!"

"చూసినా లైలా మజ్నూలూ, అనార్కలీ, దేవదాసులూను."

"అలాగేం?"

"పార్కుకి వెళితే పండుటాకులూ ఎండిన చెట్లే కనిపిస్తున్నాయి."

"ఆహా!"

"పచ్చని ప్రదేశాలన్నీ వెక్కిరిస్తున్నాయి."

"హుం!"

"వెన్నెల దహించి వేస్తోంది."

"సహజమే!"

"ఇస్త్రీ చేసినబట్టలు కట్టుకో బుద్ధివెయ్యటంలేదు."

"ఎలా వేస్తుంది"

"జుట్టు దువ్వుకో బుద్ధీ వెయ్యడంలేదు."

వీర్రాజు జుట్టుకేసి చూశాడు కిరీటి.

"నేను నవ్వి ఎన్నాళ్ళయిందో తెలుసా? ఆ మాటకివస్తే అసలు నవ్వే మరిచి పోయాను."

కిరీటి తనలో తను కొంచెం నవ్వుకొని చూసుకున్నాడు. ఫరవాలేదు తనింకా ఆ స్థితికిరాలేదు. తనకి నవ్వు ఇంకా జ్ఞాపకంవుంది.

"ఏ ఎంఁడ్రినోతాగి చచ్చిపోదాం అనుకుంటున్నా."

"కిరీటి వులిక్కిపడ్డాడు.

"నన్నూ రాణీని విడదీశాడు ఆ దుర్మార్గుడు. మనుషుల్ని వేరుచేశాడు కాని మమతల్ని ఎక్కడవేరు చేయగలడు? మాది అమరప్రేమ. ఈ జన్మలో కాకపోయినా వచ్చేజన్మలోనేనా ఫలిస్తుంది."

"ఆ మాట నిజం."

"నా అంతస్తు తక్కువనే కదా, నేను ఆటోరిక్షా డ్రైవరుని అనే కదా, మా పెళ్ళికి ఆ బూర్జువా ఒప్పుకోవడం లేదు. ఈ సంఘం యొక్క ఇనుపపాదాల కింద ఇంకా ఎంతమంది ప్రేమైకజీవులు నలిగిపోవాలో! సమసమాజ నిర్మాణం జరగాలంటే మాలాంటి ఎన్ని ప్రేమపక్షులు బలి అయిపోవాలో"

"సంఘం, ఔన్నత్యం పొందాలంటే సంఘర్షణ అవసరమే మరి!"

"నా జీవిత మధుభాండం ముక్కలైంది హృదయవీణ మూగవోయింది."

"పాపం!"

"అఫ్ కోర్స్! ఈ ఆవేదనలో కూడా ఒక ఆనందం ఉంది."

"నిజమే!"

"ఈ మంటలో కూడా ఒక మమత ఉంది."

"ఆలోచిస్తే అంతే మరి!"

"పగిలిన హృదయంతో పిచ్చివాడిలా ఈ లోకంనుంచి నిష్క్రమిస్తా."

"నువ్వు చచ్చిపోతావా వీర్రాజూ!"

"అవున్రా - చస్తా - ఎప్పుడేనా తప్పులుచేసి ఉంటే మరిచిపోండిరా."

"నోరు ముయ్యండిరా ఇడియెట్స్ - వాడు తాన అంటే నువ్వు తందానా! జోడు సన్నాయిల్లాగ ఏమిటా వెధవ నాటకం డైలాగ్సూ! మీరూనూ?" అన్నాడు శేఖర్ ఉరుము ఉరిమినట్లు అరుస్తూ.

"మరేం చెయ్యమంటావు?" ఇద్దరూ జమిలికంఠాంతో జాలిగా అన్నారు.

"నోరు మూస్తారా చంపెయ్యనా?" శేఖర్ ఇలా బిగ్గరగా అరవడంతో

వీర్రాజు పెదిమలు గట్టిగా బిగించాడు. కిరీటైతే నిజంగా రెండు చేతుల్తోటీ నోరే మూసుకున్నాడు.

"వినోద్ని నాటకం ఆడమంటే అది కిరీటికి విషాదం అయింది. ఆ సమస్య పరిష్కరించబోతే అది నా మెడకు చుట్టుకుంది. దాన్ని తప్పించడానికి నీ నాటకం బట్టబయలు చేస్తే, అది మళ్ళీ నీ కంఠానికి ఇలా అడ్డుపడింది. దీన్ని మళ్ళీ ఎలా పరిష్కరించాలో! ఏం కథో!"

"మళ్ళీ ఇంకో కొత్త ప్లానా? వద్దు బాబూ వద్దు."

"మోహం తిరిగి పోయింది."

"నడ్డి విరిగి పోయింది."

"అదిగో మళ్ళీ మొదలెట్టారు వెధవజంట కవిత్వం మీరూను. మరి ఏదో ప్లాన్ వెయ్యకపోతే, పెళ్ళి పెటాకులూ లేకుండా విరహగీతాలు రాసుకుంటూ ఒహడూ విషాదరాగాలు పాడుకుంటూ ఒహడూ దేవదాసులులాగ అఘోరిస్తారా?" ఇలా శేఖర్ వాళ్ళ నిద్దర్ని చివాట్లు పెడుతూ ఉండగా డ్యూటీ నర్స్ వచ్చి "అయిదో నెంబర్ బెడ్ మీద ఉన్న కొత్త పేషెంట్‌కి మళ్ళీ ఫిట్ వచ్చింది" అని ఆదుర్దాగా చెప్పింది.

శేఖర్ వెనకాలే కిరీటీ వీర్రాజూ కూడా గబగబా వార్డులోకి వెళ్లారు. శేఖర్ అరగంట ప్రయత్నం చేస్తేనే కాని జయకి తెలివి రాలేదు. తెలివి వచ్చాక, తనకోసం అని రూమ్‌లో అట్టే పెట్టుకున్న ఫ్లాస్క్‌లో హార్లిక్స్ తెప్పించి శేఖర్ ఇయ్యబోతే తాగడానికి మొహమాట పడింది జయ.

"తాగనంటే కాదు - మీ బావదగ్గర సాగినట్లు నాదగ్గర పేచీ సాగదు. ఊ .. డాక్టర్ ఏం ఇస్తే అది తాగవలసిందే" అన్నాడు శేఖర్ నవ్వుతూ. జయ సిగ్గుపడింది. కాస్సేపు ఆగి "టీ పార్టీలో కాఫీ సిప్ చేసినట్లు అలా సుకుమారంగా తీసుకుంటే లాభం లేదు. గడగడా తాగెయ్యి. ఊ లేకపోతే గ్లూకోజ్ ఇంజక్షన్ ఇచ్చినట్లే హార్లిక్స్ ఇంజక్షన్ ఇవ్వవలసివస్తుంది" అంటూ హెచ్చరించాడు. జయ బుగ్గలు ఎర్రబడ్డాయి.

"ఒరేయ్ శేఖర్: నువ్వు చెబితే వింటోంది కాని మేం ఎవరం చెప్పినా వినదురా. మా అత్తయ్య అదే బాధపడుతుంది" అన్నాడు కిరీటి.

"అసలు అత్తయ్యని హాస్పటల్‌కి రావద్దను. జయ ఆరోగ్యం సగం కుదుట పడుతుంది రాత్రిళ్ళు మాత్రం ఆవిడ ఎందుకు శ్రమపడి వచ్చి ఇక్కడ పడుకోవడం జయకి ఏం కావలసి వచ్చినా చూడడానికి ఇక్కడ నర్సులు లేరూ? అవసరం అయితే నేను లేనూ?" అన్నాడు శేఖర్.

ఆ రాత్రి బెడ్‌మీద పడుకోకుండా వార్డులో పచారు చేస్తోందని జయమీద నర్స్ కంప్లెంటు చెయ్యడంతో శేఖర్ వచ్చి "నీకు నిద్దర రాకపోతే పచార్లు చేసి తిక్కిన

పేషంట్స్ నిద్దర పాడుచెయ్యకు. నడు నా డ్యూటీ రూంలో కూచుందువు గాని'' అంటూ శేఖర్ జయని తన రూమ్‌కి తీసుకు వెళ్లాడు.

శేఖర్ చూపించిన ఈజీచైర్‌లో కూర్చోకుండా ''నేనీ బెంచీమీద కూచుంటాను లెండి. మీరే ఆ ఈజీచైర్‌లో విశ్రాంతి తీసుకోండి, పాపం పొద్దుటినుంచీ నాలాంటి పెంకిపేషెంట్లతో వేగివేగి ఉంటారు'' అంది జయ, వచ్చే నవ్వు ఆపుకుంటూ. ఆమె తీసుకుంటూన్న చనువుకి ఆశ్చర్యపోయాడు శేఖర్. అతను ఆలోచిస్తూ సిగరెట్ కాలుస్తూ గాలిలోకి పొగ రింగురింగులుగా వదులుతూంటే, "మా బావకి కూడా ఆ సిగరెట్ కాల్చడం కాస్త నేర్పక పోయారా?'' అంది జయ. శేఖర్ పరధ్యానంగా ''ఏవిటీ సిగరెట్ నేర్పాలా?'' అన్నాడు జయ పకపకా నవ్వి ''మీ వరసచూస్తే నాకు నేర్పేలా ఉన్నారు" అంది. వెంటనే శేఖర్ పరధ్యానం నుంచి తేరుకొని, ఆ తర్వాత కావాలనే అన్నాడు. ''ఓహో కిరీటికా? ఇంకా నీకేమో అనుకున్నాను'' అని. ఆ మాట విని జయ కోపం నటిస్తూ ''పోండి. మీరు భలే వారే!'' అంది. ''నే నెక్కడికి పోతాను ఈ హాస్పటల్‌కి పుస్తి కట్టినవాణ్ణి? ఇక్కడే ఉంటాను. అంతగావస్తే నువ్వే వెళ్ళిపోతావు ఆరోగ్యం చేకూరితే వారం పదిరోజులలో'' అన్నాడు శేఖర్.

ఆ మాటతో జయ ముఖం విషాదంగా మారిపోయింది.

అది చూసి శేఖర్ కంగారుపడ్డాడు. న్యూరాలజీ పేషెంట్‌కి ఏవో కల్లబొల్లి కబుర్లు చెప్పి మంచి మూడ్‌లో ఉంచాలని తను ప్రయత్నిస్తే ఈమె విషాదంగా మారిందేవిటి? ''నన్ను పంపించివేస్తారా? అవునులెండి, చెప్పినట్లు వినకుండా మిమ్మల్ని తెగ విసిగించి వేస్తున్నాను కదూ?'' అంది నిష్ఠూరంగా. శేఖర్ ఏదో చెప్పబోయాడు, జయ నీరసంగా నవ్వి, లేస్తూ ''నాకు ఇష్టంలేని వాళ్ళకి నేను కావాలి. ఇష్టం అయిన వాళ్ళకి నేను అక్కర్లేదు ప్చ్'' అంది. జయగురించి కిరీటి చెప్పిందంతా జ్ఞాపకం వచ్చి శేఖర్ జాలిగా నిట్టూర్చాడు.

# 16

సిటీ బస్సుకోసం క్యూలో నుంచున్నాడు కిరీటి. హాస్పిటల్‌నుంచి వస్తూన్న మాధురి అతణ్ణి చూసి గబగబా వచ్చి అతని వెనకాలే నిలబడింది. ఆడవాళ్ళకి వేరే క్యూ ఉన్నా సరే అందులో నుంచోకుండా అతను వెనక్కి తిరిగి చూస్తాడేమో అనుకొంది. ఉహూ! . ''అవును వెనక్కీ పక్కలకీ ఎందుకు చూస్తాడు బుద్ధిమంతుడుగా?'' ముసిముసి నవ్వులు నవ్వుకొంది. కాస్సేపాగి కావాలని చేతిలో స్టెతోస్కోపుని అతని మోచేతికి తగిలేలా కదిపింది. అంతకీ చలనం లేకపోతే, అతని కాలర్‌మీద పాకుతూన్న చీమని వేలితో సుతారంగా అంటీఅంటనట్లు దులిపింది. ''అబ్బే! ఈ పరమ సాత్త్వికుడికి చిన్న చిన్న మోతాదు లేవీ పనిచెయ్యవు.''

కళ్ళనిండా కొంటెతనం తొణికిసలాడుతూంటే, బయటపడని నవ్వు పల్చని మేఘం వెనక చంద్రుడిలా ముఖంలో వింతగా వెలుగుతూ ఉంటే, పక్కకి చూస్తున్నట్లు నటిస్తూ చెప్పులతో అతని మడమల్ని నెప్పిపెట్టేలా తొక్కింది. కిరీటికి చర్రుమంది.

"ఏం? సరిగా నుంచోలేవూ? ముందువాళ్ళ మడమల్ని తొక్కుతావు ఏమంత రష్‌గా ఉందనీ?" అంటూ విసురుగా వెనక్కి చూశాడు. మాధురి! అతని కళ్ళల్లో ఆశ్చర్యం – మమతలన్నీ చూపుల్లో నింపుకుంటూ మాధురి అతనికేసి చూస్తూ నవ్వి "అబ్బాయిగారి కోపం ఇంకా తగ్గలేదే!" అంది. ఆ మాటతో కిరీటికి తన కోపం సంగతి జ్ఞాపకం వచ్చింది. మొహం చికాకుగా పెట్టాడు. "మీరు ఊళ్లోకి వచ్చి చాలా రోజులైందటగా? మీకు ఫస్ట్ క్లాసు వచ్చిన సందర్భంలో నేను ఇచ్చిన పార్టీకి మీరు వస్తారని ఎంతో ఆశించాను ...అవునూ. ఎవరో పెద్దావిడనీ ఓ అందమైన అమ్మాయినీ తీసుకువచ్చి మీరు పూర్వం ఉండే రూమ్‌లోనే మకాం పెట్టారటగా? ఇలా మాధురి ఒకదాని తర్వాత మరొకటిగా ఎన్ని ప్రశ్నలు వేస్తున్నా కిరీటి సమాధానం చెప్పలేదు.

ఇంతలో బస్ వచ్చింది. ముందు డోర్‌లోంచి ఎక్కుతూన్న మాధురి. ఆ బస్‌లోనే కిరీటికూడా వెనకడోర్‌నుంచి ఎక్కి ఉంటా డనుకుంది. కాని ఆమెతో కలిసి వెళ్ళడం ఇష్టం లేక కిరీటి ఆ మట్టునే పేవ్‌మెంటుమీద ఉండిపోయాడు. బస్ వెళ్ళిపోయింది. అంతకి అరగంటక్రితం నుంచీ దూరంగా చీడీలమీద కూచుని అంతా చూస్తూన్న రవణయ్య కిరీటిని సమీపించాడు. ఆ రోజున, జగత్పతిరావు టీ పార్టీ ఇచ్చిన రోజున, రిక్షాలో వచ్చిన కిరీటిని చూశాడు. అసలు కిరీటి ఇత నన్నమాట! ఆ వీర్రాజుగా ఎవడో తనని మోసం చేశాడు. లేదా అలా మోసం చెయ్యమని జగత్పతిరావే పంపించాడో, మాధురికి రాణీ అడ్డు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో - సరే ఏమైతే ఏం? ఆ సావిత్రిని సాధించి కాళ్ళబేరానికి రప్పించి పీత గురించి ఏర్పడ్డ కళంకం రూపు మాపాలంటే తన రాణిని కిరీటికి ఇచ్చే పెళ్ళి చెయ్యాలి. ఆ రోజున పార్టీదగ్గర కన్పించిన అసలు కిరీటిని పట్టుకోవడంకోసం కాళ్ళకి బలపాలు కట్టుకొని పట్నం అంతా తిరుగుతూ ఉంటే, ఇదిగో ఇప్పటికి కన్పించాడు.

రవణయ్య కిరీటిన సమీపించి పలకరించి నెమ్మదిగా కబుర్లలోకి దింపాడు. తనతో ఇప్పుడు పట్నానికి వచ్చింది తన అత్తయ్యే కాని అమ్మ కాదని కిరీటి మాటల సందర్భంలో చెప్పడంతో 'హమ్మయ్య' అని ఒక బరువు తీరినట్లు రవణయ్య నిట్టూర్చాడు. తను వాళ్ళకి చాలా దగ్గర బంధువునని చెప్పి కిరీటితో కలిసి ఇంటికి వెళ్లాడు. "ఈవిడే మా అత్తయ్య. ఈయన మన దగ్గర బంధువట!" అని సువర్చలనీ రవణయ్యనీ ఒకర్నొకరికి పరిచయం చేసి, గోడకి జేర్లా వేసిన పీట అంచుమీద ఆనీ ఆననట్లు గోడకుర్చీ వేసిన విధంగా కూర్చున్నాడు కిరీటి.

"మీరు నన్ను ఎరుగరు కానీ, సావిత్రమ్మ, అదే, కిరీటి తల్లి బాగా ఎరుగును " అంటూ రవణయ్య ఎంతో చనువుగా గడపమీద కూర్చుని మాట్లాడుతున్నాడు. "ఆహా అలాగా?" అంటూ మర్యాదగా బుజాలనిండుగా పైట కప్పుకొని తలుపు అవతల నిలబడి సువర్చల ఊ కొడుతోంది. ఇంతలో "ఏమండీ! కిరీటిగారు ఉన్నారా?" అంటూ వీధిలోంచి ఒక స్త్రీ కంఠం వినిపించింది.

ఎవరా అని ముగ్గురూ ఒక్కమారే వీధిలోకి తొంగి చూశారు.

"ఇరవై యేళ్ళ యువతి రూపంలో ఉన్న ఈ వెలుగు కిరణం ఎవరు చెప్మా? కిరీటిని పిలుస్తోం దేవిటి?" అని సువర్చల తెల్లబోయింది.

"ఇందాకటి అమ్మాయి! జగత్పతిరావు కూతురు! ఇంటికే వచ్చేసింది! కిరీటి కోసం ఇంతగా వలేస్తోంది అన్నమాట! ఈమెని తప్పిస్తేనే కాని ఈ కిరీటికి రాణిని ఇవ్వడం పడదు" అనుకున్నాడు రవణయ్య.

"అరే! మాధురి! ఇలా వచ్చేసిందేవిటి? అత్తయ్యకి ఏం అర్థం వస్తుందో ఏమో" తత్తరపడసాగాడు కిరీటి.

లోపలనుంచి ఏ సమాధానం రాకపోయేసరికి అలవాటున్న రూమే కనుక చక చకా లోపలికి రాసాగింది మాధురి.

"కొంప ములిగిందిరో దేవుడో" అనుకొని కంగారుగా రవణయ్య మీంచి ఒక్క హైజంప్ చేసి అవతలకి ఒక్క గంతువేసి "ఏవిటిలా వచ్చావు మాధురీ" అన్నాడు కిరీటి విసుగ్గా.

"మరి ఏం చెయ్యను మీరు ఆ బస్సు ఎక్కకుండా మోసం చేస్తే అవును కానీ ." గబగబా ఇంకా ఏం మాట్లాడేస్తుందోరా భగవంతుడా - అత్తయ్య ఏమైనా వింటే అదో కొంప మునుగుడు, సవాలక్ష సంజాయిషిలు ఇచ్చుకోవాలి. అంతకంటే మాధురిని ఇక్కడనుంచి తీసుకు వెళ్ళిపోవడం నుంచిది. ఇలా అనుకొని "నడు - మీ యింటికి వెళ్ళి మాట్లాడుకొందాం" అంటూ ఆమెని అటునుంచి అటే తీసుకు వెళ్ళిపోయాడు కిరీటి.

జరిగిందంతా చూస్తూ ఏం అర్థం కాక భ్రమాన్పడి ఉండిపోయింది సువర్చల. ఇదే అద ననుకొని ఆ పిల్ల చాలా ఘటికురాలనీ కిరీటిని వల్లో వేసుకుందనీ కిరీటి అమాయకుడూ మంచివాడూ కనక ఇష్టం వచ్చినట్లు ఆడిస్తోందనీ చెప్పి సువర్చలకి బాగా కోపం ఎక్కించాడు

అంతా వినేసరికి అనుకున్నట్లుగానే మాధురి అంటే విపరీతమైన కోపం - అసహ్యం వేశాయి. వెంటనే ఆ అమ్మాయిని కలుసుకొని నాలుగు చివాట్లూ వేసి 'కిరీటి నీకు దక్కడనీ, జయని తప్ప వా డెవర్నీ చేసుకోవడం జరిగేపని కాదనీ' ఖచ్చితంగా చెప్పి రావాలనీ అనుకొంది. ఆ సంగతే రవణయ్యకి చెప్పి "ఈ పిల్లకి బుద్ధి

చెప్పాలంటే ఎక్కడ దొరుకుతుంది?'' అని అడిగింది. రవణయ్య మొదట ఆమె అభిప్రాయం విని ఓ త్తరపోయాడు. మాధురి నుంచి కిరీటిని తప్పిస్తే తన రాణీని అతనికి ఇవ్వవచ్చని తను ప్లానువేస్తే ఈమె ఎవరో జయ అంటుందేవిటి? సరే - ఆ సంగతి తర్వాత చూసుకుందాం, ముందు ఈమెచేత ఆ మాధురిని తప్పిద్దాం అని సిద్ధయించుకొని ''ఆ అమ్మాయిని మీరు ఎక్కడ ఎలా కలుసుకొనేదీ నేను ఏర్పాటు చేస్తాగా ఒకటి రెండు రోజుల్లో'' అంటూ వెళ్ళిపోయాడు.

అన్న ప్రకారం ఒకరోజున సువర్చలని బస్‌స్టాప్ దగ్గరికి తీసుకువెళ్ళి "ఆ వన్నెల విసినకర్రలా విసవిసా నడిచి వస్తోందే, ఆ అమ్మాయే. అడగవలసిన నాలుగూ అడిగేసి కిరీటిని మరిచిపొమ్మని హెచ్చరించండి. వస్తా'' అంటూ వెళ్ళిపోయాడు రవణయ్య. 'ఇలాంటి విషయాలు రోడ్డుమీద కాకుండా ఇంటిదగ్గర మాట్లాడితే బాగుండి పోనే' అనుకొంది సువర్చల. కాని రవణయ్య ఆమెకి మాధురి ఇల్లు ఎందుకు చూపిస్తాడు. ఆ మేడా ఆ వైభవం చూసి సువర్చల ప్రలోభపడి కిరీటిని ఆ ఇంటి అల్లుడ్ని చెయ్యడానికి అంగీకరిస్తే? "ఎంత పట్నవాసం పిల్ల అయినా ఇంత చేటా? ఇళ్ళమీదకి వచ్చి అందమైన అబ్బాయిల్ని ఎగరేసుకు పోవడమా ? రామ రామ! ఈ రోజుల్లో ఆడపిల్లలు మరీ సిగ్గు వదిలేస్తున్నారు'' అనుకుంటూ సువర్చల, వస్తూన్న మాధురిని చూస్తూ అనుకుంటోంది.

మాధురి ఆలోచిస్తూ అడుగులు వేసుకుంటూ వస్తోంది. హాస్పిటల్‌లో జయతో చిన్న ఘర్షణ అయింది. ''నువ్వు న్యూరాలజీ పేషెంటువి. అస్తమానూ ఆలోచనలు పెట్టుకోకూడదు. మనస్సుని అదుపులో పెట్టుకోవాలి'' అని తను అంటే ''అదెలా కుదురుతుంది డాక్టర్? ఇప్పుడు మీరొకర్ని ప్రేమించి పెళ్ళి చేసుకో బోతున్నారనుకోండి అలా వీల్లేదు. నేనతణ్ణి ప్రేమిస్తున్నాను. మీరు అతణ్ణి మరిచిపోండి అంటే మరిచిపోగలరా?'' అంటూ ఎదురు ప్రశ్నవేసింది. ఆమె అంటు న్నది కిరీటిని గురించేగా అని అనుకొని తను దిగ్భ్రాంతురాలైంది. అలా ఆలోచిస్తూ మనస్సంతా చికాగ్గా అయిపోయి వస్తూన్న మాధురిని ఆపి ''అమ్మాయి! నీ పేరేమిటో గాని నీకో విషయం చెప్పాలని వచ్చాను. నిన్ను చూస్తే గౌరవంఅయిన కుటుంబం లోనే పుట్టినట్లున్నావు నీలాంటి పిల్లలకి ఇలాంటి పనులు తగవు. నీతల్లి లాంటి దాన్ని. కోపంగా అలా పౌరుషపడి చూడకు. నీ మేలు కోరి చెప్తున్నాను'' అంది సువర్చల.

''తమరికి అభ్యంతరం అయిన పనులేంచేశాను? రోడ్డుమీద నుంచోబెట్టి ఈ నీతి బోధ ఏమిటి? అసలింతకీ మీరెవరు?'' అంటూ మెడమీద ఉన్న స్టైతస్కోపుని ఇటూ అటూ రెండు చేతులతోటీ బుజాలమీదకి సాగదీసి పట్టుకుని నిర్లక్ష్యంగా నిల బడింది మాధురి.

"నువ్వు కిరీటి సంగతి మరచిపో ...వాడి పెళ్ళి నీతో జరగదు."

"అతని సంగతి మాట్లాడ్డానికి మీరెవరు? అతనికి మీరేమౌతారు?"

"ఏం కాకపోయినా, అన్నీ నేనే!" అంది సువర్చల.

ఆమె కిరీటికి ఏంకాదు అని తెలియడంతో మాధురి గుండెలు కొంచెం కుదుట బడ్డాయి ఇంతవరకూ ఆమె కిరీటి తల్లి ఏమో అని భయపడింది. ఈసారి ఆ భయం ఏం లేకుండా కంఠంలో సాధ్యమైనంత నిర్లక్ష్యాన్ని కనబరుస్తూ "దారిని పోయే పిన్ని గారూ! ఇలా చూడండి. పాపం చాలా శ్రమపడి ఏదో చెప్పబోయారు. కాని మీ శ్రమ అంతా దండగ. రేపీపాటికి నేను కిరీటిని పెళ్ళాడతాను అలా చూస్తూ ఉండండి" అంది. సువర్చల కళ్ళ చివర్లు ఎర్రబడ్డాయి "ఆ! కిరీటితో నీ పెళ్ళి ఎలా అవుతుందో చూస్తా" అంది.

"ఎలా కాదో నేను చూస్తాను" అంటూ విసురుగా తల తిప్పి మాధురి వెళ్ళి పోయింది.

## 17

జగత్పతిరావు ఇంట్లో మాధురి పెళ్ళి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. మర్నాడే ముహూర్తం పెట్టించమన్న కూతురు ఆలోచన ఏమిటో అర్థంకాక, 'సరే పెళ్ళికి ఒప్పుకొంది' అదే చాలు అని తృప్తిపడి ఉత్సాహంగా పెళ్ళి పనులు చేయించ సాగాడు అతని అభిప్రాయం ప్రకారం శేఖరే పెళ్ళికొడుకు! కాని అదికాదనీ మాధురి పెళ్ళి కిరీటితోటే జరుగుతుందనీ శేఖర్‌కీ మాధురికీ ఇద్దరికే తెలుసు! కాని తెల్లవారి లేచి చూసేసరికి రాణీ ఇంట్లో లేకపోవడం, "జగత్పతిరావుగారి ఆశీర్వచనంతో తనకీ వీర్రాజుకీ ఆరాత్రి పెళ్ళి జరగబోతోంద"ని రాణీ రాసిన చీటీ మంచంమీద కనిపించడం, జగత్పతిరావుగారి ఇంటికి వెళ్ళి చూస్తే అక్కడ మాధురి పెళ్ళి ప్రయత్నాలు జరుగుతూ ఉండడం, ఇవన్నీ చూసేసరికి రవణయ్యకి మాధురి పెళ్ళి కిరీటితో జరగబోతోందనీ, వంగంనుంచి తన రాణీని తప్పించడంకోసమే జగత్పతిరావు తన రాణీకి వీర్రాజుతో ఆ ముహూర్తానికే పెళ్ళి ఏర్పాటుచేసి ఉంటాడనీ అనుమానం తగిలింది.

దాంతో అతనికి జగత్పతిరావు మీద కోపం, పగా విజృంభించాయి. తన మేన కోడలు రాణీనీ వీర్రాజునీ ఈ జగత్పతిరావు ఎక్కడో దాచేసి ఉంటాడు. అతని కూతుర్ని తను దాచేస్తేసరి. అటు కిరీటితో మాధురి పెళ్ళి తప్పించినట్లూ ఉంటుంది. తన మేనగోడల్ని అతను దాచినందుకు అతనిమీద కక్ష తీర్చుకున్నట్లూ ఉంటుంది. ఆ తర్వాత వీలుఅయ్యాక రాణీని వెతికి పట్టుకుని దాని పెళ్ళి కిరీటితో జరిపించవచ్చు. అందుకు వీలుగా అవసరం అయితే "రాణీని పెళ్ళిచేసుకుంటాను" అని కిరీటిచేత బల వంతంగా భయపెట్టి ఏస్టాంపు అంటించిన కాగితంమీదో సంతకం పెట్టిస్తేసరి. రాణీ కిరీటుల పెళ్ళికి ఆ కిరీటి మేనత్తని కావలిస్తే భయపెట్టి ఒప్పించవచ్చు. ఇలా కక్ష,

కార్పణ్యం, పగా, పట్టుదలా పెంచేసుకొని రవణయ్య, ఆ మధ్యాహ్నమే ఊళ్ళో ఉన్న ఒక గూండాల మురాని కలుసుకున్నాడు. పైకి టాక్సీడ్రైవర్లుగా జీవితం గడుపు కుంటూన్న ఆ మురా జనం, రవణయ్య చెప్పిందంతావిని, అతని దగ్గర అయిదు వందలు బయానా తీసుకుని, ఇంక తమ పని తాము ప్రారంభించడం మొదలెట్టారు.

ఒకడు సువర్చలని సమీపించి "మీ కిరీటికి కారు ప్రమాదంలో దెబ్బలు తగి లాయి, హాస్పిటల్‌లో ఉన్నాడు. మిమ్మల్ని తీసుకు రమ్మన్నాడని" చెప్పి ఆమెని తీసుకుని గోల్కొండ శిథిలాలవేపు టాక్సీని వేగంగా తీసుకుపోయాడు. ఆ మాటే మరొకడు మాధురికి చెప్పి మాధురినికూడా అక్కడికే చేర్చాడు." మీ అత్తయ్య చాలా ప్రమాద స్థితిలో ఉంద"ని చెప్పి ఇంకో టాక్సీ డ్రైవరు కిరీటిని గోల్కొండ శిథిలాల వైపు తీసుకుపోయాడు.

తనముందు నుంచి మూడు విడివిడి టాక్సీలలో కిరీటీ, మాధురీ, సువర్చలా వెళ్ళడం చూసి, ఏదో ప్రమాదం జరిగిందని గ్రహించి, రాణీని తీసుకెళ్ళి జగత్పతిరావు గారింట్లో శేఖర్ దగ్గర దిగబెట్టి వద్దాం అని వెళ్ళాడు వీర్రాజు. శేఖర్ ఇంకా హాస్పటల్ నుంచి రాలేదు. ఏవో పెళ్ళిపనులమీద జగత్పతిరావుగారు ఊళ్లోకి వెళ్ళారు. అక్కడ బావాజీ మాత్రం అప్రమితంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఓ గంట క్రితం ఎవరో మాధురితో కంగారుగా మాట్లాడి టాక్సీలో తీసుకుపోవడం తను చూశాడు. గది లోంచి బయటికి వచ్చి నలుగురికీ కనిపించడం ఇష్టంలేక గదిలోనే ఉండి పోయాడు. ఆలోచించగా ఆలోచించగా మాధురి ఏదో ప్రమాదంలో చిక్కుకొంది అని బావాజీకి అర్థంఅయింది. అతను సంకోచంవదిలి గదిదాటి బయటికి వచ్చాడు. నలుగురూ తనని చూస్తే చూశారు అని తెగించాడు. జగత్పతిరావు వచ్చేదాకా ఆగడమా, వెంటనే ఆ టేక్సీని వెంబడించడమా అని తటపటాయిస్తూన్న సమయంలో వీర్రాజు రాణీని ఆటో రిక్షాలో తీసుకువచ్చి అక్కడ దింపాడు.

రెండు ముక్కల్లో, వీర్రాజుకూడా అదే ప్రయత్నంలో ఉన్నాడని తెలుసుకుని, ఇల్లంతా రాణీకి అప్పజెప్పి, తను ఆటోరిక్షా ఎక్కాడు బావాజి రెండు బుజాల మీంచీ జారుతున్న శాలువాని పంటితో పైకి లాక్కుంటూ

ఆటోరిక్షా శరవేగంమీద గోల్కొండ శిథిలాలవైపు దూసుకుపోయింది. కొంత దూరం వెళ్ళాక టేక్సీ ఇంజన్లల్లోంచి ధారగా కారిన క్రూడ్ ఆయిల్ గుర్తులు ఆధారంగా ఆటోరిక్షాని పోనియ్యసాగాడు వీర్రాజు. ఆ ప్రకారం అసలు దారి తప్పించి పక్కదారిన ఒక మైలు వెళ్ళగా అక్కడో కొండవారని మూడు టేక్సీలూ కనిపించాయి. ఒక చిన్న గుహలాగ ఉన్న ప్రదేశంనుంచి మాటలు వినిపిస్తున్నాయి. బయట ఆటోరిక్షా ఆపి ఆ గుహలోకి, వీర్రాజూ, బావాజీ వెళ్ళారు, అక్కడ కిరీటీ. మాధురీ, సువర్చలతో పాటు, రవణయ్యనికూడా కాళ్ళూ చేతులూ కట్టి పడేశారు టేక్సీడ్రైవర్లు.

"ఓరి పిచ్చివాడా నువిచ్చే అయిదు వందలకోసం ఈ పని అంతా చేశాం అనుకున్నావా? ఇదిగో ఈ అమ్మాయి తండ్రి పెద్దషావుకారులా వున్నాడు. ఆ మేడా అదీ చూస్తే. ఓ పాతికవేలు ఇస్తే ఇప్పుడీ పిల్లని వదుల్తాం అని కబురుచేస్తాం" అని రవణయ్యతో అంటూ వాళ్ళు ఓ కాగితం మాధురి ముందుపెట్టి. "దీనిమీద సంతకంపెట్టు" అంటూ ఆమె చేతినున్న కట్లు విప్పసాగారు.

ఆ సమయంలో "అమ్మాయీ సంతకం పెట్టకు" అంటూ అరిచి బావాజీ ఆ టాక్సీ డ్రైవర్లమీద ఒక్క ఉరుకు వురికాడు. ఈ లోగా వీర్రాజు నలుగురి కట్లూ విప్ప సాగాడు. కిరీటీ, మాధురితోబాటు సువర్చల కూడా టాక్సీడ్రైవర్లని ఎదుర్కోవడంలో బావాజీకి సాయం చెయ్యసాగారు. రవణయ్య మాత్రం బావాజీని తేరిపారచూసి కోపం తోనూ కక్షతోనూ ఊగిపోయి. కట్లు ఊడదియ్యడమే తరవాయిగా, బయటికి పారిపోయాడు పోలీసుల్ని తీసుకురావడంకోసం. కిరీటి, మాధురీ. సువర్చలా, వీర్రాజూ కలిపి టాక్సీ డ్రైవర్లను కర్రలతోనూ రాళ్ళతోనూ బాది బావాజీ కాళ్ళదగ్గర పడెయ్యడం అతను కాళ్ళతో తన్ని వాళ్ళని మళ్లీ లేవకుండా చెయ్యడం, ఇలా కొంచెంసేపు జరిగేసరికి డ్రైవర్లుముగ్గురూ పారిపోయారు. కిరీటినీ, సువర్చలనీ, మాధుర్నీ తీసుకుని వీర్రాజూ బావాజీ గుహవదిలి ఇవతలకి వచ్చేసరికి రవణయ్య పోలీసుల్ని తీసుకుని ఎదురయ్యాడు.

"ఇతనేసార్! నరసాపురం నావ ముంచేసిన కేసులో ముద్దాయి భీమ్‌సింగ్. ఇన్నాళ్లూ ప్రభుత్వం కళ్ళుకప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇప్పుడు రౌడీల సహాయంతో ఈ ముగ్గురినీ బంధించి. తప్పించబోయిన నన్ను పీక పిసికి చంపబోయాడు" అంటూ రవణయ్య పోలీసులికి బావాజీని చూపించాడు. సువర్చల ఏదో చెప్పబోయింది. వీర్రాజూ ఏదో అనబోయాడు.

'నామాట వినండి" అన్నాడు భీమ్‌సింగ్. "అంతా కోర్టులో చెప్పుకోవచ్చు. ముందు నడు," అంటూ పోలీసులు భీమ్‌సింగ్‌ని తీసుకుపోయారు. సువర్చలా, కిరీటీ, వీర్రాజులతో సహా మాధురి తన ఇంటికివచ్చింది.

కళ్యాణ మండపం దగ్గర దిగాలుపడి కూర్చున్న జగత్పతిరావు లోపలికి అడుగు పెడుతూన్న మాధురిని చూసి "అమ్మా క్షేమంగా వచ్చావా? ఈరాణీ చెప్పినదాన్నిబట్టి నువ్వు ఏమైపోయావో అని క్రుంగిపోతున్నాను తల్లీ" అంటూ వెఱ్ఱిగా అరిచాడు అతని కంఠంవిని వులిక్కిపడి సువర్చల తలెత్తి చూసింది. ఆశ్చర్యం, ఆనందం అవధులు దాటింది. పట్టలేని సంతోషంతో 'మీ . రా" అంటూ పిచ్చిగా కేకపెట్టింది.

అనుకోని అదృష్టం హఠాత్తుగా ఎదురుకావడంతో ఒళ్ళు తెలియని ఆనందంతో "ఎవరు? డార్లింగ్!" అన్నాడు జగత్పతిరావు ఇద్దరి శరీరాల్లోనూ చలనంలేదు.

ఇద్దరి మనస్సులలోనూ ఆలోచనలేదు.

ఇద్దరి కళ్ళకీ రెప్పపాటులేదు.

పద్దెనిమిది ఇరవై సంవత్సరాల ఎడబాటువల్ల గుండెల్లోంచి ఉవ్వెత్తుగా లేస్తూన్న సంతోష తరంగం.

ఎన్నాళ్ళకి తిరిగి కలుసుకున్నాం అనే ఆనందంతో ఇద్దరి ముఖాల్లోనూ వెలిగి పోతూన్న కాంతిపుంజం. మాటలకందని మధురానుభూతిలో ఒకరినొకరు చూస్తూ అచేతనంగా అలా ఎంతసేపు వుండిపోయారో! అంతసేపూ, కాలం ఆగిపోయింది. సంతోషం వెల్లివిరిసిపోయింది. ఆశ్చర్యం ఆనందం రాజ్యం ఏలింది.

ఇన్నేళ్ళూ తను ఈ ముహూర్తంకోసమే కదా బ్రతికివుంది! తీరా సమయం వచ్చేసరికి తను ఆ ఆనందాన్ని భరించలేనంత నీరసంగా అయిపోతోందేవిటి? సంతోషంతో తబ్బిబ్బుపడి గుండె ఇలా వేగంగా కొట్టుకుంటోంది. తలమున్కలైన ఈ ఆనందం తనని బ్రతకనిచ్చేనా? పట్టలేని ఆనందంతో కళ్లు రెండూ చలమలైపోతూ వుంటే పక్కనేవున్న మాధురిని తటాలున కౌగలించుకొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది. సువర్చల. తెల్లబోయి చూస్తూన్న మాధురితో "అమ్మా మాధురీ! ..మీ మమ్మీ" అన్నారు జగత్పతిరావు ఆనందోద్వేగాలతో.

"ఆ!" అని మాధురి ఒక్క కేకవేసి "మమ్మీ!" అంటూ సువర్చలని కౌగలించుకొంది. తల్లీ కూతుళ్ళనిచూసి కళ్ళల్లోంచి ముత్యాలులా రాలుతూన్న ఆనందాన్ని కండువాతో ఒత్తుకున్నారు జగత్పతిరావు.

ఆ సమయంలో హాస్పటల్ నుంచి జయని డిస్‌ఛార్జిచేసి ఆమెని తీసుకుని అక్కడికి వచ్చాడు శేఖర్ ఒక్కనిముషంలో జరిగింది అంతా జయకీ శేఖర్‌కీ అర్థం అయి ఇద్దరూ ఆశ్చర్యంగా అందరికేసీ తర్వాత ఒకళ్ళ నొకళ్లూ చూసుకున్నారు. వాళ్ళు అలా ఒకళ్ళ నొకళ్ళు ఆప్యాయంగా చూసుకోడాన్ని మాధురి చూసింది.

"ఏవిటి మా అత్తయ్య మాధురి తల్లా" అన్నాడు కిరీటి ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ.

"ఇంక ఇప్పటినుంచి ఆవిడనీకు ఉత్త అత్తయ్యకాదు-అత్తగారు" అన్నాడు శేఖర్ కిరీటి వీపు తడుతూ.

"అంటే ఆ సరే సరే.. అలాగైనా నాకు ఇష్టమే. కానయితే ఇప్పటిదాకా డాక్టరు అల్లుడవుతా డనుకున్నది, వాస్త మార్చుకొని, కవి అల్లుడౌతాడని అనుకోవాలి. అంతేగా?" అన్నాడు జగత్పతిరావు నవ్వుతూ

"వాడూ డాక్టర్ అవుతాడు. పి. హెచ్. డిలో సీటు వచ్చింది" అన్నాడు శేఖర్.

"నిజంగా" అంటూ మాధురితోపాటు అంతా గట్టిగా ఆనందంతో అడిగారు. శేఖర్ పక్కన నిలబడ్డ జయకేసి సువర్చల సాభిప్రాయంగా చూసింది. జయనవ్వి ఇంక నీ కూతురు దొరికింది కనుక నన్ను వదిలెయ్యి పిన్నీ. నీకోరిక ప్రకారం నీ కూతుర్ని ముద్దుల మేనల్లుడికిచ్చి పెళ్ళిచెయ్యి" అంది.

"ఇంతకజ్జాకోరు పిల్లవి. నిన్ను ఊరికే వదిలేస్తే ఎల్లా. ఏ శేఖర్‌లాంటి గట్టి డాక్టర్ కేరాఫ్‌లోనో కట్టిపెట్టాలి" అంది మాధురి కొంటెగా. కళ్ల చివరనుంచి జయ శేఖర్‌ని పరిశీలించింది. శేఖర్‌లో చలనం కలగలేదు సరికదా ముఖంలో విషాదం ఆవరించింది. మాధురి కళవళపడి అతనికేసి జాలిగా చూసింది. శేఖర్‌ది గంభీరమైన హృదయం. తననుంచి జయమీదకి మనస్సు మళ్లించుకోడానికి అతనికి కొంతప్రేమ అవసరం అనుకొంది.

"కిరీటీ! మా అమ్మాయిని నీకు ఇవ్వడానికి నాకు అభ్యంతరంలేదు. అయితే ఒక్క షరతు" అన్నాడు జగత్పతిరావు గంభీరంగా.

అంతా అతనికేసి చూశారు.

"మాధురిని నీతో పంపించేది లేదు, నువ్వే రావాలి మా యింటికి ఇల్లరికం" అన్నాడు జగత్పతిరావు. అంతా నవ్వారు. కిరీటి ముఖం ఎర్రబడింది. సువర్చలకేసి చూశాడు సువర్చల నవ్వుతూ జగత్పతిరావుతో "అదేం కుదరదు మీ అమ్మాయితో సహా మీరే మా యింటికి ఇల్లరికం రావాలి" అంది.

"అంటే ?" అర్థంకాక ఆగిపోయాడు జగత్పతిరావు.

"అంటే ఈ ఇల్లూ మేడా ఆస్థీ ఇదంతా సువర్చలగారిది అన్నమాట. దీని కంతకీ ఆమె అధికారిణి. ఇక్కడ ఆమె తన మేనల్లుడితో వుంటారు. మీరే మీ అమ్మాయిని తీసుకుని ఇక్కడికి ఇల్లరికానికి వస్తారు అర్థమైందా?" అన్నాడు వీర్రాజు.

"ఓ అదా సంగతి! .అయితే సరే" అన్నాడు జగత్పతిరావు హాలు మారు మ్రోగిపోయేలా నవ్వుతూ. మాధురి పెళ్ళి పై నెలకి మార్చి మర్నాటి సాయంత్రం జగత్పతిరావు వెళ్ళి భీమ్‌సింగ్‌ని బెయిల్ మీద విడుదలచేసి తీసుకువచ్చాడు.

"సమయానికి ఈయన దేవుడులా వచ్చి అడ్డుకోకపోతే మేం ముగ్గురం ఏమై పోయి ఉందుమో-ఇవాళ మనం అంతా ఇలా సంతోషంగా కలుసుకున్నాం అంటే ఈయనే కారణం" అంది సువర్చల భీమ్‌సింగ్‌కి గౌరవంగా నమస్కరిస్తూ.

"ఇవాళ మనల్ని ఇలా కలిపిన పెద్దమనిషే ఆ రోజున మనం అలా విడిపో డానికి కారణం అయాడు. ఇతనికోసం కాకపోతే నేను అలా ఆ రోజున నాటకం వెయ్యకపోదును. అవునూ? ఆ రోజున నువ్వు ఆ ఊరు ఎందుకు వచ్చావు? రైలు ప్రమాదంలో బ్రతికి బైట పడ్డప్పుడు కోపంతో ఇన్నేళ్ళూ ఉండి పోకపోతే వెంటనే నా దగ్గరికి ఎందుకు రాకపోయావు డార్లింగ్!" అంటూ ప్రశ్నించాడు జగత్పతిరావు.

"కోపమా? క్రోధమా? ఏం లేదు. ఏం జరిగిందంటే నా చిన్ననాటి స్నేహితురాలు సావిత్రి, చిన్నప్పుడే భర్త పోయి తన కొడుకైన ఈ కిరీటితో నరసాపురంలో తమ్ముడి దగ్గర ఉండేది. ఒక రోజున తమ్ముడూ మరదలూ గోదావరిలో మునిగిపోతే, ఆ బాధ భరించలేక ఒకటి రెండు రోజులలో తమ్ముడు కూతురు ఈ జయనీ, తన కొడుకు

ఈ కిరీటినీ తీసుకుని పట్నం వచ్చేసింది. భీమ్‌సింగ్ కోరికమీద మీరు నాటకం వేసింది ఆ పట్నంలోనే-నాకు తెలియదు తనకు వచ్చిన కష్టాలన్నీ రాపి ఓ మారు వచ్చి చూసి పొమ్మంటే. మీరు ఎల్లాగూ ఊర్లో లేరు కదా, మీరు వచ్చేటప్పటికి తిరిగి వచ్చెయ్యొచ్చనే ఉద్దేశంతో ఆ పట్నం వచ్చాను. నేనూ సావిత్రీ మాట్లాడుకొంటూ ఉంటే వీధిలోంచి కిరీటి నాటకంపేపరు పట్టుకువచ్చాడు. మీరు మళ్ళీ నాటకం వేస్తున్నారనీ, నా దగ్గర ఇలా కపటనాటకం ఆడారనీ తెలిసి, అయినా ఇది ఎంతవరకూ నిజమో అని సావిత్రీ పిల్లలతో కలిసి మాధురిని తీసుకుని నాటకానికి వచ్చాను. నిజంగానే మీరు నాటకం వేస్తున్నారు. మాధురి స్టేజిమీదకి వచ్చి చేరుకుంది. దాన్ని తీసుకుని వెనకాలే వచ్చి నన్ను బతిమాలకుండా ఉంటారా అనే ధీమాతో. సావిత్రినీ కిరీటినీ జయనీ తీసుకుని మన ఊరు వెళ్ళే రైలు ఎక్కాను. అది యాక్సిడెంటే అయింది. మా కెవరికీ ఏ దెబ్బా తగలలేదు. సామాన్లు మాత్రం చిందర వందరగా పోయాయి. సావిత్రికైతే చాలా ప్రమాదకరమైన గాయం తగిలింది. అంబులెన్స్‌మీద దాన్ని తీసుకువెళితే పిల్లల్ని తీసుకుని నేనూ దానితో కారులో వెళ్ళిపోయాను. వారం రోజులు మృత్యువుతో పోరాడి చివరకి చనిపోయింది. చచ్చిపోయేటప్పుడు నరసాపురంలో తన ఆస్థులూ, తమ్ముడి భూములూ, వాటికి సంబంధించిన కాగితాలన్నీ నాకు అప్పగించి, పిల్లల్నిద్దర్నీ నా చేతిలో పెట్టి కన్ను మూసింది. ఆ తర్వాత రెండు మూడు రోజులకి కాని పిల్లల్ని తీసుకుని నేను మన ఊరికి రావడానికి వీలు లేకపోయింది. అప్పుడు వచ్చి చూస్తే ఏముంది? అప్పటికే మీరు అన్నీ అమ్మేసి ఎక్కడికో వెళ్ళిపోయారు. ఎక్కడికి వెళ్ళిందీ పక్కవాళ్ళు ఎవ్వరూ మాకు తెలియదు అన్నారు. అప్పటినుంచీ ఇవాళ్టిదాకా, మీరు ఎక్కడేనా నాటకంలో వేషం వేసినట్లు వార్త వస్తుందేమోనని రోజూ ఆశగా పేపరు చూస్తూ, ఎప్పటికేనా కలుసుకోక పోతామా అనే ఆశతో నరసాపురంలో ఈ కిరీటినీ జయనీ పెంచుతూ కాలక్షేపం చేసుకుంటూ బతుకుతున్నాను'' అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ సువర్చల.

''ఆ తర్వాత నేను నాటకంలో వెయ్యలేదు. అందుకే నా ఎడ్రస్ నీకు దొరకలేదు'' అన్నాడు జగత్పతిరావు.

''ఇంతకీ నరసాపురంలో నదిలో మునిగిపోయిన మీ సావిత్రి తమ్ముడూ మరదలూ కేసులోనే మా భీమ్‌సింగ్ ఇరుక్కున్నాడు'' అన్నాడు జగత్పతిరావు.

ఆ మాట విని రాణీ కెవ్వున అరిచి ''ఇతనేనా మా నాన్ననీ అమ్మనీ ముంచేసి చంపేసింది. ఇదిగో నా దగ్గర ఫోటో ఉంది. మావయ్యపెట్టి అడుగున ఉంటే దాన్ని తీసి, అమ్మా నాన్నా జ్ఞాపకార్థం నా దగ్గర దాచుకున్నాను'' అంది. వీర్రాజు ఆ ఫోటో చటుక్కున తీసుకుని జాగ్రత్తగా పరిశీలించి ''ఇది ఖరీదైన కెమెరాతో తీసింది. దీని

నెగిటివ్ కనక సంపాదిస్తే, దాన్ని బాగా పెద్దదిగా ఎన్‌లార్జి చేసి చూడొచ్చు" అన్నాడు. మర్నాడు వీర్రాజుని జగత్పతిరావు నరసాపురం పంపించాడు. అతి ప్రయత్నంమీద ఆ ఫొటోగ్రాఫర్ని పట్టుకొని వీర్రాజు నెగిటివ్‌సంపాదించాడు. అది ఎన్‌లార్జి చేస్తే భీమ్‌సింగ్ చెబుతూన్నది నిజం అని స్పష్టంగా అర్థం అయిపోయింది. చిన్న ఫొటోలో అయితే వెంకట్రావూ, భీమ్‌సింగూ పెనుగులాడుతున్నట్లు కనిపించింది కానీ, అదే పెద్ద ఫొటోలో, వెంకట్రావు నావ అడుగున ఉన్న ఒక బిరడా తీసి నావని ముంచెయ్యడానికి ప్రయత్నించడం భీమ్‌సింగ్ అతని చేతిలో బిరడా లాక్కొని, నావకి పెట్టి నావలోకి నీళ్ళు రాకుండా చెయ్యాలని పెనుగులాడడం కనిపించింది. వెంకట్రావుచేతిలో బిరడా, నావలోకి వస్తూన్న నీళ్ళూ.

కోర్టువారు అతనిమీద వున్న హత్యానేరాన్ని ఫొటో చూస్తూనే కొట్టేశారు. ఇక రవణయ్యని రెండు చేతుల్తోటీ పీక పిసికి చంపడానికి, గోల్కొండ శిథిలాలదగ్గర ప్రయత్నించాడని ఆరోపణ. "అయ్యా భీమ్‌సింగ్‌గారూ! మీ భుజాలమీద వున్న ఆ కాశ్మీరు శాలువా జార్చేయండి" అన్నాడు ముద్దాయి తరఫు లాయరు. కోర్టు అంతా ఒక్కమాటు కెవ్వున అరిచింది. భీమ్‌సింగ్‌కి చేతులు లేవు. సావిత్రికి గాయాలు తగిలిన ఆ రైల్వే యాక్సిడెంట్‌లోనే అతని రెండుచేతులూ జబ్బలదగ్గరికి తెగిపోయాయి. ఆ రోజున తెగిపోయిన ఆ చేతులతోటే నరకయాతన అనుభవిస్తూ రైలు అవతలనుంచి చీకట్లో వెళ్ళిపోయాడు భీమ్‌సింగ్. అక్కడ వుంటే నరసాపురం హత్యకేసు అంటూ పోలీసులు తనని ఎక్కడ అరెస్టు చేస్తారో అనే భయంతో, దగ్గర్లో ఒక ప్రకృతి ఆశ్రమానికి చేరుకొని పసర్లూ, ఆకులూ, కట్లూ వీటితో ఆరునెలలకి ఎలాగైతేనేం గాయాలు మాన్పుకొని ఉత్తరదేశం అంతా పది పదిహేనేళ్లు తిరిగి తిరిగి ఇంక తిండికి గడవక నానా అవస్థలూపడి, బాల్యస్నేహితుడు జగత్పతిరావుకి కబురుపెట్టి అతనితో కలిసి ఇంటికి వచ్చి ఇన్నాళ్ళనుంచీ బావాజీగా రహస్యజీవితం గడుపుతున్నాడు.

చేతులు లేనివాడు పీక పిసకడం ఏమిటి అనే ప్రశ్నకి తోడు, అసలు ఈ రవణయ్యే గూండాలచేత మాధుర్ని వాళ్లనీ బంధించాడని ఏమిటి కేసుపెడితే రవణయ్య రోగం కుదురుతుంది అంటూ కోపంతో ఘూర్ణిల్లాడు జగత్పతిరావు. కాని రాణి బతిమాలడంతో ఆ ప్రయత్నం విరమించాడు. వీర్రాజు రవణయ్యని బలవంతంగా జగత్పతిరావు ఇంటికి తీసుకువచ్చాడు. వచ్చి "ఏమండీ మరి రాణీ కోరికప్రకారం నేను వస్తాదునీ కాను ఆరడుగుల ఎత్తూ నూటయాభై పౌనుల బరువూలేను. మీకోరికప్రకారం తెలుగు మ్మే కూడా కాను. మీ మేనకోడల్ని నాకు పెళ్ళిచేస్తారామరి!" అన్నాడు వీర్రాజు.

"పైల్వాన్ కూతురు మరో పైల్వాన్నే పెళ్ళాడాలనుకుంది అది సహజమే అయినా ఇప్పుడు నా పెర్మిషన్ ఏముంది? ఇదిగో భీమ్‌సింగ్ నీ కూతురే రాణీ. ఆ రోజునే మీ ప్రేమని నేను అంగీకరిస్తే ఈ అనర్థాలేవీ రాకపోను" అన్నాడు రవణయ్య పశ్చాత్తాపంతో.

"నాన్నా" అంటూ కౌగలించుకొన్న కూతుర్ని తలమీద ముద్దుపెట్టుకుని "కౌగలించుకోడానికి నాకు చేతుల్లేవు అమ్మా" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు భీమ్‌సింగ్.

"ఏరా కిరీటీ? ఇంక నేనా ఊహాలోకాల్లో తేలిపోతూ కలల ప్రపంచంలో కరిగిపోతూ గులాబీలనీ మల్లెల్నీ ప్రేమించే ఆ బొటానికల్‌లవ్ కట్టిపెట్టి అసలు ప్రపంచంలో పడతావా?" అన్నాడు శేఖర్.

"ఉహూఁ" అంటూ సిగ్గుపడ్డాడు కిరీటి.

"అందరి ఎదురుగుండా ఇలా సిగ్గు నటిస్తారు డాడీ! ఒక్కళ్ళూవుంటే ఎంతలేసి మాటలంటా రనుకున్నావు? ఓ మాటు నన్ను ఒంటరిగా చూసి అజంతా సుందరీ అంటూ పిలిచారు" అంది మాధురి వచ్చేనవ్వు ఆపుకుంటూ.

"ఏమయ్యా పిలిచావా? మాట్లాడవేం? .చెప్పు గస్ తీశానో మళ్లీ గాభరా పడిపోతావు జాగ్రత్త" అన్నాడు జగత్పతిరావు.

"కిరీటితో నీపెళ్ళి ఎలా అవుతుందో చూస్తానన్నావుగా మమ్మీ" అందిమాధురి.

"అవును. ఇప్పుడూ అమాటే అంటున్నాను కన్యాదానం పీటలమీద కూర్చుని ఎలా అవుతుందో కళ్ళకి నిండుగా మరీ చూస్తాను సరా?"

"అమ్మా మాట మార్చావు."

"మాటమార్చడానికీ మాటతప్పడానికీ నేనేమైనా నాటకాల మనిషిని అయితే కదా?" అంటూ సుకన్యల జగత్పతిరావుకేసి సోగగా చూసింది.

జగత్పతిరావు గతాన్ని జ్ఞాపకం తెచ్చుకుని నవ్వాడు

వీర్రాజు ఆడిన నాటకాన్ని చెప్పిపొడుస్తోంది రాణీ.

"మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటే చాలా మరమ్మత్తు చెయ్యాలి" అంటోంది కిరీటితో మాధురి నవ్వుతూ.

శేఖర్ ఏటో చూస్తూ సిగరెట్ కాల్చుకుంటూ కూర్చుంటే మమతలన్నీ కళ్లల్లో నింపుకొని అతనికేసి జాలిగా చూస్తూవుంది ప్రియ.

ఇలా ఎవరి పట్టుకి వాళ్ళు ఏదో పనిలోవుంటే, ఏపనీ లేకుండా వున్నది ఒక్క రవణయ్య మాత్రమే! మూలకూచున్న రవణయ్యకి ఏ ఆలోచనాలేదు కాని భీమ్‌సింగ్‌కి

అన్నీ ఆలోచనలే. అక్కడున్న వాళ్ళల్లో ఒక్కొక్కళ్ళని చూస్తూంటే అతనికి ఒక్కొక్క రకమైన ఆలోచన రాసాగింది.

"ప్రేమ ఎంతబలమైందో అంత చిత్రమైంది. సువర్చలా జగత్పతిరావూ ఒక ర్నొకరు గాఢంగా ప్రేమించుకోవడంవల్లే ఇతర స్త్రీలతో వేషంవేస్తున్నాడని ఆమెకి అతనిపై కోపంరావడం, చివరికి ఇద్దరూ విడిపోయి, ఇన్నాళ్ళయినా బంధాలు చెడకుండా, మళ్ళీ కలుసుకోవడం జరిగింది. తనకి సీతతో పెళ్ళి అయి తమ ప్రేమఫలిస్తే తనకథ కూడా ఇంకోరకంగావుండివుండును. తను సీతని అంత అమితంగా ప్రేమించాడు కనకే ఆమెని ఆమె భర్త చంపడానికి తీసుకు వెళ్ళారని తెలిసి, చూస్తూ ఊరుకోలేక పోయాడు. అందుకే హత్యానేరంలో చిక్కుకున్నాడు కూడా అన్యాయంగా.

ప్రేమ చిత్రమైంది కనకే పైల్వాన్‌ని పెళ్ళి చేసుకోవాలనికూడా, తన కూతురైన రాణీ, ఆ లక్షణాలేవీ లేని వీర్రాజుని మనస్సా ప్రేమించి పెళ్ళి చేసుకోబోతోంది.

మాధురి మాత్రం? తన తెలివికి చురుకుకీ నిజానికి ఆమె శేఖర్‌ని పెళ్ళాడ వలసింది! కాని అదే చిత్రం! ఎంత ప్రయత్నించినా ఆమె మనస్సు కిరీటివైపే పరిగెట్టింది కాని శేఖర్ అంటే ఇష్టపడలేదు.

పోనీ శేఖర్‌పట్ల ఈ ప్రేమ సజీవుగా ప్రవర్తించిందా? తనని కాదంటూన్న మాధురివైపే అతని మనస్సుని మళ్ళించింది కాని, తనే కావాలని తపస్సు చేస్తూన్న జయవైపు ససేమిరా ముఖం తిప్పనిస్తోందా? తనలా విషాదాలు కాకపోయినా, తనతోపాటు, వీళ్ళ జీవితాలన్నీ వేటికవే బలే తమాషాగా చిత్రంగా ఉన్నాయి. ఇవన్నీ కలిపితే ఒక రామాయణం అంత రామ! . రామ! . ఒక ప్రేమాయణం అంత కధ అవుతుంది " అంటూ తనలో తను నవ్వుకోసాగాడు భీమ్‌సింగ్ . "ఏమిటలా నీలో నువ్వు నవ్వుకుంటున్నావు?" అని అడిగాడు జగత్పతిరావు. భీమ్ సింగ్ మొదట చెప్పలేదు. "ఏదో పిచ్చి ఆలోచన పోనిద్దూ" అన్నాడు కాదు కూడదని జగత్పతిరావుతో సహా అంతా చెప్పమని పట్టు పట్టేసరికి భీమ్‌సింగ్ తన ప్రేమాయణం తాలూకు ఆలోచనల్ని చమత్కారంగా చెప్పాడు. శేఖర్, జయా, రవణయ్యా తప్ప అంతా ఘొల్లుమని నవ్వారు. వాళ్ళ నవ్వులతో ఆ మహల్ అంతా మారు మ్రోగింది.

(ఐపోయింది)

---

Edited and Published by V. Leelavathy Raghavaiah, 40/1 Moosasait Street, Madras-600 017 and Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600 001.